మనస్సాక్షి మహాభారతం

(Personality Development in Mahabharata)



రచన :

'కాశీకవి' శతావధానిశేఖర 'విద్యావారిధి'

డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

M.A., Ph.D.(Tel.), M.A., Ph.D.(San.)

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.




తెలుగు ఆత్మగౌరవ దినోత్సవం

మనస్సాక్షి మహాభారతం

(Personality Development in Mahabharata)

రచన :

'కాశీకవి' శతావధానిశేఖర 'విద్యావారిధి'

డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

ప్రచురణ

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ-12.

శ్రీ విజయ ఉగాది
11 ఏప్రిల్, 2013

ప్రతులు : 1000

వెల : రూ. 150/-
$ 10

రచన :
'కాశీకవి' శతావధానిశేఖర 'విద్యావారిధి'
డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 12.
ఫోన్ : 0866-2414322

అంకితం



కలకాలం మానవజాతిని తీర్చిదిద్దే భారతభాగవత రామాయణాలను ఈ కాలం వారు ఎలా అన్వయించుకోవాలో పసిడిమనసుతో కంచుకంఠంతో తనదైన మార్గంలో వినిపించిన విశిష్టప్రవక్త, పురాణపండ వంశాబ్ధి సుధాకరులు, పితృవాత్సల్యంతో నన్ను అనుగ్రహించిన **ఉషశ్రీ** బాబాయి గారికి...

- పాలపర్తి శ్యామలానందప్రసాద్

మనసుమాట

మనోవిజ్ఞానం, వ్యక్తిత్వవికాసం, మానవసంబంధాలు వంటి ఆధునిక పరిభాషలన్నిటికి కేంద్రబిందువుగా మానవజాతిని తీర్చిదిద్దే మహాభారతంలో నుండి సరళంగా, సంక్షిప్తంగా కొన్ని అంశాలు నేటి యువతకు, పిల్లలకు, పెద్దలకు అందరికీ తెలిసేవిధంగా 'నిత్యసందేశం' శీర్షికతో లఘువ్యాసికలు నాచే వ్రాయించి సుమారు మూడు సంవత్సరాలు ప్రచురించిన 'సాక్షి' దినపత్రిక యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. సంపాదకమండలికి ధన్యవాదాలు.

19వ తానా తెలుగు మహాసభల్లో (మే 24, 25, 26 – 2013) పాల్గొనే అవకాశం లభించిన సమయంలో ఈ రచన వెలుగుచూసి ఖండాంతరాలకు చేరటం విశేషం. తానా అధ్యక్షులు శ్రీ తోటకూర ప్రసాద్ గారికి, కో–ఆర్డినేటర్ శ్రీ వెన్నం మురళి గారికి తదితర సభ్యులందరికి హృదయపూర్వక నమస్సులు.

ఈ శీర్షికను రాష్ట్రరాష్ట్రేతరప్రాంతాల్లో, విదేశాల్లో చదివి అభినందించిన సాక్షి దినపత్రిక పాఠక మహాశయులకు అభివాదాలు.

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు శ్రీమతి పూర్ణాంబ, బ్రహ్మశ్రీ వెంకట సుబ్బారావు గారికి,

సంస్కృతాంధ్రభాషాధ్యయనంలో, అవధానరంగంలో నన్ను అనుగ్రహించిన గురుదేవులకు, ఆప్తవాక్యాన్ని ఆత్మీయతతో అందించిన 'మధురభారతి' మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి గారికి ప్రోత్సహిస్తున్న బంధుమిత్రులందరికీ సప్రశ్రయ నమస్కారాలు...

- పాలపర్తి శ్యామలానందప్రసాద్

ఆప్త వాక్యం

'మధురభారతి'

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి

మానవ జీవితానికి మణిదర్పణం మహాభారతం. భారత కథా సన్నివేశాలను, పాత్రలను వ్యాసమహర్షి మలచి, మనకు అందించిన తీరు ఈ సత్యాన్ని తేటతెల్లం చేస్తుంది. వ్యాస సరస్వతి అడుగుజాడల్లో తమ కవితా సరస్వతిని నడిపించి, భారతరచన ద్వారా జాతికి జీవం పోశారు ఆంధ్రభారత కవిత్రయం. భారతకథలోని సార్వకాలిక ప్రబోధాన్ని సమకాలీన సమాజానికి సమన్వయించి, చక్కని రచనలు అందించే సారస్వతోపాసకులు మనకు నేటికీ దర్శనమిస్తూనే ఉంటారు. అలాంటి వారిలో అగ్రేసరులు అవధాన విద్యావిశారదులు డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్.

సజీవసంప్రదాయంలోని విలువలను నేటి తరానికి అందించే మహత్తర కార్యాన్ని సంకల్పించి, అందుకు బృహత్తర ప్రణాళికను రూపొందించుకున్నారు డా॥ పాలపర్తి వారు. భారత కథలోని ఆణిముత్యాల వంటి అద్భుత సందేశాలను ఏర్చి, కూర్చి వారం వారం 'సాక్షి' దినపత్రిక ద్వారా ఆంధ్ర పాఠకలోకానికి అందించారు.

మనస్సే ప్రధాన జీవలక్షణంగా మనుగడ సాగించే మానవుడు - తన మనస్సును ఎలా దారికి తెచ్చుకోవాలో, అలాంటి మనస్సులోని భావాలను వాగ్రూపంలో వ్యక్తీకరించేటపుడు ఎలాంటి జాగరూకతను పాటించాలో, కామక్రోధాలను ఎలా అదుపు చేసుకోవాలో ఈ వ్యాసాల్లో నిరూపించారు శ్రీ శ్యామలానంద ప్రసాద్.

తపశ్శక్తి కాని, రాజ్యాధికారంకాని, సిరిసంపదలు కాని సార్థకం కావాలంటే అవి శాశ్వతంగా ఆనందాన్ని మాత్రమే కలిగించే విధంగా వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఓర్పు నేర్పులతో వివరించారు ఈ రచయిత. మనస్సు, మాటలు, చేతలు

నిగ్రహమనే సరిహద్దులకు లోబడి ఉన్నప్పుడే అభ్యుదయం సాధ్యమవుతుందని హితవు పలికారు వ్యాసకర్త. సత్యధర్మాల తీరుతెన్నులను సప్రమాణంగా ఆవిష్కరించారు. మానవుడు తాను ధైర్యం కలిగి వర్తించవలసిన ఆవశ్యతను, అందువల్ల కలిగే ప్రయోజనాలను సరళసుందరంగా అందించారు రచయిత. ప్రజాజీవనం, పరోపకారం, కృతజ్ఞత, సహజీవనం, సౌజన్యం... ఒకటేమిటి ? మానవ జీవితానికి సంబంధించిన విజ్ఞాన సర్వస్వాన్ని, సంక్షిప్త సుందరంగా, సమగ్ర భావబంధురంగా అక్షరాల్లో పొదిగి అందించారు పాలపర్తి వారు. పనిలో పనిగా పండుగలు, పరమార్థాలు, ఆచారాలు, అంతరార్థాలు కూడా హాయిగా నిరూపించారు.

సామాన్య మానవుడి గుండె తలుపుతట్టి మేలుకొలిపి, మేలుతెలిపి, సమాజం పట్ల తమ కర్తవ్యాన్ని నిండుమనస్సుతో నిర్వ్యాజంగా నిర్వహించిన ఈ అక్షరతపస్విని అభినందిస్తున్నారు.

అందంగా, హుందాగా, మందాకినీప్రవాహంలా జాలువారిన ఈ అక్షర సరస్వతికి ఐదు పదిచేస్తున్నాను. పదేళ్ళ వయస్సులోనే పదును తేరి నేటికి ఎంతో పరిణతిని సాధించిన ఈ అమృతలేఖిని పదికాలాల పాటు పదిలమై, జాతికి ఇలాగే దారి చూపించాలని, అందుకు కావలసిన శక్తియుక్తులు ఆ అంతర్యామి డా॥ పాలపర్తి వారికి ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ...

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

విషయసూచిక

1. జీవనభారతం 11

2. మనసు వెన్నలా ఉండాలి 12

3. సత్యమే నిత్యం 14

4. తపస్వికి క్రోధం తగదు 16

5. ఆషాఢపూర్ణిమ వ్యాసుని జన్మదినం... 17

6. రాజధర్మం కత్తిమీద సాములాంటిది 19

7. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు... 21

8. సౌభాగ్యదాయక శ్రావణ పంచమి 22

9. మాటకు మాట తెగులు 24

10. అలవాట్లు - పొరపాట్లు 26

11. నోరు మంచిదైతే ఊరంతా మంచిది 27

12. వినాయకచవితి - విజ్ఞాన సమృద్ధి 29

13. అనారోగ్యమే దౌర్భాగ్యం 31

14. పితృదేవతలకు ప్రియం మహాలయం 33

15. అతడే అసలైన వారసుడు 35

16. శ్రీగాయత్రి 36

17. శ్రీమహాలక్ష్మి 37

18. విజయప్రదాత శ్రీరాజరాజేశ్వరి! 38

19. సద్గోష్ఠి - సమంజసబుద్ధి 40

20. అధికార సద్వినియోగం 42

21. నోరు... తలను కాపాడుతుంది 43

22. ధర్మం - అధర్మం **45**

23. సత్యమేవ జయతే **46**

24. దాంపత్యమే సమాజానికి మూలస్తంభం **48**

25. నమ్మకం సహజీవనానికి మూలం **49**

26. స్నేహమేరా జీవితం **51**

27. రోగం రట్టు - కాపురం గుట్టు **52**

28. దుర్జనులను గుర్తించటం ఎలా! **53**

29. కృతజ్ఞత ఉత్తమధర్మం **54**

30. అప్రమత్తత అన్నివేళలా అవసరం **55**

31. మేలుకో, నడు, లక్ష్యాన్ని సాధించు. **57**

32. గర్వం ఎవరికీ ఉండరాదు **58**

33. కోపాన్ని మించిన శత్రువు లేదు... **59**

34. కీర్తిని మిగిల్చిన వారే కీర్తిశేషులు **60**

35. అవసరమైతేనే దండోపాయం... **62**

36. సంవాదం అంటే చర్చించుకోవటం **63**

37. విత్తం పోయినా వృత్తం పోకూడదు **64**

38. అవకాశవాదులున్నారు జాగ్రత్త **65**

39. శత్రువుతో స్నేహం ఇలా ఉండాలి **67**

40. లక్ష్మీనివాసం ఎక్కడ..! **68**

41. బలహీనులను బాగాచూసుకోవాలి **69**

42. మరింత జాగ్రత్తగా ఉండాలి! **70**

43. నంగిచేష్టలు - ముంగిమాటలు **71**

44. బాధ్యతల నుండి తప్పించుకోరాదు **72**

45. ధైర్యమే అసలైన మందు 74
46. కర్తవ్యమే ఉత్తమ ధర్మం 75
47. ధనరక్షణ విషయంలో జాగ్రత్త! 76
48. ప్రజల సంకల్పమే ఉత్తమ ప్రభుత్వం 78
49. విధిలీల తెలిస్తే ఏమీ ఉండవు... 79
50. అన్ని ప్రాణులనూ గౌరవించాలి 80
51. చేసిన మేలు వృథా కాదు 82
52. చెప్పులు, గొడుగు దానం చేయాలి 83
53. అహంకారం పనికిరాదు 84
54. సర్వం జగన్నాథం కావాలి 85
55. తృప్తి - తృష్ణ 87
56. శాకంభరి కథ 88
57. మానవ సంబంధాలు మరువకూడదు 89
58. అసూయను జయించాలి 91
59. జ్ఞానభూమి - శ్రావణపౌర్ణమి 92
60. కృష్ణం వందే జగద్గురుమ్ 94
61. త్రివర్ణపతాకం తీరుతెన్నులు 95
62. నీతి నీడలో నిలుద్దాం 96
63. ఇవన్నీ సత్యాలే... 98
64. ఎవరూ తప్పించుకోలేరు 99
65. నిందితాత్ములకిచ్చుట నిష్ఫలంబు 100
66. ప్రకృతి ప్రగతి చవితి 102
67. క్రమశిక్షణతోనే తీర్థయాత్రలు సాధ్యం 103

68. జీవులన్నీ దేవుడే 104
69. వివిధజీవ సహజీవనం 106
70. అన్నం బహు కుర్వీత 107
71. సంబంధాలు - విభేదాలు 108
72. అసత్యమూ అహేతుకం కాదు! 110
73. భగినీ హస్తభోజనం 111
74. విశేషాలవిందు - వనభోజనం 112
75. సామాజిక బాధ్యతలకు సంకేతం కార్తికం 114
76. వెలుగులు పంచుతుంది... 115
77. జ్ఞానం దీపంలా వెలగాలి 116
78. కర్తవ్యాన్ని గుర్తుచేసే ముక్కోటి ఏకాదశి... 118
79. తెనుగున రచియింపుము... 119
80. ధనుర్మాసం ప్రాణుల రక్షణకు ఆవాసం 120
81. త్యాగమే భోగం 122
82. సత్కార్యాలకే సాహసించాలి 123
83. సద్భావమే శాంతికి మూలం 124
84. పిల్లలు పెద్దలకు చెప్పవచ్చు 126
85. ధర్మం ఎవరికి తెలుస్తుంది..? 127
86. సూర్యుని విజయ యాత్ర-రథసప్తమి 128
87. జాతికి మేలు చేసిన వారికి 130
88. మానవులందరినీ మేల్కొల్పే ప్రశ్నలు 131
89. మంగళప్రదం - శివనామం 132
90. అసలైనది ఏది? 134
91. పనికివచ్చే చుట్టాలు 135

1. జీవనభారతం

మహాభారతంలో ఉన్నదే మానవలోకంలో ఉంది. మానవలోకంలో ఉన్నదే మహాభారతంలో ఉంది. జంతువులన్నిటిలో మానవజన్మ శ్రేష్ఠం. మిగిలిన జంతువులకు 'జీవనరీతి' ఉంటే మానవునికి 'జీవననీతి' ఉంటుంది. దాని ప్రకారమే జీవించాలి. అలా జీవిస్తేనే ఉత్తమ సంస్కృతిగల సమాజం ఏర్పడుతుంది. బలవంతునిదే రాజ్యం. 'బలవంతుడు ఏది చేసినా తప్పుకాదు' అనుకుంటే, ఒకరినొకరు హింసించటం, దోచుకోవటం మొదలవుతుంది. సమాజం అల్లకల్లోలం అవుతుంది. బలవంతుడు బలహీనునికి ఉపకారం చెయ్యాలి. సాధుజనులను కాపాడాలి. అలా చెయ్యకుండా బలగర్వంతో వారికి అపకారం చెయ్యటం, హింసించటం జీవననీతి కాదు. అలా దుర్మార్గులైన వారికి అకారణమైన భయాలు ఊహించని రోగాల రూపంలోనో, కుటుంబ కలహాల రూపంలోనో, నష్టాల రూపంలోనో వెంటాడతాయి. బాధ పెడతాయి. కాబట్టి బాధించబడిన బలహీనులు, సజ్జనులు ప్రత్యక్షంగా ఏమీ చెయ్యలేకపోయినా బలవంతుడు పరోక్షంగా దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదు... అనే జాగృతి ప్రతిక్షణం ప్రతివారికీ ఉండాలి. ఈ సందేశంతోనే పంచమవేదంగా మహాభారతాన్ని వ్యాసమహర్షి ప్రారంభించి లోకానికి అందించాడు.

తగునిది తగదని యెదలో వగవక సాధులకు పేదవారలకెగ్గుల్
మొగిజేయు దుర్వినీతులకగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్

సరమ అనే కుక్కకు ఒక పిల్ల ఉంది. అది జనమేజయుడు దీర్ఘసత్రయాగం చేసేచోట తిరుగుతుండగా అతని తమ్ముళ్లు శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడు దానిని కొట్టి తరిమేశారు. అది అరుస్తూ వెళ్లి తల్లికి చెప్పింది. దేవతల కుక్క అయిన సరమ ఈ సందర్భంగా మానవజాతికి ఇచ్చిన శాశ్వత సందేశం సదా శిరోధార్యం. ఆచరణీయం.

'బలగర్వంతో ఇది తగును, ఇది తగదు అనే వివేకం, విచక్షణ లేకుండా సాధుజనులకు, పేదవారికి అపకారం చేయటం దుర్వినీతి అవుతుంది. అలా చేసినవారికి ఊహించని విధంగా, కారణం లేకుండా ఏవేవో భయాలు కలుగుతాయి' అని ఒక కుక్క ద్వారా చెప్పించిన వ్యాసమహర్షి వ్యక్తీకరణ నైపుణ్య ప్రభావంతోనే పంచతంత్రం, హితోపదేశం వంటి నీతిగ్రంథాలు వచ్చాయి. విశ్వాసానికి, విధేయతకు మారుపేరు కుక్క. అంతేకాక అది దేవశుని (దేవ లోకానికి చెందిన కుక్క). దేవతాలక్షణాలు గల సరమ భారతం మొదట్లో కనబడితే చివర్లో కుక్కరూపంలో ఉన్న ధర్మదేవత ధర్మరాజుతో స్వర్గానికి వెళుతూ మానవజాతి ఇతర

ప్రాణులను తనతో సమానంగా ఎలా చూడాలో సూచిస్తోంది.

అన్నిప్రాణులకూ ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి అనే నాలుగు తప్పనిసరిగా ఉంటాయి. భయం ప్రాణులకు తమకంటె బలవంతులైన శత్రువుల ద్వారా మాత్రమే ఉంటుంది. అది భౌతికభయం. బలగర్వితుడైన మానవునికి బలహీనులంటే భయం లేకపోవచ్చు. కాని... వారిని హింసిస్తే పాపం వస్తుంది. కష్టాలు వస్తాయి అనే పాపభీతి ఉండాలి. ఈ భయం లేకపోతే మానవజాతి మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది.

భారతకథలో ఒక సన్నివేశాన్ని ఆధారంగా తీసుకొని మొత్తం మానవజాతి జీవననీతిని ప్రబోధించే విధంగా వ్యాసహృదయాన్ని నన్నయ తెలుగువారికి అందించారు. అందుకే 'వింటే భారతం వినాలి. తింటే గారెలు తినాలి' అనే సామెత ఏర్పడింది. మినపగారెలు దేహపుష్టిని కలిగించినట్లే మహాభారత శ్రవణం వ్యక్తిత్వ వికాసాన్ని ఇస్తుంది.

బలం అనేకవిధాలుగా ఉంటుంది. ధనబలం, విద్యాబలం మొద లైన బలాలు కలవారు ఆయా రంగాల్లో బలహీనులను, సజ్జనులను హింసించి అపకారం చెయ్యకూడదు. అలా చెయ్యటం పాపమనీ, పాపం వలన కష్టనష్టాలు వస్తాయనే భయం మానవులందరికీ ఉంటే, హింస, దోపిడి ఉండవనీ సరమ ద్వారా చెప్పించిన వేదవ్యాసునికి నమస్కరిస్తూ మహాభారతం చదువుదాం, జీవననీతిని తెలుసుకుందాం.

2. మనసు వెన్నలా ఉండాలి

మహాభారతం గొప్ప ప్రబోధకేంద్రం. దానిలో అన్నిరంగాల నిపుణులు ఉంటారు. ఎవరికి ఏది అవసరమో దానిని ప్రబోధించి రుగ్మతలను పోగొట్టడానికి మహాభారతం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి.

ఉదంకుడు అనే శిష్యుడు గురుపత్ని కోరిన కుండలాలు తేవడానికి పౌష్యమహారాజు దగ్గరకు వెళ్లాడు. ఆయన అవి ఇచ్చి అతిథిని భోజనం చేసి వెళ్లమన్నాడు. ఉదంకుడు భోజనం చేస్తూ ఉండగా అన్నంలో వెంట్రుక వచ్చింది. అతను కోపంతో రాజును 'అంధుడివి కమ్మ'ని శపించాడు. చిన్న తప్పుకే పెద్దశాపం పెట్టిన ఉదంకునిపై కోపంతో రాజు 'సంతానహీనుడివి అవుతావు' అని ప్రతిశాపం పెట్టాడు. ఇద్దరం శాపాలు ఉపసంహరించుకుందామని ఉదంకుడు అన్నప్పుడు పౌష్యుడు మనస్తత్త్వశాస్త్ర విశ్లేషణగా తన

అభిప్రాయాన్ని ఇలా చెప్పాడు.

నిండుమనంబు నవ్యనవనీతసమానము పల్కుదారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపు నో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్

విప్రుల మనసు వెన్నలా ఉండి, మాట పరుషంగా ఉంటే, రాజుల మాట వెన్నలా ఉండి, మనసు పరుషంగా ఉంటుంది. అందువల్ల విప్రులు ఇచ్చిన శాపాన్ని వెనుకకు తీసుకోగలరు. కాని రాజులకు సాధ్యం కాదన్నది పద్యభావం. మానవుల మనోభావాలు, ప్రవర్తన వారి వంశపారంపర్య రక్తకణాలు, పెరిగిన పరిసరాలు, మానవసంబంధాలను బట్టి ఏర్పడతాయని మనోవిజ్ఞానశాస్త్రం ఇప్పుడు చెబుతున్న దానిని పౌష్యుని ద్వారా వ్యాసుడు ఏనాడో చెప్పించాడు. మానవుని ప్రవర్తనకు ప్రధానకేంద్రం మనస్సు. మానవులకు బంధానికయినా మోక్షానికయినా మనస్సే కారణం.

మానవుడు ఏ పని చేయాలన్నా మనసులో సంకల్పం ఏర్పడాలి. అది వెలుపలికి కాని లోపల కానీ వాక్కు రూపంలో వ్యక్తం కావాలి. చివరకు ఇంద్రియాల ద్వారా ఆచరణలోకి రావాలి. కనుక చేసేపని ఏదయినా మూడు దశలలో మనో వాక్కాయ రూపంలో సంపూర్ణతను పొందుతుంది. మనసును నియంత్రించగలిగితే మంచిపనులు చేయవచ్చు. చెడుపనులను మానవచ్చు. 'నేనింతే. ఇట్లాగే చేస్తా' అని మొండిగా వాదించే వారి పద్ధతిలో పౌష్యుడు తాను గెలవటానికి తన ప్రయోజనాన్ని నెరవేర్చుకోవటానికి చెప్పినట్లుగా ఉన్నా మనసు రూపుదిద్దుకొనే విధానాన్ని, దాని భేదాలను మానవులు తెలుసుకొనే విధంగా శాశ్వత సందేశాన్ని ఇచ్చాడు.

కరడుకట్టిన మనస్సును మార్చటానికి ఎన్నో ఉపాయాలను భారతీయ సంస్కృతికి మూలకర్తలైన మహర్షులు అన్వేషించారు. కొందరు ప్రభువు శాసిస్తే భయంతో వింటారు. కొందరు స్నేహితుడు చెబితే మైత్రితో వింటారు. కొందరు ప్రియమైన వారు లాలనగా చెబితే వింటారు. మొత్తం మీద మానవజాతి మనోగతిలో మార్పు తెచ్చి మంచిదారిలో పెట్టటమే మహర్షుల ఉద్దేశం కనుక వారు అన్నివిధాలా ప్రయత్నించారు. ఉదంకోపాఖ్యాన ప్రయోజనం కూడా అదే.

'స్వభావోదురతిక్రమః' (స్వభావం మారదు) అన్నప్పుడు ఇక చెప్పటం దేనికి? హితోపదేశాలు, సుభాషితాలు, సూక్తులు విని మారేవాళ్లు లేనప్పుడు వాటి ప్రయోజనం

ఏమిటి? అనే సందేహం రావచ్చు. కాని ఒక వ్యక్తి ప్రవర్తన అతని సహజస్వభావమా? లేక పరిస్థితులను బట్టి అలా ప్రవర్తించాడా? అనేది స్పష్టంగా నిర్ణయించటం కష్టం కనుక హితోపదేశం చేస్తూనే ఉండాలి. ఉదంకోపాఖ్యానం చదివిన వారిలో ఉదంకుని వంటివారు చిన్నచిన్న వాటికి పెద్ద శాపాలు పెట్టే కోపం తెచ్చుకోకుండా ఉంటారు. పౌష్యుని వంటివారు పరిపాలకులైనంత మాత్రాన అన్నిచోట్ల మెత్తగా మాట్లాడుతూ కఠినంగా వ్యవహరించవలసిన అవసరం లేదని పట్టువిడుపులు ఉండాలని తెలుసుకుంటారు. ఉభయులలోనూ రజోగుణ తీవ్రత తగ్గి సత్త్వగుణం ప్రకాశిస్తుంది. ఎవరికైనా నిండుమనంబు నవ్య నవనీత సమానంగా ఉండాలనీ, అలా లేనివారు ఈ కథ చదివి మారాలనీ మహాభారతసందేశం.

3. సత్యమే నిత్యం

ఊహ తెలిసినప్పటి నుంచి ఊపిరి విడిచేవరకు 'సత్యాన్నే పలకాలి, అసత్యాన్ని పలకకూడదు' అనే కఠోరవ్రతాన్ని వేదం మానవజాతికి విధిస్తోంది. ధర్మాచరణం కంటె ముందు చెప్పిన శాసనం 'సత్యంవద' (సత్యాన్ని పలుకు). తరువాతనే 'ధర్మం చర' (ధర్మాన్ని ఆచరించు) అని శాసిస్తోంది. సత్యభాషణం కూడా ధర్మంలో భాగం అవుతోంది. సత్యానికి భారతీయధర్మం ప్రాముఖ్యాన్ని ఇచ్చింది. మానవునికి మాత్రమే మాట్లాడే శక్తినిచ్చిన భగవంతుడు దానిని దుర్వినియోగం చేసుకుని చెడిపోవద్దని హెచ్చరిస్తున్నాడు.

సత్యభాషణంలోని సందేహాలకు సమాధానాల రూపంలో ఎన్నో కథలను వ్యాసభగవానుడు మహాభారతంలో వివరించాడు. సత్యమహిమను గురించి చెప్పిన ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క సందేహాన్ని తీరుస్తూ దాని ఆవశ్యకతను వివరించాడు వ్యాసమహర్షి...

తన యెరిగిన యర్థం బొరు
డనఘా! యిది యెట్టు చెప్పుమని యడిగిన చె
ప్పనివాడును సత్యము చె
ప్పని వాడును ఘోరనరకపంకమున పడున్

తనకు తెలిసిన విషయాలను ఇతరులు అడిగినప్పుడు చెప్పనివాడు, సత్యం చెప్పనివాడు ఘోరమైన నరకంలో బురదలో కూరుకొనిపోతాడు. నరకంలో నుంచి బయటకు రాలేడు.

భృగుమహర్షి అగ్నిహోత్రాలను సిద్ధం చెయ్యమని తన భార్య పులోమకు చెప్పి స్నానం

చెయ్యటానికి నదికి వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ఆమెను పులోముడు అనే రాక్షసుడు చూసి మోహించి, 'ఆమె ఎవరు?' అని అగ్నిహోత్రుణ్ని అడిగాడు. సత్యం చెప్పటమా! చెప్పకపోవటమా! అని సందేహించాడు అగ్ని. సత్యం చెపితే భృగువు శపిస్తాడు. చెప్పకపోతే అసత్యమాడిన పాపం వస్తుంది. ఈ రెండిటిలో దేనివలన ఎక్కువ నష్టం అని బేరీజు వేసుకున్నాడు. 'ఈమె భృగుపత్ని' అని నిజం చెప్పేశాడు. రాక్షసుడు పందిరూపంలో ఆమెను తరిమాడు. వేగంగా పరిగెత్తుతున్న పులోమ కడుపులోని పిల్లవాడు బైటపడిపోయి, కళ్లు తెరిచి రాక్షసుడి వంక చూశాడు. వాడు బూడిదైపోయాడు. ఆమె పిల్లవాణ్ని ఎత్తుకొని ఆశ్రమానికి వచ్చేసింది. భృగుమహర్షి 'నీగురించి వాడికి ఎవరు చెప్పారు?' అని భార్యను అడిగాడు. ఆమె అగ్నిహోత్రుణ్ని చూపించింది. భృగువు కోపంతో 'నీవు సర్వభక్షకుడివి అగుదువుగాక' అని శపించాడు. అప్పుడు అగ్ని చెప్పిన సమాధానమే పై పద్యం. తిట్లకూ, శాపాలకూ భయపడి తాత్కాలిక లాభాలకు, ప్రయోజనాలకూ ఆశపడి అసత్యం చెప్పకూడదు. దీనివల్ల వచ్చే పాపం భయంకరమైనది అని దేవతలందరికీ ప్రతినిధి (అగ్నిముఖా వై దేవాః) అయిన అగ్ని ద్వారా భారతం మానవజాతికి సందేశాన్ని ఇస్తోంది.

'తనకు తెలిసినది ఇతరులు అడిగినప్పుడు చెప్పితీరాలి' అని నన్నయ పొడిగించిన వాక్యంలోని సారాన్ని సారమతులు గ్రహించి తమ విజ్ఞానాన్ని సమాజానికి అందించాలి. అడిగిన వారికి చెప్పితీరాలి. అలా చెప్పకపోతే అది కూడా అసత్యదోషమే అవుతుంది. సమాచారాన్ని తెలియనివాడు తెలుసుకోవటం వారి హక్కుగా, తెలిసినవారు చెప్పటం వారి బాధ్యతగా మహాభారతం నిర్దేశిస్తోంది.

అగ్నిహోత్రుడు నిస్వార్థంగా సత్యం చెప్పినందుకు మొదట ఋషిశాపం తగిలినా తరువాత అది వరంగా మారింది. బ్రహ్మదేవుడు 'అగ్ని తగిలిన ఏ వస్తువైనా పవిత్రం అవుతుంది' అని అగ్నికి శాశ్వతమైన ఔన్నత్యాన్ని కల్పించాడు. కనుక ధర్మాచరణ మొదట కష్టనష్టాలను కలిగించినట్లు ఉన్నా ఆచరణ ఫలితం తరువాత కాలంలో శాశ్వత లాభాలను ఇస్తుంది అని మనసులో స్థిరపరచుకొని మానవులంతా ధర్మబద్ధులైతే వ్యవస్థ దానంతట అదే చక్కబడుతుంది. ఆనందమయమౌతుంది. సత్యం చెప్పటం వలన ఇక్కడ కలిగే కష్టం తాత్కాలికమైనది. చెప్పకపోతే ఘోరనరకంలో బురదలో దిగబడి అనుభవించబోయే దుఃఖం అతి దారుణమైనది అని మానవజాతి విశ్వసిస్తే ఈ లోకంలో హాయిగా నిశ్వసించవచ్చు.

4. తపస్వికి క్రోధం తగదు

సృష్టిలో సమస్తప్రాణులకూ సహజాతాలు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు. అవి లేకుండా ఏ ప్రాణీ పుట్టదు. మానవజాతిని అవి మరింత వెన్నాడుతూ ఉంటాయి. దుష్టశిక్షణ, శిష్టరక్షణల కోసం భగవంతుడు భూమిపై అవతరించి పాంచభౌతిక దేహాన్ని ధరించినప్పుడు ఆయనకు కూడా కామక్రోధాదులు తగు పాళ్లలో ఉంటాయి. ఉంటేనే దిగివచ్చిన కార్యం నెరవేరుతుంది.

కామాదులు ఆరింటినీ 'అరిషడ్వర్గం' అంటారు. ఈ ఆరుగురూ దేహికి శత్రువులు. శత్రువు అపకారం చేస్తాడు. వాడు మనకు శత్రువు అని తెలుసు కాబట్టి వాడికి దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. కుదిరితే మన బలాన్ని పెంచుకొని వాడిపై దాడి చేసి గెలుపు సాధిస్తాం. కాని కామాది శత్రువులు వాళ్లను విడిచి మనం ఉండలేనంత సన్నిహితంగా మనతో కలిసి ఉంటారు. వాళ్లతో కలిసి మనం చేసే పనులన్నీ మంచిగానే అనిపిస్తాయి. అరిషడ్వర్గం ఆరుగురూ కలిసే ఉంటారా? విడివిడిగా ఉంటారా? ఒకరి తర్వాత ఒకరు వస్తారా? అంటే 'కామం' అనే వాడి వెనక మిగిలిన వాళ్లు వస్తారని శ్రీకృష్ణభగవానుడు 'సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోభి జాయతే' అని భగవద్గీతలో చెప్పాడు. కనుక కోరికలు తీరిపోతే మిగిలినవాళ్లు రాకుండా ఉంటారా... అంటే కోరికలు పుట్టుకొస్తూనే ఉంటాయి. పుట్టిన కోరికలు అన్నీ తప్పకుండా తీరతాయనీ చెప్పలేం. దాంతో క్రోధం పుట్టుకొస్తుంది.

ధర్మమూర్తులైన పాండవుల మనుమడు, సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్మ బ్రతికించినవాడు అయిన పరీక్షిత్తు మహారాజు తనను శమీకమహర్షి పట్టించుకోలేదనే ఊహతో ఆయన మెడలో చచ్చిన పామును వేసి వెళ్లిపోయాడు. గౌరవాలు, గుర్తింపులు, హెచ్చుతగ్గుల వద్ద మనసులో నిద్ర లేచే అహంకారమే ఎన్నో గొడవలకు మూలం అవుతోందనడానికి ఉదాహరణ ఈ సంఘటన. తండ్రి మెడలో ఉన్న మృతసర్పాన్ని చూసిన శృంగి క్రోధంతో పరీక్షిత్తుకు వారం రోజుల్లో తక్షక విషంతో మరణం సంభవించేటట్లు శపించాడు. అది విన్న శమీక మహర్షి కొడుకుతో ఇలా అన్నాడు..

క్రోధమ తపసుం జెఱచును
క్రోధమ యణిమాదులయిన గుణముల బాపుం
గ్రోధమ ధర్మ క్రియలకు

బాధయగుం గ్రోధిగా దపస్వికి జన్నే!

'నాయనా! క్రోధం తపస్సును చెడగొడుతుంది, అణిమాది అష్టసిద్ధులను పోగొడుతుంది, ధర్మాచరణకు బాధ కలిగిస్తుంది. తపస్వికి క్రోధం పనికిరాదు' శమీకుడు క్రోధం పనికిరాదని గట్టిగా మూడుసార్లు చెప్పాడు. దానివలన వచ్చే నష్టాలను వివరించాడు. తండ్రి అగ్నిని తనలో దాచుకొనే జమ్మిచెట్టు వంటి శమీకుడు. కొడుకు కొమ్ములు మొలిచి తల విసిరే పసరం వంటి శృంగి. కనుక తండ్రి వైతరం బాధ్యతగా కొడుకుకు ధర్మోపదేశంతో పాటు శీలనిర్మాణాన్ని క్రిందితరానికి బోధించిన విధానాన్ని మహాభారతం అందిస్తోంది.

క్రోధం, కోపం సమానపదాలుగా ఉపయోగిస్తాం. 'తన కోపమే తన శత్రువు' అని సుమతీ శతకకారుడు కూడా అన్నాడు. అమరకోశం కూడా సమానార్థకాలుగా చెప్పినా 'క్రుధక్రోధే', 'క్రుధ రోషే' అనే రెండు ధాతువులను లింగాభట్టీయం చూపించింది. 'రుష హింసాయాం' అనే ధాతువు ప్రకారం క్రోధం హింస చేయిస్తుంది. కనుక కోపం కంటె పెమెట్టుగా తీవ్రమైనది, హింస చేయించేది క్రోధం. అందుకే అరిషడ్వర్గాలలో 'క్రోధం' అనే పదానికీ చోటు లభించింది. కోపాగ్ని గడ్డిమంట లాంటిది. తనకు తానే తగలబడి చల్లారుతుంది. క్రోధాగ్ని కట్టె నిప్పు వంటిది. తాను తగలబడుతూ ఎదుటివాటిని తగలబెడుతుంది. ఇతర ప్రాణులలో ఆత్మరక్షణ కోసం అప్పటికప్పుడు కోపం వస్తుంది. పాము పగ పడుతుందని నమ్మకం. మానవజాతిలో మాత్రం క్రోధమే ఎక్కువగా ఉండి, 'మన, తన' చూడకుండా వినాశానికి కారణం అవుతోంది. ఏకాగ్రతను, ఆరోగ్యాన్ని, మానవసంబంధాలను పాడు చేస్తోంది. మహాభారత సందేశంతో క్రోధాన్ని జయిద్దాం. శాంతిరస్తు. తుష్టిరస్తు. పుష్టిరస్తు.

5. ఆషాఢపూర్ణిమ వ్యాసుని జన్మదినం...

వేదాలను యుగాలకు అనుగుణంగా విభజించాడు. వేదధర్మాలను రాబోయే కలియుగానికి అందించటానికి అష్టాదశ పురాణాలను రచించాడు. తన కళ్ల ఎదుట జరిగిన సన్నివేశాలను ఇతిహాసంగా, పంచమవేదంగా మహాభారత సంహిత రూపంలో మానవజాతికి శాశ్వత పాఠ్యగ్రంథంగా ఇచ్చిన జగద్గురువు వేదవ్యాసమహర్షి.

వైదిక సంస్కృతిని సమస్త మానవులకు సమగ్రంగా ప్రత్యక్షం చేసే వాఙ్మయాన్ని సృష్టించిన ఘనత వ్యాసునిదే. 'వేదవ్యాసుడు' ఆయన అసలు పేరు కాదు. వేదాలను విభజించటం

వలన ఆ పేరు ఏర్పడింది. పరాశరమహర్షి కుమారుడు కనుక 'పారాశర్యుడు', తల్లి సత్యవతి కనుక 'సాత్యవతేయుడు'. బదరీవనంలో తపస్సు చేయటం వలన 'బాదరాయణుడు' అనే పేర్లు వచ్చాయి. యమునా నదీ ద్వీపంలో పుట్టటం వల్ల 'ద్వైపాయనుడు' అనే విశేషణం అసలు పేరుకు కలిసింది.

వేదవ్యాసుని అసలు పేరు 'కృష్ణుడు'. ఆ కాలంలో 'కృష్ణ' నామానికి ఉన్న ఆకర్షణ వల్ల పురుషులకు, స్త్రీలకు కూడా ఆ పేరు పెట్టేవారు. శ్రీమన్నారాయణుడు 'శ్రీకృష్ణుడు'గా అవతరించాడు. ద్రౌపది అసలు పేరు 'కృష్ణ'. అర్జునుని పది పేర్లలో ఒకటి 'కృష్ణుడు'. అందరిలో ప్రత్యేకంగా తెలియటానికి వ్యాసభగవానుడు 'కృష్ణద్వైపాయనుడు' అయ్యాడు. చాంద్రమానం ప్రకారం వచ్చే ఆషాఢపూర్ణిమను ఆయన జన్మదినంగా వ్యాసపౌర్ణమిగా ఆయనను పూజించాలని ధర్మశాస్త్ర గ్రంథాలు నిర్ణయించాయి.

కలియుగం ఆరంభం నుంచి ఈ పూర్ణిమను వ్యాసపూర్ణిమగా, గురుపూర్ణిమగా జరుపుకొనే ఆచారం కొనసాగుతోంది. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతాది మార్గాలు ఎన్ని ఏర్పడినా ఆ ప్రవక్తలందరికీ వ్యాసవాఙ్మయమే ప్రమాణం. ఆయన రచించిన ఇతిహాసపురాణాలు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలే ఆధారం. అందువలన వ్యాసుడు జగద్గురువయ్యాడు. 'నారాయణ' 'సదాశివ' పదాలు మార్చుకున్నా 'వ్యాస' పదాన్ని అలాగే ఉంచి 'అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్' అని గురుపరంపరకు నమస్కరిస్తున్నారు.

'అన్ని ప్రాణుల హితానికి కృషి చేయటం, వేదాలలోని ధర్మాలను సూర్యుడు పద్మాలను వికసింపచేసినట్లు లోకానికి తెలియచేయటం, లోకానికి చెప్పటమే కాక శమదమాది సద్గుణాలను తాను ఆచరించి చూపటం'... ఇదే వ్యాసతత్త్వం. అందుకే మానవజాతి ఆయనకు శిష్యవర్గమై నమస్కరించాలి. ఆషాఢమేఘం ఎలా ఉంటుందో వ్యాసమహర్షి అలా ఉంటాడు. బ్రహ్మచారి చేతిలో ఉండే ఆషాఢ దండం (మోదుగకర్ర) అతనికి రక్షణ కల్పిస్తూ, దారిచూపిస్తూ, బ్రహ్మచర్య చిహ్నంగా ఎలా స్వాధ్యాయ ప్రవచన బద్ధుణ్ని చేస్తుందో వ్యాస వాఙ్మయం అలా అతణ్ని జ్ఞానవంతుణ్ని చేస్తుంది కనుక ఆషాఢపూర్ణిమ వ్యాసపూర్ణిమ.

'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః...' అనే గురు ప్రార్థనలో చెప్పినట్లు వ్యాసుడు కురువంశం కొనసాగటానికి కారణమైనాడు. వారిని కష్టాలలో కనిపెట్టి ఉన్నాడు. మొత్తం లయమైపోతున్న యుగాంత ప్రళయాన్ని పర్యవేక్షించి త్రిమూర్తుల ధర్మాలను నిర్వర్తించిన నిరాకార పరబ్రహ్మం అయ్యాడు.

తల్లిపాలు తాగేవరకే ఒకరికొకరు గుర్తు. ఆ తరువాత ఎవరికి వారే. బంధాలు లేవు. బంధుత్వాలు లేవు. కానీ మానవుడు తన పైతరాల నుంచి ధర్మాధర్మాలను తెలుసుకొని కింది తరానికి తెలియచేయాలి. అది అతని కర్తవ్యం. బాధ్యత.

ఈ సందేశాన్ని అందించటానికే 'వశిష్ఠుని మునిమనమడు, శక్తి మహర్షి మనుమడు, పరాశరుని కుమారుడు, శుకమహర్షి తండ్రి అయిన వ్యాసమహర్షికి నమస్కారం' అనే ప్రార్థనా శ్లోకం ఏర్పడింది. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో మానవుడు తన పైతరాల నుంచి ఎంత తెలుసుకోగలుగుతున్నాడు, కింది తరానికి ఎంత అందించగలుగుతున్నాడు అనే ప్రశ్న ఉదయించి సమాధానం దొరికితే బతుకు నిండుపున్నమి వెన్నెల అవుతుంది. ఋషి ఋణం తీరుతుంది.

6. రాజధర్మం కత్తిమీద సాములాంటిది

ఏ పని చెయ్యాలో, సంపాదించినదాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుకుంటేనే చేసిన కృషి సఫలం అవుతుంది. లేదంటే పగిలిన కుండలో పోసే నీళ్లలాగా పోసేవి పోస్తుంటే, పోయేవి పోతూ ఉంటాయి. జీవనవిధాన సూత్రాల పట్టాలపై నడిస్తేనే జీవితశకటం గమ్యాన్ని చేరుకుంటుంది.

క్షమ (సహనం, ఓర్పు) లేని తపసి చేసిన తపస్సు, ప్రమత్తుడు (మదం, విచ్చలివిడితనం కలవాడు) సంపాదించిన సంపద, ధర్మవిరుద్ధంగా పరిపాలించేరాజు రాజ్యం, పగిలిన కుండలోని నీరులాగా అశాశ్వతం అయి క్షీణించిపోతాయి.'

తపస్సు అంటే ముక్కు మూసుకొని కూర్చుని చేసే ధ్యానం మాత్రమే కాదు. స్థిరమైన లక్ష్యంతో ఒక పని సాధించటానికి ఏకాగ్రతతో చేసే పని ఏదైనా తపస్సు అవుతుంది. కనుక దీక్షతో పనిచేసేవారు ఎవరికైనా సహనం, ఓర్పు లేకపోతే విజయం సాధించలేరు. విశ్వామిత్రుడు ఒక్కొక్క దిక్కునా పదివేల సంవత్సరాలు కష్టపడి చేసిన తపస్సును అసహనంతో వృథా చేసుకున్నాడు. శాపాలు పెట్టి తపోలాభాన్ని ఖర్చు చేసుకున్నాడు. తపసికి సహనం అవసరం అని జ్ఞానోదయం అయ్యాక బ్రహ్మర్షి అయ్యాడు. అప్పుడు యాగరక్షణకు రామలక్ష్మణులను తీసుకువెళ్లాడు. కాని రాక్షసులను శాపాలతో పారద్రోలి తపస్సు వృథా చేసుకోలేదు... ఏకాగ్రతతో ఒకే బొమ్మ వేసే చిత్రకారుడు సహనంతో దృష్టిని కేంద్రీకరించినప్పుడు గీతలు

చెరిగిపోకుండా, రంగులు చెదిరిపోకుండా అందమైన చిత్రాన్ని చిత్రించగలుగుతాడు. అన్నిరంగాల వారికి సహనం అవసరం. వేగంగా సాగే ఈ నాటి ప్రపంచంలో వాహనాలు నడపటం కూడా తపస్సులాంటిదే. సహనం లేనివారు స్వయంగా ఆపదలు తెచ్చుకుంటారు. ఏ పని తలపెట్టినా తపస్సులాగా చేయాలి. సహనంతో ఆవేశపడకుండా, నిరాశ పడకుండా చేయాలి. నిండుకుండలా ఉండాలి.

సంపదను నిలబెట్టుకోవాలంటే నిరంతరం అప్రమత్తులై ఉండాలి. ప్రమత్తుడు (మదించినవాడు, జాగ్రత్తలేనివాడు) ఎంతటి సంపదనైనా పగిలినకుండలో నీరులాగా పోగొట్టుకుంటాడు. 'ఏట్లో పోసినా ఎంచి పోయాలి' 'దక్షుడు లేని ఇంటికి పదార్థము ఎంత వచ్చినా అది నిలవదు' 'వెల్లి (ప్రవాహం) గలిపిన చింతపండు' అయిపోతుంది.

నహుషుడు చేసిన యజ్ఞయాగాలకు అనుకోకుండా ఇంద్రపదవి లభిస్తే దానిని మదంతో, అహంకారంతో పోగొట్టుకుని కొండచిలువ అయ్యాడు. వచ్చిన అధికారాన్ని ధర్మబద్ధమైన పరిపాలనలో నిలబెట్టుకున్న ప్రభువు నిండుకుండలా ఉంటాడు. అధర్మమార్గంలో పరిపాలించే రాజు పగిలిన కుండలా అధికారాన్ని కోల్పోయి నరకానికి పోతాడు. రాజధర్మం కత్తిమీద సాములాంటిది. ఏ మాత్రం తేడా వచ్చినా తెగక తప్పదు. ధర్మం విషయంలో స్వపర భేదం లేకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తే ధర్మదేవత అనుగ్రహం లభిస్తుంది. మాధవవర్మ మహారాజు కన్నకొడుకును కూడా కనికరించకుండా నిష్పక్షపాతంగా చెప్పిన తీర్పుతో బెజవాడలో కనకవర్షం కురిసింది. 'రాజ్యం స్వహస్తధృతదండమవాతపత్రమ్' (అధికారం తన చేతితో తాను మోసుకొనే గొడుగువంటిది) అని కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతలంలో గొప్ప పోలిక చెప్పాడు. గొడుగు వేసుకున్న వాడు దాని బరువు బాధ్యతలు తానే వహించాలి. జాగ్రత్తగా పట్టుకోవాలి. అప్పుడు దాని నీడవలన వచ్చే సుఖాలను, భోగాలను అనుభవించే అర్హత ఏర్పడుతుంది. అంతేకాని ఊరికే సుఖపడాలనుకోకూడదు. ఏ పని చేసినా తపస్సులాగా ఓర్పుతో చేయాలి. సంపదను సద్వినియోగం చేయాలి. అధికారాన్ని ధర్మబద్ధమైన పరిపాలనతో నిలబెట్టుకోవాలి. లేకపోతే ఈ మూడూ ఎవరికైనా ఎక్కడైనా ఎప్పుడైనా నిలబడవు. శమీకుడు తన కొడుకు శృంగికి చెప్పిన ఈ సందేశం మానవులందరికీ శిరోధార్యం.

7. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు...

జ్ఞానంతో, సాధనతో జ్ఞానేంద్రియాల (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం)ను, కర్మేంద్రియాల (నోరు, చేతులు, కాళ్లు, మలమూత్రావయాలు)ను నిగ్రహించాలి. అయితే దీనికి కాలపరిమితి, పరీక్షలు, యోగ్యతాపత్రాలు ఉండవు. ఏదైనా ఒక పరీక్షలో ఒకసారి ఉత్తీర్ణులయితే జీవితాంతం ఆ యోగ్యతాపత్రాన్ని చూపించుకోవచ్చు. కాని జితేంద్రియ యోగ్యతాపత్రం మాత్రం ఏ క్షణానికి ఆ క్షణం మారిపోతూ ఉంటుంది. ఊపిరి ఉన్నంతవరకు ఈ ఊయల ఆగకుండా అటు ఇటు ఊగుతూనే ఉంటుంది. దాంట్లో కూర్చున్న జీవుడు కళ్లు గట్టిగా మూసుకొని రెండు తాళ్లూ గట్టిగా పట్టుకొని నెమ్మదిగా ఊపు తగ్గించుకోవాలి. ఆకారం ఉన్నంతవరకు ఏ క్షణంలోనైనా వికారం కలుగవచ్చు. మనస్సు దానికి ఏదో కారణం చెబుతుంది. అందుకే భగవద్గీతలో 'బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాఃసమపికర్షతి' (ఇంద్రియ సముదాయానికి చాలా బలం ఉంటుంది. అది ఎంతటి విద్వాంసుడినైనా లాగేస్తుంది) అని స్పష్టంగా చెప్పాడు. చెడుగుడు ఆటలో ఈ వేదాంత రహస్యం అంతా దాగి ఉంది. తెలుగువారి క్రీడలన్నీ వ్యక్తిత్వ వికాసం, మానవసంబంధాలు, హితోపదేశం కోసమే ఏర్పడ్డాయని ప్రశాంతంగా విశ్లేషించి చూస్తే ఎవరికైనా తెలిసిపోతుంది.

కామక్రోధలోభమోహమదమాత్సర్యా లనే ఆరుగురి జట్టు చాలా బలమైనది. దాంట్లో ఈ చివర కామం, ఆ చివర మాత్సర్యం కొంగు కాస్తూ ఆరుగురూ చేతులు కలిపి కూతకు వచ్చినవాడిని లాగేస్తూ ఉంటారు. అవతలజట్టులో జపం, తపం, సాధన, యోగం, జ్ఞానం, మోక్షేచ్ఛ ఉంటారు. ఏమరుపాటు, నిర్లక్ష్యం లేకుండా చురుకుదనంతో, ప్రతిక్షణం జాగరూకతతో కూతకు వెళ్లి అవతలి జట్టులోని వాళ్లను తాకి దొరక్కుండా కూత ఆపకుండా తిరిగి వస్తూ ఉంటే ఆట ముగిసే సమయానికి గెలుపు లభిస్తుంది. కూతకు రావటం అంటే సమాజంలో తిరగటమే. జీవనావసరాలు తప్పవు కదా!

వ్యాసమహర్షి తండ్రి పరాశరుడు. మహాతపస్వి. స్మృతి సూత్రాలను 'పరాశరస్మృతి' గా రాబోయే కలియుగానికి అందించిన మహానుభావుడు. ఆయన యమున దాటి అవతలి గట్టుకు వెళ్లటానికి పడవ ఎక్కాడు. ఆ పడవను నడిపే దాశరాజుకు ఆరోజు వీలుపడక ఆ పని త న కూతురు సత్యవతికి అప్పగించాడు. పరాశరుడు పడవ ఎక్కినప్పుడు సత్యవతి పడవ నడుపుతోంది. పడవలో వారు ఇద్దరే ఉన్నారు. ఆమె శారీరక సౌందర్యం ఆయనను

సమ్మోహపరచింది. వ్యాసమహర్షి పుట్టుకకు కారణమైన ఈ కథ మన అందరికీ తెలిసినదే. మహర్షులకు ఇచ్చే గౌరవాన్ని, స్థాయిని బట్టి జరిగినదాన్ని తాత్త్వికంగా ఎలా సమన్వయపరచినా ఏ కాలంలోనైనా మానవుడు తెలుసుకోవలసిన మహత్తర సత్యాన్ని నన్నయ ఇలా చెప్పాడు.

ఎంత శాంతులయ్యు నెంత జితేంద్రియు
డయ్యుఁ గడు వివిక్తమయిన చోట
సతుల గోష్ఠిఁ జిత్త చలనమొందుదు రెందుఁ
గామి శక్తి నోర్వ గలరె జనులు

ఎంతో మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం కలవారైనా మిక్కిలి ఏకాంత ప్రదేశంలో పురుషుడు స్త్రీతో మాట్లాడుతూ గడిపినప్పుడు మనస్సు దారితప్పుతుంది. కామున్ని మానవులు ఎప్పటికీ గెలువలేరు, అని ఇంత కఠినంగా చెప్పటానికి కారణం స్త్రీపురుషజీవుల మధ్య ప్రకృతి సిద్ధంగా ఉండే స్వాభావిక ఆకర్షణ. నేటి మనస్తత్త్వశాస్త్రం ఇదే చెబుతోంది. మహాభారతంలోని ఈ పద్యాన్ని, ఇటువంటివి మరికొన్ని చదివిన వారికి, విన్నవారికి ఆ సన్నివేశంలో చటుక్కున గుర్తు వస్తూ ఉంటాయి. కనుక తొలి క్షణం మనస్సు చలించినా మరుక్షణం వివేకం మేలుకొనే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలా జరగాలనే తన తండ్రి కథను దాపరికం లేకుండా వ్యాసమహర్షి లోకానికి అందించాడు. స్త్రీ పురుషులను తప్పు పట్టటం కాక తప్పించుకు తిరగవలసిన అవసరాన్ని నొప్పించకుండా చెప్పాడు.

8. సౌభాగ్యదాయక శ్రావణ పంచమి

మాసాలలో శ్రావణమాసానికి ఎంతో విశిష్టత ఉంది. స్త్రీలకు, పురుషులకు, అన్ని వర్ణాలవారికీ ఆచరణీయమైన అంశాలకు కేంద్రం శ్రావణమాసం. శ్రావణ మాసవ్రతాలలో ముఖ్యమైనది నాగపంచమి. శ్రావణ శుక్ల పంచమిని నాగపంచమిగా జరుపుతారు. మరొక విశేషం శ్రావణ శుక్ల చతుర్థిని కూడా నాగులచవితిగా జరుపుతారు. శ్రావణమాసంలో ఇలా జరపటాన్ని నిర్ణయసింధువు (ధర్మశాస్త్ర గ్రంథం) అంగీకరించింది.

శ్రావణ శుక్లపంచమిని గరుడపంచమిగా జరపాలని గరుడపురాణం చెప్పింది. పరస్పర శత్రువులైన నాగులు, గరుత్మంతుడు ఇద్దరూ పూజలందుకొనే విశేషపర్వం.

నాగజాతిని సుబ్రహ్మణ్య స్వరూపంగా ఆరాధించటం, ఆరోగ్యాన్ని, సంపదలను, సంతాన

సౌభాగ్యాలను పొంది మొక్కులు తీర్చుకోవటం, దీపావళి వెళ్లిన తరువాత నాగులచవితికి పుట్టలో పాలు పోయటం తెలుగునేలలో అనాదిగా జరుగుతోంది. నాగపంచమికి అమ్మవారిని ఫణిగౌరిగా పూజించటం విశేషం.

ఫణిగౌరి! నమస్తేస్తు కైలాసనిలయేస్థితే
లోకమాతర్నమస్తుభ్యం, సౌభాగ్యం దేహి మే సదా

'కైలాసంలో ఉండే లోకమాతా! ఫణిగౌరీ! నీకు నమస్కారం. నాకు నిత్య సౌభాగ్యంప్రసాదించు' అని ప్రార్థిస్తూ చేసే ఈ వ్రతాన్ని అన్నదమ్ములు ఉన్న స్త్రీలు తప్పకుండా జరుపుకోవాలని వ్రతకల్పం చెబుతోంది.

సర్పజాతిలో వాసుకి ప్రముఖుడు. అతడు జరత్కారువు అనే పేరు గల తన చెల్లెలిని జరత్కారుడనే ఋషికి ఇచ్చి పెళ్లి చేశాడు. వాళ్లిద్దరికీ జన్మించిన ఆస్తీకుడు జనమేజయుని దగ్గరకు వెళ్లి సర్పయాగాన్ని ఆపించి సర్పజాతిని కాపాడాడు. అలాగే నూతిలో తెగిపోబోతున్న వంశవృక్షపువేళ్లను పట్టుకొని వేలాడుతున్న పితృదేవతల కోరికపై... పెళ్లి ఇష్టం లేని జరత్కారుడు... జరత్కారువు నాగజాతి కన్య అయినా ఒకే పేరుండటం వలన అంగీకరించాడు. అయితే తనను ఏ మాత్రం వ్యతిరేకించినా పుట్టింటికి పంపేస్తాననే ఒప్పందం పెట్టాడు. సాయం సంధ్యాసమయానికి నిద్రలేపిందన్న నెపంతో వాసుకి దగ్గరకు పంపేస్తూ, ఆమె కడుపులో పిల్లవాడు ఉన్న విషయం చెప్పాడు.

మేనమామ దగ్గర పుట్టి పెరిగిన ఆస్తీకుడు తండ్రివైపు పితృదేవతలకు పుణ్యలోకాలు కల్పించాడు. తల్లివైపు సర్పజాతి నశించిపోకుండా కాపాడాడు. అన్నదమ్ములు సోదరికి అండదండలుగా ఉంటే జరత్కారువులాగ పుట్టినింటికి క్షేమాన్ని కలిగిస్తుంది. దౌహిత్రుడు రెండు వంశాలకూ పనికివస్తాడు.

శ్రావణ శుద్ధపంచమి గరుత్మంతుని జన్మదినంగానూ, అతడు స్వర్గం నుండి భూలోకానికి అమృతాన్ని తెచ్చినరోజుగానూ గరుడపంచమి గురించి గరుడ పురాణం చెబుతోంది. గరుత్మంతునికి వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలలో ప్రముఖస్థానం ఉంది. శ్రీమహావిష్ణువుకు వాహనంగా పరివారదేవతలలో ముఖ్యుడుగా పూజలందుకునే గరుత్మంతుడు తన తల్లికి దాస్యవిముక్తి కల్పించాడు. ఇంద్రుని వజ్రాయుధం దెబ్బకు తట్టుకొని అమృతాన్ని భూమికి తెచ్చిన వీరుడు.

తల్లి వినతతో పాటు తాను కూడా సవతి తల్లి కద్రువకు, ఆమె సంతానం సర్పాలకు

ఊడిగం చేశాడు. రోషంతో ఎవరూ సాధించలేని దానిని సాధించి తల్లి దాస్యాన్ని పోగొట్టిన సుపుత్రుడు గరుత్మంతుడు.

అటు ఆస్తీకుడు, ఇటు గరుత్మంతుడు ఇద్దరూ పిల్లల పెంపకంలోని పరిస్థితులు, పరిసరాల ప్రభావాన్ని సూచిస్తూ పిల్లలను జాగ్రత్తగా పెంచమని, పిల్లల తెలివితేటలను ప్రతిభాపాటవాలను, సృజనాత్మకతను సద్వి నియోగం చేసుకోమని పెద్దలకు సందేశం ఇస్తున్నారు.

9. మాటకు మాట తెగులు

మహాభారత విహంగం నిరంతరం ఆకాశంలో విహరిస్తూ నేలపైన తిరిగేవాటిని, జరిగేవాటినీ పరిశీలిస్తూ ఉపగ్రహంలా మనకు సందేశాలు అందిస్తూ ఉంటుంది. మనం ప్రయోగించే యాంత్రిక ఉపగ్రహాలకు కాలపరిమితి ఉంటుంది. కాని మహాభారతం ఎల్లకాలమూ మానవ సంక్షేమానికై పరిభ్రమించే విధంగా ప్రయోగించిన సర్వశాస్త్రవేత్త వేదవ్యాసుడు.

ఇతర జంతువులు వాటికి పుట్టుకతో వచ్చిన జీవలక్షణాలతో జీవిస్తాయి. ఉత్తమజంతువుగా (జంతూనాం నరజన్మ దుర్లభమ్) పేర్కొనబడుతున్న మానవుడు అదనంగా లభించిన బుద్ధిని ఉపయోగించి జ్ఞానాన్ని సంపాదించి జన్మను సార్థకం చేసుకోవాలి. అన్నిటిలోనూ ఆచితూచి అడుగు వెయ్యాలి. అప్పుడు సామాజిక వ్యవస్థ సంతోషంగా సాగుతూ, మానవ సంబంధాలు మనోహరంగా మారాకు వేస్తూంటాయి.

శుక్రుడు రాక్షసుల గురువు కనుక ఆయన చెప్పే నీతులు, ధర్మాలు శ్రేష్ఠం కాదనుకోకూడదు. కొన్ని సందర్భాలలో అట్లా అనిపించినా లోకజ్ఞత, సామాజిక జీవనంలో శుక్రనీతి అవసరం అవుతూనే ఉంటుంది. శుక్రునికి తన కూతురు దేవయాని అంటే అంతులేని ప్రేమ. రాజగురువు కుమార్తెగా తండ్రి చూపిస్తున్న అతి ప్రేమ వల్ల ఆమె ప్రవర్తన ఒక రకంగా రూపుదిద్దుకుంది. గర్వం, గయ్యాళితనం, కోరింది కోరినట్లు రావాలని, కావాలని పట్టుబట్టే మొండితనం దేవయాని పాత్రను చరిత్రలో ప్రత్యేకంగా నిలబెట్టాయి. పిల్లలపెంపకంలో ఎదురయ్యే ఒడిదుడుకులు... ఏ కాలపు తల్లిదండ్రులైనా తెలుసుకోవలసిన అంశాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు దేవయాని కథలో ఎన్నో ఉన్నాయి.

రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ. రాజుగారి అమ్మాయిగా ఆమెలో గర్వం,

అహంకారం, ఆధిక్యభావం కాస్తోకూస్తో చోటుచేసుకున్నాయి. శర్మిష్ఠ, దేవయాని జలకాలాటకు వెళ్లినప్పుడు గట్టున పెట్టిన బట్టలు గాలికి తారుమారైనాయి. తన బట్టలు దేవ యాని కట్టుకున్నదన్న కోపంతో శర్మిష్ఠ ఆమెను బావిలోకి తోసి వెళ్లింది. వేటకు వచ్చిన యయాతి మహారాజు ఆమెకు చేయి అందించి పైకి చేర్చాడు. శర్మిష్ఠ తనను అవమాన పరిచింది కనుక తాను నగరంలోకి రానని తన చెలికత్తెతో తండ్రికి కబురు పంపింది. శుక్రుడు వచ్చి ఆమెకు హితోపదేశం చేశాడు...

అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మరి విననియట్ల ప్రతివచనంబుల్
పలుకక బన్నము వడియెడ
దలపక యున్నతుడు చూవె ధర్మజ్ఞుడిలన్

ఎదుటివారు అలిగినా తాను అలుగకుండా ఉండాలి. తిట్టినా విననట్లు తాను తిట్టకుండా ఉండాలి. అవమానం జరిగితే మనసులో పెట్టుకోకుండా మరిచిపోవాలి. ఈ లోకంలో అలా ఉండేవాడే ధర్మజ్ఞుడు అని శుక్రుడు దేవయానితో పాటు మనకు మార్గదర్శకుడైనాడు.

ఎదుటివాడికి కోపం వచ్చినప్పుడు తాను శాంతంగా ఉండటం వలన తన ఆరోగ్యం పాడవదు. వాడిలో పశ్చాత్తాపం కలుగుతుంది. వాడు తిట్టాడని తాను కూడా తిడితే 'మాటకు మాట తెగులు నీటిని నాచు తెగులు' కనుక ఘర్షణ పెరుగుతుంది. విననట్లు ఊరుకుంటే ఎదుటివాడే మనసు మార్చుకుంటాడు. మనస్సులో పుట్టిన కోపం వాక్కురూపంలో తిట్లుగా, దేహం మీదికి హింసగా మారి నాశనానికి కారణమౌతోంది. రెండుచేతులూ కలిస్తే చప్పట్లు మోగినట్టు ఎదుటివాడూ తానూ ఇద్దరూ నష్టపోతారు.

ఎంతో స్నేహంగా ఉండేవారిలో ఇద్దరూ తీవ్రస్వభావులైతే మిత్రలాభాన్ని పొందలేరు. 'ఎదుటివాళ్లు శాంతంగా ఉంటే నేనూ ఉంటాను' అని వంతు పెట్టుకోకుండా ఎవరికి వారు ఆచరణలోకి తేవాలి. అప్పుడు మానవసంబంధాలు విడాకులు, పెడాకులు కాకుండా సమాజం సుఖసంతోషాలతో ప్రగతిమార్గంలో పయనిస్తుంది.

10. అలవాట్లు - పొరపాట్లు

ఏ కాలంలోనైనా మానవుల వివేకాన్ని పోగొట్టి చెడ్డపనులు చేయించే దుర్వ్యసనాలు నిత్యనూతనంగా విజృంభిస్తూనే ఉంటాయి. వాటి మాయలో పడినవారు తాము పతనం కావటమే కాక కుటుంబానికీ, సమాజానికీ కూడా కష్టనష్టాలను కలిగిస్తారు.

ఏదో ఒక రూపంలో మానవులను ప్రలోభపెట్టే సామర్థ్యం గల వ్యసనాలను క్రోడీకరించి ఏడింటిని సప్తవ్యసనాలుగా ప్రకటించారు. వ్యసనం అంటే మానలేని అలవాటు. ఏడింటిలో మొదటిది మద్యపానం. స్త్రీ, వేట, జూదం, వాక్పారుష్యం (నోటిదురుసు) దండ పారుష్యం (కఠినంగా దండించటం), అర్థదూషణం (ధనం విచ్చలవిడిగా ఖర్చు పెట్టటం) మిగిలిన ఆరు. వీటిలో ఏదో ఒకటి మనకు తెలియకుండానే మనలో ఉండే అవకాశం ఉంటుంది. ఎవరి అలవాటును వారు ఏవేవో కారణాలు చెప్పి సమర్థిస్తూ ఉంటారు. చేతులు కాలాక చెంపలు వేసుకుంటారు.

మృతసంజీవని విద్యను కనిపెట్టినవాడు, రాక్షసుల గురువు, మహానీతివేత్త అయిన శుక్రాచార్యునికి ఉన్న వ్యసనం మద్యపానం. అంతటి మహానుభావుడు మద్యం మత్తులో ఒళ్ళు తెలియక వివేకాన్ని కోల్పోతూ ఉంటాడు. వ్యసనపరుడు తన బలహీనత వలన ఎదుటివారి చేతిలో మోసపోతూ ఉంటాడు. మేకను చూపించి పులిని, చెఱకుగడను చూపించి ఏనుగును బంధించినట్లు వ్యసనపరుని ధన, మాన, ప్రాణాలను అపహరిస్తాడు. రహస్యాలు రాబట్టుకుంటారు. వివేకాన్ని నశింపచేస్తారు.

శుక్రాచార్యునికి మాత్రమే తెలిసిన మృతసంజీవని విద్యను నేర్చుకొనిరమ్మని బృహస్పతి తన కుమారుడుయిన కచుడిని శుక్రాచార్యుని దగ్గరకు పంపాడు. కచుడు తన వినయవిధేయతలతో శుక్రుడిని మెప్పించాడు. దేవగురువు కొడుకు తన దగ్గరకు చదువుకోవటానికి వచ్చాడని శుక్రుడు ఎంతో వాత్సల్యంతో కచుడిని ప్రేమగా చూడటం సహించలేక రాక్షస విద్యార్థులు మాత్సర్యంతో కచుడిని చంపేశారు. అడవిలో అతని మృతదేహం ఉందని దివ్యదృష్టితో చూసిన శుక్రుడు మృతసంజీవనితో అతడిని బతికించాడు. రాక్షస విద్యార్థులు మళ్లీ కచుడిని చంపారు. ఈసారి దేహం మిగలకుండా కాల్చి బూడిద చేశారు. ఆ బూడిద కూడా మిగలటం ఇష్టం లేక దానిని మద్యంలో కలిపి గురువుగారి చేత తాగించారు.

మద్యపానం రుచిలో సమస్తమూ మరచిపోయిన ఆచార్యుడు తన కుమార్తె దేవయాని పిలుపుతో మెలుకువ తెచ్చుకుని జరిగిన అనర్థాన్ని దివ్యదృష్టితో తెలుసుకుని పశ్చాత్తాపపడ్డాడు. కడుపులో ఉన్న కచుడిని బతికించి బయటకు తేవటానికి కడుపులో ఉన్నవాడికి మృతసంజీవని విద్య నేర్పవలసి వచ్చింది. శత్రుపక్షంవాడైన కచుని ప్రయోజనం సులువుగా నెరవేరింది. అప్పుడు కాని మద్యపానం వల్ల కలిగే నష్టాలు శుక్రాచార్యునికి తెలిసిరాలేదు. వెంటనే లోకానికి సందేశాన్ని, కఠినమైన ఆదేశాన్ని ఇలా ఇచ్చేశాడు.

మొదలి పెక్కు జన్మముల పుణ్యకర్మముల్
పరగఁ బెక్కు సేసి పడయఁబడిన
యట్టి యెఱుక జనులకాక్షణ మాత్రన
చెఱుచు మద్యసేవ సేయనగునె

'గత జన్మలో చేసిన ఎన్నో పుణ్యాల వలన కలిగిన జ్ఞానాన్ని ఈ జన్మలో ఒక్క క్షణంలో పోగొడుతుంది కనుక మద్యపానం చేయరాదు'

'ఈనాటి నుంచి ఎవరూ మద్యపానం చేయకండి. చేసినవారు నా శాపానికి గురి అవుతారు' అని గట్టిగా చెప్పారు. మద్యపానం దుర్వ్యసనం. దానిని మానుకోండి ... అని ఎవరో పెద్దలు, సంస్కర్తలు చేసిన హితబోధ కంటె దానివలన స్వయంగా కష్టనష్టాలను అనుభవించి చెప్పిన శుక్రాచార్యుని మాట వ్యసనాంధకారంలో 'వేగుచుక్క' (శుక్రగ్రహం). మానవజాతికి శిరోధార్యం.

11. నోరు మంచిదైతే ఊరంతా మంచిది

మానవులను పడగొట్టి పరువు ప్రతిష్ఠలు పోగొట్టే సప్తవ్యసనాలలో పరుషభాషణం ఒకటి. వ్యసనం అంటే మానుకోలేని అలవాటు. ఆ అలవాటు చెడ్డది కావచ్చు, మంచిది కావచ్చు. హద్దుమీరితే దానిని వ్యసనం అనాలి. చెడ్డది దుర్వ్యసనం. మంచిది సద్వ్యసనం. దేనితోనైనా బాధలు తప్పవు అని చెప్పటానికే దానం వ్యసనంగా మారిన బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కటానికి శ్రీహరి వామనావతారం ఎత్తాడు.

ఇతర జంతువులకు లేని వాక్కు అనే వరం మానవజాతికి ప్రత్యేకంగా లభించింది. దానిని కొందరు సద్వినియోగం చేసుకుని మన్ననలు పొందితే కొందరు తమను తాము నిగ్రహించుకోలేని మానసిక అనారోగ్యంతో దుర్వినియోగం చేసుకుని దూషణలకు

గురవుతుంటారు. తమ మీద ప్రేమ, నైపుణ్యం, ఉత్సాహం, సామర్థ్యం కలిగి తమ దగ్గర ఉన్నవారిని కూడా కొందరు ఊరికే సూటీపోటీ మాటలు అంటారు. వంకలుపెడతారు.

ఆత్మన్యూనత భావాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఎదుటివారి గొప్పదనాన్ని అంగీకరించకుండా, అభినందించకుండా ఆధిక్యాన్ని ప్రదర్శించటానికి పరుషంగా మాట్లాడతారు. దానివలన మానవసంబంధాలు దెబ్బతిని, ఆత్మీయులు దూరమవుతారు. ఇలా దూరం చేసుకునేవారిని 'వివేకశూన్యులు' అనటం తప్పుకాదు.

కడుననురక్తియు నేర్పును
గడకయు గలవారి నుఱక కడవగ నెగ్గల్
నొడివెడు వివేకశూన్యుల
కడనుండెడు నంతకంటె కష్టము కలదే

(మహాభారతం, ఆది. 3ఆ. 149)

'మిక్కిలి అభిమానం, నైపుణ్యం, సామర్థ్యం కలవారిని కారణం లేకుండా గొప్పకోసం పరుషంగా చులకనగా మాట్లాడే వివేకశూన్యుల దగ్గర ఉంచటం కంటె కష్టం ఏముంటుంది?' అని దేవయాని తన తండ్రి శుక్రాచార్యునితో పలికింది. రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ రాక్షసగురువు శుక్రాచార్యుని కుమార్తె దేవయానిని బావిలోకి తోసి వెళ్లింది. శుక్రుడు ఆమె దగ్గరకు వచ్చి నగరానికి పోదాం రమ్మని పిలిచినప్పుడు పరాభవంతో మగ్గిపోతున్న దేవయాని పలికిన ఈ పలుకులు నిత్యసత్యాలు.

ఆత్మన్యూనత, ఆధిక్యభావాల సంఘర్షణ వలన వచ్చే పరిణామాల్లో మొట్టమొదటిది మాటల్లో మార్పు. అంటే నోటిదురుసుతనం. ఏం మాట్లాడుతున్నామో? ఆ మాట అనవచ్చో లేదో? అనే వివేకాన్ని కోల్పోయే మానసికస్థితిలో ఉన్నవారిని అవ్యవస్థచిత్తులు అంటారు. అటువంటి వారి దగ్గర ఉండటానికి మించిన కష్టం మరొకటి లేదు. ఎప్పుడు ఏ వంకరమాట అంటారో చెప్పలేం.

హోమకుండంలో భగభగలాడే అగ్నిహోత్రుడు హోమంలో తనకు నెయ్యి పోస్తున్న హోత చేతిని కూడా కాలుస్తాడు... అనే ఉదాహరణతో అగ్నిదేవుణ్ని తప్పుపట్టి భావించకూడదు. ఎప్పుడూ చిటపటలాడుతూ ఉండేవాళ్లు తమకు భక్తితో, గౌరవంతో, అభిమానంతో ఉపకారం చేసేవారిని కూడా బాధపెడతారు అనే విషయం బాగా అర్థం కావటానికి ఒక సుభాషితంలో ఈ పోలికను చెప్పారు.

'జిహ్వాగ్రే మిత్రబాంధవాః' (బంధుమిత్రులందరూ నాలుక చివరనే ఉంటారు) అనే సూక్తి కూడా... నోటిదురుసుతనం వలన అందరూ దూరమౌతారని చెప్పటానికి చమత్కారంగా వారంతా నాలుక చివరనే ఉంటారు అంటోంది.

నన్నయగారు చెప్పిన పై పద్యంలో ఉఱక, కడవగ అనే రెండుపదాలు చాలా ముఖ్యమైనవి. తగిన కారణం లేకుండా, ఎదుటివారిని మించిపోవటానికి, ఆధిపత్యాన్ని నిరూపించుకోవటానికి, వారు బాధపడుతుంటే చూసి ఆనందించటానికి పరుషభాషణం చేయటం తగదు. క్షేమదాయకం కాదు. ఈ మహాభారత సందేశం ఎల్లవేళలా మానవజాతికి శిరోధార్యమైన ఆదేశం.

12. వినాయకచవితి - విజ్ఞాన సమృద్ధి

యుగయుగాలుగా దేశవిదేశాల్లోని అన్నివర్గలవారు శ్రద్ధాభక్తులతో ఒకే పద్ధతిలో జరుపుకునే విజ్ఞానభరితమైన విశేషపర్వం వినాయకచతుర్థి. ఏది మొదలుపెట్టాలన్నా, ఏ శుభకార్యంలోనైనా ముందు విఘ్నేశ్వరపూజ తప్పనిసరిగా చేస్తాం. తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా పూర్తి అయ్యేటట్లు అనుగ్రహించమని ప్రార్థిస్తాం.

భాద్రపద శుద్ధచతుర్థి... విఘ్నాలకు అధిపతిగా పార్వతీనందనుడు నియమింపబడిన తిథి, వినాయకుణ్ని చూసి చంద్రుడు నవ్వినందుకు పార్వతీదేవి కోపించి చంద్రుణ్ని ఎవ్వరూ చూడరాదని శపించింది. అందరూ ఆమెను ప్రార్థించగా భాద్రపద శుద్ధచతుర్థినాడు వినాయకవ్రతం చేసి, కథ విని అక్షతలు వేసుకొన్నవారు చంద్రుణ్ని చూడవచ్చునని పరిహారం చెప్పింది. అప్పటినుంచి అన్నిలోకాలలో ఈ తిథినాడు వినాయకుణ్ని పూజిస్తున్నారు.

'గణానాం త్వా గణపతిగ్ం హవామహే' అనే వేదమంత్రం నుండి గణపతికి ప్రథమస్థానం ఏర్పడింది. జ్యేష్ఠుడుగా, బ్రహ్మకు అధిపతిగా కీర్తించబడే గణేశుణ్ని అందరికంటె ముందు పూజించాలి. 'ఆదౌ పూజ్యో గణాధిపః' అని వేదశాసనం. భౌతికంగా మానవులకు ఎంతో విజ్ఞానాన్ని, సందేశాలను ఇచ్చే పండుగ ఇది ఒక్కటే.

మానవదేహంలో ఉన్న ఆరు చక్రాలలో మూలాధారచక్రం మొదటిది. దానికి అధిపతి గణపతి. పంచభూతాలలో చక్రానిది పృథివీతత్త్వం. యోగ సాధన మూలాధారం నుండి మొదలవుతుంది. భూమిపై జీవించే జీవులు గణపతి అనుగ్రహంతోనే క్రమంగా విజయాన్ని

సాధించగలుగుతారు. లేకపోతే వారు చేసే కృషి 'నేల విడిచి చేసే సాము' అవుతుంది. మట్టిలో పుట్టి మట్టిలో మనం కలిసిపోతున్నట్లే మట్టితో చేసిన గణపతి బొమ్మను పూజించి నీటి ద్వారా మట్టిలోకి చేర్చటంలోని అంతరార్థం... రూపాన్ని పొందిన పదార్థం శాశ్వతంగా అలాగే ఉండదు అని.

సగుణోపాసన నుండి నిర్గుణపరబ్రహ్మను తెలుసుకోవాలి. ఈ పరమార్థాన్ని తెలియచేసే మట్టి ప్రతిమకు చవితినాడు పూజించాలి. మన కోరికలను అనుసరించి పూజించేటప్పుడు పసుపు, వెండి, బంగారం, నవరత్నాలతో చేసిన ప్రతిమను పూజించాలి. దానిని నిమజ్జనం చేయనక్కరలేదు. వినాయకునిరూపంలో ఎన్నోప్రత్యేకతలు ఉన్నాయి. ఏనుగుతల దృఢదీక్షను, పెద్దచెవులు ఎదుటివారు చెప్పింది విచక్షణతో వినడాన్ని, తొండం కార్యకౌశలాన్ని, ఏకదంతం తగ్గిన అహంకారాన్ని, పెద్దనోరు ఏదైనా తినగల శక్తిని, పెద్ద పొట్ట అన్నిటినీ దాచుకోగల సామర్థ్యాన్ని, నాగయజ్ఞోపవీతం విషజంతువును యజ్ఞసూత్రంగా మలుచుకునే నిగ్రహాన్ని, నాలుగు చేతులు... చిత్తం, మనస్సు, బుద్ధి, అహంకారాలను, మూషికవాహనం చిన్నదిగా కనిపిస్తూ తనకు ఇష్టమైన దానికోసం ఎక్కడికైనా తప్పుకుపోయే విషయవాంఛలపై అధిరోహించి తన అదుపులో పెట్టుకుని మంచిదారిలో నడిచే చాతుర్యాన్ని, వీరాసనంలో మడిచి ఉన్న ఎడమకాలు నిగ్రహించిన మనస్సును, వ్రేలాడుతున్న కుడికాలు నిర్ణయాత్మక బుద్ధిని సూచిస్తూ సాంకేతికంగా సందేశాత్మకంగా గణేశుడు రూపుదిద్దుకున్నాడు.

వినాయకచతుర్థి పూజా ద్రవ్యాలు, నైవేద్యాలు, ఆరాధనవిధానం అంతా ప్రబోధాత్మకంగా రూపొందించబడింది. మానవులు పూజించే దేవుళ్లలో నిరాడంబరతను నేర్పేవాడు గణేశుడే. నిరుపేదలైనా మట్టితో బొమ్మ చేసుకుని తోటల్లో తిరిగి, ప్రకృతి నుండి పరిసరాలలో లభించే ఏకవింశతి (21) పత్రాలను, ద్రవ్యాలను సేకరించి పూజించవచ్చు. విలువైన ఆభరణాలు, అలంకారాలు ఆయన కోరడు. పూజామందిరంలోకి అంతరిక్షంలోని పాలవెల్లిని గణపతి మాత్రమే రప్పిస్తాడు.

వడపప్పు, పానకం, ఉడకబెట్టి చేసిన ఉండ్రాళ్లు వంటి సులువుగా తయారై ఆరోగ్యాన్నిచ్చే పదార్థాలే స్వామికి ఇష్టం. నూనెలు, నేయి, వేపుళ్లు, తీపి, కారం పిండివంటలు కోరడు. దేహానికి వ్యాయామంగా గుంజిళ్లు తీయిస్తాడు.

"నీ చుట్టూ ఉన్న ప్రకృతిలో ఆరోగ్యాన్నిచ్చే మూలికలు, ఓషధులు ఉన్నాయి. వర్షఋతువులో అన్నీ పచ్చగా ఉంటాయి. పిల్లల్ని తీసుకువెళ్లి వెళ్లి వెతికి వాటిని గుర్తుపట్టు.

21 రకాల ఆకులతో నన్ను పూజించు. పనికిమాలిన చెత్త తీసుకుని వచ్చి నా నెత్తిన పెట్టకు. ఓషధులలో గరిక శ్రేష్ఠమైనది. ఇది చర్మవ్యాధుల్ని పోగొడుతుంది. నాకే కాక అమ్మవారికి కూడా ప్రీతిపాత్రమైన గరికను తెచ్చి నాకు సమర్పిస్తే దోషాలు తొలగిపోతాయి."

ఈ పూజ ఆడంబరం కోసం కాదు, ప్రకృతితో కలసి జీవించడం కోసం. పాడిపంటల కృషి జీవనవికాసం, శారీరక, మానసిక ఆరోగ్యవిజ్ఞానం కోసం, తరాల మధ్య అంతరాలు తొలగి అనుబంధాలు పెరగటం కోసం. తల్లిదండ్రులపై గౌరవం ఇనుమడించటం కోసం. తోబుట్టువులు సఖ్యతతో ఉండటం కోసం. హాస్యరసాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రవర్తనను తీర్చిదిద్దడం కోసం. సత్రాజిత్తులా సంపదలు రాగానే అహంకరించకూడదని చెప్పడం కోసం. భగవంతుడైనా తనపై వచ్చిన అపనిందలను తొలగించుకోవాలని తెలియటం కోసం. బుద్ధి సక్రమంగా ఉంటే నా అనుగ్రహంతో విజయసిద్ధి అవుతుందని గ్రహించటం కోసం... అని గణేశుడు వినాయకచతుర్థి ప్రయోజనాలను వరద అభయహస్తాలతో సూచిస్తున్నాడు. ఒకవేళ వ్రతం చేయలేకపోతే -

సింహః ప్రసేనమవధీత్ సింహోజాంబవతా హతః
సుకుమారక మారోదీః తవహ్యేష శ్యమంతకః
(నిర్ణయసింధువు)

అనే శ్లోకాన్ని చదువుకుంటే చంద్రదర్శనం వలన నీలాపనిందలు రాకుండా ఉంటాయి. మొక్కుబడిగా కాకుండా, వివేకంతో విజ్ఞానాత్మకమైన వినాయకచతుర్థి వ్రతాన్ని జరుపుకుని, విద్యాసంపదను పొందుదాం. గణేశుని కృపకు పాత్రులమవుదాం.

13. అనారోగ్యమే దౌర్భాగ్యం

'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సూక్తి ఏ భాషలో పుట్టి ఏ భాషలోకి వచ్చినా అన్ని భాషలు మాట్లాడేవారూ, అన్ని దేశాలవారూ, అన్ని కాలాల వారూ దానిని ఉపయోగిస్తూనే ఉంటారు. ఆరోగ్యానికి కావలసిన క్రమశిక్షణ, జాగ్రత్తలు, మనోనిగ్రహం వంటి ఆచరణల విషయంలో మాత్రం శ్రద్ధ చూపించక, పక్కదారిపడతారు. దానికి ఏవో కారణాలు చెబుతారు. ప్రాయశ్చిత్తాలు చేసుకుంటారు. పరిశోధనలు చేసి నివారణోపాయాలు వెదుకుతారు.

ఏ దేవతలయినా చేసిన తప్పు ఒప్పుకుంటే క్షమిస్తారట. ఆరోగ్యదేవత మాత్రం ఎవరినీ

క్షమించదట. శిక్ష అనుభవించవలసిందే. పాంచభౌతికమైన మానవదేహానికి పరిణామక్రమంలో ముసలితనం, రోగాలు వస్తూనే ఉంటాయి. అట్లా దైవవశంగా వచ్చేవాటిని రాకుండా ఎవరూ ఆపలేరు. 'ఏ వయసుకు ఆ ముచ్చట' అనే సామెత అన్ని వయస్సులకూ వర్తిస్తుంది. నల్లజుట్టు పడుచుదనానికి ముచ్చట అయితే, తెల్లజుట్టు ముసలితనానికి ముచ్చట. వచ్చేవాటిని ఎలాగూ ఆపలేం. కాని మన అవివేకంతో, స్వయంకృతాపరాధాలతో మనంతట మనం తెచ్చుకునే వ్యాధులు, వృద్ధాప్యం మరింత దుఃఖాన్ని కలిగిస్తాయి. సహజంగా వ చ్చేవి నియమితకాలం బాధిస్తే చేతులారా తెచ్చుకున్నవి జీవితాంతం బాధిస్తాయి.

యయాతి మహారాజు శుక్రాచార్యుని కూతురు దేవయానిని పెళ్లిచేసుకున్నాడు. ఆమెకు దాసిగా... రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ కూడా వెళ్లింది. యయాతి రహస్యంగా ఆమెను కూడా పెళ్లి చేసుకుని అయిదుగురు కొడుకులను కన్నాడు. దేవయాని జరిగిన విషయం తండ్రికి చెప్పింది. శుక్రుడు ఆగ్రహోదగ్రుడై యయాతిని వృద్ధుడవు కమ్మని శపించాడు. యయాతి క్షమించమని వేడుకున్నాడు. శుక్రుడు చాలా తెలివిగా 'నీ ముసలితనాన్ని ఎవరైనా తీసుకుని వాళ్ల యౌవనాన్ని నీకు ఇవ్వటానికి ఒప్పుకుంటే నీ బాధ తొలగిపోతుంది' అన్నాడు. యయాతి తన కొడుకులను పిలిచి 'మీలో ఎవరైనా నా ముసలితనాన్ని తీసుకుని యౌవనాన్ని ఇవ్వండి' అని అడిగాడు. అప్పుడు మొదటి నలుగురు ఇలా అన్నారు -

తగిలి జరయు రుజయు దైవవశంబున
నయ్యెనేని వాని ననుభవింత్రు
గాక! యెఱిగి యెఱిగి కడగి యా రెంటి జే
కొందురయ్య ఎట్టి కుమతులయిన?
(ఆది - 3 ఆ - 193 ప)

'తండ్రీ! దైవవశాత్తు వచ్చిన ముసలితనాన్ని, రోగాన్ని ఎవరైనా అనుభవిస్తారు అంతేకాని కావాలని చేతులారా స్వీకరిస్తాడా? నీ ముసలితనాన్ని మేము తీసుకోము' అని కరాఖండిగా చెప్పేశారు. కొడుకులు తండ్రితో అట్లా అనటం తప్పే అయినా ఆ మాటలలో గొప్ప సందేశం ఉంది. తన ప్రవర్తన లోపం వలన ఒంట్లో ఓపికను, ఆరోగ్యాన్ని కోల్పోయినవాడు ఎంతటివాడైనా కన్నబిడ్డలకు చులకన అవుతాడు. ఎటువంటి మూర్ఖుడయినా ప్రయత్నించి మరీ ఆ రెండిటినీ తెచ్చుకుంటారా... అనటంలో తండ్రిపై ఎత్తిపొడుపు కూడా ఉంది. ఈ వివేకం మానవులందరికీ కలిగించటానికే శుక్రుడు యయాతికి షరతులతో కూడిన ఉపాయం

చెప్పాడు. ఎంతటి ఆత్మీయులైనా వారి యౌవనాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చి, వృద్ధాప్యాన్ని, అనారోగ్యాన్ని తీసుకోరు. శుక్రుడు వరం ఇచ్చాడు కనుక, ఐదో కొడుకు పూరువు ముసలితనాన్ని ఇవ్వటానికి ఒప్పుకున్నాడు కనుక... యయాతి బయటపడ్డాడు. మనకు అది అసాధ్యం కనుక జాగ్రత్తలో ఉందాం. మహాభారత సందేశాన్ని అందుకుందాం. పైకి ముసలితనపు లక్షణాలు, అనారోగ్యం వచ్చినట్లు కనపడకపోయినా జీవకణాలలో బలం, రోగనిరోధకశక్తి తగ్గి వ్యాధులు వచ్చి మీదపడతాయి. అంతేకాక అవి తగ్గకుండా బుగ్గిపాలు చేస్తాయి.

14. పితృదేవతలకు ప్రియం మహాలయం

చాంద్రమాన భాద్రపద కృష్ణపక్షాన్ని మహాలయ పక్షంగా స్మృతి, ధర్మశాస్త్ర గ్రంథాలు పేర్కొంటున్నాయి. మానవుడు మోక్షాన్ని పొందడానికి దేవయానం, పితృయానం అనే రెండు మార్గాలను వేదం చెప్పింది. అలాగే జన్మించిన ప్రతి మానవునికీ దేవఋణం, ఋషిఋణం, పితృఋణం అనే మూడు ఋణాలు ఉంటాయని, వాటి నుంచి విముక్తులైన వారికి మాత్రమే ముక్తి లభిస్తుందనీ వేదం శాసిస్తోంది.

యజ్ఞయాగాదులు, తపోధ్యానాలతో దేవఋణాన్ని, సంతానవంతులై తాతముత్తాలకు పిండప్రదానాలు చేసి పితృ ఋణాన్ని, వేద శాస్త్రాధ్యయన ప్రవచనాలతో ఋషి ఋణాన్ని తీర్చుకోవాలి. మహాభారతం ఈ మూడు ఋణాలను తీర్చుకునే కర్తవ్యాన్ని ఆయా సందర్భాలలో బోధించింది. అనుశాసనిక పర్వంలో భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజు పితృయజ్ఞం గురించి అడిగినప్పుడు భీష్ముడు ఇలా అన్నాడు -

పితృపూజ సమగ్ర్యము దై
వత పూజనమునకు మనుజవల్లభ! పితృదే
వతల గొనియాడుదురు దే
వతలాదిగ గల్గునెల్లవారును భక్తిన్
(అనుశాసనిక 3. ఆ. 157 ప.)

'ధర్మరాజా! పితృపూజతోనే దేవపూజ సంపూర్ణం అవుతుంది. దేవతలు కూడా పితృదేవతలనే భక్తితో పూజిస్తారు' అని చెప్పారు. భాద్రపద కృష్ణపక్షం పితృదేవతల ఆరాధనకు

అనువైనది. ఆషాఢ కృష్ణపక్షం నుండి లెక్కిస్తే అయిదవదైన భాద్రపద కృష్ణపక్షాన్ని వారంతా ఆశ్రయించుకుని ఉంటారు. అన్నానికి, మంచినీళ్లకు ఇబ్బంది పడుతూ వాటికోసం ఎదురుచూస్తూ ఉంటారు. కనుక ఆ పదిహేనురోజులు శ్రాద్ధకర్మతో వారికి అన్నోదకాలు కల్పించాలి. మొత్తం వీలుకాకపోతే మొదటి అయిదురోజులు వదిలి చివరి పదిరోజులు, కుదరకపోతే మొదటి పదిరోజులు వదిలి చివరి అయిదు రోజులు చెయ్యాలి. కనీసం నువ్వులు, నీళ్లు వదిలినా అమావాస్యనాడు మాత్రం తప్పకుండా అన్నశ్రాద్ధం పెట్టితీరాలి. పదిహేను రోజుల్లో ఒక్కరోజయినా శ్రాద్ధం పెట్టాలి. 'తస్య సంవత్సరం యావత్ సంతృప్తాః పితరోధ్రువమ్' (మహాలయంలో ఒక్కరోజు శ్రాద్ధం పెడితే సంవత్సరం పొడుగునా పెట్టినంతగా పితృదేవతలు సంతృప్తి చెందుతారు).

మహాలయ పక్షానికి ఉత్తరకార్తె వస్తుంది. ఆ కార్తెలో పితృయజ్ఞం చేస్తే పితృదేవతలు సంతానాన్ని అనుగ్రహిస్తారు. రవి కన్యారాశిలో ఉండే సమయం ఇది. పార్వణవిధి (అన్నంతో చేసేది)తో చేసే శ్రాద్ధం పితృదేవతల అనుగ్రహంతో ఆరోగ్యాన్ని, జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

'ఆషాఢ్యాః పంచమే పక్షే కన్యాసంస్థే దివాకరే
యో వై శ్రాద్ధం నరః కుర్యాత్ ఏకస్మిన్నపి వాసరే
(నిర్ణయసింధుః)

మహాలయపక్షంలో సూర్యుడు కన్యారాశిలో ఉండగా ఒక్కరోజయినా పితృదేవతలకు పిండప్రదానంతో శ్రాద్ధం చేస్తే వారు సంతోషంతో ఆశీర్వదిస్తారు. అష్టమి, ద్వాదశి, అమావాస్య తిథులలోను, భరణి నక్షత్రం ఉన్ననాడు తిథివారనక్షత్ర విచారణ లేకుండా మహాలయశ్రాద్ధం పెట్టవచ్చునని హేమాద్రిఖండం చెబుతోంది. తండ్రి మరణించిన తిథి నిషిద్ధ దినమైనా ఆ రోజు శ్రాద్ధం పెట్టవచ్చు. అలా చేయడం పితృపక్షంలో పూజనీయం. తిథినాడు కుదరకపోతే అష్టమి ఎవరికైనా పనికి వస్తుంది. కొత్తగా పెళ్లి అయిన వారు కూడా మహాలయంలో పిండదానం చేయవచ్చునని బృహస్పతి చెప్పాడు.

15. అతడే అసలైన వారసుడు

మానవుడు తాను కూడబెట్టిన ఆస్తిపాస్తులు, అప్పులు, వ్యవహారాలు అన్నీ తన తరువాత ఎవరికి చెందాలో నిర్ణయించే స్మృతి గ్రంథాలను యుగానుగుణంగా మహర్షులు రచించారు. ఔరసులు అంటే కన్నబిడ్డలు. ఔరసత్వాన్ని తెలుగువారు 'వారసులు', 'వారసత్వం' అని పిలుస్తున్నారు. తల్లిదండ్రుల సంపదకు పిల్లలే తొలిహక్కుదారులు అని న్యాయశాస్త్రం చెబుతుంటే, అంతటితో సరిపోదనీ, పిల్లలు తల్లిదండ్రులు చెప్పినట్లు విని వారు చెప్పిన పనిచేస్తేనే వారికి పితృధనం స్వీకరించే అర్హత లభిస్తుందనీ మహాభారతం హెచ్చరిస్తోంది.

'తల్లిదండ్రులు చెప్పిన పని చేయకపోతే, మాట వినకపోతే వాడు కొడుకు అవుతాడా, పితృధనానికి అర్హుడు అవుతాడా?' అని యయాతి ప్రజల ఎదుట తీర్మానం చేశాడు. శుక్రాచార్యుడు ఇచ్చిన శాపం వల్ల నాకు వచ్చిన వృద్ధాప్యాన్ని కొంతకాలం తీసుకుని మీలో ఎవరైనా మీ యౌవనాన్ని ఇవ్వండి అని కొడుకులను అడిగితే, నలుగురు ఇవ్వం పొమ్మన్నారు. అయిదో వాడు ఇచ్చాడు. దానికి సంతోషించిన యయాతి తన రాజ్యానికి అతనిని వారసుడుగా ప్రకటించాడు. అప్పుడు ప్రజలు పెద్దకొడుకు ఉండగా చివరివాడికి ఎలా ఇస్తావు? అని ప్రశ్నించినప్పుడు యయాతి అసలైన వారసత్వ సూత్రాన్ని ఆవిష్కరించాడు. ఇది తన ఒక్కడికే కాక మానవులందరికీ వర్తించే విధంగా ప్రజలకు తెలియజేశాడు.

పిత్రార్జితం హక్కు ప్రకారం ఎలాగైనా వచ్చేస్తుందని పిల్లలు యధేచ్ఛగా ప్రవర్తించకూడదని, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకూడదని ఈ సన్నివేశం సార్వకాలిక సందేశాన్ని ఇస్తోంది. ఈ పద్యంలో నన్నయ రెండుసార్లు 'తనయుడు' అనే పదాన్నే సాభిప్రాయంగా ప్రయోగించారు. 'అంగాదంగాత్ సంభవసి' (ప్రతి అవయవము నుండి జన్మిస్తున్నావు) అని వేదం చెప్పినట్లు దీపంతో మరొక దీపం వెలిగినట్లు తల్లిదండ్రుల తనువులే తనయులౌతున్నారు. 'తను' ధాత్వర్థంలో వంశాన్ని విస్తరింపచేస్తున్నారు. సంతోషాన్ని కలిగిస్తున్నారు. తనయ శబ్దానికి అంత లోతైన అర్థం ఉంది. సంతానానికి సామాన్యార్థంలో 'తనయుడు' అని ప్రయోగించినా మగపిల్లలకు, ఆడపిల్లలకు అందరికీ ఈ హెచ్చరిక పనికి వస్తుంది. ఇప్పుడు ఆస్తిహక్కు అందరికీ ఉంది కదా!

చెప్పినమాట వినని పిల్లలకు పిత్రార్జితమైన ఆస్తిని పొందే అర్హత ఉండదని మహాభారత శాసనం. ఇది అమలు జరగటం సాధ్యం కాకపోయినా ఈ పద్యం చదివిన పిల్లలలో మానసిక

పరివర్తన తప్పకుండా వస్తుంది. తల్లిదండ్రుల మాట వినకుండా వారిచ్చిన ఆస్తిని అనుభవిస్తున్న పెద్దలలో పశ్చాత్తాపం కలిగి పితృకార్యాలైనా శ్రద్ధగా చేస్తారు. బతుకు నాణేనికి 'హక్కు' బొమ్మ అయితే 'బాధ్యత' బొరుసు అవుతుంది. రెండూ సరిగా ఉంటేనే ఆ నాణెం చెల్లుతుంది. మానవజన్మ సార్థకం అవుతుంది. ఆస్తిపాస్తుల కోసం తల్లిదండ్రుల సేవ చేయాలనే సూచన మాత్రమే ఉందనుకోవటం అవివేకం. పితృధనం అంటే కేవలం ఇల్లు,వాకిళ్లు, బంగారం, డబ్బు, పొలాలు మొదలైనవాటినే చెప్పేదికాదు. తల్లిదండ్రుల అనుభవాలు, ఆశయాలు, ఆదర్శం, విద్య, ప్రతిభ, పాండిత్యం, పరిచయాలు, గౌరవాలు, బంధువర్గంలో గుర్తింపు వంటివి అన్నీ అసలైన 'పితృధనం' అని తెలుసుకోవాలి. తల్లిదండ్రులు చెప్పిన మాట విని వారి ఆప్యాయతను పొందిన పిల్లలకే ఆ ధనం లభిస్తుంది. అతడే గెలుస్తాడు. తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడు వారు చెప్పినట్లు వినాలి. మరణించిన తిథుల్లో బంధుమిత్రులందరినీ పిలిచి భోజనాలు పెట్టాలి. గయలో పిండప్రదానం చెయ్యాలి. అప్పుడే పుత్రునికి పుత్రత్వం వస్తుంది. అతడే అసలైన వారసుడు అని భారతసందేశం.

16. శ్రీగాయత్రి

నిరాకార శక్తిస్వరూపిణి అయిన శ్రీమాత... దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సాకారంగా అనేక రూపాలలో అవతరిస్తూ ఉంటుంది. సర్వప్రాణులలో శక్తిరూపిణిగా సర్వదా సృష్టిస్థితిలయాలను తన కనుసన్నలలో నడిపిస్తూ ఉంటుంది. త్రిమూర్తులను దివ్యవిమానంలో మణిద్వీపానికి రప్పించేటప్పుడు ఈ సత్యాన్ని వారికి తెలిసేటట్లు చేసింది. వారు తామే కర్తలమన్న అహంకారాన్ని పోగొట్టుకుని అమ్మను స్తుతించారు. వారికి కలిగిన జ్ఞానోదయం అన్ని జీవులకూ కావాలి. మాయపొరల అడుగున మగ్గుతున్న వివేకమణి వెలుగులు విశ్వమంతటినీ తేజోమయం చెయ్యాలి.

దశదోషాలను హరించి విజయాన్ని ప్రసాదించే 'దశహరా' (దసరా) ఉత్సవాలలో అమ్మవారిని ఒక్కొక్క తిథినాడు ఒక్కొక్క అవతారంగా ఆరాధించే క్రమంలో ఆశ్వయుజ శుద్ధద్వితీయ (విదియ) నాడు గాయత్రీదేవిగా పూజించాలి. గాయత్రికి మించిన మంత్రమూ, అమ్మకు మించిన దైవమూ లేవు. 'గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ' తనను జపించే వారిని రక్షిస్తుంది... అని అర్థం. మానవజాతికి సంభాషణశక్తి ప్రత్యేకంగా లభించింది.

అమ్మవారు అక్షరరూపిణిగా అవతరించింది. మనం మాట్లాడే ప్రతి అక్షరానికీ శక్తి ఉంది. ద్రష్టలైన ఋషులు తపస్సులో దర్శించిన అక్షరసంపుటి మంత్రంగా ఆవిర్భవిస్తుంది. అప్పటి నుండి ఆ మంత్రాన్ని జపించిన వారికి శక్తి లభిస్తుంది. ప్రయోజనాలు నెరవేరతాయి.

నిరాకారశక్తి అక్షరరూపమైన ఉచ్చారణ ద్వారా సాకారతను పొందే ప్రక్రియ మంత్రశాస్త్రం. అమ్మవారు అలా అవతరించిన మంత్రరూపమే గాయత్రి. విశ్వామిత్ర మహర్షి దర్శించిన నాలుగుపాదాల గాయత్రీమంత్రంలో మూడు పాదాలను జపించి మనం ఆమె అనుగ్రహాన్ని పొందుతున్నాం. ఇరవైనాలుగు అక్షరాలు, మూడుపాదాలు కలిగిన గాయత్రీమంత్రానికి అధిష్ఠానదేవతగా 'గాయత్రీదేవి' ఉంటుంది. ఇదే గాయత్రీమంత్రం. మిగిలినవి ఆయా దేవతలకు చెందిన గాయత్రీమంత్రాలు.

'తత్త్వార్థ వర్ణాత్మిక' గా అవతరించిన గాయత్రీమాతకు ముక్తా (ముత్యం), విద్రుమ (పగడం), హేమ (బంగారం), నీల(నీలం), ధవళ (తెలుపు) కాంతులు గల అయిదు ముఖాలు. ఒక్కొక్క ముఖంలో మూడుకనులు, శిరస్సుపై నెలవంకతో కూడిన రత్నకిరీటం ఉంటాయి. వరద, అభయ, అంకుశ, కశ (కొరడా), కపాలం (పుట్టె), గద, శంఖం, చక్రం, రెండు తామరపూలు... పదిచేతులలో ఉంటాయి.

ఈ రూపంపై మనస్సును లగ్నం చేసి మంత్రాన్ని జపిస్తూ అమ్మ అనుగ్రహాన్ని పొందాలి. పొద్దున్న, మధ్యాహ్నం, సాయంకాలం... ఈ మూడు సంధ్యలలో జపిస్తే సూర్యుని ద్వారా శక్తి ప్రవేశించి జ్ఞానప్రచోదనం చేస్తుంది. జ్ఞానాన్ని, తేజస్సును ప్రసాదించే అవతారం గాయత్రీదేవి.

17. శ్రీమహాలక్ష్మి

దేవీనవరాత్రి ఉత్సవాలలో తృతీయతిథి (తదియ) నాడు శ్రీమాత మహాలక్ష్మీరూపంగా ఇంద్రకీలాద్రిపై పూజలు అందుకుంటోంది. మహిషాసురుణ్ని సంహరించటానికి అమ్మవారు ధరించిన మహాలక్ష్మి రూపవిశేషాలు మహిషుడి సంహారం వరకు జరిగిన కథ దేవీభాగవతంలో విశదంగా ఉంది. ఈ మహాలక్ష్మి అవతారం అమ్మవారి సమగ్ర సౌందర్యానికి, దుష్టసంహార పరాక్రమానికి పరాకాష్ఠగా ఏర్పడినదే కాని విష్ణుపత్ని లక్ష్మీదేవి కాదు. నాలుగు పురుషార్థాల (ధర్మ, అర్థ, కామ, మోక్ష) లో తృతీయ పురుషార్థమైన కామాన్ని ప్రకోపింప చేస్తే ఎంతటివాడైనా

ఎలా నశించిపోతాడో... మహిషాసురుని వధ ద్వారా ముల్లోకాలకూ తెలియచేయటానికి అద్భుత సౌందర్యస్వరూపిణిగా అవతరించిన మహాలక్ష్మిగా తృతీయ తిథి (తదియ) సంకేతంగా ఆరాధించబడుతోంది. కామంతో కన్నుమిన్ను కానని దున్నపోతును, వాని అనుచర గణాన్ని అమ్మ సంహరించి విజయకేతనం ఎగురవేసింది. మహిషాసుర మర్దనం సమస్త ప్రాణికోటికి గుణవర్ధనంగా సందేశాన్ని అందించింది. యథావిధిగా కలశ స్థాపన చేసి పాడ్యమి నుండి దశమి వరకు దీక్షతో పూజచేసేవారు ఆయా తిథులలో అమ్మవారి అవతారాలకు చెందిన అష్టోత్తర సహస్రనామాలతో, పూజాద్రవ్యాలు, నైవేద్యాలతో ఆరాధిస్తే సరిపోతుంది. విదియనాడు చక్కెర, తదియనాడు పాలు నివేదన చెయ్యాలి. ఆశ్వయుజమాసం అంతా పాయ సం అమ్మవారికి ఇష్టం. వేదమాత గాయత్రి వైభవాన్ని దేవీభాగవతం ద్వాదశ స్కంధంలో, మహాలక్ష్మి అవతార విశేషాలను పంచమస్కంధంలోనూ తెలుసుకోవచ్చు. నవరాత్రి ఉత్సవ విధానం తృతీయ స్కంధంలో ఉంది.

18. విజయప్రదాత శ్రీరాజరాజేశ్వరి!

ఆశ్వయుజ శుద్ధ ప్రతిపత్తు నుండి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలు దశమినాడు ముగుస్తాయి. శ్రీరాజరాజేశ్వరి అలంకారంతో, ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వరుల కృష్ణానదిలో హంసవాహనం మీద నౌకావిహారం చేసి, జమ్మిచెట్టు దగ్గర శమీపూజ చేయడంతో ఈ ఉత్సవాలు పూర్తవుతాయి.

వివిధ రూపాలలో దుష్టశక్తులపై విజయం సాధించి, సింహాసనాన్ని అధిష్టించిన శ్రీరాజరాజేశ్వరిగా పూజలందుకుంటుంది. 'నవావరణాత్మకమైన శ్రీచక్రంలోని కేంద్రబిందువులో కామేశ్వరుని ఒడిలో కూర్చున్న కామేశ్వరిగా మణిద్వీపంలోని చింతామణి గృహంలో దర్శనమిచ్చే శుభదినం 'విజయదశమి'.

కలశస్థాపన చేసి దీక్షధారులై తొమ్మిది రోజులు శాస్త్రోక్తంగా నివేదనలు చేసి, అలంకారాలతో అమ్మవారిని పూజించినవారు కామ క్రోధలోభ మోహ మద మాత్సర్యాలను, జయించినవారై అపరాజితయైన శ్రీరాజరాజేశ్వరీదేవి అనుగ్రహాన్ని పొందుతారు.

'రాజరాజేశ్వరీ జ్యోత్స్ను రాజ్యసామ్రాజ్యదాయినీ' (శరత్కాలపు వెన్నెల వెలుగులు చీకట్లను పోగొట్టినట్లు అమ్మవారు జీవుల అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి ముక్తిని ప్రసాదిస్తుంది)

చిద్రూపిణి, పరదేవత, భగవతి అయిన అమ్మవారు విజయదశమినాడు ప్రసన్నతతో, సుందర దరహాసంతో భక్తులను అనుగ్రహిస్తుంది. ఎర్రని అంచుపై బంగారుహంసలు ఉన్న తెల్లని చీర, ఎర్రని రవిక, సమస్త ఆభరణాలు ధరిస్తుంది. తల్లి ముంగురులు తుమ్మెదల వలె గాలికి ఎగురుతూ ఉంటాయి. నవరత్నాలు పొదిగిన చెవికమ్మల వెలుగులు అమ్మ ముఖంలోని ఆనందదీప్తిలో కలిసిపోతూ ఉంటాయి. సమస్త ఆయుధ, పరివార దేవతా సహితంగా శ్రీమహాకామేశ్వరుని అంకంపై శ్రీరాజరాజేశ్వరీ పరాభట్టారికాదేవి శాంతమూర్తిగా ద ర్శనమిస్తుంది.

చిదగ్నికుండం నుండి దుష్టశిక్షణ కోసం ఉద్భవించిన ఈ తల్లి పంచభూతాత్మకంగా వెలుగొందుతోంది. అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి, వాయువు, ఆకాశం ఏర్పడితే అన్నింటిలోని శక్తి తానై వాటిని అమ్మ శాసిస్తోంది. ఈ సంసార సాగరం నుండి అవతలకు దాటించే శక్తి ఆమెకు మాత్రమే ఉంది.

'సుతరసి తరసీ నమః'... అమ్మవారు విజయదశమి నాడు కామేశ్వరునితో కలిసి నౌకావిహారం చేస్తుంది.

శ్రీరాముడు విజయదశమినాడు జమ్మిచెట్టుకు ప్రదక్షిణ చేసి రావణ సంహారానికి బయలుదేరాడు. అర్జునుడు తన గాండీవాన్ని జమ్మిచెట్టుపై దాచుకున్నాడు. అందుకే జమ్మిచెట్టును దర్శిస్తే చాలు అది పాపాలను పోగొడుతుంది. మన లోపల, బయట ఉన్న శత్రువులను నశింపచేస్తుంది.

శ్రీరాజరాజేశ్వరీ దేవికి పెరుగన్నం ఇష్టమైన నివేదన. ఇహపరాలలో అన్ని రంగాలలో విజయాన్ని ప్రసాదించే శ్రీమత్ సింహాసనేశ్వరి సకల ప్రాణులనూ అనుగ్రహించు గాక!

'దేవీం నేమి సదా మదీయ జననీం శ్రీరాజరాజేశ్వరీమ్.'

19. సద్గోష్ఠి - సమంజసబుద్ధి

ఎఱుకగలవారి చరితలు
గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం
బెఱుగుచు నెఱిగిన దాని
మఱవకనుష్ఠించునది సమంజస బుద్ధిన్
(ఆది - 3 - 203)

జ్ఞానులైన పెద్దల జీవిత చరిత్రలను అధ్యయనం చేస్తూ, సజ్జనుల సమావేశంలో కదలకుండా కూర్చుని ధర్మాన్ని తెలుసుకుంటూ, తెలుసుకున్న ధర్మాన్ని మరచిపోకుండా సద్బుద్ధితో ఆచరణలో పెట్టాలి అని దీని అర్థం.

తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తిపాస్తులు, ఆరోగ్యఅనారోగ్యాలతో పాటు జీవనవిధానాన్ని, జీవితంలో తీసుకోవలసిన జాగ్రత్తలను, తెలుసుకోవలసిన విషయాలను తప్పకుండా అందచేయాలి. బాల్యంలో తినటం, తాగటం నేర్పుతారు. ఏ పదార్థాలు తినవచ్చో, ఏవి తినకూడదో, బట్టలు ఎలా కట్టుకోవాలో, బడికి ఎలా వెళ్లాలో మొదలైనవన్నీ శ్రద్ధగా నేర్పినట్లే మనోవికాసం విషయంలో మరింత దృష్టిపెట్టాలి. సూచనలు చేస్తూ ఉండాలి. కొన్నింటిని లాలనగా, కొన్నిటిని కఠినంగా నిర్దేశించాలి.

మనం ఇచ్చే భౌతిక సంపదల కంటే నైతిక సూచనలే పిల్లలకు ఎక్కువ ఉపయోగపడతాయి. అవసర సమయాలలో గుర్తుకువస్తూ దారి చూపిస్తూ ఉంటాయి. పిల్లలు పెద్దవాళ్లయిన తరువాత బాధ్యతలు వారికి అప్పగించి, విశ్రాంతి తీసుకోవాలి. అదే వానప్రస్థం. అప్పగిస్తున్న బాధ్యతలను ఎలా నిర్వర్తించాలో వారికి స్పష్టంగా తెలియచేయాలి. లేకపోతే పిల్లలు సరిగ్గా చేయటం లేదని పెద్దలు, ఎలా చెయ్యాలో సొంతం చెప్పలేదని పిల్లలు గొడవ పడతారు. కనుక పెద్దలు పిల్లలకు గతం, వర్తమానం, భవిష్యత్తు తెలిపే సూచనలు చేయాలి. 'అదే అసలైన పితృధనం'.

యయాతి మహారాజు తన కుమారుడైన పూరుడికి రాజ్యం ఇవ్వదలుచుకున్నాడు. పట్టాభిషేకం చేయబోయేముందు కొన్ని నీతులు చెప్పాడు. వాటిలో ఇది (పైన వివరించిన పద్యం) మొదటిది. ఈ నీతిపద్యం ఏవో బాధ్యతలు చేపట్టబోయే వారికి మాత్రమే కాక సమస్త మానవజాతికి మార్గదర్శకం అవుతోంది. బాధ్యతలు స్వీకరించే సమయంలో

యువతరం కొన్ని ఉద్వేగాలకు లోనవుతుంది. పదవి వచ్చిన సందర్భంగా అహంకారంతో బుద్ధి పెడదారి పట్టేస్తుంది. అందుకే 'సమంజసబుద్ధిన్' అని యయాతి చెప్పినట్టు నన్నయ పదునైనమాట వాడారు.

ఏ బాధ్యతలనైనా చేపట్టబోయే వారు ముందుగా గత చరిత్రను బాగా తెలుసుకోవాలి. జ్ఞానులైన పెద్దల జీవితవిశేషాలను అధ్యయనం చేయటం ద్వారా గట్టి పునాది ఏర్పడుతుంది. కొత్త బాధ్యతలకు సంబంధించిన తీరుతెన్నులు తెలుస్తాయి. కొత్తగా వచ్చిన వారిని ఆ రంగంలో పాతవారు కొందరు దుర్బుద్ధితో తప్పుదారి పట్టిస్తారు. కనుక తన చుట్టూ మంచివారినే పెట్టుకోవాలి. సజ్జనుల గోష్ఠిలో ధర్మాధర్మాలు తెలుస్తూ ఉంటాయి. ఏదో లాంఛనంగా ఒక నిమిషం వారికి కనపడి అత్యవసర రాజకీయ కార్యక్రమాలు ఉన్నాయని వెళ్లిపోకూడదు. కదలకుండా వారి మధ్య మెలగాలి. ధర్మాన్ని, కర్తవ్యాన్ని తెలుసుకోవాలి. అప్పుడే సజ్జనగోష్ఠి వలన ఉపయోగం ఉంటుంది.

గోష్ఠిలో కూర్చుని మనసు ఎటో పెట్టకుండా వినాలి. ఈ చెవితో విన్నదానిని ఆ చెవితో వదిలి మరిచిపోకుండా ఆచరణలో పెట్టాలి. అప్పుడు వర్తమానం ద్వారా భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది. మొత్తం మీద జ్ఞానుల చరిత్రలు చదివినా, సజ్జనుల గోష్ఠిలో ధర్మాలు తెలుసుకున్నా చివరకు ప్రధానమైనది ఆచరణ. సమంజసబుద్ధితోనే ఈ క్రమశిక్షణ సాధ్యమౌతుంది.

జీవన పాఠ్యప్రణాళిక సమగ్రస్వరూపంగా ఉన్న మహాభారతంలోని ఈ నీతిపద్యం మానవజాతి మనోగమనాన్ని లోతుగా పరిశీలించి చేసిన హితోపదేశానికి ప్రత్యక్ష సాక్ష్యం. సదా పఠనీయం. సర్వదా ఆచరణీయం.

20. అధికార సద్వినియోగం

ఇచ్చునది పాత్రునకు ధన
మచ్చుగ నొరు వేడకుండునది యభిముఖులై
వచ్చిన యాశార్థుల వృథ
పుచ్చక చేయునది సర్వభూతప్రీతిన్ (ఆది - 3 - 204)

అర్హులైనవారికి ధనాన్ని ఇవ్వాలి. ఇచ్చినదానికి ప్రతిగా ఇతరులను యాచించకూడదు. దగ్గరకు వచ్చి ఆశతో అడిగిన వారిని నిరాశపరచకూడదు. అన్ని ప్రాణులకు ప్రీతి కలిగించాలి.

యయాతి మహారాజు తన కుమారుడు పూరునికి పట్టాభిషేకం చేయబోయే ముందు చెప్పిన నీతులలో ఇది సార్వకాలికం. సార్వజనీనం. అధికారం రాగానే దానితో అనేక సంపదలు అధీనంలోకి వస్తాయి. 'అధికారంతో ఏం చేసినా చెల్లుతుంది' అనే అహంకారంతో విలాసాలకు, దుర్వ్యసనాలకు సంపదను దుర్వినియోగం చేసే మనస్తత్త్వం ఏర్పడితే ప్రజలు హాహాకారాలు చేస్తారు. రాజ్యం నాశనమైపోతుంది. కనుక ఆర్థికపరమైన ఆలోచన ఎలా ఉండాలో అనుభవపూర్వకంగా తండ్రి తన కుమారుడికి చెబుతున్నాడు. 'ఇచ్చునది', 'వేడకుండునది' 'చేయునది' అనే క్రియా పదాలు నిశ్చింతగా శాసనాత్మకంగా విధి అర్థంలో ప్రయోగించబడ్డాయి.

ఉన్న సంపదను అర్హులైన వారికి మాత్రమే దానం చేస్తూ తాను ధర్మకర్తగా ఉండాలి. అర్హతను గుర్తించటంలో స్వార్థం లేని వివేకాన్ని చూపించాలి. అర్హులకు ధనాన్ని ఇచ్చితీరాలి. తాను అధికారంలో ఉన్నది అందుకే అనే సత్యాన్ని గుర్తించాలి. నేను దానం చేస్తున్న సొమ్మును నష్టపోతున్నాను. ఆ నష్టాన్ని పూడ్చుకోవాలంటే ఇతరుల నుండి దానిని రాబట్టుకోవాలి అనే ఊహతో ఎదుటివారిని యాచించటం, బాధించటం వంటివి చేయకూడదు. ఇది కూడా శాసనమే. ఆదాయవ్యయాలపై అవగాహన ఉండాలి. ఆదాయానికి తగిన వ్యయం ఉండాలి. అప్పుడు ఇతరులను యాచించే అవసరం రాదు. ఈ ఆర్థిక ప్రణాళిక పరిపాలకులకు మాత్రమే కాక సామాన్య మానవులందరికీ వర్తిస్తుంది.

పిసినారితనంతో అవసరమైన ఖర్చులు మానుకోకూడదు. అలాగని అధిక వ్యయం చేసి అప్పులు చేయకూడదు. చేయించకూడదు. అర్హులైనవారికి ఇవ్వాలి. ఇచ్చిన తరువాత 'ఎక్కువ ఇచ్చేశాను అనో, నేను కాబట్టి ఇచ్చాను అనో' బాధపడటం, అహంకరించటం పనికిరాదు.

'ఇవ్వటం వరకే కర్తవ్యం. ఇచ్చేది శ్రద్ధగా ఇవ్వాలి. అశ్రద్ధగా నిర్లక్ష్యంతో ఇవ్వకూడదు. ఇవ్వకపోతే బాధ్యత విస్మరించినట్లవుతుందనే భయంతో ఇవ్వాలి. ఇవ్వవలసినంత ఇవ్వలేకపోతున్నానే అని సిగ్గుపడుతూ ఇవ్వాలి' అని ఉపనిషత్తులో చెప్పబడిన నియమావళి పరిపాలనలో భాగంగా పాలకులకు కూడా వర్తిస్తుంది.

మన వలన వారి సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో మన దగ్గరకు వచ్చి అడుగుతున్నారంటే మన సమర్థత వారికి తెలియటమే కాక మన బాధ్యతను కూడా గుర్తుచేస్తున్నారని భావించాలి. 'అదత్వా త్వం మాదృశో మా భూః, దత్వాత్వం త్వాదృశోభవ (దానం చేయక నువ్వు నా వంటివాడివి కావద్దు. ఇచ్చి నీ వలెనే ఉండు) అని ఒక బిచ్చగాడు దాతను హెచ్చరించాడు. కనుక ఆశతో వచ్చిన వారిని ఊరికే తిప్పి పంపకూడదు.

ఇప్పటివరకూ చెప్పినదంతా మానవుల మధ్య సామాజికనీతి అని మాత్రమే భావించకుండా చివరికి అన్ని ప్రాణులకూ మేలు చేస్తూ జీవించటం మానవధర్మంగా రాజధర్మంగా చెప్పే ఈ సందేశం మానవజీవితంలో ప్రధానపాత్ర వహిస్తూ 'ధనమూలమిదం జగత్' అని కీర్తించబడుతున్న ధన వినియోగంతో అధికారాన్ని, సంపదను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలియచేస్తోంది.

21. నోరు... తలను కాపాడుతుంది

ఇతర ప్రాణులకు తినటానికి మాత్రమే పనికివచ్చే నోరు, మానవజాతికి మనసులోని భావాలను ఎదుటివారికి మాటరూపంలో వ్యక్తీకరించే సాధనంగా కూడా ఉపయోగిస్తుంది. ఎన్నోభాషలు, ఎంతో శబ్దజాలం, వాక్యనిర్మాణం, వ్యక్తీకరణ విధానం మొదలైనవాటిని మానవుడు ఏర్పరుచుకున్నాడు. అయితే ఈ సౌకర్యం వలన లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. మాటల వలన మన్ననలు పొందవచ్చు. అవమానాలు కూడా కలుగవచ్చు. నాలుక చివరనే బంధుమిత్రులు ఉంటారు. 'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది', 'నోరు పారేసుకోవద్దు', 'కాలుజారినా తీసుకోవచ్చు కాని నోరుజారితే తీసుకోలేం'... మొదలైన సామెతలు, సూక్తులు అన్నీ వాక్కుకి ఉన్న ప్రాధాన్యాన్ని, జాగ్రత్తను తెలియచేస్తున్నాయి. మహాభారతంలో యయాతి పూరునికి చేసిన ఉపదేశంలో వాక్కును ఎలా సద్వినియోగం చేసుకోవాలో చక్కగా సూచించాడు.

మనమునకు బ్రియంబును హిత
మును బథ్యము దథ్యమును నమోఘము మధురం
బును పరిమితమును నగు పలు
కొనరగ బలుకునది ధర్మయుతముగ సభలన్ (ఆది 3. 205)

'మనసునకు ప్రియంగా, హితంగా, ఆచరణీయంగా, సత్యంగా, వ్యర్థం కానిదిగా, తియ్యగా, పరిమితంగా ఉండే మాటను అందరి ఎదుట ధర్మబద్ధంగా మాట్లాడు' అని యయాతి చెప్పినమాట మొత్తం మానవజాతికి అన్నికాలాలలోనూ భావవ్యక్తీకరణలో తీసుకోవలసిన మెలకువలను, జాగ్రత్తలనూ తెలియజేస్తోంది.

వాక్కు... పదా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనే నాలుగు దశలలో ఉంటుంది. 'వైఖరీ వాక్కు' మాత్రమే బయటికి వినిపిస్తుంది. ఆ దశకు చేరుకునే ముందుగానే మనం దాన్ని తీర్చిదిద్దుకోవటానికి ఎనిమిది సూచనలు ఇవ్వబడ్డాయి. మాట... చెప్పేవారి, వినేవారి మనసులకు నచ్చాలి. క్షేమదాయకం కావాలి. ఆచరణయోగ్యం కావాలి. సత్యమై ఉండాలి. చెప్పింది వ్యర్థం కాకూడదు. వినటానికి ఆకర్షణీయంగా ఉండాలి. అలాగని సుదీర్ఘంగా మాట్లాడకూడదు. ఈ ఏడింటికీ అంతస్సూత్రంగా ఉండవలసిన ఎనిమిదో సూచన... 'చెప్పబోయేది ధర్మమైతేనే చెప్పాలి'. దాపరికం లేకుండా నిర్భయంగా పదిమంది ముందు చెప్పదలచుకున్న దానిని చెప్పాలి అనే సూచనను 'సభలన్' 'ఒనరగ' అనే పదాల ద్వారా 'నన్నయ' తెలుగువారికి అందిస్తున్నాడు. భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు దీనిని 'వాఙ్మయ తపస్సు' అన్నాడు. మాటను వ్యర్థం చేయకూడదు. మానవ సంబంధాలను, మనస్సును, ధర్మాన్ని చెడగొట్టే విధంగా మాట్లాడకూడదు.

ధీరులు, గుణవంతులు, నాయకత్వ బాధ్యతలు కలవారు వాక్కు విషయంలో మరింత నియంత్రణ కలిగి ఉండాలి. వారికి వాక్పారుష్యం పనికిరాదు. అది విషం కంటె, అగ్ని కంటె ప్రమాదకరం. దేహానికి గుచ్చుకున్న బాణాలనైనా ఉపాయంగా తీసే వైద్యులు ఉన్నారు. కాని మనసులో నాటిన మాటను ఎవ్వరూ తీయలేరు. కనుక యయాతి చెప్పిన ఎనిమిది లక్షణాలు సరిపోయే విధంగా మాట్లాడటానికి తగిన మానసిక శిక్షణను మహాభారతం ద్వారా పొందుదాం.

22. ధర్మం - అధర్మం

ధర్మం, అధర్మం అనే పదాలను అందరం తరచుగా ఉపయోగిస్తూ ఉంటాం. ధర్మం అంటే ఏమిటి? అధర్మం అంటే ఏమిటి? అని అడిగితే మాత్రం స్పష్టంగా చెప్పలేం. ఒక్కొక్కదేశంలో ఒక్కొక్కకాలంలో అది చేసిన వారిని బట్టి ధర్మాధర్మ ముద్రలు వేస్తాం. అంతేకాక న్యాయం, ధర్మం రెండూ ఒకటే అనుకుంటాం. ప్రభుత్వ శాసనం, చట్టాలను బట్టి న్యాయం మారుతూ ఉంటుంది. ఒకనాటి అన్యాయం నేడు న్యాయం కావచ్చు. నేటి న్యాయం రేపటికి అన్యాయం కావచ్చు. కాని ధర్మానికి అలాంటి మార్పులు వర్తించవు.

ధర్మం అన్ని జంతువులకూ శాశ్వతమైన ప్రమాణాలతో వెలుగొందుతూ ఉంటుంది. దానిని మనం ఆచరించి తీరాలి. ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది. గర్వం, అహంకారం లేకుండా ఉంటేనే ధర్మచింతన ఏర్పడుతుంది. ఎదుటివారి కంటె మనం గొప్పవాళ్లం కాదు, వారూ మనమూ ఒకటే అనే సమానదృష్టి ఏర్పడాలి. 'ఆత్మవత్ సర్వభూతాని' (అన్నిప్రాణులూ నావంటివే) అనుకోవాలని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ విధంగానే శాపవిమోచన అనంతరం గొప్ప తపస్సు చేసి ఊర్ధ్వలోకాల్లో సద్భావనానికి చేరుకున్న యయాతికి అతని మనుమలు అయిన అష్టకాదులు కనిపించారు. వారు అడిగిన ధర్మాధర్మ స్వరూపాన్ని యయాతి స్పష్టంగా ఇలా నిర్వచించాడు -

సర్వభూతదయకు సత్యవాక్యమునకు
నుత్తమంబు ధర్మువొండెయుంగ
నొరుల నొప్పికోడకుపతాప మొనరించు
నదియు కడు నధర్మమనిరి బుధులు(ఆది - 3 - 219)

'అన్నిప్రాణుల మీద దయ కలిగి ఉండటం, సత్యాన్ని పలకటం ఇది ఉత్తమధర్మం యొక్క శాశ్వత స్వరూపం. ఎదుటివారికి బాధ కలుగుతుందనే సానుభూతి లేకుండా హింసించటం అతి తీవ్రమైన అధర్మం యొక్క శాశ్వత స్వరూపం'. ఈ నిర్వచనం ఏ దేశంలో, ఏ కాలంలో, ఎవరికైనా వర్తిస్తుంది. 'ఇజం' ఏదైనా 'నిజం' మాత్రం ఇదే. అన్ని మతాలకూ ఇదే సమ్మతం. ధర్మాన్ని ఆచరించే విషయంలో కొన్ని మార్పులు సమయ సందర్భాలను బట్టి కనిపించవచ్చు. కాని ధర్మం మారదు. మారకూడదు. దానికి స్థిరమైన స్పష్టమైన పరీక్షనాళిక ఈ పద్యం.

అన్నిప్రాణుల మీద దయకలిగిన వాడు ఏ ప్రాణినీ బాధపెట్టలేడు. సత్యం పలికేవాడు ఇతరులను మోసగించలేడు. ఒకవేళ అసత్యం పలుకవలసి వచ్చినా అది సర్వభూతదయతో

మరొకరి క్షేమం కోసం అవుతుంది. దానిని ధర్మసూక్ష్మం అన్నారు. మొత్తం మీద సర్వభూతదయ అనేది శాశ్వత ధర్మానికి ప్రామాణిక సూత్రం. అది లేని వాడికి ఇతరులు బాధపడతారనే స్పృహ ఉండదు. కనుక ఇతరులను బాధిస్తూ వారి దుఃఖానికి కారణం అవుతాడు.

వైద్యుడు చేసే శస్త్రచికిత్స, వేసే సూదిమందు రోగాన్ని పోగొట్టి సుఖాన్ని కలిగించ డానికే కనుక భౌతికంగా ఎదుటివారి నొప్పిని గుర్తించకుండా బాధించినట్లు కనపడినా దానిలో ఉన్నది 'భూతదయ'మాత్రమే. గురువు శిష్యులను శిక్షించినా వారి క్షేమం కోసమే. అయితే ఆ శిక్ష, శిక్షణలో భూతదయ అంతర్వాహినిగా ఉండాలి. మోసం ఉండకూడదు. అదే సర్వభూతదయ, సత్యం కలిసిన శాశ్వతధర్మం. అదిలేని జీవనవిధానం అధర్మ ప్రవర్తన అవుతుంది. బుద్ధిమంతుడైన మానవునికి ధర్మాధర్మజ్ఞానాన్ని మహాభారతం సూటిగా, సులువుగా అందిస్తోంది.

23. సత్యమేవ జయతే

మానవుడు సంఘజీవి. ఒంటరిగా బతకటం సాధ్యం కాదు. ఒక్కడుగా ఉన్నా నలుగురి మధ్యలో ఉంటూ తన జీవనానికి కావలసినవి సమకూర్చుకోవలసిందే. బంధుత్వాలు లేకపోయినా మానవ సంబంధాలు కొనసాగుతూనే ఉండాలి. కనుక అవి దెబ్బతినకుండా ఉండే విధంగా తన ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి.

మానవులందరినీ కలిపి నడిపించేది నమ్మకం. ఒకరిని ఒకరు నమ్మితేనే సమాజం సజావుగా సాగుతుంది. లేకపోతే అభిప్రాయభేదాలు, ఘర్షణలు ఏర్పడతాయి. పరస్పర విశ్వాసాన్ని శాశ్వతంగా నిలబెట్టేది సత్యసంభాషణ. ఎదుటివాడు మాట్లాడేది సత్యమే అనే నమ్మకం ఒకరికొకరికి కలిగినప్పుడే వ్యవస్థ నిలబడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే 'సత్యే సర్వం ప్రతిష్ఠితమ్' (సత్యమునందే సర్వం నిలిచి ఉంది).

అన్నిజీవులకు అత్యవసరమైనది నీరు. అది లేనిదే బతకలేం. భూమిలో ఉన్న నీటికోసం నుయ్యి తవ్వాలి. అక్కడ తియ్యని నీటి జల ఉండాలి. తోడుకోవటానికి తాడు, చేద కావాలి. నీళ్లు ఉన్నా సాధనాలు లేకపోతే నీరు తీసుకోవడం కుదరదు. లోపలికి దిగి వెళ్లి నీళ్లు తెచ్చుకునే దిగుడుబావి ఒక్కటి నూరు నూతుల కంటె శ్రేష్ఠం. సులువుగా నీరు దొరుకుతుంది.

నూతికైనా బావికైనా కష్టపడి భూమిని తవ్వాల్సిందే.

అదే ఒక యజ్ఞం చేస్తే దాని ఫలితంగా వానలు కురిస్తే మరింత సులువుగా చెరువులన్నీ నిండుతాయి. ఎటువంటి శ్రమా లేకుండా అందరికీ నేల మీదే నీరు దొరుకుతుంది. అయితే శాస్త్రోక్తంగా, సమంత్రకంగా, సరియైన ద్రవ్యాలతో చేసిన యజ్ఞం ఫలిస్తేనే ఇదంతా జరుగుతుంది. ఆ విధంగా చేయడం చాలా కష్టం. కనుక అటువంటి యజ్ఞాలు ఆశతో వంద చెయ్యటం కంటె ఇంట్లో సమర్థులైన కొడుకో, కూతురో ఉంటే ఎంతదూరమైనా నడచి వెళ్లి నీళ్లు తెచ్చి ప్రాణం నిలుపుతారు.

ఎన్నోతరాలు ఎదురుచూసిన ఆకాశగంగను భగీరథుడు కష్టపడి స్వయంకృషితో నేలమీదికి తెచ్చి తాతముత్తాతలను తరింపచేశాడు. అయితే కన్నబిడ్డలందరూ అన్నివేళలా కనిపెట్టి కాపాడేవాళ్లే ఉండరు. 'అడ్డాలనాడు బిడ్డలు గానీ గడ్డాల నాడు కాదు' అనే సామెత ఇలా ఏర్పడినదే. గూట్లో మేత తిన్న పక్షిపిల్లలు రెక్కలు రాగానే ఎగిరిపోతాయి. మరి మనిషిని కడదాకా ఎల్లవేళలా కాపాడేది ఎవరో? చెంబెడు మంచినీళ్లు ఇచ్చేదెవరు? అంటే సత్యభాషణం, సాధుజీవనమే అతనిని కాపాడుతుంది.

అందరూ సత్యం పలికితే ద్వేషాలు, వైషమ్యాలు ఉండవు. ఊరిలో ఉన్నవారంతా ఒకరికొకరు తోడవుతారు. ఒకరిగొంతులో ఒకరు గుక్కెడు నీళ్లు పోస్తారు. సత్యభాషణం చేసే వ్యక్తిపై నమ్మకం ఏర్పడుతుంది. నమ్మకం ఆత్మీయతను పెంచుతుంది.

భౌతిక బంధుత్వాలకంటె ఆత్మీయతా బాంధవ్యం శాశ్వతం. విశ్వజనీనం. కనుక అబద్ధాలు చెబుతూ అందరినీ దూరం చేసుకోవద్దు. సత్యవాక్యమే అందరినీ కాపాడుతుంది. ఆ సత్యమే నేడు నిన్ను నన్ను ఎవరినైనా కాపాడుతుంది... అని రాజసభలో అందరూ వింటూ ఉండగా, శకుంతల దుష్యంతుణ్ని హెచ్చరించిందని మహాభారతం చెబుతోంది.

సత్యాన్ని మించినది ఈ లోకంలో లేదు. అందుకే వేదాలు సత్యమేవ జయతే, సత్యం వద... అని ఘోషిస్తున్నాయి. సత్యానికి సాటి రాగలది ఈ ప్రపంచంలో మరొకటి ఉండదనేది జగద్విదితం. సత్యవాక్పాలకు లను భగవంతుడు నిరంతరం రక్షిస్తూనే ఉంటాడు.

24. దాంపత్యమే సమాజానికి మూలస్తంభం

స్త్రీ పురుషులు ఎవరికి వారు విడిగా సంపూర్ణతను పొందలేరని వేదం చెబుతోంది. దంపతులుగా మాత్రమే స్త్రీపురుషులు ఏ పని చేయటానికైనా అధికారాన్ని పొందుతారు. ఈ భావన మనస్సులో దృఢమైనప్పుడే చిన్నచిన్న పంతాలకు, పట్టింపులకు, ఆర్థిక కారణాలకు, అహంకారాలకు లోనై ఒకరికొకరు దూరం కాకుండా కష్టసుఖాలలో భాగస్వాములౌతారు. బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలలో గృహస్థాశ్రమమే ముఖ్యమైనది. గృహస్థులే మిగిలిన ఆశ్రమాల వారికి సహాయ సహకారాలు అందిస్తారు. గృహస్థ ఆశ్రమంలోనే స్త్రీపురుషులిద్దరూ కలిసి సమాజసేవ చేయగలిగేది. పురుషుడు గృహస్థాశ్రమ ఫలాన్ని పొందాలంటే స్త్రీ సహకారం తప్పనిసరి. దైవకార్యాలు, పితృసేవ, సామాజికసేవ మొదలైనవి ఏది చెయ్యాలన్నా భార్యాభర్తల మధ్య ఏకాభిప్రాయం, అన్యోన్యత ఉంటేనే పురుషుడు అనుకున్న దానిని చక్కగా చేయగలుగుతాడు. దక్షిణాఫ్రికాలో గాంధీజీ ఆఫ్రికా వారిని ఇంటికి భోజనానికి పిలిచినప్పుడు కస్తూరిబా వారితో కలిసి తినటానికి అంగీకరించకపోతే, 'స్త్రీ సహకారం లేకుండా పురుషుడు ఏ సత్కార్యమూ చేయలేడు. కనుక తనను అర్థం చేసుకో'అని ఆమెను గాంధీజీ కోరారు.

'అనుగుణ భార్యావంతుడు' అనగా తనను అనుసరించే భార్య ఉన్న భర్త మాత్రమే కార్యశీలి, దాంతుడు, పుత్రవంతుడు అవుతాడని మహాభారతంలో శకుంతల దుష్యంతునికి స్పష్టంగా వివరించింది. 'ప్రతిపురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' మొదలైన ఆంగ్లేయసూక్తుల సూక్ష్మపరిశీలన మహాభారతంలో కనిపిస్తుంది. 'దాంతుడు' అనగా ఇంద్రియ నిగ్రహం కలవాడు. భార్య అనుకూలవతి అయిన పురుషుని ఇంద్రియాలు అన్నీ తృప్తి చెందుతాయి కనుక అతడు ఇంద్రియాల ప్రలోభాలకు లొంగకుండా ధర్మనిర్వహణలో ఏకాగ్రత చూపించగలుగుతాడు. కార్యసాధకుడై విజయాన్ని పొందుతాడు. అలా కాకపోతే ఇంద్రియాలు మనిషిని తప్పుదారి పట్టిస్తాయి. ఎంతటి మేధావి అయినా పతన'ం అవుతాడు. 'బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి (ఇంద్రియాలు చాలా బలమైన వి. ఎంతటి విద్వాంసుణ్ణి అయినా లాగి కింద పడేస్తాయి) అని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు చెప్పిన ప్రమాదం నుండి పురుషుడు తప్పించుకోవటానికి తగిన ఉపాయం అనుకూల దాంపత్యం.

భార్యాభర్తలు ఒకరికొకరు అనుకూలంగా చూస్తూ, వింటూ, తింటూ, పరిమళాలు, స్పర్శ అనుభూతులతో సమన్వయం సాధించటం ద్వారా ఇంద్రియాలపై పట్టు సంపాదిస్తారు.

అప్పుడు ధర్మాచరణకు దారి సుగమం అవుతుంది. భార్యాభర్తల అన్యోన్యత వల్ల సమాజం మొత్తం ధర్మబద్ధం అవుతుంది. వారికి కలిగిన సంతానం కూడా మానసిక అనారోగ్యం లేని వ్యక్తిత్వ వికాసంతో విద్యాబుద్ధులలో సాటివారిలో ఉత్తములై తల్లిదండ్రులయందు భక్తిగౌరవాలు కలిగిన ఉత్తమపౌరులు అవుతారు. వృద్ధాప్యంలో వారిని ఆప్యాయతతో చూస్తారు. అటువంటి సంతానం ఉన్నవారే పుత్రవంతులు. ఎడమొగం పెడమొగంగా ఉన్న తల్లిదండ్రుల పెంపకంలో పిల్లలు ప్రతిభాహీనులుగా, అసాంఘికశక్తులుగా మారితే వారు ఉన్నా లేనట్లే. ఆ దంపతులు పుత్రవంతులు అయినా కానట్లే. దాంపత్యధర్మం మిగిలిన ధర్మాలన్నింటినీ ఎలా కాపాడుతుందో శకుంతల మాటల ద్వారా దుష్యంతునికే కాక మానవజాతికి శాశ్వత సందేశం అందుతోంది. దాంపత్యధర్మం ఒక్కటి సరిగా ఉంటే చాలు. మిగిలిన ధర్మాలన్నీ బతికి మానవజాతిని మంచిగా బతికిస్తాయి.

25. నమ్మకం సహజీవనానికి మూలం

కలసిమెలసి జీవించవలసిన సమాజంలో కపటత్వం, నయవంచన, మోసం మొదలైనవి... స్వార్థం, స్వలాభం కోసం మనోవికారాలుగా ఏర్పడి ఎదుటివారిని బాధిస్తూ ఉంటాయి. నమ్మకమే సహజీవనానికి మూలం. తెలివితేటలను సద్వినియోగం చేసుకుని సమాజానికి మేలు చేసేవారు సజ్జనులు, చెడు పనులు చేయడానికి ఉపయోగించేవారు దుర్జనులు. నిజమైన మంచివారి కంటె, నమ్మించి మోసం చేసేవారు చాలా మంచిగా నటిస్తూ ఉంటారు.

మహాభారతం చదివిన వారికి వివేకం, విజ్ఞానం కలిగించే ఉపాఖ్యానాలు, కథల ద్వారా పరిశీలనా శక్తి ఏర్పడుతుంది. దానివలన ఎదుటివారిని అంచనా వేయగలుగుతారు. గ్రద్ద - నక్కలకు, పిల్లి–ఎలుకలకు, హంసి - చక్రవాక పక్షులకు జరిగిన సంభాషణల వంటి సన్నివేశాలలో సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం, మనస్తత్వ పరిశీలన విధానం, సత్ప్రవర్తన స్వరూపం తెలుస్తాయి.

కణ్వాశ్రమానికి వచ్చిన దుష్యంత మహారాజు అక్కడ శకుంతలను చూసి, ఆమె సౌందర్యానికి ముగ్ధుడయ్యాడు. తియ్యని కబుర్లు చెప్పాడు. కణ్వమహర్షికి తెలియకుండా రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. ఆనందంగా గడిపారు. దుష్యంతుడు రాజధానికి బయలుదేరుతూ శకుంతలను తీసుకురావటానికి పరివారాన్ని పంపుతానని చెప్పాడు.

శకుంతల గర్భవతి అయ్యింది. కుమారుడు పుట్టాడు. నాలుగైదేండ్ల వాడు అయ్యాడు. రాజధాని నుండి ఎవరూ రాలేదు. కణ్వమహర్షి 'అమ్మా! పుట్టినింటిలో ఎక్కువకాలం ఉండకూడదు. నీ భర్త దగ్గరకు కుమారుణ్ని తీసుకుని వెళ్లు' అని శిష్యులను తోడు ఇచ్చి పంపాడు.

దుష్యంతుడు కొలువుతీరి ఉండగా శకుంతల రాజసభలో ప్రవేశించింది. మహారాజు ఆమెను గుర్తించలేదు. స్వాగతం చెప్పలేదు. రాజకీయ కార్యకలాపాల ఒత్తిడి వలన తనను మరిచిపోయాడేమో అనుకుంది. గుర్తు చేసింది. కానీ అతడు అంగీకరించలేదు. నువ్వెవరో నాకు తెలియదు పొమ్మన్నాడు. అప్పుడు శకుంతల ధైర్యంతో ధర్మపోరాటానికి సిద్ధమైంది. పంచభూతాలు, సూర్యచంద్రులు, పగలు, రాత్రి, అంతరాత్మ అనే పదిమంది సాక్షులు అన్నీ చూస్తూ ఉంటారు. అసత్యం చెప్పకూడదు. అధర్మం చెయ్యకూడదు. మహారాజా! నీవు గుర్తు ఉండి కూడా లేనట్టు నటిస్తున్నావు. మోసగాళ్లు మాత్రమే అలా ప్రవర్తిస్తారు.

నిజంగా మరచిపోతే గుర్తు చెయ్యవచ్చు. అసలు తెలియని దానిని వివరంగా చెప్పి తెలియచేయవచ్చు. తెలిసి కూడా తెలియనట్లు, గుర్తు ఉండి కూడా లేనట్లు నటించే మోసగాళ్లకు తెలియచేయటం సృష్టికర్త అయిన బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు. కనుక అటువంటివాణ్ని వదిలెయ్యకూడదు. నలుగురిలో నిలబెట్టి నిజం కక్కించాల్సిందే. బుద్ధి చెప్పాల్సిందే. సాక్ష్యాధారాలు చూపాల్సిందే. మానవులు అధర్మాన్ని చూసి మౌనం వహించకుండా ధర్మయుద్ధానికి సిద్ధమైతే పైనుండి దైవసహాయం లభిస్తుంది. ఉప్పు, కర్పూరం ఒక్కటిగా కనబడినట్లు నయవంచకులు మంచిగా కనబడతారు. మాయమాటలకు లొంగకుండా వారి నైజాన్ని గుర్తించాలి. విజయం సాధించాలి. ఆకాశవాణి అందరికీ వినబడేటట్లు నిజం చెప్పింది. దుష్యంతుడు శకుంతలను స్వీకరించాడు.

26. స్నేహమేరా జీవితం

చుట్టరికాలు, వరుసలు... దగ్గరైనా దూరమైనా, సత్యమైనా అసత్యమైనా ప్రేమ, అనురాగం, భక్తి, గౌరవం, వాత్సల్యం, మైత్రి, జాలి, దయ, కరుణ మొదలైన వాటిలో ఏ పేరు పెట్టినా అసలు పేరు మాత్రం స్నేహమే. 'స్నేహం' అనే శబ్దానికి 'నెయ్యి' అని అర్థం. నెయ్యి తయారయిన తరువాత ఇక అది ఎంతకాలమైనా చెడిపోదు. అవసరమైనప్పుడల్లా కరుగుతూ ఉంటుంది. తనస్పర్శతో ఒరిపిడిని నివారిస్తుంది. రుచిని శక్తిని ఇస్తుంది. 'ఆయుర్ఘృతమ్' (నెయ్యి ఆయుష్షును ఇస్తుంది) అని ఆయుర్వేదం చెబుతోంది. ఈ లక్షణాలన్నీ కలిగి ఉండి మానవజాతిని అన్యోన్యంగా నడిపే మనోభావానికి 'స్నేహం' అనే పేరు చెక్కుచెదరనిస్థాయిలో పెద్దలు ఏర్పరిచారు.

ఒకరిని చూచి ఒకరు కరగకుండా ఈ లోకంలో ఏ పనీ జరగదు. వ్యక్తిత్వ వికాసంలో ఇది ప్రధానమైన అంశం. మానవ సంబంధాలకు ఇదే ఆయువుపట్టు. "శకుంతల అత్తవారింటికి వెళుతోందనగానే, స్నేహం వలన ఋషినైన నాకు కూడా దుఃఖం కలుగుతోంది" అని కణ్వుడు స్నేహశబ్దాన్ని ఉపయోగించాడు. కణ్వునికి శకుంతల కన్న కూతురు కాదు. అడవిలో పసిపాప ఏడుస్తుంటే జాలిపడి తెచ్చి పెంచాడు. సర్వసంగపరిత్యాగి అయిన ఆ మహర్షిలో ఉన్న ఆర్ద్రత (కరిగేగుణం) కథను ఇంతదూరం నడిపించింది. రక్తసంబంధం ఉన్న తల్లిదండ్రులు ఆడపిల్ల అత్తవారింటికి వెళ్లేటప్పుడు నాకంటే ఎంత ఎక్కువ బాధపడతారో అనుకున్నాడు. ఆర్ద్రత లోపించటం వల్లనే మానవ సంబంధాలు పుటుక్కున తెగిపోతున్నాయి. మహాభారతం ఈ అంశంపై లోతైన పరిశీలన చేసింది.

ద్రుపదుడు, ద్రోణాచార్యుడు చిన్నప్పుడు గురుకులంలో కలిసి చదువుకున్నారు. పెద్దయ్యాక ద్రుపదుడు పాంచాల దేశానికి రాజు అయ్యాడు. ద్రోణుడు విద్యావంతుడయ్యాడు. కాని పేదరికంలో మగ్గిపోతున్నాడు. పసివాడయిన అశ్వత్థామకు పాలకోసం ఒక ఆవును అడుగుదామని, చిన్ననాటి స్నేహితుడైన ద్రుపదమహారాజు దగ్గరకు వెళ్లాడు. ద్రుపదుడు తనను చూడగానే ఆనందంతో స్నేహహస్తాన్ని అందిస్తాడనుకున్నాడు ద్రోణుడు.

కానీ ద్రుపదుడు, "నీకూ నాకూ స్నేహం ఏమిటి? నువ్వెక్కడ? నేనెక్కడ? చిన్నప్పుడు కలిసి చదువుకున్నంత మాత్రాన సరిపోదు. శీలం, విద్య, ధనం, మంచిచరిత్ర అన్నీ సమానంగా ఉన్నప్పుడే స్నేహం గానీ, వివాహం గానీ కుదురుతాయి. అసమానుల మధ్య ఇవి కుదరవు" అని ఎగతాళిగా మాట్లాడినా మనస్తత్త్వ శాస్త్రానికి సంబంధించిన సత్యాన్ని ఆవిష్కరించాడు.

పైన చెప్పినవాటిలో ఏ ఒక్కదానిలో సమానత్వం ఉన్నా స్నేహం వర్థిల్లుతుందని తెలుసుకోవాలి. దీనిని మానవజాతికి మార్గదర్శనం చెయ్యటానికి భగవంతుడు రామావతారంలో జటాయువు, సుగ్రీవుడు వంటి పశుపక్ష్యాదులతో స్నేహభావంతో కలిసి ఉండే ఆర్ద్రతను చూపించాడు. కృష్ణావతారంలో తన చిన్ననాటి స్నేహితుడైన కుచేలుని ఆదరించి స్నేహం యొక్క ఆంతర్యాన్ని ఆవిష్కరించాడు. సంపద, అధికారం సమానంగా లేకపోయినా మిగిలిన వాటిని బట్టయినా మానవుల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి. అలా సాగించే ఆర్ద్రత ఉంటే అది స్నేహమై ఘర్షణలను నివారిస్తుందని మహాభారతం ఇచ్చే సందేశం మానవజాతికి శిరోధార్యం. జీవనరథచక్రాల ఇరుసుకు 'కందెన' స్నేహమే. అది లేకుండా ఎవరి బండీ సాగదు.

27. రోగం రట్టు - కాపురం గుట్టు

మనం తిన్నా తినకపోయినా కాలం ఆగదు. పరిగెత్తుతూనే ఉంటుంది. రోజులు గడుస్తూనే ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోవటమే జీవనకళ. అందువల్ల ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలి. అటువంటి తప్పులు పునరావృతం కాకుండా జీవనశైలిని మార్చుకోవాలి. అప్పుడే మానవజీవితం పరిపూర్ణం అవుతుంది. కొందరు ఎప్పుడూ మౌనంగా ఉంటారు. మరికొందరు దారిని పోయేవారిని పిలిచి మరీ గంటల తరబడి ఇంట్లో సంగతులు, సొంత విషయాలు చాటింపు వేస్తూ ఉంటారు. మూగిగా ఉండటం ఎంత తప్పో, అదేపనిగా మాట్లాడుతూ ఉండటం కూడా అంతే తప్పు. ఇంతటి లోతైన వ్యక్తిత్వ వికాసాన్ని తేలికైన సామెతల రూపంలో అందించటం తెలుగుభాష గొప్పదనం.

కొన్ని విషయాలను బయటపెట్టాలి. కొన్నింటిని దాచుకోవాలి. రోగాన్ని దాచిపెట్టకూడదు. దాన్ని రట్టు చెయ్యాలి. నలుగురికీ తెలిస్తే వారికి తెలిసిన నివారణోపాయాలు, ఔషధాలు, పథ్యాలు రోగికి తెలియచేస్తారు. దానివలన ప్రమాదం నుండి త్వరగా కోలుకోవచ్చు. ఇతరుల సహాయం దొరికే విషయాలను మాత్రమే బయటికి చెప్పాలని దీని తాత్పర్యం. కాపురంలో భార్యాభర్తలు, పిల్లలు, బంధువుల మధ్య ఆవేశకావేశాలు, సరదాలపరదాలు వస్తూనే ఉంటాయి. వాటిని బయటపెడితే, తీర్చకపోగా నవ్వుకుని, పుల్లలు వేసి మంట ఎగదోస్తారు.

కనుక కుటుంబ విషయాలలో గుట్టు అవసరం.

ధృతరాష్ట్రుడు... ధర్మరాజుకు యువరాజ పట్టాభిషేకం చేసినప్పుడు దుర్యోధనుడు అతని ఔన్నత్యాన్ని సహించలేకపోయాడు. కర్ణ, శకుని, దుశ్శాసనులతో... ఇప్పుడేం చెయ్యాలో రాజనీతి చెప్పమని అడిగాడు. శకుని మంత్రి అయిన కణికుడు పరిపాలనా చాతుర్యానికి ఉపయోగించే నీతులు కొన్ని దుర్యోధనుడికి చెప్పాడు. రాచరికపు వ్యవస్థలోనే కాక ఈనాటికీ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచటానికి అవి ఉపయోగిస్తాయి.

పిడుగు, గాలి వంటివి ఏ హెచ్చరిక లేకుండా ఎలా వస్తాయో, అలాగే కోపం, ప్రేమలాంటివి ఆచరణలోకి వచ్చేవరకు గుట్టుగా ఉండాలి. ముందుగా తెలిస్తే అవతలివారు కోపం విషయంలో తప్పించుకునే అవకాశం దొరుకుతుంది. ప్రేమ విషయంలో ఎక్కువ ప్రయోజనాన్ని ఊహించుకుని ఇచ్చినదాన్ని తక్కువగా భావిస్తారు. కనుక శిక్షించినా, రక్షించినా అమలులోకి వచ్చేవరకూ ఆర్భాటం చేయకూడదని కణికుడు బోధించిన నిర్వహణ నైపుణ్యం కలకాలం పనికి వస్తుంది.

28. దుర్జనులను గుర్తించటం ఎలా!

మన చుట్టూ ఉన్నవారు అందరూ చూడటానికి మంచిగా కనిపిస్తారు. వాళ్లలో సజ్జనులెవరో, దుర్జనులెవరో, నమ్మించి మోసంచేసే వాళ్లెవరో గుర్తుపట్టటం చాలా కష్టం. ఉప్పు, కర్పూరం చూడటానికి ఒకే విధంగా తెల్లగా ఉంటాయి. రుచి చూసినప్పుడే తేడా తెలుస్తుంది. ఆలుచిప్ప ఎండలో మెరుస్తూ వెండిలాగ కనిపిస్తుంది. మసక వెలుతురులో తెల్లత్రాచు మల్లెదండలాగ ఆకర్షిస్తుంది. పుచ్చువంకాయను చూసి గుర్తు పట్టగలం. చేదు దోసకాయను కనిపెట్టలేం.

ఎందరో వ్యక్తులు, ఎన్నో సంస్థలు ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నా కొత్తవి వస్తూనే ఉన్నాయి. మోసాలు జరుగుతూనే ఉన్నాయి. అటువంటి వారిని గుర్తుపట్టటం ఎలా? పిల్లలకు నీతికథలు చెబుతూనే ఉన్నాం. అమాయకత్వం, నక్కజిత్తులు, నక్కవినయం మొదలైన సూచనలు చేస్తూనే ఉన్నాం. ఆషాఢభూతి అనే శిష్యుడు గురువును ఎలా మోసగించాడో అందరికీ తెలుసు. అయినా వంచన, మోసం అన్నికాలాలో జరుగుతూనే ఉన్నాయి.

మహాభారతంలో కణికుడు దుర్యోధనునికి చెప్పిన రాజనీతిలో దుర్జనులను గుర్తించేటందుకు కొన్ని సూచనలు చేశాడు. ఆ లక్షణాలు కనబడిన వారిని నమ్మకుండా

అనుమానించి జాగ్రత్తపడాలి. 'మాటిమాటికీ నమస్కారాలు పెట్టటం, ప్రమాణాలు చెయ్యటం, తియ్యగా ఇచ్చకాల కబుర్లు చెప్పటం, దొంగవినయాలు చూపటం... ఇవి కాపురుష (చెడ్డవాళ్ల) లక్షణాలని మహాభారతం చెబుతోంది. అయితే మంచివాళ్లను గుర్తుపట్టటానికి కూడా ఈ లక్షణాలే పనికివస్తాయి. అసలు ఇవి సజ్జనుల లక్షణాలే. దుర్జనులు వీటిని అడ్డం పెట్టుకుని కాటు వేస్తున్నారు.

పులి... ఆవు చర్మం కప్పుకుని నిజమైన ఆవును కూడా అనుమానానికి, అవమానాలకు గురిచేస్తోంది. సజ్జన లక్షణాల ముసుగులో దాగి ఉన్న దుర్జనులను గుర్తుపట్టటానికి మహాభారతం చూపించిన తేడా 'అతి'. పైన చెప్పిన లక్షణాలు సాధారణస్థాయిలో ఉంటే సజ్జనుడు. అసాధారణస్థాయిలో ఉంటే దుర్జనుడు.

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు. మితిమీరిన ప్రవర్తనను అంచనా వేయగల పరిశీలనా సామర్థ్యాన్ని పెంచుకోవాలి. 'ఆవు - పులి' కథలో ఆవు తన బిడ్డకు పాలు ఇచ్చి తిరిగి వస్తానని ఒట్టువేసి చెప్పినా పులి నమ్మలేదు. క్రూరజంతువైన పులి సాధుజంతువైన ఆవు ఒకసారి ప్రమాణం చేస్తేనే నమ్మలేదు. కానీ ఆవు వంటి సాధువులు మాత్రం పులి వంటి దుర్జనులు చేసే దొంగ ప్రమాణాలకు మోసపోతున్నారు. కనుక ఇలాంటి వారిపట్ల కొంత అప్రమత్తతతో ఉండటం అవసరం.

29. కృతజ్ఞత ఉత్తమధర్మం

ఎదుటివారు చేసిన సహాయాన్ని గుర్తు ఉంచుకునే గుణాన్ని 'కృతజ్ఞత' అంటారు. ఇది అన్ని ప్రాణుల మధ్య అన్యోన్యతను, ఐకమత్యాన్ని, పరోపకారాన్ని, సేవాభావాన్ని పెంపొందిస్తుంది. ఏ కాలంలోనైనా మానవజాతి ఒకరికొకరు ఉపకారం చేసుకోవటం అనే ప్రక్రి య లేకుండా జీవితం నడవదు. ఉపకారం చేసే చొరవ మనసులో కలగాలంటే మనం వారి నుండి పొందిన ఉపకారం గుర్తుకు రావాలి. చేసిన మేలును మరచిపోతే దానిని 'కృతఘ్నత' అంటారు. 'కృతఘ్నుని శవాన్ని కుక్కలు కూడా ముట్టవు' అని రామాయణ, భారత, భాగవతాలు ఘోషిస్తున్నాయి.

పాండవులు, వారి తల్లి కుంతి ఏకచక్రపురంలో ఒక గృహస్థుని ఇంట్లో మారువేషాలలో జీవిస్తున్నారు. బకాసురుడనే రాక్షసునికి ఆహారంగా వంతు ప్రకారం ఆ ఇంటి యజమాని

వెళ్లవలసిన రోజు వచ్చింది. దాంతో అతని కుటుంబ సభ్యులు గొల్లున ఏడవటం మొదలుపెట్టారు. ఆ ఆర్తనాదాలు విన్న కుంతి బాధపడింది. భీముణ్ని పిలిచి, 'నాయనా! ఈ గృహస్థు మనకు ఆశ్రయం ఇచ్చి ఎంతో ఉపకారం చేశాడు. వారికి వచ్చిన కష్టాన్ని తీర్చటం మన కర్తవ్యం' అంటూ...

"పొందిన మేలు గుర్తుపెట్టుకోవటం సామాన్యధర్మం. దానికి సమానంగా ప్రత్యుపకారం చేయటం మధ్యమం. దానికంటె మరింత ఎక్కువగా తిరిగి మేలు చేయటం ఉత్తమం. బుద్ధిమంతులు ఇలా చెయ్యాలి" అని హితోపదేశం చేసింది. తల్లి ఆదేశంతో ఆవేశం వచ్చిన భీముడు ఆ గృహస్థుకు బదులుగా బకాసురునికి తాను ఆహారంగా వెళ్లి లోకకంటకుడైన ఆ రాక్షసుణ్ని సంహరించి సంఘానికి మేలుచేశాడు. తల్లిదండ్రుల ఉపదేశాల ప్రభావం పిల్లలపై తప్పకుండా పనిచేస్తుంది. వాళ్లు చెడు చెప్పినా, మంచి చెప్పినా ఆచరణీయంగానే అనిపిస్తుంది. అందుచేత పెద్దలు ఎప్పుడూ పిల్లలకు రాగద్వేషాలకు అతీతంగా సదుపదేశమే చెయ్యాలి. సజ్జనులైన పిల్లలు తల్లిదండ్రులకు బరువైనా సమాజం వారిని భరిస్తుంది. భూమికి బరువైన దుర్జనులను సంఘం సంహరిస్తుంది.

సామాజిక శాంతికి, అభివృద్ధికి... కృతజ్ఞతాగుణమే మూలమన్న విషయాన్ని పిల్లలకు చిన్ననాటి నుంచే తెలియచేయాలి. ప్రకృతిలో చెట్లు, నదులు, కొండలు తమకోసం కాక ఇతరుల కోసం జీవిస్తున్నాయి. చెట్టు చిన్నదిగా ఉన్నప్పుడు మనం పోసిన కొద్దిపాటి నీళ్లకు గుర్తుగా తాను ఎండలో మాడుతూ మనకు నీడను ఇస్తోంది. పశుపక్ష్యాదులకు నివాసంగా పనికి వస్తోంది. తాను మొలకెత్తి, పెరిగి పెద్దవ్వటానికి ఉపకారం చేసినవారందరికీ ప్రత్యుపకారం చెయ్యటమే ధ్యేయంగా జీవిస్తున్న చెట్టులాగ జీవించటం మానవజాతి బాధ్యతగా, కర్తవ్యంగా గుర్తించమని మహాభారతం చెబుతోంది.

30. అప్రమత్తత అన్నివేళలా అవసరం

'ప్రమాదం' అనే సంస్కృత పదాన్ని తెలుగువారు ప్రయాణాల్లో జరిగే ఆపదగా ఉపయోగిస్తున్నారు. కానీ అసలైన అర్థం 'ఏమరుపాటు', నిర్లక్ష్యం, అజాగ్రత్త. దానివలన కలిగిన కష్టాన్ని మనం సరాసరి 'ప్రమాదం' పేరుతో పిలుస్తున్నాం. ఏ ప్రాణి అయినా ప్రతిక్షణం జాగరూకతతో ఉండకపోతే ఏ క్షణంలోనైనా ఇబ్బందులకు గురి కావచ్చు. ఎఱ చూసి చేప,

నూకలు చూసి పక్షులు, చెఱకుగడలు చూసి ఏనుగు ఆకర్షణకు లోనై ప్రమత్తతతో పరుల చేతికి చిక్కి ప్రాణాలు కోల్పోతున్నాయి. మానవజాతిని బురిడీ కొట్టించి బుట్టలో వేసే అంశాలు చాలా ఉన్నాయి. మనిషికి అప్రమత్తత మరింత అవసరం అని మహాభారతం చెబుతోంది.

'ప్రమాదోధీమతామపి' (తెలివైనవారు కూడా పొరబడతారు) అనే సూక్తి సుప్రసిద్ధం. 'ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్టు' అనేది తెలుగు సామెత. ఇంటా, బయటా జీవితంలో తుదిక్షణం వరకు ఏమరుపాటు పనికిరాదు. ఒళ్లు మరిచి ఉంటే ఇంట్లోనైనా మృత్యువు కబళిస్తుంది.

కణికుడు దుర్యోధనునికి రాజనీతి ఇలా చెబుతున్నాడు... 'తనకు అపకారి అయిన వాడికి దగ్గరలో ఉండే మూర్ఖుడు ఎత్తయిన చెట్టు చిటారుకొమ్మన నిద్రపోయేవాడితో సమానం. ఎంత జాగ్రత్తగా ఉన్నా నిద్రలో ఏమరుపాటుతో జారి కిందపడతాడు'. (ఆది - 6 - 118). ఈ నీతి సూత్రంలో చెప్పిన పోలిక చాలా గొప్పది. నేలమీద పడుకున్నవాడు ఆదమరచి ఉన్నా పడడు. ఉన్నతస్థానంలో ఉన్నవారికే ప్రతిక్షణం అప్రమత్తత అవసరం. నిద్ర ప్రాణులకు కనీస అవసరమైనా ప్రాణరక్షణ కోసం వారు దానిని త్యాగం చెయ్యక తప్పదు.

మహాభారతంలోని పోలికలో చెప్పిన అపకారి రాజనీతి విషయంలో శత్రువు కావచ్చు. ఎంతోకాలంగా నైపుణ్యంతో నడుపుతూ ఉండవచ్చు. అయినా మితిమీరిన ఆత్మవిశ్వాసంతో కూడిన ఏమరుపాటు వలన వచ్చిన కునికిపాటు కొంపలు ముంచుతుంది. తినే పదార్థాలు, తాగే పానీయాలు, ఎప్పటినుంచో తెలిసిన మనుషులు... ఏవైనా, ఎవరైనా, ఎప్పుడైనా మన ప్రమత్తత, ఏమరుపాటు వలన అపకారిగా మారి ప్రాణాలను అపహరించే అవకాశం అన్నివేళలా ఉంటుంది. అందుచేత ఎంతటి మేధావి, నిపుణుడు, బలవంతుడు, గుణవంతుడు, ధనవంతుడు, అధికారం ఉన్నవాడైనా ప్రతిక్షణం జాగరూకతతో అప్రమత్తులై ఉండాలి. భౌతికనేత్రం నిద్రపోతున్నా జ్ఞాననేత్రం ఎప్పుడూ మేలుకొనే ఉండాలి.

అహంకారం, అతిశయం, అలసత్వం, అధికారగర్వం వంటి దుర్లక్షణాల వలన ఆ కన్ను మూతపడితే అనుకోని ఆపదలు వచ్చిపడతాయి. ఇవి స్వయంకృతాలు. విధి లిఖితమైన ఆపదలను తప్పించుకోలేకపోవచ్చు. స్వయంకృతాలను మాత్రం అప్రమత్తతో రాకుండా చేసుకోవచ్చు. ఇదే మహాభారత సందేశం.

31. మేలుకో, నడు, లక్ష్యాన్ని సాధించు.

ఆధ్యాత్మికత సోమరితనం కాదు. వేదాంతం మత్తుమందు కాదు. మానవత్వపు విలువలను తెలియచేస్తూ, మానవజాతి పురోగతికి మార్గనిర్దేశం చెయ్యటమే భారతీయ సంస్కృతి లక్ష్యం. యువతలో చైతన్యం వచ్చినప్పుడే సమాజానికి ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉంటుంది అని అంతర్జాతీయంగా ప్రపంచమంతా తన వైపు చూచే విధంగా ఎలుగెత్తి చాటిన మహనీయుడు స్వామి వివేకానంద. భగవద్గీతలో కృష్ణుడు అర్జునునికి చెప్పిన క్లైబ్యం మాస్మగమః... ' (పార్థా! పిరికితనం పనికిరాదు. క్షుద్రమైన హృదయదౌర్బల్యాన్ని విడిచి పరాక్రమంతో నిలబడు) అనే శ్లోకం అంటే వివేకానందునికి చాలా ఇష్టం. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, వేదాంత గ్రంథాలను ఎలా చదవాలో, ఎలా అర్థం చేసుకోవాలో ఆధునిక సమాజానికి సప్రమాణంగా ఉదాహరణలు, ఆత్మవిశ్వాసంతో ఆకర్షణీయంగా బోధించిన మహావక్త, దార్శనికుడు ఆయన. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వలన భారతీయులలో కలిగిన ఆత్మన్యూనతాభావం, గందరగోళం, భయం, పిరికితనం మొదలైన మానసిక వికారాలను పోగొట్టి, వ్యక్తిత్వవికాసాన్ని కలిగించి కార్యోన్ముఖులను చేయుటానికి వివేకానందుని బోధనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

"పేదరికం పోవాలి. ఆకలితో ఎవరూ బాధపడకూడదు. ఇనుపకండరాలతో ఉక్కునరాలతో దృఢమైన ఆరోగ్యవంతమైన దేహం ఉండాలి. ఆటపాటలతో ఉల్లాసంగా ఉండాలి. అప్పుడే వేదాంతం అర్థమవుతుంది. నీ లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకు. అప్పుడు ప్రపంచం మొత్తం నీకు మోకరిల్లుతుంది. కష్టపడి డబ్బు సంపాదించు. కాని దానితో బంధాన్ని పెంచుకోకు. సత్యానికి కట్టుబడి ఉంటే విజయం నెమ్మదిగా లభించవచ్చు. కానీ తప్పక లభిస్తుంది. ప్రతిదానినీ పరీక్షించు. ప్రయత్నించు. అప్పుడు మాత్రమే విశ్వసించు. దానిలో నీకు కనపడిన మంచిని అందరికీ పంచు. ఈ జీవితాన్ని ఇతరుల సేవకు సమర్పించు."

ఇలా సాగిన వివేకానందుని ప్రవచనాలలోని పరమార్థం మతబోధకాదు. హితబోధ. మానవునిలోని స్వార్థం, అసూయ, చెడుస్నేహాలు, పరా నుకరణం, అజ్ఞానాలను పారద్రోలి ఉత్తమునిగా తీర్చిదిద్దాలి. అప్పుడు సమాజంలోని కక్షలు కార్పణ్యాలు అంతరిస్తాయి. అంతటా ఉన్న పరమాత్మతత్త్వం అవతగమవుతుంది. ఈ భారతీయ తత్త్వాన్ని ప్రపంచం నాలుగుదిక్కులా చాటిచెప్పటానికి చాలా కష్టాలకు ఓర్చి వివేకానందుడు తూర్పు, పశ్చిమ దేశాలెన్నో పర్యటించారు. చికాగో విశ్వమత సమ్మేళనంలో ఆయన చేసిన ప్రసంగం

చిరస్మరణీయం. యువతరాన్ని తీర్చిదిద్దే సూక్తులుఅసంఖ్యాకంగా అందిస్తున్న వివేకానందుని రచనలు యువతకు మార్గదర్శకాలు. 'మేలుకో, నడు, లక్ష్యాన్ని సాధించు అనే ఉపనిషద్వాక్యమే వివేకానందుని నినాదం. దాని ఆచరణే మనం ఆయనకు చేసే అభివాదం.

32. గర్వం ఎవరికీ ఉండరాదు

ఏ ప్రాణికైనా గర్వం పనకిరాదు. దానివలన అనర్థాలు, అపజయాలు తప్పవు. విజ్ఞానం గల మనిషి కూడా గర్వాన్ని వదులుకోలేకపోతున్నాడు. అందుకే లోపల ఉండే ఆరుగురు శత్రువులు కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సార్యాలలో 'మదం' పేరుతో గర్వాన్ని కూడా చేర్చారు. 'నేను' చాలా గొప్పవాణ్ణి. 'నేను' తప్ప ఇది ఎవరూ ఇలా చేయలేరు అనుకోవడటమే అహంకారం. గర్వం, మదం, అహంకారం అన్నీ ఒకటే. మానవుడు ఆరుగురు శత్రువులను జయించాలి. గొప్ప తపస్సుచేసిన వారు ఎవరైనా వారిని పరీక్షించి మొత్తం ఆరుగురు శత్రువులను గెలిచారో లేదో నిర్ణయించి ఉత్తీర్ణత ప్రకటించే బాధ్యత ఇంద్రునిది. అది చాలా బాధ్యతగల పదవి. లోకంతో నానా మాటలు అనిపించుకోవాలి. వాటిని పట్టించుకోకుండా తన బాధ్యత తాను రాజీపడకుండా నిర్వహించాలి. అందుకే ఇంద్రుడు ఒక్కొక్కచోట ఒక్కొక్క ఉపాయాన్ని ఎదుటివారు ఊహించలేని విధంగా ప్రయోగించి పరీక్షిస్తూ ఉంటాడు. మహాభారతంలో యయాతిని 'మదం'తో పడగొట్టాడు.

యయాతి కొడుకులలో పురావు అనేవాడు తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చి ముసలితనాన్ని తాను తీసుకొన్నాడు. యయాతి అతనికి రౌద్రాన్ని ఇస్తూ ఎన్నో నీతులు ఉపదేశించాడు. 'నాయనా మదం, కామం క్రోధం, మాత్యర్యం, లోభం, మోహం అనే లోపలి శత్రువులను గెలిచినవాడే బయటి శత్రువులను తేలికగా గెలుస్తాడు' (ఆది-3-106) అని చెప్పిన నీతిలో మొదట మదాన్నే చెప్పాడు. తరువాత కాలంలో యయాతి ఇంద్రుడికి ఎంతో మర్యాదగా, గౌరవంగా స్వాగతం చెప్పాడు. ఇంద్రుడు అతడితో క్షేమసమాచారాలు అడుగుతున్నట్టు సంభాషించాడు. యయాతి మహారాజా! నీ తపస్సు చాలా శక్తిగలది. అసామాన్యమైనది. ఇన్నివేల సంవత్సారాలు పుణ్యలోకాలు అనుభవించడం అసాధారణం అంటూ పొగడ్తల్లో ముంచెత్తాడు. యాయాతిలో దాగి ఉన్న మదం నిద్రలేచింది. గర్వం మేలుకొంది. అహంకారం ఆకాశాన్ని అంటింది. 'దేవేంద్రా! నాకు నేనే సాటి నాతపస్సుతో దేవతలు, రాక్షసులు,

మహారాజుల తపస్సులేవీ సరిపోవు. ఇంతవరకూ ఎవరూ ఇలా చేయలేదు. ఇక ముందు చేయలేరు అని యయాతి తన గొప్ప చెప్పుకున్నాడు. అప్పటి వరకూ నవ్వుతూ మాట్లాడిన ఇంద్రుడు 'యయాతీ! నీ తపస్సు ఎంత గొప్పదయినా మహర్షులను అవమానించి గర్వంగా అహంకారంతో మాట్లాడావు కనుక నీ పుణ్యం అంతా అయిపోయింది. ఇక భూలోకానికి దయచెయ్యి అని పరీక్షాఫలితాన్ని ప్రకటించాడు. యయాతి తనకుమారునికి ఉపదేశం చేసేటప్పుడు పనికిరాదని చెప్పిన పదాన్ని తాను వదులుకోలేకపోయాడు. గర్వం ఉండకూడదు. పిల్లలకు చేప్పేనీతులు పెద్దలు మరిచిపోకుండా ఆచరించాలి. ఎంత పరిణతి చెందిన వారిలోనైనా పొగడ్తలతో గర్వం తొంగి చూస్తుంది. ~~ఈ~~ మహాభారత కథ దొంతర మల్లెపువ్వులాగా ఒక సందేశంలో నుండి మరెన్నో సందేశాలను ఇస్తోంది.

33. కోపాన్ని మించిన శత్రువు లేదు...

మహాభారతంలోని అసలు కథ కంటే కొసరు కథలు వ్యక్తిత్వ వికాసానికి, ఇంద్రియ మనోనిగ్రహాలకు, క్రమశిక్షణకు దారి చూపిస్తాయి. కోపాన్ని జయించాలి. 'తన కోపమె తన శత్రువు' అని చెప్పే నీతి సూత్రాన్ని ఒక యువకుడు ఎదిరించాడు. 'కోపం వస్తే తప్పేమిటి? అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదుర్కోవాలంటే కోపం రావలసిందే' అన్నాడు. అతని పితృదేవతలు అతనికి యథార్థాన్ని వివరించి కోపం పనికిరాదని చెప్పారు. వచ్చిన కోపానికి పరిష్కారంలాంటి శిక్ష విధించారు. కోపం వచ్చినవాడు తన కోపంతో తానే శిక్షింపబడతాడని దీని ద్వారా లోకానికి సూచించారు.

భృగువంశానికి చెందిన ఔర్వుడు తేజశ్శాలిగా పుట్టాడు. అప్పటికే అతని వంశంలోని వారందరినీ చంపిన క్షత్రియులు ఇతని తేజస్సుతో గుడ్డివారు అయ్యారు. వాళ్లు ఔర్వుని తల్లితో, 'చూపు తెప్పించమ'ని ప్రార్థించారు. ఆమె 'పుట్టిన పిల్లవాడిని అడగండి' అన్నది. వాళ్లు ఔర్వుణ్ని అడిగారు. అతడు

గ్రహించాడు. 'సంపదల కోసం నా పితృదేవతలను క్షత్రియులు సంహరించారు. నా తపస్సుతో అన్ని లోకాలలో ప్రళయం సృష్టిస్తాను' అని ఔర్వుడు క్రోధంతో తపస్సు చేయసాగాడు. శాంతమూర్తులైన అతని పితృదేవతలు ప్రత్యక్షమై, 'నాయనా! నీ తపస్సుకు లోకాలన్నీ భయపడుతున్నాయి. నీ రోషాన్ని విడిచిపెట్టు. మేము క్షత్రియుల చేతిలో

అసమర్థులమై చావలేదు. తపోమహిమ వల్ల దీర్ఘాయువు లభించింది. మేము అంతకాలం భూమి మీద ఉండలేకపోయాం. ఆత్మహత్య మహాపాపం కనుక పుణ్యలోకాల కోసం క్షత్రియులతో తగాదా పెట్టుకొని వారి చేతిలో కావా లని మరణించాం. నువ్వు వారిపై కోపించావు. వారికే కాక అన్ని లోకాలకూ ఆపద తలపెట్టావు. ఇది నీకు తగదు. కోపం తగ్గించుకో' అన్నారు.

ఔర్వుడు పితృదేవతలకు నమస్కరించి, 'మీరు చెప్పేవరకు నాకు నిజం తెలియక, కోపంతో ముల్లోకాలనూ పాడుచేయాలని నిర్ణయించుకున్నాను. వచ్చిన కోపానికి దారి చూపకపోతే అది వచ్చిన వారినే దహిస్తుంది. సమర్థుడయిన వాడు హింస చేసేవారిని అడ్డుకొనకపోతే వాడికి కూడా హింస చేసిన పాపం వస్తుంది. నా కోపాన్ని ఏం చేయమంటారు? దానిని వదిలేస్తే నన్ను తగలబెడుతుంది. నాకు హితాన్ని ఉపదేశించండి' అన్నారు. అప్పుడు పితృదేవతలు 'నాయనా! అన్ని లోకాలూ నీటిలోనే ఉంటాయి. నీ మహోగ్రమైన కోపాగ్నిని సముద్రంలో విడిచిపెట్టు. నీ ప్రతిజ్ఞ నెరవేరినట్లవుతుంది. నీ కోపం సముద్రాన్ని దహిస్తుంది' అన్నారు. ఔర్వుడు వారు చెప్పినట్లు తన కోపాన్ని సముద్రంలో వదిలేశాడు. అది అశ్వముఖంతో ఇప్పటికీ బడబానలం పేరుతో సముద్రజలాలను తాగుతున్నా చల్లారటం లేదు. కాబట్టి ముందువెనుకలు ఆలోచించకుండా కోపం తెచ్చుకోకూడదు. వేదంలోని ఈ కథ మానవులకు కోపం పనికిరాదని చెబుతోందని వశిష్ఠుడు పరాశరునికి హితోపదేశం చేశాడు. అనాలోచితంగా కోపం తెచ్చుకోరాదని మహాభారత సందేశం.

34. కీర్తిని మిగిల్చిన వారే కీర్తిశేషులు

'కీర్తిశేషులు' అనగా 'మరణించినవారు' అని చిన్నపిల్లలు కూడా సరిగ్గానే చెప్పాం అనుకుంటారు. లోకంలో అంతగా ప్రసిద్ధమైన ఆ మాటకు అసలు అర్థాన్ని భీష్ముడు దుర్యోధనునికి చెప్పాడు. మరణించిన తరువాత కూడా వారసులు, బంధుమిత్రులు, ప్రజలు ఎవరిని తలుచుకుంటూ ఉంటారో వారే కీర్తిశేషులు. మనిషి పోగానే మరునాటికే జనం మరిచిపోయేవారిని కీర్తిశేషులు అనటం అర్థరహితం.

కీర్తి అంటే తలుచుకోవటం. అది రెండురకాలు. మంచిగా తలుచుకోవటం. చెడ్డగా చెప్పుకోవటం. ఒకరు సత్కీర్తిశేషులు. మరొకరు దుష్కీర్తిశేషులు. మంచికీర్తి కలవారు స్వర్గాది

పుణ్యలోకాలకు, చెడుకీర్తి కలవారు నరకాది పాపలోకాలకు వెళతారు. స్వర్గంలో పుణ్యం, నరకంలో పాపం అనుభవించటం పూర్తికాగానే అక్కడి నుంచి పంపేస్తారు. అయితే భూలోకంలో పుణ్యాత్ములను ఏ ఒక్కరు తలుచుకున్నా స్వర్గంలో వారి పుణ్యం పద్దు జమ అవుతూ ఉంటుంది. పాపాత్ములకు నరకంలో పాపం జమ అవుతుంది. వారు అక్కడ నివసించే కాలం పెరుగుతూ ఉంటుంది. కనుక శాశ్వతంగా చెప్పుకొనే మంచిపనులు చేస్తే, అటువంటివారికి శాశ్వత బ్రహ్మలోకం లభిస్తుంది. చెడ్డపనులు చేసి అపకీర్తి మూటగట్టుకొని జనంతో చీవాట్లు తినేవారు శాశ్వతంగా రౌరవాది నరకాలలో ఉంటారు.

"నాయనా! దుర్యోధనా! నాకు కౌరవులూ, పాండవులూ సమానమే. ఈ రాజ్యంపైన వాళ్లకు కూడా హక్కు ఉంది. వారికి అర్ధరాజ్యం ఇవ్వు. నీకు మంచిపేరు వస్తుంది. ఇవ్వకపోతే అపకీర్తి వస్తుంది. నరకానికి పోతావు. మానవుని పుణ్యకీర్తి ఈ లోకంలో ఎంతకాలం ఉంటే అంతకాలం స్వర్గంలో ఉంటాడు. మంచికీర్తి మరణానంతరం పుణ్యలోకాలను ఇచ్చినట్లే జీవించి ఉండగా ఆయురారోగ్యాలను ఇస్తుంది..." అని భీష్మపితామహుడు ఉద్యోగపర్వంలో దుర్యోధనునికి హితబోధ చేశాడు. మరణించినవారి పిల్లలు శ్రాద్ధాలు పెడుతూ తలుచుకుంటూ ఉంటారు గదా, అంటే వారు చేస్తారో? లేదో? ఎంతకాలం చేస్తారో? తరతరాలు వంశాభివృద్ధి అవుతుందో? కాదో?

సమాజానికి పనికివచ్చే మంచిపనులు చేసిన వారిని ఎవరో ఒకరు తలుచుకుంటూ ఆ లోటు తీరుస్తారు. గోదావరికి ఆనకట్ట కట్టిన కాటన్, తెలుగుభాషకు సేవచేసిన సి.పి. బ్రౌన్... మొదలైనవారు మనవారు కాకపోయినా ఇక్కడ మనం తలుచుకుంటున్నాం. తర్పణాలు వదుల్తున్నాం. నూతులు తవ్వించటం, సత్రాలు, గుడులు, బడులు కట్టించటం, రచనలు చేయించి అంకితం తీసుకోవటం వంటి సత్కార్యాలు చేయటం వలన చేసిన వారి పేరును తరతరాలూ తల్చుకుంటారు. కనుక సప్తసంతానాలలో వీటిని ధర్మశాస్త్రం చేర్చింది. మహాభారతంలో భీష్ముడు ఇచ్చిన వివరణ ప్రకారం నిజమైన కీర్తిశేషులు ఎవరో తెలుసుకుందాం. మంచిపనులు చేస్తూ మంచిపేరును కూడబెట్టుకుందాం. భీష్మణ్ని స్మరించుకుందాం.

35. అవసరమైతేనే దండోపాయం...

ఆకలి వేస్తున్న సింహం నోరు తెరుచుకొని కూర్చుంటే, కుందేలు వచ్చి నోట్లో దూరదు. వేటాడవలసిందే. 'వేలు వంచనిదే వెన్న అయినా దొరకదు' అని సామెత. ఎంత చిన్నపని అయినా సాధించే విధానం తెలియాలి. తెలియకపోతే అదే అసాధ్యంగా కనిపిస్తుంది. 'ధైర్యే సాహసే లక్ష్మీః' అంటారు. ధైర్యంలో, సాహసంలో సంపద ఉన్నమాట వాస్తవమే. అయినప్పటికీ సాహసం అన్నిచోట్లా పనికిరాదు. కొన్నిపనులు మెత్తదనంతో, వినయవిధేయతలతో, భక్తితో పూర్తవుతాయి.

కార్యసాధకుడు దేశకాలాలను బట్టి తగిన విధంగా ప్రవర్తించి విజయం సాధిస్తాడు. సామ, దాన, భేద, దండ ఉపాయాలు నాలిగింటిలో ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో తెలుసుకుని దానిని ఉపయోగించాలని మహాభారతంలో హనుమంతుడు భీమునికి సందేశం ఇచ్చాడు.

భీముడు సౌగంధిక పుష్పాన్ని తేవటానికి వెళ్లినప్పుడు హనుమంతుడు కలిశాడు. భీమునికి ఉన్న దుడుకు స్వభావం, దేవతల నుండి సౌగంధిక పుష్పాన్ని తేవటానికి పనికిరాదు. ఎందుకంటే దేవతలను భక్తితో ప్రార్థించి ప్రసన్నం చేసుకోవాలి. లేదంటే వారి ఆగ్రహానికి గురి కావలసిన వస్తుంది. అందుకే 'సాహసం అన్నివేళలా పనికిరాదు. తెలివైనవాడు నాలుగు ఉపాయాలను ప్రయోగిస్తాడు. పనిజరగటం ముఖ్యం' అని హనుమంతుడు... భీమునికి హితవు చెప్పాడు

కార్యసిద్ధి పొంది కాలంబు దేశంబు
నెఱిగి బుద్ధిమంతులెల్ల ప్రొద్దు
సాహసంబు విడిచి సామాద్యుపాయ ప్ర
యుక్తి చేయుదురు యథోచితముగ

మెత్తగా ఎదుటివారిని వశపరచుకోవడం సామోపాయం. ఏదైనా ఇస్తానని ఆశపెట్టి పనిచేయించుకోవడం దానోపాయం. ఎదుటివారిలో చీలికలు తెచ్చి బలహీనపరచి గెలుపు సాధించడం భేదోపాయం. సామ, దాన, భేదోపాయాలు పనికిరానప్పుడు చివరికి సాహసంతో దండోపాయాన్ని ప్రయోగించాలి. అంతేకాని ఏ పని అయినా కొట్లాటతోనే అవుతుంది, కండబలంతోనే గెలుపు లభిస్తుంది... అనుకోవటం బుద్ధిమంతుల లక్షణం కాదు. అటువంటివారు తమ బలంతో కొన్నిపనులు సాధించినా 'కార్యసాధకుడు' అనే శాశ్వతముద్రకు

అర్హులు కారు.

అన్నివేళలా అన్నిపనులూ ఏదో ఒక ఉపాయంతో సాధించేవాడే కార్యసాధకుడు. అటువంటివాడికి అన్నివేళలా విజయం తథ్యం. కనుక సమయానుకూలంగా ఉపాయంతో పనిని సానుకూలపరచుకోవాలి. ఈ విషయాన్ని ఇద్దరు మహాబలవంతుల మధ్య జరిగిన సన్నివేశం ద్వారా మహాభారతం మానవజాతికి తెలియచేసింది. ఈ సందేశం సదా స్మరణీయం. సర్వదా ఆచరణీయం.

36. సంవాదం అంటే చర్చించుకోవటం

ఇద్దరు వ్యక్తులు ఒక విషయం గురించి సంభాషించుకోవటం వలన, ఒకవేళ వారి మధ్య అభిప్రాయ భేదాలు ఉండి ఉంటే, అవి తొలగిపోయి, అవగాహన ఏర్పడుతుంది. 'సంవాదం' అంటే గొడవపడటం కాదు, చర్చించుకోవటం. మంచివారి మధ్య జరిగే సంవాదం మంచి ఫలితాలను ఇస్తుంది. చెడ్డవాళ్లు అహంకారాన్ని, ఆవేశాన్ని తగ్గించుకోలేక కొట్లాడుకుంటారు. అందువలన 'సంవాదం' అనే మాటకు లోకంలో కొంచెం చెడు అర్థం వచ్చింది.

మహాభారతంలో ఎన్నో సంవాదాలు ఉన్నాయి. వ్యక్తిత్వవికాసానికి, మానవసంబంధాలకు, కార్యదక్షతకు, వ్యవహార నైపుణ్యానికి, పరిపాలనా చాతుర్యానికి అవి ఎంతగానో ఉపయోగిస్తాయి. చిన్నచిన్న కథల ద్వారా అద్భుతమైన సందేశాన్ని అందిస్తాయి. అంపశయ్యపై ఉన్న భీష్మునితో, "తాతా! శత్రువు బలవంతుడైతే బలహీనుడు ఏ ఉపాయంతో ఆపద నుంచి తప్పించుకొంటాడు?'' అని ధర్మరాజు అడిగాడు. అప్పుడు భీష్ముడు 'సముద్రసరిత్సంవాదం' చెప్పాడు.

ఒకసారి సముద్రుడు నదులతో సమావేశమై ఒక ప్రశ్న అడిగాడు. "నదులారా! మీరు వరదలలో వేగంగా ప్రవహించేటప్పుడు, కొండలపై నుంచి దూకేటప్పుడు పెద్దపెద్ద చెట్లను పడగొట్టేస్తారు. కొండలను పిండి చేస్తారు. కట్టలు తెగగొట్టేస్తారు. ఊళ్లకు ఊళ్లు ముంచెత్తుతారు. కాని అల్పమైన తుంగమొక్కలు చెక్కుచెదరకుండా ఉంటున్నాయి. అవి మీకు ఏం లంచం ఇచ్చాయి? మీరు వాటిని ఎందుకు కదిలించలేకపోతున్నారు?'' అని అడిగాడు. అన్ని నదుల పక్షాన గంగానది సముద్రునితో, "స్వామీ! మేము వేగంగా ప్రవహించేటప్పుడు కొండలు, చెట్లు అహంకారంతో మాకు అడ్డంగా నిలుస్తాయి. అందువలన

మా ధాటిని, బలాన్ని చూపించి వాటిని పడగొట్టేస్తాం. ప్రబ్బలి, తుంగ వంటి మొక్కలు మా రాకకు స్వాగతం చెబుతున్నట్లు వినయంతో తల వంచుతాయి. కనుక మేం వాటి మీదుగా ప్రవహించి నీ దగ్గరకు చేరుకుంటాం. తర్వాత అవి తలలు ఎత్తి, మునుపటిలా బతుకుతాయి. వాటి మీద మాకు ప్రత్యేకంగా ప్రేమ ఏమీ లేదు" అన్నది.

అరి నృపాలు పెంపు ఆత్మీయశక్తియు
నెఱిగి మూర్ఖవృత్తి నెదురుపడక
యుచితవృత్తినతని యుద్ధతి మేవడి
గడపి హీనబలుడు పెడక నిలుచు (శాంతి 3 ఆ . 90 ప)

'ధర్మరాజా! శత్రువులోని బలాన్ని, తన స్వశక్తిని తెలుసుకొని మూర్ఖత్వంతో ఎదురుపడకుండా ఉండాలి. ఎదుటివారి పొగరు ఎల్లకాలం ఉండదని గ్రహించి తగిన విధంగా ప్రవర్తించాలి. అప్పుడు బలహీనుడు చెడకుండా నిలబడతాడు' అని ప్రకృతిలో సాధారణంగా జరిగేదానిలో నుంచి సందేశాన్ని సృష్టించి తేలికగా అర్థమయ్యేటట్లు భీష్ముడు లోకానికి అందించాడు.

37. విత్తం పోయినా వృత్తం పోకూడదు

పాండవులు అరణ్యవాస సమయంలో ఒక సంవత్సరం హిమాలయ ప్రాంతంలో ఉన్నారు. అప్పుడు భీముడు అక్కడ ఉన్న ఒక అరణ్యంలో తిరుగుతూండగా ఒక కొండచిలువ అతడిని చుట్టుకొంది. పదివేల ఏనుగుల బలంగలవాడైనా, యక్షులను, రాక్షసులను చంపినవాడైనా పాము పట్టు నుంచి మాత్రం విడిపించుకోలేకపోయాడు భీముడు. ఆ అజగరానికున్న బలాన్ని చూసి ఆశ్చర్యపోతూ, 'ఓ సర్పరాజా! నేను భీమసేనుణ్ని. మహాబలవంతుడిని. నన్ను బంధించే శక్తి నీకు ఎలా వచ్చింది? ఎవరైనా వరం ఇచ్చారా? నువ్వు ఎవడివి?' అని అడిగాడు. ఆ పాము జంతువు అయినా పూర్వజన్మ జ్ఞానంతో ఇలా పలికింది. 'భీమసేనా! ఇది అగస్త్యమహర్షి నాకు ఇచ్చిన వరం. ఎవరైనా సరే నా ఎదుట బలహీనులవుతారు. నేను కిందటి జన్మలో నహుష చక్రవర్తిని. ఇంద్రపదవిని పొందాను. అహంకారంతో ఋషులను పల్లకీ మోయమన్నాను. తొందరగా నడవటం లేదని కాలితో తన్నాను. అప్పుడు అగస్త్యుడు... సర్పం కమ్మని శపించాడు. పశ్చాత్తాపంతో ప్రార్థించగా..

'పూర్వజన్మజ్ఞానం ఉండేట్టు, నా ముందు ఎవరైనా బలహీనులయ్యేట్లు, నా ప్రశ్నలకు సరియైన సమాధానం ఇచ్చిన వారి ద్వారా నాకు శాపవిముక్తి కలిగేట్లు వరమిచ్చాడు. అప్పటి నుంచి ఈ అడవిలో ఉన్నాను. ఇప్పుడు నీ దురదృష్టం వలన నువ్వు నాకు ఆహారం అయ్యావు' అంటూండగా ధర్మరాజు భీముడిని వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు. అజగరం అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పి భీముడిని విడిపించాడు.

విత్తహీనుండు వెండియు వివిధ విధుల
విత్తవంతుండుగా నేర్చు వృత్తహీను
డైనవాడు విహీనుండ యండ్రుగాన
విత్తరక్షకు కడు మేలు వృత్తరక్ష (అరణ్య, ఆ 4, ప. 30)

'ధనం, వంశం ముఖ్యమా? శీలం ముఖ్యమా?' అంటే, 'విత్తం పోతే మళ్లీ సంపాదించుకోవచ్చు, వృత్త (శీలం) హీనుడు ఎప్పటికీ హీనుడుగానే ఉంటాడు. విత్త రక్ష కంటె వృత్త రక్ష ముఖ్యం' అన్నాడు ధర్మరాజు. 'చెడు పనులు చేస్తూ, అబద్ధాలాడుతూ, హింస చెయ్యనివాడు ఉత్తమలోకాలు పొందుతాడా?' అంటే, 'దానం, మంచిపనులు, సత్యం, అహింస నాలుగూ సమానమే అయినా, వాటిలో అహింస విశేషమైనది. కనుక మొదటివి మూడూ లేకపోయినా అహింస ఒక్కటి ఆచరించినవాడు స్వర్గాన్ని పొందుతాడు' అన్నాడు ధర్మరాజు. ఈ సమాధానాలకు అజగరం సంతోషించి భీముడిని వదిలేసి, శాపవిముక్తుడయ్యాడు. ధర్మరాజు చెప్పిన సమాధానాలు రెండూ శాశ్వత సందేశాలు. విత్తం పోయినా వృత్తం పోకూడదు. దేన్ని విడిచిపెట్టినా అహింసను విడిచిపెట్టకూడదు. 'అజగర ధర్మరాజ సంవాదం'లోని సందేశం సర్వదా ఆచరణీయం.

38. అవకాశవాదులున్నారు జాగ్రత్త

అవకాశాన్ని బట్టి తమకు అనుకూలంగా వాదించి ఎదుటివారిని మోసగించే వారు ఎల్లవేళలా ఉంటారు. తమ స్వార్థం కోసం నమ్మకం కలిగే విధంగా తియ్యటి కబుర్లు చెబుతారు. మోసగించి నిలువునా ముంచేస్తారు. కానీ వారు చెప్పే మాటలు, వినేవారికి రవ్వంత అనుమానాన్ని కూడా కలిగించవు. వాక్చాతుర్యంతో తిమ్మిని బమ్మి చేసే వారితో జాగ్రత్తగా ఉండాలని భీష్ముడు, ధర్మరాజుకు 'గృధ్రగోమాయు సంవాదం' (గృధ్రం అంటే గ్రద్ద,

గోమాయువు అంటే నక్క) ఉదాహరణగా స్పష్టంగా అర్థం అయ్యేలా చెప్పాడు.

విదిశా పట్టణంలో ఒక బాలుడు మరణించాడు. బంధువులు శవాన్ని స్మశానానికి తీసుకువెళ్లారు. గొల్లున ఏడుస్తున్నవారిని ఒక గ్రద్ద చూసి, వారి దగ్గరకు చేరి, 'అయ్యలారా! జనన మరణాలు ప్రకృతిసిద్ధం. కొద్దిసేపట్లో చీకటి పడుతుంది. మీరందరూ ఇలాగే ఏడుస్తూ కూర్చుంటే రాక్షసులు, భూతాలు, పిశాచాలు ఇక్కడకు వచ్చి మిమ్మల్ని తినేస్తాయి. ఎంత ఏడ్చినా పోయినవాళ్లు తిరిగిరారు. శవాన్ని ఇక్కడ పారేసి త్వరగా ఇక్కడి నుంచి వెళ్లిపొండి' అని మెత్తగా చెప్పింది. విన్నవారందరూ వెళ్లిపోదామని బయలుదేరారు. ఇదంతా చాటు నుంచి గమనిస్తున్న నక్క ఒకటి, బయటకు వచ్చి, వెళ్లిపోతున్నవారిని ఆపి, 'పెద్దలారా! గ్రద్ద చెప్పిన పిచ్చిమాటలు విని వెళ్లిపోకండి. తామరపువ్వులాంటి ముఖం కల ఈ పిల్లవాడి శవాన్ని వదిలిపోవడానికి మీకు మనసు ఎలా ఒప్పింది? ఈ దేహం మళ్లీ మీకు కనబడదు. కళ్లారా చూస్తూ పొద్దుగ్రుంకేవరకు ఇక్కడే ఉండండి. అదృష్టవశాత్తు ఈ బాలుని ప్రాణాలు తిరిగిరావచ్చు' అని నక్క చెప్పిన మాటలు అక్కడ ఉన్నవారికి నచ్చాయి. పిల్లవాడు బతుకుతాడేమోనని ఆశ కలిగి ఆగిపోయారు. మళ్లీ గ్రద్ద వచ్చి, 'చచ్చినవాళ్లు బ్రతకటం ఎక్కడైనా ఉన్నదా? పిచ్చినక్క చెప్పినమాటలు విని మోసపోకండి. త్వరగా వెళ్లిపొండి' అంది. 'క్రూరమైన గ్రద్ద మాటలు నమ్మకండి. దైవబలంతో ఇతడు బ్రతకవచ్చు. అలా బ్రతికినవారు ఉన్నారు, ఆగండి' అంది నక్క. 'శవాలు ఎక్కడైనా బ్రతుకుతాయా' అని గ్రద్ద నవ్వింది.

గ్రద్ద, నక్క ఇలా మాట్లాడటానికి కారణం స్వార్థం, అవకాశవాదం. వెలుతురు ఉండగా వారు శవాన్ని వదిలివెడితే కడుపునిండా తినవచ్చునని గ్రద్ద ఆలోచన, గ్రద్దకు చీకట్లో కళ్ళు కనపడవు కనుక చీకటిపడేవరకూ బంధువుల్ని ఉంచి శవాన్ని దానికి దొరకకుండా చేస్తే తరువాత తాను తినవచ్చునని నక్క ఆశ. అవకాశవాదులు స్వార్థంతో చెప్పే మాటలు ఎంత నమ్మకంగా ఉంటాయో మహాభారతంలోని ఈ సంవాదం మనకు తెలియచేస్తోంది. ఈ కథకు కొసమెరుపు ఉంది. అది తెలుసుకోదలచినవారు శాంతిపర్వం మూడవ ఆశ్వాసం చదవండి. (బంధువుల ఏడుపులకు పరమేశ్వరుడు ప్రత్యక్షమై పిల్లవాణ్ని బ్రతికించి, స్వార్థపరులైన గ్రద్ద, నక్క ఇద్దరికీ తిక్క కుదిర్చాడు).

39. శత్రువుతో స్నేహం ఇలా ఉండాలి

ఆపదలో, శత్రువు సహాయంతో తప్పించుకోవలసి వస్తే, ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో స్నేహం చేసి అయినా గెలుపు సాధించాలి. అయితే ఆపద తీరిన తరువాత ఆ స్నేహాన్ని కొనసాగించవచ్చునా? అనే ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు ధర్మరాజుకు 'మూషికమార్జాల సంవాద' కథను చెప్పాడు.

ఒక అడవిలో మఱ్ఱిచెట్టు కింద బొరియలో 'పలితుడు' అనే ఎలుక, చెట్టు కొమ్మమైన 'రోమశుడు' అనే పిల్లి నివసించేవి. వేటగాడు జంతువులను పట్టుకోవడానికి రాత్రివేళ పన్నిన వలలో పిల్లి చిక్కుకుంది. ఎలుక నిర్భయంగా ఆహారం కోసం తిరుగుతూండగా, 'చంద్రకుడు' అనే గుడ్లగూబ, 'హలికుడు' అనే ముంగిస ఎలుకను వెంబడించాయి. వాటి నుంచి తప్పించుకోవడానికి ఎలుక ఒక ఉపాయం ఆలోచించి, పిల్లి దగ్గరకు వెళ్లి, 'వల కొరికి నిన్ను కాపాడతాను. ఆ గుడ్లగూబ, ముంగిస నా వెంట పడుతున్నాయి. వాటికి నువ్వంటే భయం. కనుక నన్ను నీ ఒడిలో ఉండనీ. నిన్ను చూసి అవి పారిపోతాయి. తరువాత నీవల తాళ్లు కొరుకుతాను' అంది. పిల్లి 'నువ్వు నన్ను కాపాడతానంటున్నావు కనుక నిన్ను నేను కాపాడతాను. దగ్గరకు రా' అంది. ఎలుక పిల్లి దగ్గర కూర్చోగానే గుడ్లగూబ, ముంగిస పారిపోయాయి. అప్పుడు పిల్లి ఎలుకతో 'వలతాళ్లు కొరుకు' అంది. ఎలుక మాట్లాడలేదు. పిల్లి 'చేసిన మేలు మరచిన కృతఘ్నుడివి' అని తిట్టింది. ఎలుక 'నేను అలాంటివాణ్ని కాదు. వలలో నుంచి బయటకు రాగానే నువ్వు నన్ను కొట్టి తినొచ్చు. బలవంతుడైన శత్రువుతో సంధి చేసుకొన్నా పూర్తిగా నమ్మకూడదు. వేటగాడు దగ్గరకు వస్తూండగా వల కొరుకుతాను. వాడికి భయపడి నువ్వు చెట్టెక్కుతావు. నేను కలుగులో దూరిపోతాను' అంది. ఈలోగా తెల్లారింది. పరిఘుడు అనే వేటగాడు వస్తూండగా ఎలుక వలతాళ్లు కొరికి పిల్లిని కాపాడింది. వల పాడైపోయినందుకు బాధపడుతూ వేటగాడు వెళ్లిపోయాడు. అప్పుడు పిల్లి ఎలుకను పిలిచి, 'మిత్రమా! మనిద్దరం ఒకరికొకరు మేలు చేసుకున్నాం. ఈ రోజు నుంచి మనం కలిసిమెలిసి ఉందాం. కబుర్లు చెప్పుకొందాం' అంది. ఎలుక, 'నీ కోరిక బాగానే ఉంది. కాని మనం శత్రువులం. శత్రుత్వం ఎప్పుడైనా బయటపడవచ్చు. దూరంగా ఉండి పలకరించుకోవటమే మంచిది. ఎప్పుడూ పిల్లికి ఎలుక ఆహారమే' అంది.

బలవంతుడైన శత్రువుతో ప్రయోజనం కోసం స్నేహం చేసినా, అది నెరవేరగానే దూరంగా ఉండాలి. పూర్తిగా నమ్మి దగ్గరకు చేరకూడదు... అని కలుగులో దూరింది. 'ధర్మరాజా!

మూషికమార్జాల సంవాదం ద్వారా... శత్రువుతో స్నేహం ఎలా ఉండాలో మానవులు తెలుసుకోవాలి' అని భీష్ముడు హితోపదేశం చేశాడు.

40. లక్ష్మీనివాసం ఎక్కడ..!

భీష్మపితామహుని సందేశాలు, ఉపదేశాలు వింటున్న ధర్మరాజు తనకు ఏదైనా సందేహం కలిగిన వెంటనే బిడియపడకుండా అడుగుతున్నాడు. తాతగారు విసుగు లేకుండా వెంటనే ఒక ఇతివృత్తం చెప్పి సందేహాలకు సమాధానం ఇస్తున్నాడు. తరాల మధ్య సంస్కృతి ఆగకుండా సాగటానికి ఇదే సరియైన మార్గం.

"తాతా! లక్ష్మీదేవి ఎటువంటివారి దగ్గర నివసిస్తుంది?'' అని ధర్మరాజు అడిగాడు. "నాయనా! ఇదే ప్రశ్న 'లక్ష్మీరుక్మిణీ సంవాదం'లో రుక్మిణి లక్ష్మిని అడిగింది'' అంటూ సంవాదాన్ని భీష్ముడు వివరించాడు.

ఒకసారి శ్రీమన్నారాయణుని ఒడిలో కూర్చున్న లక్ష్మీదేవిని చూసి రుక్మిణి ఆశ్చర్యపడింది. 'అమ్మా! నువ్వు ఎటువంటి స్త్రీ పురుషులలో కొలువై ఉంటావు?' అని అడిగింది. దానికి ఆమె ఇలా చెప్పింది, 'నిత్యమూ సత్యం పలికేవారు, శుచిశుభ్రతలు పాటించేవారు, తల్లిదండ్రులు, పెద్దలు, గురువులయందు భక్తికలవారు, చురుకైనవారు, కార్యసాధకులు, స్వచ్ఛమైన బుద్ధికలవారు, మంచి పనులుచేసేవారు, విజ్ఞానవంతులు, తపస్సూదానమూ చేసేవారు, బ్రహ్మచర్యాన్నీ, మనోనిగ్రహాన్నీ పాటించేవారిలో నేను కొలువైఉంటాను. క్రూరులు, కృతఘ్నులు, దుష్టబుద్ధులు, ఎంగిలి పదార్థాలలో నేను ఉండను. పాత్రలను, ఇంటిని చక్కగా శుద్ధిచేసుకొనే స్త్రీలలో నేనుంటాను. భర్తకు ప్రతికూలంగా ఉండేవారు, దయలేనివారు, ఇరుగుపొరుగు ఇండ్లలో కాలం గడిపేవారు, అతిగా నిద్రపోయే స్త్రీలలో నేను ఉండను. తామరపూలతో నిండిన చెరువులో, పూలుపండ్లతో పచ్చగా ఉన్న తీగెలు, చెట్లలో నేను ఉంటాను!' అని చెప్పింది.

ఈ సంభాషణలోని అంతరార్థాన్ని తెలుసుకోమని భీష్ముడు ధర్మరాజుకు సూచించాడు. లక్ష్మి అంటే... రంగు కాగితాలు, వెండి బంగారాలు మాత్రమే కాదు. ఆరోగ్యవంతమైన మనస్సు, వాక్కు, దేహాలలో వెలుగొందే ఒక జీవకళ. లక్ష్మీదేవి తన నివాసాలుగా చెప్పినవన్నీ వ్యక్తిత్వ వికాసానికి, సంస్కారవంతమైన జీవనానికి ప్రతీకలు. ఈ లక్షణాలు ఉన్నవారు

ఆర్థికంగా ధనవంతులు కాకపోవచ్చు. సామాన్య కుటుంబీకులైనా సంతృప్తితో, నిష్కల్మషంగా, కల్లాకపటం లేకుండా జీవిస్తూ ఉంటారు. అదే లక్ష్మీనివాసం. మానవజీవితంలో ముఖ్యమైన అంశాలన్నీ ఆమె చెప్పిన వాటిల్లో ఉన్నాయి. దాంపత్య ధర్మంలో, స్త్రీపురుషుల క్రమశిక్షణలో, కార్యదక్షతలో లక్ష్మి ఉంది. బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు ధరించకపోయినా లక్ష్మికి నివాసమైనవారు ఆకర్షణీయంగానే ఉంటారు. లక్ష్మి తాను ఉండని తావులు కూడా చెప్పింది కనుక మనం ఆ దారిన పోకూడదు. క్రూరత్వాన్ని, కృతఘ్నతను, దుష్టబుద్ధిని తొలగించుకోవాలి. ఆహారనియమాలు పాటించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి. వృక్షసంపదను పెంపొందించాలి. లక్ష్మికి స్థిరనివాసాన్ని కల్పించాలి.

41. బలహీనులను బాగాచూసుకోవాలి

వ్యాసుడు ధృతరాష్ట్రునికి, "తమ్ముని కుమారులైన పాండవులు తండ్రి లేనివారు. పెదతండ్రిగా వారిని శ్రద్ధతో చూడవలసిన బాధ్యత నీపై ఉంది. నీ కొడుకుల కంటె వారిని మరింత ప్రేమతో చూసుకోవాలి" అని హితోపదేశం చేశాడు. తాను చెప్పేది అతనికి స్పష్టంగా తెలియటానికి 'ఇంద్ర సురభి సంవాదం' వివరించాడు. ఇంద్రుడు దేవతలరాజు. సురభి కామధేనువు పేరు.

సకలగోమాత అయిన సురభి ఒకసారి ఇంద్రుని వద్దకు వెళ్లి జాలికలిగేటట్లు ఏడ్చింది. ఇంద్రుడు ఆశ్చర్యంతో 'సురభీ! ఇంతగా ఏడుస్తున్నావు. నీ వారందరూ క్షేమమే కదా!' అని అడిగాడు. 'దేవేంద్రా! నీ వజ్రాయుధ రక్షణలో నావారు తప్ప, ముల్లోకాలలో మిగిలినవారందరూ క్షేమంగా ఉన్నారు. నాగళ్లు, బళ్లు కట్టేటప్పుడు ఒక పక్క బలమైన ఎద్దును, మరొకపక్క బలహీనమైన దానిని కడుతున్నారు. కర్రలతో, చెండ్రాకోళ్లతో కొట్టి హింసిస్తున్నారు. దుర్బలులైన నా బిడ్డలను జనులు బాధిస్తుంటే చూడలేకుండా ఉన్నాను. నా దుఃఖానికి కారణం ఇదే' అని సురభి బదులిచ్చింది. 'సురభీ! నీకు కొన్నివేలమంది పిల్లలున్నారు. వారిలో అందరూ దుఃఖపడటం లేదు. కొందరికోసం ఏడవటం ఎందుకు?' అని ఇంద్రుడు ఓదార్చబోయాడు.

'దేవా! కన్నబిడ్డలు అందరూ క్షేమంగా ఉండాలి. ఏడుస్తున్న పిల్లల ముఖాలు నేను ఎలా చూడగలను?'అని సురభి ఇంద్రుణ్ని నిలదీసింది. సురభి మాతృప్రేమను ఇంద్రుడు మనసులో

మెచ్చుకున్నాడు. చిరునవ్వుతో దానిని కరుణించాడు. మేఘాలకు అధిపతి కనుక వర్షాలు కురిపించాడు. గడ్డి బాగా మొలిచింది. బలహీనంగా ఉన్న ఎద్దులు కడుపునిండా గడ్డి మేసి బలంగా తయారై సంతోషంగా ఉన్నాయి.

నీ సుతులు నూర్వురును పాండు నృప తనూజు
లేవురును నొక్క రూపకానెఱుగవలయు (అరణ్య - ఆ - 1 ప.87)

"ధృతరాష్ట్రా! ఈ ఇంద్రసురభి సంవాదం వేదంలో ఉంది. నీకూ పిల్లల ఉన్నారు. వారు సంతోషంగా ఉండాలని ఎలా అనిపిస్తుందో, దీనులై అడవులపాలైన పాండవులు కూడా అలాగే సంతోషంగా ఉండాలని నీకు అనిపించాలి. పశువు అయిన సురభి చెప్పినట్లు పిల్లలందరూ సుఖంగా ఉంటేనే తల్లిదండ్రులయినా దుఃఖించకుండా ఉంటారు. బుద్ధిజీవులైన మానవులు మరింత జాగరూకతతో తమ వారందరి క్షేమాన్నీ కాంక్షించాలి. కొందరు బాగుంటే చాలుననే సంకుచిత భావాన్ని విడనాడాలి" అని వ్యాసుడు చేసిన బోధ మానవజాతికి మహోపదేశం.

42. మరింత జాగ్రత్తగా ఉండాలి!

'తాతా! ఎవ్వరినీ నమ్మకుండా ఒంటరిగా ఉంటే కష్టసుఖాలు చెప్పుకునేందుకు ఎవరూ ఉండరు. మనసుకు విశ్రాంతి లభించదు. అలాగని నమ్మితే మోసాలు జరుగుతాయి. కాబట్టి విశ్వసించటం, విశ్వసించకపోవటం ఈ రెండింటిలో ఏది మంచిదో నాకు తెలియటం లేదు' అని ధర్మరాజు భీష్ముణ్ణి అడిగాడు.

నాయనా! నీ సందేహం తీరటానికి 'బ్రహ్మదత్త పూజని సంవాదం' చెబుతాను. శ్రద్ధగా విను. 'బ్రహ్మదత్తుడు' అనే రాజు 'పూజని' అనే గోరువంకను పెంచుతున్నాడు. అది చక్కగా మాట్లాడుతుంది. దానికి ఒక పిల్ల ఉంది. పూజని ఎగిరి బయటకు వెళ్లి పళ్లు, కాయలు తెచ్చి పిల్లకు పెడుతోంది. బ్రహ్మదత్తుని కొడుకు ఆ పిల్లతో ఆడుతూ ఉంటాడు. గోరువంక పిల్ల తన తల్లి తెచ్చిన పళ్లలో మంచివాటిని రాజకుమారుడికి ఇస్తూంటుంది. ఒకనాడు ఒంటరిగా వచ్చిన యువరాజు, గోరువంక పిల్ల గొంతు పిసికి చంపేశాడు. పూజని వచ్చి చూసి ఏడ్చింది. రాజవంశాన్ని నిందించింది. 'రాజులు క్రూరులు. వారిని నమ్మరాదు. తన బిడ్డను చంపిన వారి మీద పగ తీర్చుకోవాలి' అనుకుంది. కోపంతో రాజుకొడుకు కళ్లను గోళ్లతో పీకి ఆకాశానికి ఎగిరి, 'బ్రహ్మదత్తా! నీ కొడుకు నా బిడ్డను చంపాడు. నేను వాడి కళ్లు పీకేశాను' అంది.

'పూజనీ! నీ తప్పు ఏమీ లేదు. జరిగిందేదో జరిగింది. నువ్వు వెళ్లిపోవద్దు. ఇక్కడే ఉండు' అన్నాడు రాజు. పూజని 'రాజా! స్నేహం చేసిన తరువాత తియ్యగా మాట్లాడినా, పగ చల్లారదు. నేలను ఆక్రమించినా, దాయాదులైనా, మాటకు మాట పెరిగినా, ఆడువారి వలనైనా, కీడు చేసినా ఈ అయిదు కారణాలలో ఏదో ఒక దానివలన పగ ఏర్పడుతుంది.

తల్లిదండ్రులను, అన్నదమ్ములను, కన్నబిడ్డలను, ప్రాణస్నేహితులను కూడా పూర్తిగా నమ్మరాదు. పగ గలవారిని ఎలా నమ్ముతాం. నేను వెళుతున్నాను' అంది. 'పూజనీ! కాలం, కర్మను బట్టి కీడుమేలు జరుగుతూంటాయి. ఎవరినీ ఎవరూ చంపలేరు, బతికించలేరు. నువ్వు ఇక్కడే ఉండు' అన్నాడు రాజు. గోరువంక 'రాజా! సముద్రం నిండా నీళ్లున్నా లోపలి బడబాగ్ని ఎప్పటికీ చల్లారదు. విశ్వాసం నీటి వంటిది. అవిశ్వాసం బడబాగ్ని వంటిది. అది ఎప్పుడయినా ఉబికి ఉప్పెన కావచ్చు. కనుక ఎవరికివారు ఎదుటివారితో తగు జాగ్రత్తతో వ్యవహరించాలి. పూర్తిగా విశ్వాసం, అవిశ్వాసం రెండూ పనికిరావు. నీ కొడుకు నా బిడ్డతో కలిసిమెలిసి ఆడుకొనే పసివాడే అయినా దానిని చంపిన కోపంతో నేను వాడి కళ్లు పీకాను. అప్పటివరకు మన మధ్య విశ్వాసం ఉంది. ఇప్పుడు లేదు. తనను, తన సంపదను కాపాడుకోవాలంటే ఎవరినీ ఎవరూ పూర్తిగా నమ్మరాదు అని బృహస్పతి చెప్పాడు' అని ఎగిరిపోయింది. 'ఈ బ్రహ్మదత్తపూజని సంవాదం' మానవ, మానవేతరుల మధ్య జరిగింది. మానవులు మరింత జాగ్రత్తగా ఉండాలని మహాభారతం చెబుతోంది.

43. నంగిచేష్టలు - ముంగిమాటలు

కురుక్షేత్ర యుద్ధం ముగిసింది. ధర్మరాజు చక్రవర్తి అయ్యాడు. వైభవోపేతంగా అశ్వమేధయాగాన్ని చేశాడు. యాగం చేయించిన వారిని, యాగానికి వచ్చిన వారిని ఘనంగా ధన కనక వస్తు వాహనాలతో సత్కరించాడు. ఋత్విక్కులు ధర్మరాజును గొప్పగా పొగిడారు. అప్పటిదాకా ఇదంతా మౌనంగా గమనిస్తున్న ఒక ముంగిస వారి మధ్యకు వచ్చింది. సక్తుప్రస్థుడు అనే పేద గృహస్థు ఆచరించిన ధర్మం ముందు ఈ అశ్వమేధయాగం ఎందుకూ పనికిరాదు... అని మానవభాషలో అరిచింది. ఋత్విక్కులు ఆశ్చర్యంతో సక్తుప్రస్థుడి గురించి చెప్పమని ఆ ముంగిసను అడిగారు. ఇది విప్రనకుల సంవాదం. (విప్రులంటే బ్రాహ్మణులు. నకులం అంటే ముంగిస.) వారితో ముంగిస ఇలా చెప్పింది.

కురుక్షేత్ర ప్రాంతంలో ఒకసారి తీవ్రమైన కరువు వచ్చింది. ఒక గృహస్థు, భార్య, కొడుకు, కోడలు నలుగురూ తినటానికి ఆహారాన్ని సంపాదించలేకపోతున్నారు. వారు ఒకనాడు పొద్దున్న బయటకు వెళ్లి మధ్యాహ్నానికి కుంచెడు పేలపిండి సంపాదించగలిగారు. యజమాని దానిని నాలుగు సమానభాగాలు చేసి పంచిపెట్టాడు. ఆకలితో నకనకలాడుతున్న వారు తమ వంతుకు వచ్చిన పేలపిండి తినబోతూండగా అతిథి వచ్చాడు. కాళ్లు కడిగి, కుటుంబ సభ్యులంద రూ అతిథి మర్యాదలు చేశారు. "నాకు ఆకలిగా ఉంది. ఏదైనా పెట్టండి" అని అతిథి అడగ్గానే యజమాని భార్య, "నావంతు పిండిని అతిథికి ఇవ్వండి" అంది. "నువ్వు ఆకలితో మాడుతున్నావు. నేను నీకుపెట్టాలిగానీ నీ సొమ్ము దానం చేయటం ఏమిటి?" అన్నాడు భర్త. "భర్త చేసే మంచిపనిలో పాలుపంచుకోవటం భార్యధర్మం. మీరు తినకుండా నేనెలా తింటాను?" అంది భార్య. భార్యవంతు పిండిని అతిథికి పెట్టారు. అతిథికి ఆకలి తీరలేదు. కొడుకు, "నా వంతు పేలపిండిని అతిథికి పెట్టండి. తల్లిదండ్రులు తినకుండా నేనెలా తింటాను?" అన్నాడు. కొడుకు వంతుపిండిని పెట్టినా అతిథి ఆకలి తీరలేదు. కోడలు, తనవంతు కూడా అతిథికి ఈయమంది. కోడలు వంతు కూడా తిని అతిథి తృప్తి చెంది, యమధర్మరాజుగా ప్రత్యక్షమయ్యాడు. కుటుంబ సభ్యులందరినీ మెచ్చుకున్నాడు.

"మీ నలుగురినీ చూడటానికి స్వర్గలోకంలో, బ్రహ్మలోకంలో అందరూ ఎదురు చూస్తున్నారు" అన్నాడు.

"హింసతో ధనం సంపాదించి, ఆ ధనంతో యజ్ఞయాగాలలో దానధర్మాలు చేస్తే అవి తప్పును కప్పిపుచ్చుకునే నంగిచేష్టలు. నిజమైన దానం స్వల్పమైనా అదే గొప్పది" అని ముంగిస పలికింది.

44. బాధ్యతల నుండి తప్పించుకోరాదు

కురుక్షేత్రయుద్ధంలో పాండవులు గెలిచారు. హింసతో బంధుమిత్రులను చంపినందుకు ధర్మరాజు విషాదంతో ఉన్నాడు. ద్రౌపది, భీమ అర్జున నకుల సహదేవులు ఎంత ఓదార్చినా వినిపించుకోవటం లేదు. "హింస, దండన ఉన్న రాజ్యాధికారం నాకు వద్దు. దానివలన నరకం వస్తుంది. రాజభోగాలు అశాశ్వతం. జనకమహారాజు మిథిలానగరం తగలబడినప్పు డు కూడా దుఃఖం లేకుండా ఉండగలిగాడు. నేనూ అలాగే ఉంటాను" అన్నాడు. అప్పుడు

అర్జునుడు, "ధర్మరాజా! జనకమహారాజు అతని భార్యకు జరిగిన పత్నీజనక సంవాదంలో ఆమె చేసిన హితబోధ విను" అన్నాడు.

జనకమహారాజు రాజ్యాన్ని విడిచిపెట్టి భిక్షాటనం చేస్తూ బంధాలు, బాధ్యతలు లేకుండా జీవించటానికి బయలుదేరాడు. అప్పుడు అతని భార్య, "నాథా! స్వధర్మమైన పరిపాలన విడిచిపెట్టి భిక్షాటనతో జీవిస్తే, ఇప్పటిదాకా నీవు ఆదరించిన అతిథులు, విద్యార్థులు, సాధువులు, పేదసాదలు, రోగులు, వికలాంగులు వంటివారి గతి ఏమవుతుంది. వారిని పోషించవలసిన బాధ్యత, సమర్థత ఉన్న నువ్వు కూడా వారిలో ఒకడివైపోతావా? దానివలన నీకు శాంతి లభిస్తుందా? పైన ఉండవలసిన చెయ్యి కిందికి కాకూడదు. నీ బాధ్యత నీవు నిర్వర్తిస్తే నీ వల్ల ఎంతోమంది బతుకుతారు. వృద్ధురాలైన నీ తల్లిని వదిలి ఆమెను ఏడిపించి వెళ్లటం వేదాంతం కాదు. ప్రజల కష్టసుఖాలను కనిపెట్టి పరిపాలించడం నీ ధర్మం.

పాలకులు చల్లని పందిరిలాగ, పండ్లతో నిండిన చెట్టులాగ ప్రజలకు అవసరాలు తీర్చాలి. ప్రజల క్షేమం కోసం పాటుపడే రాజుకు అదే తపస్సు అవుతుంది. రాజ ఋషి అవుతాడు. దానివల్లనే మోక్షం లభిస్తుంది. తన ధర్మం తాను నిర్వర్తించకుండా తప్పించుకొని వేరే దానిని ఎంత గొప్పగా ఆచరించినా అది అధర్మమే అవుతుంది. ఎవరు చేయవలసిన పనిని వారు అంకితభావంతో, శ్రద్ధతో చేయటమే తపస్సు. దానితోనే మనశ్శాంతి లభిస్తుంది. వేదాంతాన్ని అడ్డం పెట్టుకొని పని నుండి పారిపోవడం పలాయనవాదం అవుతుంది. మెట్టవేదాంతం సరికాదు. మెట్టపొలం ఉన్న రైతు... వానలు కురిసిన ఏడూ, కురవని ఏడూ, మానకుండా వ్యవసాయం చేస్తూనే ఉండాలి. పొలం దున్నుతూనే ఉండాలి. లేకపోతే అది బీడువారిపోతుంది. సమాజానికి అందవలసిన పంట అందకుండా పోతుంది.

పిరికితనం, హృదయ దౌర్బల్యం మానసిక అనారోగ్య లక్షణాలు. నిరాశ నిస్పృహలు, దుఃఖంతో ఏర్పడే దంతవేదాంతం, శ్మశాన వైరాగ్యం వంటివి అపరిపక్వఫలాలు. చెట్ల పిందెలు కొన్ని ఎండకు రంగుమారి పండినట్లు కనిపిస్తాయి. కాని అవి పండ్లు కావు. స్వధర్మాచరణ వల్ల కలిగిన బాధ్యతను గుర్తు చేస్తూ ఉంటుంది. జనకమహారాజా! నీ నిర్ణయం సరైనది కాదు. ఇది ధర్మవిరోధంబు దీని మోక్షంబు గలుగుననుట నాకుంజూడ సందియంబు..." అని భార్య చెప్పిన మాట విని జనకుడు బాధ్యతల నుండి తప్పించుకోవాలనుకున్న తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. అర్జునుడు చెప్పిన పత్నీజనక సంవాదం విన్న ధర్మరాజు కూడా తన మనసు మార్చుకున్నాడు. మహాభారత సందేశం మనకందరికీ ఆదర్శం.

45. ధైర్యమే అసలైన మందు

"తాతా! కాలం కలిసిరాక కష్టాలలో ఉన్న మానవుడు, ఆ సమయంలో ఎలా ప్రవర్తిస్తే బాగుంటుంది? ఎలా అతనికి మేలు కలుగుతుంది?'' అని ధర్మరాజు భీష్ముణ్ని అడిగాడు. "నాయనా! ఎటువంటి దుర్దశకైనా ధైర్యమే మందు. ధైర్యంతోనే చేవ కలుగుతుంది. దానివలన సరియైన నిర్ణయాలు తీసుకొని కష్టాల నుండి గట్టెక్కవచ్చు. ధైర్యం ఆరోగ్యాన్ని ఇస్తుంది. ఎంతటి కష్టకాలంలోనైనా ధైర్యం వలన క్షేమంగా ఉండవచ్చు. ఈ సత్యాన్ని 'ఇంద్రబలి సంవాదం'లో ఇంద్రునికి బలి చెప్పిన విషయాలు నీకు చెబుతాను. విను' అని భీష్ముడు ఇలా చెప్పాడు.

ఒకసారి దేవదానవులకు జరిగిన యుద్ధంలో దేవతలు గెలిచారు. దేవతాగణాలు జయజయధ్వానాలు పలుకుతూండగా ఇంద్రుడు ఐరావతంపై కూర్చొని మూడులోకాలలో విజయయాత్రకు బయలుదేరాడు. ఓటమిపాలైన రాక్షసరాజు బలిచక్రవర్తి సముద్రం ఒడ్డున ఒక కొండ గుహలో ఉన్నాడని తెలిసిన ఇంద్రుడు అతనిని ఉడికించటానికి అటువైపు వెళ్లాడు. ఇంద్రుణ్ని చూచిన బలి కంగారుగా లేచి నిలబడలేదు. మామూలుగా ఉన్న బలిని చూచి ఇంద్రుడు 'రాక్షసరాజా! రాజ్యాన్ని కోల్పోయావు. శత్రువుల వైభవాన్ని కళ్లారా చూస్తున్నావు. అయినా నీకు దుఃఖం కలగటం లేదు. ఇది ఎలా సాధ్యం?' అన్నాడు. 'ఇంద్రా! నువ్వు నాతో ఎగతాళిగా మాట్లాడినా నాకు బాధ లేదు. నేను గెలిచినప్పుడు నువ్వు ఇలాగే హీనస్థితిలో ఉన్నావు. గెలుపుఓటములకు కాలమే కారణం గాని మనం కాదు. గెలుపు వలన వచ్చే గర్వాన్నీ, ఓటమి వలన వచ్చే విషాదాన్నీ ధీరత్వమే అణిచిపెడుతుంది. నాకు ఇది విక్రమకాలం కాదు. కనుక అలుక లేదు. కాలం కలిసి వచ్చినప్పుడు నిన్ను, నీ వారిని ఎడమచేతితో కొట్టాను. నీకూ ఇప్పటి సిరిసంపదలు శాశ్వతం కాదు. నీకు రాబోయే చేటుకాలాన్ని కూడా నువ్వే చూస్తావు. ఎంతమంది ఇంద్రులు పోలేదు. ఎంత శీలవంతుడైనా కాలం వాడికి ఏది చేయాలో అదే చేస్తుంది' అని బలి చెప్పిన సమాధానానికి ఇంద్రుడు ఉలిక్కిపడ్డాడు.

'బలీ! ఇంత నిర్వికారత, వివేకం, వినయం, శాంతి ఎలా వచ్చాయి?' అన్నాడు. 'ఇంద్రా! ఇవి ఎక్కడి నుంచో కొనితెచ్చేవి కావు. కష్టసుఖాలలో నిబ్బరంగా, ఉండటం మనసుకు ముఖ్యగుణాలు. కాలస్వభావం తెలుసు కనుక నేను కలత చెందను. ప్రాణులకు కాలం చేతనే ఏదైనా జరుగుతుంది. కాలానికి ఏమరుపాటు ఉండదు. ఇప్పటిదాకా బాగానే ఉ

న్నాడు. ఎలా పోయాడు? అని ఆశ్చర్యపడే మానవుడు కాలమహిమ తెలియని మూఢుడు. కాలజ్ఞానమే శాంతికి మూలం' అన్నాడు. ఇంద్రుడు బలి కాలవివేకానికి ఆశ్చర్యపడి అభినందించాడు. ఈ 'ఇంద్రబలి సంవాదం' చదివినవారికీ, విన్నవారికీ మనోధైర్యం కలుగుతుంది.

46. కర్తవ్యమే ఉత్తమ ధర్మం

'పితామహా! వేదశాస్త్రాలలో చాలా ఆచారాలు విడివిడిగా చెప్పబడ్డాయి. అందరికీ సమానంగా మేలు చేకూర్చే ఒకే ఒక ఆచారం మహాత్ములు ఆచరించినది ఏదైనా ఉందా?' అని ధర్మరాజు భీష్ముణ్ని అడిగాడు. 'నాయనా! పూర్వం 'జాజలి' అనే ఋషికి 'తులాధారుడు' అనే వ్యాపారికి జరిగిన సంవాదంలో ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది అని 'జాజలి తులాధార సంవాదం' వినిపించాడు.

జాజలి తపోనిష్ఠకై కదలిక లేకుండా కూర్చొని తపస్సు చేస్తున్నాడు. అప్పుడు గజిబిజిగా పెరిగిన అతని తలపైన పిచ్చుకలు గూడుపెట్టాయి. ఆ జంట అక్కడ గుడ్లు పెట్టి పొదిగి పిల్లల కోసం మేత తేవటానికి పోయి తిరిగి వస్తూ ఉండేవి. జాజలి వాటిపై జాలితో కదలకుండా, వాటిని తోలకుండా ఊరుకున్నాడు. అలా చేసినందుకు తన ధర్మనిష్ఠకు తనను తానే మెచ్చుకొని, నా వంటివారు మరెవరూ ఉండరు అనుకున్నాడు. అతడు అలా అనుకోగానే అద్భుతంగా ఆకాశవాణి, 'ఎంతో ధర్మపరుడైన తులాధారుడు కూడా ఇలా అనుకోలేదు. నిన్ను నువ్వే ఎందుకు పొగుడుకుంటున్నావు?' అని పలికింది. ఆ మాటలకు ఆశ్చర్యపడిన జాజలి తులాధారుడు ఎవరో చూడాలనుకున్నాడు. అతడు వారణాసిలో ఉన్నాడని ఆకాశవాణి పలికింది.

జాజలికి తులాధారునిపై మాత్సర్యం ఏర్పడింది. వారణాసి వెళ్లగానే ధర్మబద్ధంగా వ్యాపారం చేస్తున్న తులాధారుడు జాజలికి స్వాగతం చెప్పి అతిథి మర్యాదలు చేశాడు. 'స్వామీ! పిచ్చుకలు మీ తలపై గూడు పెట్టి పిల్లలతో సుఖంగా ఉండగా ఏ మనోవికారం లేకుండా ఎలా తపస్సు చేయగలుగుతున్నావు. నువ్వు చాలా గొప్పవాడివి' అన్నాడు. ఎక్కడో జరిగినదానిని చూసినట్లుగా చెప్పిన తులాధారుని మాటలకు జాజలి ఆశ్చర్యపడి, 'వ్యాపారం చేసుకునే నీకు ఇంత జ్ఞానం ఎలా కలిగింది?' అన్నాడు. అమ్మకాలు కొనుగోళ్లలో మోసం చెయ్యను.

తగిన లాభాన్ని మాత్రమే తీసుకుంటాను. లాభనష్టాలు సమానంగా భావిస్తాను. తిట్టినా, పొగడినా పట్టించుకోను. హింస చెయ్యను. నన్ను నేను పొగుడుకోను. అన్ని ప్రాణులపై దయ కలిగి ఉంటాను. భయరాహిత్యమే దక్షిణగా గల సత్యయాగాన్నే చేస్తూ ఉంటాను. భోగాలు, కీర్తి కోరను. ఎవరికి మేలు చేసినా ఇంత చేశానని చెప్పుకోను. దేనిమీద 'నాది' అనే మమత లేకుండా కర్తవ్యాన్ని బాధ్యతతో నిర్వహిస్తాను' అని చెప్పాడు తులాధారుడు.

'తపస్సు, యజ్ఞాలు ఏవీ చేసినట్టు చెప్పలేదు. అవి చెయ్యనక్కరలేదా?' అని జాజలి అడిగాడు. 'అహంకారంతో, కోరికలతో చేసే తపస్సులు, ఫలకాంక్షతో చేసే యజ్ఞయాగాలను దేవతలు మెచ్చరు. నిత్యతృప్తితో చేసే సత్యయజ్ఞానికే దేవతలు సంతోషిస్తారు. దానివల్లనే నిజమైన ఆనందం కలుగుతుంది. ఎవరి ధర్మాన్ని వారు నిష్కల్మషంగా ఆచరిస్తే వారి హృదయం కాలుష్యం, బురదలేని తీర్థం అవుతుంది' అన్నాడు. ఆకాశవాణి తులాధారుని పేరు ఎందుకు ప్రస్తావించిందో జాజలికి అర్థమైంది. ఈ సంవాదంలోని ధర్మతత్త్వం ధర్మరాజుకు అర్థమైంది. మనం కూడా అందరికీ ఆచరణీయమైనదేదో దీని ద్వారా తెలుసుకుందాం.

47. ధనరక్షణ విషయంలో జాగ్రత్త!

కన్నబిడ్డలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఆప్తబంధువులు, ప్రాణమిత్రులు... ఎవరి మధ్యనైనా గొడవలు సృష్టించి, విడగొట్టి, చంపగల శక్తి సిరిసంపదలకే ఉంది. అధికారం కోసం, సంపదల కోసం జరిగిన ఘోరాలు, నేరాలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ధనాన్ని సంపాదించడం కోసం కష్టపడాలి. దాన్ని కాపాడుకోవటం మరింత కష్టపడాలి.

చుట్టూ ఉన్నవారిలో ఎవరు మంచివారో, ఎవరు దుర్మార్గులో తెలియదు. అందరూ ప్రదర్శించే ఆత్మీయతలో ఏది సత్యమో, ఏది నటనో కనిపెట్టలేరు. ధర్మరాజు 'ధనార్జన, రక్షణల విషయంలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?' అని భీష్మపితామహుడిని అడిగాడు. అప్పుడు భీష్ముడు, "ధర్మరాజా! ధనవంతుణ్ని అందరూ దోచుకోవాలనే చూస్తారు. దానికోసం ఎంతటి అపకారం చేయడానికైనా వెనుకాడరు. 'కాలక వృక్షీయ దర్శి సంవాదం' వినిపిస్తాను. దానిని బట్టి నువ్వు సత్యాన్ని గ్రహించగలుగుతావు" అని ఇలా చెప్పాడు.

కాలక వృక్షీయుడు అనే ఋషి, కోసలరాజు క్షేమదర్శి దగ్గరకు పంజరంలో పెట్టిన కాకిని

వెంటబెట్టుకుని వచ్చాడు. 'మహారాజా! ఇది మామూలు కాకి కాదు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు దీనికి తెలుసు. నువ్వు రాజకార్యాలలో, ధనసంపాదనలలో ఏమరుపాటు పొందే అవకాశం ఉంది. నీ చుట్టూ ఉన్నవారు, నీ ఉద్యోగులు, మంత్రులు ఎలాంటివారో, అవినీతి, అక్రమాలు ఏం చేస్తున్నారో గమనించే తీరిక నీకు ఉండదు. ఈ కాకిని నీకు కానుకగా ఇస్తున్నాను. ఇది ఎవరు ఎలాంటివారో, ఏం చేయబోతున్నారో... అన్నీ నీకు తెలియచేస్తూ ఉంటుంది. దొంగలను మోసగాళ్లను నీకు పట్టిస్తుంది'' అని చెప్పి, కాకిని రాజుకు ఇచ్చి, రాజసత్కారాన్ని పొంది వెళ్లిపోయాడు. అద్భుతమైన కాకి తన దగ్గరకు వచ్చినందుకు ఎంతో ఆనందించాడు క్షేమదర్శి. ఆ రోజు రాత్రి రాజభవనంలో సురక్షితంగా ఉన్న ఆ కాకిని ఎవరో చంపేశారు. బయటి నుంచి వచ్చి ఎవరూ ఈ పని చేయలేరు. కేవలం రాజుకు సన్నిహితులు మాత్రమే ఆ పని చేయగలరు. మరునాడు కాలకవృక్షీయుడు వచ్చి రహస్యంగా రాజును కలిశాడు.

"మహారాజా! నేను మా నాన్నగారి స్నేహితుణ్ని. ఆయన పోయిన తరువాత అడవికిపోయి తపస్సు చేసుకుంటున్నాను. నీ క్షేమం కోసం నిన్ను చూడటానికి వస్తూ, నీ చుట్టూ జరుగుతున్న అవినీతి, అక్రమాలను నీకు తెలియచేయటానికి ఈ కాకిని తెచ్చాను. ఇది మామూలు కాకి మాత్రమే. కాని తమ గుట్టును ఈ కాకి ఎక్కడ బయటపెడుతుందోనని, నీ దగ్గర ఉన్నవారే దీనిని చంపేశారు. ఇప్పుడు నీకు నీ చుట్టూ ఉన్నవారి గురించి కొంత తెలిసి ఉంటుంది. కనుక ముందు ముందు నువ్వు జాగ్రత్తగా ఉంటావు. నా ఉపదేశాన్ని స్వీకరించు. నన్ను పంపించెయ్యి. నీ పరివారంలోని వంచకుల మధ్య విభేదాలు సృష్టించు. ఒక్కొక్కరినీ విడివిడిగా శిక్షించు. సంపదలను సంరక్షించుకో'' అని ఉపదేశించాడు.

కాలకవృక్షీయ క్షేమదర్శి సంవాదం ఎప్పటికైనా ఎవరికైనా అవసరమే. (మహాభారతం శాంతిపర్వం రెండవ ఆశ్వాసం)

48. ప్రజల సంకల్పమే ఉత్తమ ప్రభుత్వం

"భీష్మపితామహా! ఎలా ప్రవర్తిస్తే దేశప్రజలు సుఖంగా ఉంటారో తెలియజేయి" అని ధర్మరాజు అడిగితే అందుకు సమాధానంగా భీష్ముడు "నాయనా! ప్రజలు... ఉత్తమగుణాలతో ప్రకాశించేవాడిని రాజుగా ఎన్నుకోవాలి. అన్నిపనులూ అతని ద్వారా జరిగేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడు ప్రజలంతా సుఖంగా ఉంటారు. శాసించే ప్రభుత్వం లేకపోతే సమాజం చెడిపోతుంది. పరస్త్రీలను, పరధనాన్ని ఒకరికొకరు దొంగిలిస్తారు. పెద్దచేప చిన్నచేపను తిన్నట్లు బలవంతులు బలహీనులను మింగేస్తారు. ప్రభుత్వం లేకుండా ప్రజలు జీవించలేరు. వ్యవసాయం, పశుసంరక్షణ, వ్యాపారాలు మొదలైన వృత్తులన్నీ దెబ్బ తింటాయి. పూర్వం ప్రజలు తమలో తాము నియమాలు ఏర్పరచు కున్నారు. క్రూరత్వం, దొంగతనం, వ్యభిచారం మొదలైనవాటిని నిషేధించారు.

రాజు లేకుండా తప్పు చేసినవారిని అందరూ కలిసి శిక్షించాలనుకున్నారు. కానీ అనేక కారణాల వలన అది సాధ్యం కాలేదు. విషాదంతో అందరూ బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లారు. సమాజాన్ని రక్షించే సమర్థుడొకడిని ప్రసాదించ మని ప్రార్థించారు. బ్రహ్మ ఆ బాధ్యతను మనువుకు అప్పగించాడు. "ప్రజలు చెప్పిన మాట వినరు. ఈ పని నేను చెయ్యను" అని మనువు తిరస్కరించాడు. ప్రజలు మహాత్ముడైన మనువును ప్రార్థించారు. "నీవు చెప్పినట్లు వింటాం. పరిపాలన చక్కగా సాగటానికి పశువులలో, పసిడిలో సగభాగం, పండిన పంటలో పదో వంతు ఇస్తాం. ఆయుధాలు ధరించిన సైన్యాన్ని ఏర్పరుచుకో. బలవంతుడవై చెడ్డవారిని శిక్షించు. మంచివారిని రక్షించు. మేమందరం నీ శాసనాలను పాటిస్తాం. అధర్మ వర్తనులు నీ చేత శిక్షింపబడాలి. ధర్మపరులు ఆచరించిన ధర్మంలో ఆరోవంతు నీకు చేరుతుంది" అని ఒప్పందం చేసుకున్నారు. మనువు దానికి అంగీకరించాడు. పరాక్రమంతో, నీతితో ప్రజలంతా సుఖంగా ఉండేటట్టు పరిపాలించాడు.

'మనుమానవ సంవాదం'... తమను చక్కగా పరిపాలించే రాజును ఎన్నుకొనే బాధ్యత ఎప్పుడైనా ప్రజలదే అనే సందేశాన్ని అందిస్తుంది. ప్రజలకు మేలు చేసే రాజశాసనాలను వారు గౌరవించాలి. తమ రాజును తాము గౌరవిస్తేనే ఇరుగుపొరుగు వారు అతనికి భయపడతారు. ఈ విధంగా విధేయులై ఉన్న ప్రజలను రాజు చిరునవ్వుతో పలకరిస్తూ ఉండాలి. ఏ పనిలోనూ ఏనాడూ తప్పు కనపడకూడదు. అందరిపట్లా ఎచ్చుతగ్గులు లేని సమభావం ఉండాలి. కృతజ్ఞత కలిగి ఉండాలి. ఇంద్రియ సుఖాలకు లొంగనివాడై ఉండాలి.

చక్కగా పనిచేసే వారికి ప్రసన్నతతో ఫలాన్ని ఇవ్వాలి. తన రాజ్యంకోసం పాటుపడాలి. తండ్రితో సమానుడై, ప్రజాసంక్షేమం కోసం కృషి చెయ్యాలి. దుర్మార్గుల పట్ల, శత్రువుల పట్ల భయంకరుడై వారిని చీల్చి చెండాడాలి. ఇంతటి ఉత్తమ లక్షణాలు గల రాజశాసనాన్ని ఎన్నుకొనే జాగరూకత ప్రజలకు ఉండాలనీ, ఆ బాధ్యత వారిదేననీ మహాభారతం మనకు చెబుతోంది. (శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం)

49. విధిలీల తెలిస్తే ఏమీ ఉండవు...

'తాతా! దుర్యోధనుడు కొంత రాజ్యాన్ని మాకు ఇచ్చినా, మేము రాజ్యం కోసం అతనితో గొడవ పడకుండా ఉన్నా ఇంత మహాసంగ్రామం జరిగేది కాదు. ఇంతమంది మరణించేవారు కాదు. ఎంత పశ్చాత్తాప పడినా నా దుఃఖం తీరటం లేదు' అని ధర్మరాజు అనగానే భీష్ముడు, 'నాయనా! జరిగినదానికి ఎవరూ కర్తలు కాదు. విధిలీల తెలిస్తే విరోధాలూ, విషాదాలూ ఉండవు. గౌతమీ లుబ్ధ సర్ప మృత్యుకాల సంవాదం చెబుతాను. ఇది విన్నవారికి ప్రశాంతత లభిస్తుంది' అన్నాడు.

గౌతమి అనే బ్రాహ్మణ స్త్రీకి ఒక కుమారుడు ఉన్నాడు. అతడు పాముకాటు కారణంగా చచ్చిపోయాడు. ఆమె ఏడుస్తుండగా ఒక బోయవాడు పామును పట్టుకు వచ్చి, 'అమ్మా! నీ కొడుకును కరిచిన పాము ఇదే. దీనిని కర్రతో కొట్టి చంపమంటావా? కత్తితో రెండుగా నరకమంటావా?' అని అడిగాడు. గౌతమి 'విధివశాత్తు జరిగిన దానికి ఎవరినో కారణంగా భావించి అధములు దుఃఖపడతారు. ఉత్తములు తేలికగా తీసుకుంటారు. ఈ పామును చంపితే పిల్లవాడు బతుకుతాడా?' అంది. 'అమ్మా! ఈ పాము క్రూరమైనది. దీనిని చంపటం తప్పు కాదు' అని బోయవాడు అనగానే పాము 'నేను ఏం తప్పు చేశాను? మృత్యువు కరవమంటే ఈ పిల్లవాణ్ని కరిచాను. నాకు ఇతనిపై ఏ కోపమూ లేదు' అంది. 'మృత్యువుకు నీవు సాధనంగా ఉన్నావు కనుక నిన్ను శిక్షించవచ్చు' అన్నాడు లుబ్ధకుడు. 'అగ్నిలో హవిస్సు వేసిన కర్త ఫలితాన్ని పొందుతాడు కానీ, సాధనమైన నెయ్యి కాదు కదా! మృత్యువును శిక్షించు' అంది పాము.

మృత్యుదేవత వచ్చి, 'సర్పమా! నేను నిన్ను పంపించినట్లే నన్ను యముడు పంపాడు. ఈ పిల్లవాని చావుకు మనమిద్దరమూ కారణం కాదు. అన్నీ తెలిసిన నువ్వు ఈ నేరాన్ని నా

మీదకు ఎందుకు నెడుతున్నావు?' అంది. 'మృత్యుదేవతా! నా ప్రాణాన్ని కాపాడుకోవడానికి నీ గురించి చెప్పాను. కాలునితో నాకేం పని?' అని పాము బోయవానితో 'విన్నావా! మృత్యువు నా తప్పేమీ లేదని చెప్పింది. నన్ను చంపకు' అంది. 'కాలుని మీదకు దోషాన్ని నెట్టినా నీకూ, మృత్యువుకూ పాపం పోదు' అన్నాడు బోయవాడు. కాలుని కారణంగా మేమిద్దరం ఈ పని చేశాం కాబట్టి అతడినే అడుగు' అని పాము, మృత్యువు వాదించాయి.

అప్పుడు కాలుడు అక్కడికి వచ్చి, 'పామూ, మృత్యువూ, నేనూ ఈ పిల్లవాని చావుకు కారణం కాదు. ఏ ప్రాణికైనా తాను చేసిన కర్మలు బట్టే జనన మరణాలు, సుఖదుఃఖాలు లభిస్తాయి. తప్పించుకోవడం శివునికి కూడా సాధ్యం కాదు' అన్నాడు. వీరందరి వాదోపవాదాలు విన్న గౌతమి బోయవానితో, 'కర్మానుగుణంగా కష్టసుఖాలు కలుగుతాయనే వివేకం కలిగిన వారు దోషవిషాదాలను విడిచిపెడతారు' అంది. వాడు ప్రశాంతచిత్తుడై పామును విడిచిపెట్టాడు. జరిగిన విషాదాన్ని విచారంతోనో, విరోధంతోనో జీవితాంతం పొడిగించుకోవడం తెలివైన పనికాదని చెప్పే ఈ గౌతమ లుబ్ధక సర్ప మృత్యుకాల సంవాదం ఏ కాలంలోనైనా మానవజాతి ప్రశాంత జీవితానికి మార్గదర్శకమే. (అనుశాసనిక పర్వం)

50. అన్ని ప్రాణులనూ గౌరవించాలి

"బంధుమిత్రులు కలిసి జీవించటం, కళ్లెదుట కనపడటం ద్వారా స్నేహం, ఆత్మీయత నిలబడతాయి. ఒకరికొకరు దూరమైతే కన్నబిడ్డలైనా కానివారు అవుతారు. ఎదురుపడటం, పలకరించుకోవటం లేకపోతే స్నేహం నశించిపోతుంది. కలిసిమెలిసి ఉంటే ఇతర ప్రాణులతో కూడా విడదీయలేని అనుబంధం ఏర్పడుతుంది" అని భీష్మపితామహుడు చెప్పగానే, "తాతా! ఆ స్నేహం ఎలా ఉంటుంది?" అని ధర్మరాజు అడిగాడు. భీష్ముడు, 'చ్యవన నహుష సంవాదం' వినిపించాడు.

చ్యవనుడు... గంగాయమునలు కలిసేచోట, ఆ నీటిలో మునిగి కదలకుండా కూర్చొని ఏకాగ్రతతో తపస్సు ప్రారంభించాడు. నదిలోని చేపలు అతని చుట్టూ తిరుగుతూ, తాకుతూ ఉండేవి. చ్యవనునికి ఆ చేపలపై కరుణ, ప్రేమ కలిగి స్నేహానుబంధం ఏర్పడింది. ఇలా పన్నెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకనాడు జాలరులు వచ్చి చేపల కోసం వలలు విసిరారు. చేపలతో పాటు చ్యవనుడు కూడా వలలో చిక్కుకున్నాడు. వాళ్లు వలను పైకి

లాగినప్పుడు చేపలతోపాటు తాను కూడా బైటికి వచ్చి వారికి కనపడ్డాడు.

మహర్షిని చూసి జాలరులు భయపడ్డారు. భక్తితో నమస్కరించారు. క్షమాపణలు వేడుకున్నారు. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం ఏమిటని అడిగారు. చ్యవనమహర్షికి వారిపై కోపం రాలేదు. చేపలపై చూపిన కరుణనే వారిపై చూపాడు. ఒడ్డున పడి ఉన్న చేపలను చూసి వారితో 'నాయనలారా! ఈ చేపలతో సహవాసం వలన వీటితో నాకు చాలా ఆత్మీయత ఏర్పడింది. మీరు బయటకు తీయటం వలన ఇవి చచ్చిపోయాయి. నాకూ వీటితో పాటు చనిపోవాలనిపిస్తోంది. ఈ చేపలతోపాటు నన్ను కూడా అమ్ముకోండి' అన్నాడు.

జాలరులు వేగంగా నహుష మహారాజు దగ్గరకు వెళ్లి జరిగినదంతా చెప్పారు. నహుషుడు మంత్రి పురోహితులతో పరిగెత్తుకొని వచ్చి నమస్కరించి, "స్వామీ! ఈ అపరాధానికి నిష్కృతి చెప్పండి" అన్నాడు. "రాజా! చేపలతో పాటు నన్ను కూడా కొనుక్కో. ఆ ధనం ఈ జాలరులకు జీవనోపాధికి పనికి వస్తుంది" అన్నాడు. రాజు వేయి బంగారు మాడలు జాలరులకు ఇమ్మని మంత్రికి చెప్పాడు. ఋషి ఒప్పుకోలేదు. రాజు పదివేలు, లక్ష, కోటి అన్నా, రాజ్యంలో సగం ఇస్తానన్నా, మొత్తం రాజ్యం ఇస్తానన్నా కూడా ఒప్పుకోలేదు. రాజుకు ఏం చెయ్యాలో తోచలేదు.

కవిజాతుడు అనే ఋషి వచ్చి 'రాజా! నీ సమస్యకు పరిష్కారం ఒక గోవును ఇవ్వటమే. దానికి చ్యవనుడు ఒప్పుకొంటాడు' అన్నాడు. నహుషుడు మంచి గోవును ఇస్తాననగానే చ్యవనుడు అంగీకరించాడు. "భౌతికమైన సిరిసంపదల కంటె పశుసంపద గొప్పది. వాటితో సహజీవనం వలన స్నేహం కలుగుతుంది. వాటితో పాటే మానవజాతి సుఖసంతోషాలతో జీవించగలుగుతుంది" అన్నాడు.

ఇతర ప్రాణులను గౌరవిస్తూ వాటితో స్నేహాన్ని పెంచుకోవాలని చెప్పే ఈ చ్యవన నహుష సంవాదం నిజమైన సిరిసంపదలను స్నేహాన్నీ తెలిపే మంచికథ.

(అనుశాసనికపర్వం)

51. చేసిన మేలు వృథా కాదు

పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు మార్కండేయ మహాముని వారిని చూడటానికి వచ్చాడు. కృష్ణుడు, పాండవులు అతనికి స్వాగతం పలికి, అతిథి మర్యాదలు చేసి, "మహాత్మా! నేడు నీ దివ్యవాక్కును వినాలనుకుంటున్నాం" అన్నాడు కృష్ణుడు. మార్కండేయుడు ఎన్నో ధర్మాలను వారికి వినిపించాడు. ధర్మరాజు, 'మహర్షీ! వైవస్వతుడు మనువు అయ్యాడని చెప్పావు కదా! ఎలా అంతటి ప్రభావసంపన్నుడు అయ్యాడు' అని అడిగాడు. ఈ 'యుధిష్ఠిర మార్కండేయ సంవాదం'లో బలహీనులను శ్రద్ధతో కాపాడేవాడే నాయకుడు అవుతాడు. వారి వలన తాను రక్షింపబడతాడు... అనే సందేశం ఉంది.

వైవస్వతుడు పదివేల సంవత్సరాలు దీక్షతో బదరికాశ్రమంలో తపస్సు చేశాడు. ఒకనాడు అతడు జలాశయంలో స్నానం చేసి ఒడ్డున కూర్చున్నాడు. ఒక చిన్నచేప ఒడ్డు దాకా వచ్చి వైవస్వతునితో, 'అయ్యా! నేను చిన్నచేపను. బలవంతమైన పెద్దచేపలు నన్ను తినేస్తాయని భయంగా ఉంది. వాటి వలన ప్రమాదం లేకుండా నన్ను తీసుకువెళ్లి మరొకచోట ఉంచండి' అని ప్రార్థించింది. వైవస్వతుడు ఆశ్చర్యంతో ఆ చేపపిల్లను తీసుకుని వెళ్లి ఒక నూతిలో వేశాడు. ఆ చేప బాగా పెద్దదయింది. 'స్వామీ! నీ దయవలన ఈ నూతిలో నా శరీరం బాగా పెరిగింది. ఈ నుయ్యి నాకు చాలటం లేదు. మరొకచోటుకు తీసుకుపో' అంది. అతడు దానిని పెద్దబావిలో వేశాడు. కొంతకాలం తర్వాత, 'స్వామీ! నా శరీరం బాగా పెరిగింది. ఈ బావిలో ఉండలేకపోతున్నాను' అంది. వైవస్వతుడు దానిని తీసుకుపోయి గంగలో వదిలాడు.

కాలక్రమంలో ఆ చేపకు గంగ మడుగు కూడా సరిపోలేదు. అతడు దాని మొర విని సముద్రంలో వదిలాడు. అప్పుడు ఆ చేప 'వైవస్వతా! కృపతో నువ్వు నాకు చేసిన ఉపకారానికి, నీకు ప్రత్యుపకారం చేస్తాను. త్వరలో పెద్ద ప్రళయం రాబోతోంది. అన్ని ప్రాణులకు ఆపద కలుగబోతోంది. నదులు, సముద్రాలు అన్నీ పొంగి, భూమి మునిగిపోబోతోంది. దీనిని మన్వంతర సంధి అంటారు. నువ్వు ఒక పెద్ద ఓడ తయారుచేసుకుని, అందులో ఆహారపదార్థాలు పెట్టుకో. ఆ ఓడకు బలమైన తాళ్లు కట్టు. సప్త ఋషులు సహా దానిలో కూర్చో. సముద్రంలోకి ప్రవేశించగానే నన్ను తలచుకో. నేను పెద్ద కొమ్ము గల చేపనై మీకు మేలు చేస్తాను' అంది. వైవస్వతుడు ఆ చేప చెప్పినట్లే ఓడను నిర్మించి అన్ని బీడాలను దానిలో పెట్టాడు. సప్తమునులతో దానిలో కూర్చొని సముద్రంలో ప్రవేశించగానే చేపను తలచుకున్నాడు. అది పైకి వచ్చి ఓడకు కట్టిన తాడు తన కొమ్ముకు తగిలించమంది.

తగిలించగానే ఓడను హిమాలయ పర్వతశిఖరం పైకి తీసుకుపోయి అందరినీ కాపాడింది. జలప్రళయం తర్వాత వైవస్వతుడు మనువై అన్ని ప్రాణులను సృష్టించాడు. చిన్నచేపను కాపాడిన వైవస్వతుడు, ఆ చేపవలనే ఒక మన్వంతరానికి అధిపతి అయ్యాడు. వైవస్వత మన్వంతరంలో ఉన్న మనం, బలహీనులను కాపాడాలి. (మహాభారతం, అరణ్యపర్వం)

52. చెప్పులు, గొడుగు దానం చేయాలి

"తాతా! ఎన్నో వస్తువులు దానం చేస్తూంటాం. వాటిల్లో కొన్ని వస్తువులు మానవుల ప్రాణాలను కాపాడటానికి మరింత అవసరమౌతాయి. కనుక వాటిని విరివిగా, తప్పనిసరిగా దానం చేయాలని మహర్షులు చెప్పారు. చెప్పులు, గొడుగు ఇవ్వటం ఎంతో మంచిది అంటారు. ఎందుకని?" అని ధర్మరాజు అడిగాడు. భీష్మపితామహుడు వాటి ప్రాముఖ్యాన్ని తెలిపే 'సూర్యజమదగ్ని సంవాదం' ఇలా వినిపించాడు.

జమదగ్ని మహర్షి విల్లు పట్టుకున్నాడు. ఆయన భార్య రేణుకాదేవి బాణాల కట్టను పట్టుకొని వెంట నడిచింది. భర్త ఒకచోట నిలబడి గురి చూచి బాణం వేస్తే, ఆమె వెళ్లి వెంటనే ఆ బాణం తీసుకు వచ్చి ఇస్తోంది. వాళ్లు ఈ విధంగా వినోదిస్తుండగా సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. ఎండ మండిపోతోంది. బాణం తేవటానికి వెళ్లిన రేణుక ఆలస్యంగా తిరిగి వచ్చింది. జమదగ్ని 'ఆలస్యం ఎందుకు అయ్యింది' అని అడిగాడు. 'నెత్తిమీద ఎండ మండిపోతోంది. నేల వేడికి కాళ్లు కాలిపోతున్నాయి. కాస్సేపు ఒక చెట్టుకింద నిలబడ్డాను. అందుకని ఆలస్యం ఆయింది' అని ఆమె కారణం చెప్పింది. జమదగ్నికి సూర్యుని మీద కోపం వచ్చింది. 'సూర్యుడు నిన్ను బాధపెట్టాడా? ఇప్పుడే అతనికి తగినశాస్తి చేస్తాను' అని ఒక అస్త్రాన్ని ఎక్కుపెట్టాడు. సూర్యుడు వెంటనే ఒక ఋషివేషంలో ప్రత్యక్షమయ్యి, శాంతించమని ప్రార్థించాడు. రవిని నేలగూలుస్తానని జమదగ్ని కేకలేశాడు. ఆ ఋషి వినయంగా తలవంచి, 'మహర్షీ! ఋషులు క్రూరంగా ఉండకూడదు. దయతలచు. సూర్యుడు తన కిరణాల వేడితో వర్షాల రూపంలో నీటిని, ఓషధులను ఇస్తున్నాడు. దేవతలకు, పితృదేవతలకు హవ్యకవ్యాలను అందిస్తున్నాడు. నీవు అతనిని పడగొడితే అందరికీ నష్టం. నీకు కష్టం కలిగిందని, అన్నిటినీ తొలగించుకుంటూపోతే నీవు బతకడం కూడా కష్టం అవుతుంది. రక్షణోపాయాలను పాటించాలి కాని, పర్యావరణాన్ని పాడుచేయకూడదు' అని, నిజరూపంతో

ప్రత్యక్షమై చెప్పులు, గొడుగు సృష్టించాడు. 'జమదగ్నీ! ఈ గొడుగుతో తలకు, చెప్పులతో కాళ్లకు ఎండ నుండి రక్షణ కలుగుతుంది. వీటిని నీ కోసమే తయారుచేశాను. ఈ రెండూ విశేషమైన వస్తువులు. వీటిని దానం చేసినవారికి సుస్థిరంగా ఇహపరసుఖాలు కలుగుతాయి. నీ కారణంగా ఇవి నా చేత సృష్టింపబడ్డాయి. కనుక యుగయుగాలు, తరతరాలు మానవులు నిన్ను తలుచుకుంటారు. శాంతించు' అన్నాడు.

రేణుకా జమదగ్నులు సంతోషంతో, సూర్యునికి నమస్కరించి వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి మానవులు చెప్పులు, గొడుగు ధరించి సూర్యతాపం తట్టుకుంటున్నారు. చెప్పులు, గొడుగు దానం చేస్తే మానవులకు అవి ఎంతగానో ఉపయోగపడతాయి. దేవతలు అందరూ దీవిస్తారు... అని భీష్ముడు చెప్పిన సూర్యజమదగ్ని సంవాదాన్ని ధర్మరాజు శ్రద్ధతో విన్నాడు. ఎండాకాలంలో మాత్రమే కాదు, ఎప్పుడైనాసరే చెప్పులు, గొడుగు దానం శ్రేష్ఠం.

(మహాభారతం, అనుశాసనిక పర్వం)

53. అహంకారం పనికిరాదు

శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన రాయబారం చేయటానికి కౌరవ సభకు వెళ్లాడు. ఈ అద్భుతాన్ని చూడటానికి నారదాది మహర్షులు కూడా వచ్చారు. సభలోని వారంతా ఆశ్చర్యంతో మౌనంగా చూస్తున్నారు. శ్రీకృష్ణుడు ముందుగా దృతరాష్ట్రునికి హితోపదేశం చేశాడు. పాండవులు చెప్పమన్న మాటలన్నీ అందరూ వింటూ ఉండగా ఆయనకు చెప్పాడు. శాంతియుతంగా కలసి మెలసి ఉండమని శ్రీకృష్ణుడు చేసిన ప్రతిపాదనకు సభలోని వారంతా ఆనందించారు. అక్కడ ఉన్న మహర్షులలో కణ్వుడు 'నాయనా! దుర్యోధనా! ఎదుటివారి బలం తన బలం తెలుసుకోకుండా అహంకరిస్తే హాని జరుగుతుంది. గరుత్మంతుడు ఒకసారి ఇలాగే అహంకరించి అవమానానికి గురయ్యాడు. ఆ కథ విను' అన్నారు.

ఇంద్రుని రథసారథి మాతలి తన కూతురు గుణకేశికి భర్తను వెతుకుతున్నాడు. ఆర్యకుడనే సర్పరాజు మునిమనుమడు సుముఖుడు తగిన వాడనిపించి ఆర్యకుణ్ణి అడిగాడు. అతడు దుఃఖంతో 'ఈ పిల్లవాడి తండ్రి చిరకుణ్ణి గరుత్మంతుడు చంపేశాడు. వీణ్ణి కూడా నెలరోజుల్లో చంపుతానని ప్రతిజ్ఞ చేసి వెళ్లాడు కనుక ఈ పెళ్ళికి ఒప్పుకోను' అన్నాడు. మాతలి 'ఇంద్రుణ్ణి ప్రార్థించి ఇతనిని కాపాడతాను' అని వెళ్లాడు. అతను వెళ్లేసరికి ఇంద్రుడు,

ఉపేంద్రుడు(విష్ణువు) మాట్లాడుకుంటున్నారు. మాతలి ఇంద్రుణ్ణి ప్రార్థించాడు. అతడు సుముఖుడికి ఆయువిచ్చి కన్యాదానం చేసుకోమన్నాడు. అక్కడే ఉన్న గరుత్మంతుడు అది విని ఆగ్రహోదగ్రుడైనాడు. 'ఇంద్రా! నువ్వు అదితి కొడుకునైతే నేను వినత కొడుకును. మన తండ్రి కశ్యపుడు. నీ గొప్ప ఏంటి? నా తక్కువ ఏమిటి? నన్ను అడక్కుండా సుముఖుడికి ఎందుకు ఆయువిచ్చావు? దేవతలందరినీ నా రెక్కల్లో ఒక్క ఈక మీద మోసేస్తాను. నాబలం తెలియక నన్ను చులకన చేశావు' అన్నాడు. అక్కడే ఉన్న విష్ణువు ఆ మాటలకు పకపకా నవ్వాడు. 'వైనతేయా! అంత అహంకారం పనికిరాదు. నువ్వు నన్ను మోస్తున్నంత మాత్రాన నిన్ను నువ్వు ఎక్కువగా ఊహించుకోవద్దు.' అంటూ తన మోచేతిని అతని వీపుమీద ఆనించాడు. గరుత్మంతుడు కోపంతో ఆ చేతిని విసిరి కొడదామనుకున్నాడు. రెక్కలు టపటపలాడించాడు. ఎన్నో విధాల ప్రయత్నించాడు. కదిలించలేకపోయాడు. ఊపిరి అందలేదు. స్పృహ తప్పి పడబోతుండగా విష్ణువు దయతలిచాడు. చేయితీసి అతనిని ఓదార్చాడు. 'నువ్వు ఎంత బలవంతుడివైనా గర్వం, అహంకారం పనికిరావు. దేవలోకానికి ప్రభువైన ఇంద్రునితో నేను పక్కన ఉండగానే అలా మాట్లాడకూడదు. అతనూ నువ్వూ ఒక తండ్రి బిడ్డలైనా, నువ్వు నా వాహనానివైనా, మహాబలవంతుడవైనా నోరు పారేసుకోకూడదు.' అని బుద్ధి చెప్పాడు.

అహంకారానికి ఎన్ని కారణాలుంటాయో సూచించే ఈ కణ్వమహర్షి సందేశం దుర్యోధనునికే కాక మానవులందరికీ కనువిప్పు కలిగించాలి.

(ఉద్యోగపర్వం, తృతియాశ్వాసం)

54. సర్వం జగన్నాథం కావాలి

భారతదేశంలోని పుణ్యక్షేత్రాలన్నిటిలో పూరీ జగన్నాథ క్షేత్రానికి ప్రత్యేకత ఉంది. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయాలలో ఉండే మూలవిరాట్టు అన్నిచోట్ల శిలావిగ్రహమైతే, ఇక్కడ కొయ్యతో చేసిన విగ్రహాలు ఉండటం విశేషం. అవి కూడా నియమిత కాలంలో కొత్తవి ప్రతిష్ఠించబడుతూ వృక్షరూప భగవదారాధన ప్రాముఖ్యాన్ని సూచిస్తాయి.

ఆషాఢ శుక్ల ద్వితీయనాడు ఉత్సవ విగ్రహాలతో జరిగే 'జగన్నాథ రథయాత్ర' మానవులకు ప్రకృతిలో దైవాన్ని దర్శిస్తూ, కర్మమార్గాన్నీ, సహజీవనాన్నీ తెలుసుకోమని ప్రబోధిస్తుంది.

మానవ సంబంధాల సాన్నిహిత్యాన్ని, వీధుల్లో తిరుగుతూ చెబుతుంది. మిగిలిన క్షేత్రాలలో అయ్యవారు, అమ్మవార్లు ఉంటారు. ఇక్కడ మాత్రం జగన్నాథుడు... అన్న బలరాముడు, చెల్లెలు సుభద్రతో కలిసి ఉంటాడు. వివాహం కాగానే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లతో అనుబంధాలు వదులుకోకూడదు.

నాలుగు దిక్కుల్లో ప్రధాన క్షేత్రాల్లో తూర్పున ఉన్న పూరీ క్షేత్రంలో జగన్నాథుడై కొలువున్న స్వామి జగత్తుకంతటికీ ఈ సందేశాన్ని ఇస్తున్నాడు. అన్నచెల్లెళ్లతో కలిసి వైభవంగా ఊరేగుతున్నాడు. ఆషాఢమాసంలో వచ్చే తొలకరి జల్లులు, ఋతుపవనాలతో కర్తవ్యోన్ముఖులై పాడిపంటలతో వర్ధిల్లమంటున్నాడు. వనసంపదను పెంచి ప్రతిచెట్టులో తనను చూడమంటున్నాడు.

దక్షిణాయనం పితృదేవతలకు ప్రధానమైనది. తాను దేవాలయంలో ఉన్నట్లే పితృదేవతలలో కూడా ఉంటాననీ, బ్రతికి ఉండగా వారి మాట విని చక్కగా చూసుకోమనీ, మరణించాక శ్రద్ధతో విధులు ఆచరించమనీ చెబుతున్నాడు. ఎవరి కుటుంబవ్యవస్థ వారికి ఉన్నా అనుబంధాలు చెడకూడదని చెప్పటానికే అన్నాచెల్లెళ్లు ముగ్గురూ మూడు రథాలపై ఊరేగుతున్నారు.

'రథస్థం స్వామిన దృష్ట్వా పునర్జన్మ న విద్యతే' (రథంపై ఊరేగే ఉత్సవమూర్తులను దర్శిస్తే మళ్లీ జన్మ ఉండదు) అని అన్ని క్షేత్రాలలోనూ రథోత్సవాలు చేస్తారు. జగన్నాథ రథోత్సవం అన్నిటిలోనూ విశిష్టం. దీనిని 'రథయాత్ర' అంటారు. ఇది చాలా విస్తృతం. రథానికి పదహారు చక్రాలు ఉంటాయి. పంచభూతాలతో, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలతో కూడిన జీవాత్మ పదహారు చక్రాలుగా ఉన్న ఈ శరీర రథంపై జగన్నాథుణ్ని ఊరేగించటమే జన్మసాఫల్యమని తెలుసుకోవటానికే కొన్ని వేల మంది రథాలను లాగుతున్నారు.

ఈ యాత్రకు వచ్చినవారు ఏ భేదాలూ లేకుండా ప్రసాదాన్ని కలిసిమెలిసి తింటూ 'సర్వం జగన్నాథం'గా ఉంటున్నారు. ఆదిశంకరులు, రామానుజులు, చైతన్య మహాప్రభువు, జయదేవ మహాకవి వంటివారు ఈ క్షేత్రంలో పీఠాలు స్థాపించి, ప్రబోధించి జాతిని జాగృతం చేశారు. ప్రకృతికి, మానవ సంబంధాలకు దూరం కాకుండా కష్టజీవులై కలిసిమెలిసి జీవిస్తూ భగవత్ప్రసాదాన్ని అందుకోవటమే పూరీ జగన్నాథ రథయాత్ర మనకు ఇచ్చే సందేశం.

55. తృప్తి - తృష్ణ

మానవుల ఆనందానికీ, ప్రశాంతతకు తృప్తి కారణం. దుఃఖానికీ, అశాంతికీ తృష్ణ మూలం. తృష్ణకు అంతు ఉండదు. 'తృష్ణ' పదానికి అసలు అర్థం దప్పిక. అది తీరాలంటే నీళ్లు తాగాలి. ఊరికే వచ్చిందని గాని, ఖరీదైనదని గాని, గొప్పకోసం గాని నీటికి బదులు నెయ్యి లేదా వేరే రసాయనిక పానీయాలు తాగితే దప్పిక తీరకపోగా మరింత బాధ పెడుతుంది. ఇంకా ఇంకా తాగాలనిపిస్తుంది. ఉన్నదానితో తృప్తి చెందకుండా ఆరాటపడేకొద్దీ తృష్ణ మానవుణ్ని అశాంతికి గురి చేస్తుంది. "తాతా! అన్నదమ్ములను, గురువులను, బంధుమిత్రులను చంపే క్రూరత్వం మాకు తృష్ణ వలన వచ్చింది. అది ఎలా నశిస్తుందో నాలుగు మంచిమాటలు చెప్పు" అని ధర్మరాజు భీష్ముణ్ని అడిగాడు. "నాయనా! జనకరాజ, మాండవ్య మహామునుల సంవాదంలో జనకుడు చెప్పిన మాటలు తృష్ణను పోగొడతాయి. విను" అన్నాడు.

"మాండవ్య మహర్షీ! సంపదలే దుఃఖానికి కారణం. దేనిపైనా ఆశలేకుండా ఉంటే దుఃఖం కలగదు. తృష్ణను విడిచినప్పుడు కలిగిన సుఖానికి భూలోక, స్వర్గసుఖాలు ఏవీ సాటిరావు. సంపదలు కష్టపడకుండా తేలికగా పెరిగితే, ఆవుతో పాటు కొమ్ములు పెరిగినట్టు... తృష్ణ కూడా పెరుగుతూ ఉంటుంది. దానితో మమకారం మితిమీరుతుంది. మా బంధువులు, మా డబ్బు, మా ఆస్తిపాస్తులు, మా ఇల్లువాకిళ్లు... అనే మమకారాన్ని చంపుకుంటేనే తృష్ణ నశిస్తుంది. దొరికిన దానితో తృప్తిపడుతూ, దొరకని దానికి దుఃఖించనివాడు గొప్పవాడు. అతణ్ని తృష్ణ బాధించదు. మానవుల దుఃఖాలకు, మిత్రత్వ శత్రుత్వాలకు, అహంకార మమకారాలకు, నేరాలకు ఘోరాలకు అన్నిటికీ తృష్ణయే ఆదికారణం. జుట్టు తెల్లబడినా, పళ్లు ఊడినా, కళ్లు కనపడకపోయినా, ఒళ్లు ముడతలు పడి ముసలితనం వచ్చినా తృష్ణ మనిషిని విడువదు. దానికి వృద్ధాప్యం రాదు. నిత్యయౌవనంతో నిన్ను బాధిస్తూనే ఉంటుంది. 'నింద లేనిదే బొంది పోదు' అన్న సామెతగా మనిషి మరణానికి ఏదో రోగాలను, ప్రమాదాలను కారణంగా చెబుతారు. వాటన్నిటికీ నివారణోపాయాలు ఉన్నాయి. ఏ వ్యాధికైనా తగ్గించే ఔషధాలు, జాగ్రత్తలు ఉన్నాయి. ప్రస్తుతం లేకపోయినా ముందుముందు కనిపెట్టే అవకాశాలు ఉన్నాయి. కానీ ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా, ఎవరినైనా పట్టిపీడిస్తూ నాశనానికి కారణమై నివారణకు అసాధ్యమైన ఏకైక ప్రాణాంతక వ్యాధి తృష్ణ. కోరికలను జయించినవాణ్ని మాత్రమే అది వదిలిపారిపోతుంది. పారిపోయిందని నిర్లక్ష్యం చేస్తే ఏ క్షణాన అయినా మళ్లీ వచ్చి

ఆక్రమిస్తుంది. దాని బారినపడకుండా ఉండడానికి నిరంతర సాధన అవసరం. సాధించినవారు పొందే ఆనందం అనితరసాధ్యం'' అన్నాడు.

జనకుడు... మాండవ్యునకు చెప్పిన మాటలను భీష్ముని ద్వారా విన్న ధర్మరాజు, తృష్ణాక్షయ సుఖమే అంతరంగ శాంతికి మూలకారణమని తెలుసుకున్నాడు. అడవికిపోయి తపస్సు చేయకుండానే ఏ వృత్తిలో, ఏ బాధ్యతలో ఉన్నా తృష్ణను జయించవచ్చునని గ్రహించాడు. (మహాభారతం, శాంతిపర్వం, పంచమాశ్వాసం)

56. శాకంభరి కథ

దేవతలకూ, రాక్షసులకూ మధ్య వైరం శాశ్వతం. ఇరుపక్షాల మధ్య ఘర్షణలు, యుద్ధాలు, ఎత్తులు, పైఎత్తులు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ఒకసారి దేవతలు, మరొకసారి రాక్షసులు గెలుస్తూ ఉంటారు. దేవతలకు, ఋషులకు, మానవులకు... రాక్షసుల వలన కష్టం కలిగినప్పుడు వారిని కాపాడటం కోసం శ్రీమహావిష్ణువో, అమ్మవారో ఏవో అవతారాలు ఎత్తుతూ ఉంటారు.

ఏ అవతార ప్రయోజనమైనా దుష్టశిక్షణ, శిష్టరక్షణ. అంటే దుష్టులైన రాక్షసులను శిక్షించటం ద్వారా శిష్టులైన దేవమానవ గణాలను రక్షించటం, ఈ వరుస ప్రకారం అవతారలక్ష్యం- మొదట దుష్టశిక్షణ అవుతోంది. అది పూర్తయ్యే లోపల శిష్టులు బాధపడక తప్పటం లేదు. బాధలను ఎక్కువకాలం భరించవలసి వస్తోంది. రాక్షసులకు మొండిపట్టుదల, అతితెలివితేటలు ఎక్కువ. తమ ఇష్టదైవం ప్రత్యక్షమయ్యే వరకు ఘోరమైన తపస్సు చేస్తారు. ప్రత్యక్షం కాగానే కాదనటానికి వీలులేని చిత్రవిచిత్ర వరాలు పొందుతారు. వారి ప్రధాన శత్రువులైన దేవతలపై ఆధిపత్యం సాధించి వారిని ఏడిపించేటప్పుడు మధ్యలో మానవులు ఇబ్బంది పడతారు.

దుర్గముడనే రాక్షసుడు బ్రహ్మను గురించి తపస్సు చేశాడు. ప్రత్యక్షం కాగానే వేదాలు, శాస్త్రాలు, మంత్రాలు అన్నీ తనకిమ్మని వరం అడిగాడు. బ్రహ్మ ఇచ్చాడు. దాంతో వేదాలు మొదలైనవన్నీ దుర్గముడి సొంతం అయినాయి. అవన్నీ... చదువుకున్న వారి దగ్గర నుంచి అదృశ్యం అయిపోయాయి. ఎవరికీ ఏ మంత్రమూ గుర్తు లేదు. యజ్ఞయాగాలు, పూజాపురస్కారాలూ జరగటం లేదు. భూలోకంలో యజ్ఞాలు చేస్తేనే దేవతలకు ఆహారం

అందుతుంది. వారికి ఆహారం అందక బక్కచిక్కిపోతున్నారు. ఇదీ దుర్గముడి తెలివి.

అయితే మానవులు యజ్ఞాలు చెయ్యటం లేదని దేవతలు వర్షాలు కురిపించటం మానేశారు. దాంతో భూలోకంలో కరవు ఏర్పడింది. పంటలు పండక, కూరగాయలు లేక మానవులు మరణిస్తున్నారు. అటు దేవతలూ, ఇటు మానవులూ తమను కాపాడమని అమ్మవారిని ప్రార్థించారు. ఆమెకు విషయం అర్థమైంది. దుర్గముడు అతితెలివిగా దేవతలను బాధపెడుతుంటే, మధ్యలో మానవులు నలిగిపోతున్నారు. ప్రాణాధారమైన నీరు లేక అల్లాడుతున్నారు. ముందు వారిని రక్షించాలి. తరువాత దుష్టశిక్షణ చెయ్యాలి... అనే ప్రణాళికతో ఒళ్లంతా కళ్లు చేసుకుని, కరుణతో భూలోకం వైపు చూసింది. ఆ నేత్రాల నుండి ధారాళంగా వర్షాలు కురిశాయి. క్షణాలలో కూరగాయలన్నీ పండి అమ్మ చేతిలోకి వచ్చాయి. ఆమె 'శాకంభరి' అయ్యింది. కూరగాయలను అందరికీ పంచిపెట్టింది. మానవుల కరవు తీరింది. దేవిని స్తుతించారు. 'నాలాగే మీరు కూడా పండించిన కొన్ని కూరగాయలను పేదలకు పంచిపెట్టండి. నాకు ఇచ్చినట్టే అవుతుంది. వర్షాలు కురుస్తాయి. పంటలకు కూరగాయలకు లోటు ఉండదు. ఇదే నా 'శాకంభరి' అవతార రహస్యం'' అని దీవించింది. ఆ తరువాత దుర్గమాసురుణ్ని సంహరించింది.

నమః శాకంభరి శివే నమస్తే శతలోచనే
సర్వోపనిషదుద్ఘుష్టే దుర్గమాసురనాశిని॥
(దేవీభాగవతం - సప్తమస్కంధం)

57. మానవ సంబంధాలు మరువకూడదు

పాండవులు అయిదుగురూ ద్రౌపదితో కలిసి మహాప్రస్థానానికి వెళ్లారు. దారిలో ఒక్కొక్కరు ఒక్కొక్క కారణంతో పడిపోతూ ఉండగా, మిగిలినవారు ముందుకు సాగారు. చివరకు ధర్మరాజు, వారిని వెంబడిస్తున్న ఒక కుక్క మిగిలారు. ఇంద్రుడు మేళతాళాలతో స్వాగతం చెప్పి, ధర్మరాజును దివ్యరథం ఎక్కమన్నాడు.

'దేవేంద్రా! నా తమ్ముళ్లు, భార్య అందరూ దప్పికతో దారిలో పడిపోయారు. వారు లేకుండా నేను మీతో రాను. వాళ్లను కూడా పిలవండి' అని ధర్మరాజు అంటే ఇంద్రుడు, 'ధర్మరాజా! వాళ్లు శరీరాలు విడిచిపెట్టి స్వర్గానికి చేరారు. వాళ్లు నీకు అక్కడ కనబడతారు. నువ్వు

మానవశరీరంతో స్వర్గానికి వస్తున్నావు. రథం ఎక్కు' అన్నాడు. ధర్మరాజు 'అయితే మాతో వస్తున్న ఈ కుక్కను కూడా రథం ఎక్కించండి' అన్నాడు. ఇంద్రుడు 'దీనికి ఆ స్థాయి లేదు' అన్నాడు. ధర్మరాజు 'నన్ను నమ్మి నాతో ఉన్న ఈ కుక్కను వదిలేస్తే, నాకు పాపం వస్తుంది. శరణు వేడినవాణ్ని వదిలేస్తే... మిత్రునికి ద్రోహం చేసినవాణ్ని, స్త్రీని చంపినవాణ్ని అవుతాను. నాకు స్వర్గం అక్కర్లేదు' అన్నాడు. అప్పుడు ఆ కుక్క యమధర్మరాజుగా ప్రత్యక్షమై ధర్మరాజు ప్రవర్తనను మెచ్చుకున్నాడు. 'ధర్మరాజా! మరణించిన నీ తమ్ముళ్లలో ఒకరిని బ్రతికిస్తాను. ఎవరు కావాలో కోరుకో' అన్నాడు.

'కుంతి బిడ్డలలో నేను బ్రతికి ఉన్నాను. నా సవతి తల్లి మాద్రి బిడ్డలలో కూడా ఒకరు బ్రతకాలి కనుక నకులుణ్ని బ్రతికించు' అన్నాడు. మహావీరులు, సొంత తమ్ముళ్లు అయిన భీమార్జునులను వదిలి నకులుణ్ని బ్రతికించమని అడిగిన ధర్మరాజులోని మానవధర్మరక్షణకు యముడు అతడిని ఎంతో మెచ్చుకున్నాడు. దేవతలు, ఋషులు మొదలైనవారు ధర్మరాజును రథంపై కూర్చోబెట్టి తమ విమానాలపై అనుసరించి మానవశరీరంతో స్వర్గానికి తీసుకువెళ్లారు.

అక్కడ నారదుడు, 'ధర్మరాజా! ఇంతవరకు శరీరంతో స్వర్గానికి వచ్చిన రాజువు నువ్వే. ఎన్నో పుణ్యాలు చేసినవారికి కూడా ఈ భాగ్యం కలగలేదు' అన్నాడు. ధర్మరాజు, 'నారదమహర్షీ! నా తమ్ముళ్లు భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఎక్కడ ఉన్నారో చూస్తేగాని నాకు సుఖం లేదు' అన్నాడు. ఇంద్రుడు 'ధర్మరాజా! మానవదేహంతో స్వర్గానికి వచ్చే అరుదైన అవకాశం నీకు మాత్రమే లభించింది. ఇంకా తమ్ముళ్లు అనే బంధం నువ్వు వదులుకోలేకపోతున్నావు. వాళ్లు సుఖంగానే ఉన్నారులే. వాళ్ల సంగతి వదిలెయ్' అన్నాడు.

ధర్మరాజు 'దేవేంద్రా! మానవదేహం ఉన్నంతవరకు మానవ సంబంధాలను వదులుకోకూడదు. నన్ను ఈ దేహంతో ఇక్కడకు తెచ్చారు కనుక నేను నా వాళ్లను గురించి ఆలోచించడం తప్పుకాదు. వాళ్లను కళ్లారా చూడకుండా నేను ఈ స్వర్గసుఖాలు అనుభవించలేను. వాళ్లను చూపించ ండి. అప్పుడే నేను ఇక్కడ సుఖంగా ఉండగలుగుతాను. అదే నాకు పరమానందం'అన్నాడు.

మానవ సంబంధాల విలువను తెలిపే ఈ 'ఇంద్రధర్మరాజ సంవాదం' మానవుడు ఎంత ఉన్నతస్థితికి వెళ్లినా తన వారిని మరచిపోకూడదని హెచ్చరిస్తోంది.

58. అసూయను జయించాలి

తపస్సు, యజ్ఞాలు, దానాలు, జపాలు, అధ్యయనం, ప్రవచనం వంటివి అన్నీ శ్రద్ధతో ఆచరించవచ్చు. అందరి మెప్పు పొందవచ్చు. సౌమ్యుడు, అజాతశత్రువు అనిపించుకోవచ్చు. ఎన్నిటిని జయించినా అసూయ మిగిలిపోతుంది. దాన్ని జయించటం, వదిలించుకోవటం అసాధ్యం కాదు కాని, కష్టసాధ్యం. 'బోద్ధారో మత్సరగ్రస్తాః (పదిమందికీ చెప్పగల బోద్ధలు అసూయచేతిలో చిక్కుకున్నారు) అని భర్తృహరి మహాకవి బాధపడ్డాడు. మహాభారతంలో నారదుడు ధర్మరాజుకు స్వర్గంలో ఈ చురక అంటించాడు.

అసూయ మనలో ఉన్నదనటానికి గుర్తు ఏమిటంటే, ఎదుటివారిలో తప్పులు, లోపాలు ముందుగా, ఎక్కువగా, పెద్దవిగా కనపడతాయి. ఎదుటివాళ్లు అనర్హులైనా అందలం ఎక్కారనిపిస్తుంది. వారి అర్హతలు కనపడవు. ధర్మరాజును పాంచభౌతిక దేహంతోనే స్వర్గానికి తీసుకువెళ్లారు. రాజులలో ఎవరికీ ఈ గౌరవం లభించలేదు. స్వర్గంలో ప్రవేశించగానే అతను ముందుగా, "నా వాళ్లందరినీ చూడాలి" అన్నాడు. ఇంద్రుడు వెంటనే తగినవానిని పిలిపించి, "ధర్మరాజుకు తనవారిని చూడాలనిపిస్తోందట. నీవు ఇతనిని వెంటబెట్టుకుని వెళ్లి, అందరినీ చూపించు" అన్నాడు. అతను యుధిష్ఠిరుణ్ని వెంటబెట్టుకుని బయలుదేరాడు. వారితోపాటు నారదుడు మొదలైన వారు కూడా వెంట నడిచారు. ముందుగా ధర్మరాజుకు ఉన్నతాసనంపై కూర్చొన్న దుర్యోధనుడు కనిపించాడు. అతడికి అప్సరసలు సేవలు చేస్తున్నారు. సుయోధనుణ్ని అలా చూడగానే ధర్మరాజు గుండె అసూయతో భగ్గుమంది. పక్కనే ఉన్న నారదునితో, "ఇతడు ఇక్కడ ఎలా ఉన్నాడు? పరమలోభి, ముందుచూపు లేనివాడు, రాజులందరి చావుకు కారణమైనవాడు, పతివ్రత అయిన పాంచాలిని అవమానపరిచినవాడు, తులువ అయిన దుర్యోధనుడు ఉన్నచోట నేను ఎలా ఉంటాను? నన్ను నా వాళ్ల దగ్గరకు పంపండి" అన్నాడు.

నారదుడు చిరునవ్వుతో "ధర్మరాజా! ఈ మహారాజు క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధంలో మరణించాడు. ఆ ధర్మంతోనే మిగిలిన రాజులకు మరణాన్ని కలిగించాడు. కనుక ఇది పాపం లెక్కలోకి రాదు. ఈ ధర్మం ముందు ద్రౌపదిని అవమానపరచటం మొదలైన తప్పులన్నీ చిన్నవి అయ్యాయి. ఎవరికి ఏ స్థానం ఇవ్వాలి? దేనికి ఎంత శిక్ష విధించాలి? మొదలైనవన్నీ ఇక్కడివారు చూసుకొంటారు. నిన్ను శరీరంతో స్వర్గానికి రప్పించటం వలన ఈ పుణ్యలోకంలో కూడా నీలో అసూయ నిద్రలేచింది. అది నశించలేదు.

ఈ లోకంలో ఈసు, అసూయ, రోషం వంటి మనోవికారాలు పనికిరావు. వాటిని వదిలిపెట్టి సమతను పెంపొందించుకో. జూదంలో, యుద్ధంలో ఇతడు చేసిన పాపాల వలన నీకు కలిగిన బాధను మరిచిపో. ఎలా సమర్థించినా నువ్వు చాలామంది రాజుల మరణానికి కారణమయ్యావు" అన్నాడు.

దేశకాల పాత్రతలను బట్టి చట్టాలలో తేడాలు ఉంటాయి. మన మామూలు కంటికే సహజంగా వక్రీకరణ దోషం ఉంటుంది. దానికి అసూయ తోడయితే అజాతశత్రువనిపించుకున్న ధర్మరాజు కూడా దారి తప్పుతాడని తెలిపే ఈ 'ధర్మరాజ నారద సంవాదం' (స్వర్గారోహణ పర్వం) మానవులందరికీ ఋజుమార్గాన్ని చూపిస్తోంది.

59. జ్ఞానభూమి - శ్రావణపౌర్ణమి

మిగిలిన నెలల్లో వచ్చే పూర్ణిమల విశిష్టత కంటె శ్రావణపూర్ణిమకు మరెన్నో ప్రత్యేకతలున్నాయి. ఇరవై ఏడు నక్షత్రాలలో ప్రధానమైన పన్నెండులో, పున్నమి చంద్రుడు ఉండే మాసాలకు ఆ పేర్లు వచ్చాయి. ఆ పన్నెండు నక్షత్రాలలో కూడా మరింత శ్రేష్ఠమైనది శ్రవణం. అది శ్రీమన్నారాయణుడు జన్మించిన నక్షత్రం. దానిలో చంద్రుడు ఉండే మాసం శ్రావణం. శ్రావణపూర్ణిమనాడు స్వామివారి జన్మనక్షత్రం కనుక లక్ష్మీదేవికి, ఆమె సోదరుడు చంద్రునికీ ఈ పౌర్ణమి ఎంతో ప్రీతిపాత్రం.

శ్రావణపౌర్ణమికి యుగయుగాలుగా భారతీయ సంస్కృతిలో ఇచ్చిన ప్రాధాన్యం బహుముఖీనం. శ్రీమహావిష్ణువు విద్యాస్వరూపుడుగా హయగ్రీవుడైనాడు. అన్ని విద్యలకూ ఆయనే ఆధారం. ఆయన జ్ఞానానంద స్వరూపుడు. స్వచ్ఛమైన స్ఫటికంలాగ ఉండే హయగ్రీవుని జయంతి అయిన శ్రావణ పౌర్ణమినాడు వేదాలను రక్షించుకోవలసిన బాధ్యతను గుర్తుచేస్తూ, దానిని వేదారంభదినంగా ప్రకటించి, విద్యార్థులతో వేదారంభం చేయిస్తారు. వైదికమైన వ్రతాలు ఆచరించటానికి దీక్ష తీసుకునే వ్రతారంభదినం కూడా ఇదే. అన్నదమ్ములు అక్కచెల్లెళ్లకు అండగా ఉంటామని వారిచేత రక్షాబంధనాన్ని కట్టించుకునే రాఖీపూర్ణిమ కూడా ఇదే.

బలిచక్రవర్తికి అతని చెల్లెలు, యమునికి అతని చెల్లెలు యమి శ్రావణపౌర్ణమినాడు

రక్షాబంధనం కట్టినట్టున్న పౌరాణిక గాథల్లో ఆత్మీయత, అనుబంధం నెలకొన్నాయి. నేటికీ భారతీయ సంతతి దేశవిదేశాల్లో సైతం ఈ ఆచారాన్ని పాటించడ ం మానవసంబంధాల మహనీయతను తెలియచేస్తుంది. తల్లిదండ్రులు, అన్నదమ్ముల నుంచి దూరమై మెట్టినింటికి చేరిన ఆడపిల్లలకు కష్టసుఖాలలో అండదండగా ఉండే బాధ్యతను అన్నదమ్ములకు గుర్తు చేసే పర్వంగా శ్రావణపౌర్ణమి రూపొందింది. ఈ పౌర్ణమి హద్దుగా ఏ వ్రతానికైనా దీక్షపూనే రక్షాబంధన దినం ఇది.

యజ్ఞయాగాది కర్మకాండను రక్షించటానికి నూత్న యజ్ఞోపవీతాలు ధరించే 'జంధ్యాల పున్నమి', వేదశాస్త్రాలను రక్షించటానికి ఉపాకర్మ చేసి గురుకులానికి వెళ్లే 'వేదపూర్ణిమ', తోబుట్టువులు ఒకరినొకరు రక్షించుకొనేందుకు రక్షలు కట్టుకొనే 'రాఖీపూర్ణిమ', 'గోసంరక్షణ' వంటి వ్రతాలను చేపట్టే వ్రతముహూర్త పౌర్ణమి... ఇలా ఒకే పౌర్ణమి తిథినాడు ఇన్ని పున్నములు రావటం శ్రావణమాసంలోనే జరుగుతుంది. వర్ష ఋతువులో నదులకు రజోదోషం ఉంటుంది. అప్పుడు నదుల్లో స్నానం చేయకూడదు. శ్రావణపౌర్ణమినాడు ఆ దోషం ఉండదు. అందరూ నదీస్నానం చెయ్యాలి. ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు విడవాలి. దానధర్మాలు చెయ్యాలి. మిగిలిన పున్నములు అనధ్యయనాలు. పాఠాలు చెప్పకూడదు. కానీ శ్రావణ పౌర్ణమినాడు చెప్పవచ్చు. ఏ సత్కార్యానికైనా బద్ధకంకణులయ్యే ప్రత్యేకత ఈ పున్నమికే ఉంది.

యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః
తేన త్వామపి బధ్నామి రక్షే మాచల మాచల (నిర్ణయసింధువు)

(రాక్షసరాజైన బలిచక్రవర్తికి అతని సోదరి రక్ష కట్టినట్టు, నేను నీకు కడుతున్నాను. ఓ రక్షాబంధనమా! జారిపోకు) అనే శ్లోకాన్ని చదువుతూ రక్షాబంధనాన్ని కట్టిన తోబుట్టువులను యథాశక్తి సత్కరించాలి. శ్రావణపౌర్ణమిని సద్వినియోగం చేసుకుందాం.

60. కృష్ణం వందే జగద్గురుమ్

శ్రావణ బహుళ అష్టమినాడు భూమికి అవతరించిన చిన్నిశిశువు శ్రీకృష్ణుడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధ్యేయంగా ఏర్పడిన పది అవతారాలలో, మిగిలినవి అంశావతారాలుగా చెప్పబడ్డాయి. కృష్ణావతారం సంపూర్ణావతారం. కృష్ణస్తు భగవాన్ స్వయమ్ (శ్రీకృష్ణుడు భగవంతుడు) అని మహర్షులు ఈ అవతారాన్ని కీర్తించారు. ఐశ్వర్యం (ప్రభుత్వం), సమగ్రత, పరాక్రమం, కీర్తి, సంపద, జ్ఞానవైరాగ్యములు కలిగి ఉంటే, భగవంతుడు అవుతాడు.

భాగవతంలో శ్రీకృష్ణుని జననం, బాల్యం, లీలలు, కంసవధ మొదలైన ఘట్టాలు, మహాభారతంలో పాండవుల పక్షాన ఉండి చూపించిన రాజనీతి చాతుర్యం, ధర్మరక్షణకై చేసిన గీతోపదేశం... మానవజాతి మనుగడను సరిదిద్దటానికి చేసిన ప్రణాళికగా... భగవంతుని లక్షణాలన్నీ శ్రీకృష్ణునిలో కనబడతాయి. కనుక కృష్ణభగవానుడు అయ్యాడు. అలాగే కృష్ణపరమాత్మ అనే పిలుపు కూడా ఈ అవతారానికే చెల్లింది. పరమాత్మ రూపరహితమై సృష్టికి మూలకారణమై, సృష్టిలో అంతటా వ్యాపించి ఉంటుంది. దానిలో నుండి వెలువడిన భిన్నరూపాలు జీవాత్మలుగా బ్రతుకుతూ మళ్లీ పరమాత్మలో లీనమైపోతూ ఉంటాయి. ఈ జీవులు బ్రతికినంతకాలం ధర్మబద్ధంగా, క్రమశిక్షణతో గడపాలి. వాళ్లలో వాళ్లు స్వార్థంతో కొట్టుకొని చచ్చిపోకూడదు.

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలకు లొంగిపోకూడదు. అలా జరిగినప్పుడు రూపరహితమైన పరమాత్మ రూపాన్ని ధరించి భూలోకానికి వచ్చి సరిచేస్తూ ఉండటమే జగన్నాటకం. జీవాత్మకు ప్రతినిధియైన అర్జునుని రథాన్ని తానే నడుపుతూ పరమాత్మ అతనిలోని లోపాలను సవరించటానికి చేసిన బోధ 'భగవద్గీత' అయ్యింది.

పరమాత్మ భగవంతుడై, భగవంతుడు శ్రీకృష్ణుడై మానవజాతి సంక్షేమం కోసం ద్వాపరయుగాంతంలో సమగ్రమైన మార్గదర్శకసూత్రాలను అందించాడు. అందుకే శ్రీకృష్ణుని పుట్టినరోజు మనకు పండుగరోజు అయ్యింది. భగవద్గీత సర్వకాల, సర్వావస్థలలో, సర్వ మానవులను ఆకర్షిస్తూ ఉంటుంది. కృష్ణశబ్దానికి అదే అర్థం 'కర్షతి ఇతి కృష్ణః' (ఆకర్షించువాడు). 'గీత' అంటే 'గానం చేయబడింది'. దాన్నే 'గీతాశాస్త్రం' అని కూడా అంటారు. అది మానవజాతిని శాసిస్తుంది. అటువంటి శాసనాన్ని భగవంతుడు తియ్యగా గానం చేశాడు. శిష్యులకు కఠినమైన పాఠాన్ని సులువుగా అర్థం అయ్యేటట్లు ఎలా చెప్పాలనే విషయం బోధనా నైపుణ్యం గల గురువుకే తెలుస్తుంది. అందుకే శ్రీకృష్ణుడు జగద్గురువు

అయ్యాడు. గీత అన్నికాలాల్లో, అన్ని దేశాల్లో మానవులందరికీ పాఠ్యగ్రంథం అయ్యింది.

ఎప్పుడెప్పుడు మానవుడు ఆత్మశక్తిని కోల్పోతాడో అప్పుడప్పుడు గీత నూత్న తేజస్సును ఇచ్చి పునరుజ్జీవింపచేస్తూ ఉంటుందని స్వామి వివేకానంద వంటి మహనీయులు ఎందరో ప్రపంచానికి చాటిచెప్పిన గీతను, వె న్నముద్దలా మనకు ప్రసాదించిన వెన్నదొంగకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు చెబుదాం.

'కృష్ణం వందే జగద్గురుమ్'

61. త్రివర్ణపతాకం తీరుతెన్నులు

పతాక ఒక జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. ఏ రంగంలో ప్రముఖుడైనా, ప్రపంచ ప్రఖ్యాతినందినవాడైనా సామాన్యుని వలె తన జాతీయ పతాకానికి వందనం చేసి, ఆ నీడలో నిలవాల్సిందే. ప్రపంచంలో ప్రతి దేశానికీ జాతీయపతాకంతోనే గుర్తింపు లభిస్తోంది. పతాకం జాతిసమైక్యత, సమగ్రతలకు మూలవిరాట్టు. మహాభారతకాలంలో వ్యక్తిగతంగా ఎవరి పతకాలు వారికి గుర్తింపునిచ్చేటట్లు ఏర్పరచుకున్నారు. ప్రాచీన భారతదేశం ఛప్పన్నారు స్వతంత్రరాజ్యాలుగా ఉన్నకాలంలో ఏ రాజ్య పతాకం ఆ రాజ్యానికి ఉండేది. మహమ్మదీయులు, డచ్చివారు, పోర్చుగీసులు మనదేశంలో అన్ని ప్రాంతాలను ఆక్రమించినా ఎక్కడికక్కడ వారి వారి పతాకాలు ఎగిరాయి. ఆంగ్లేయులు వివిధ సంస్థానాలను స్వాధీనం చేసుకుంటూ మొత్తం దేశంపై ఆధిపత్యం సాధించి, వారి వలసరాజ్యంగా తమ పతాకాన్ని ఈ దేశంలో ఎగురవేసినప్పుడు, భారతీయులలో సంస్కృతి పరమైన సమైక్యభావం జాతిపరంగా మేల్కొంది.

భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, కులాలు, మతాలు, వేరువేరుగా ఉన్నా... ఈ దేశం లో పుట్టినవారందరిదీ ఒకే జాతి. అది భారతజాతి. భారతదేశము నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు... అనే ఏకసూత్రత భారతదేశాన్ని ఒకే పతాకం కిందికి తెచ్చింది. 1921 మార్చి 31న గాంధీమహాత్ముడు విజయవాడ మహాసభలకు విచ్చేసినప్పుడు పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణపతాకాన్ని కొద్ది మార్పులతో ఆమోదించటంతో జాతీయపతాకం రూపుదిద్దుకుంది. భారతదేశ జాతీయ పతాకాన్ని రూపొందించిన ఘనత తెలుగువారికి దక్కింది. విడగొట్టి పాలించే దుష్టనీతితో దేశాన్ని

ఆక్రమించిన ఆంగ్లేయులను వెడలగొట్టడానికి వందేమాతరం నినాదం, త్రివర్ణపతాకం ఆసేతుహిమాచలం స్వాతంత్ర్యసంగ్రామ స్ఫూర్తిని ఇచ్చాయి. మహోద్యమం తీవ్రతరమై 1947, ఆగస్టు 15 నాటికి స్వతంత్ర భారతదేశం ఆవిర్భవించి సర్వసత్తాకం కావటానికి మూలకారణం త్రివర్ణపతాకమే.

అశోకుని ధర్మచక్రంతో, కాషాయం, తెలుపు, ఆకుపచ్చరంగులతో రూపొందించబడిన జాతీయపతాక విశిష్టతను, ప్రత్యేకతను పెద్దలు అనేక విధాలుగా అభివర్ణించారు. కాషాయాన్ని ధైర్యం, మతసామరస్యాలకు, తెలుపును శాంతికీ, ఆకుపచ్చను సమత సస్యశ్యామలతకూ ప్రతీకాత్మకంగా ఏర్పరిచారు. మధ్యలోని చక్రం సంపూర్ణతకూ, నిరంతర ప్రగతి చలనానికీ, అభివృద్ధికీ సంకేతం. చక్రంలోని 24 గీతలు దర్శనాలను సూచిస్తాయి. ధర్మం, సత్యం, శాంతి, అహింస, సామరస్యం, సమైక్యభావం, ప్రకృతితో సహజీవనం, వ్యవసాయం... భారతీయ సంస్కృతిని, అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిరూపించే ప్రధానాంశాలను, ఆత్మగౌరవంతో వినీలాకాశంలో రెపరెపలాడుతూ ప్రపంచానికి తెలిపే మన జాతీయపతాకం మహనీయత మాటలకందనిది. 22 జూలై 1947న భారత రిపబ్లిక్ జాతీయపతాకంగా తీర్మానించబడిన త్రివర్ణపతాకం భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెడుతూ, భారతీయుల వందనాలను ఆత్మీయతతో, దేశభక్తితో అందుకుంటోంది. జాతీయపతాకం నీడన భారతదేశం అగ్రరాజ్యంగా నిలుచుగాక! జై భారత్!!!

62. నీతి నీడలో నిలుద్దాం

లంచాలు, కానుకలు, విలాసవంతమైన ఏర్పాట్లు, స్వాగతసత్కారాలు మొదలైనవాటితో ఎదుటివారిని లొంగదీసుకొని వారిచేత పనులు చేయించుకునేవారి కథలు, కథనాలు... వందలు, వేల సంఖ్యలో నిత్యం చూస్తున్నాం, వింటున్నాం. ప్రతివ్యక్తికీ ఏదో ఒక బలహీనత ఉండి తీరుతుంది. దాన్ని తెలుసుకోవాలి. ఆ మార్గంలో అతడిని సంతోషపెట్టి నూటికి నూరుపాళ్లు విజయం సాధించవచ్చునని మహాభారతంలో కణికుడు చెప్పిన వక్రనీతులన్నిటినీ ఒంటపట్టించుకొని ధృతరాష్ట్రుడు చివరివరకూ ఆచరణలో పెట్టాడు. గుడ్డివాడుగా, అశక్తుడుగా పైకి కనిపించే ధృతరాష్ట్రుణ్ని లోతుగా పరిశీలిస్తే, మానవుని మనస్సు వక్రమార్గంలో ప్రయాణించి ఎన్ని ఉత్పాతాలు సృష్టిస్తుందో స్పష్టమౌతుంది.

పాండవులకు ఇవ్వవలసిన రాజ్యాన్ని ఇవ్వకుండానూ, వారు యుద్ధానికి రాకుండానూ ఎంతో తెలివిగా వారిని పొగుడుతూ రాయబారం చేసుకొని రమ్మని సంజయుణ్ని పంపాడు. సంజయుడు ధృతరాష్ట్రుడు చెప్పమన్న విధంగా యుద్ధమంటే విరక్తి కలిగించే విధంగా చతురతతో అంతా చెప్పాడు. దాంతో పాండవులు చల్లబడతారని ధృతరాష్ట్రుడు అనుకున్నాడు. కానీ వాళ్లు కృష్ణుణ్ని రాయబారిగా పంపుతున్నారని తెలిసేసరికి అతన్ని ఎలా లొంగదీసుకోవాలో, అన్ని ప్రయత్నాలూ చేశాడు. కృష్ణుడు వస్తున్నాడనే వార్త రాగానే నిండుసభలో స్వాగతసత్కారాల వివరాలు ఇలా ప్రకటించాడు...

“శ్రీకృష్ణునికి బంగారు నగలు కట్టిన ఖరీదైన గుర్రాలు ఎన్నో ఇస్తాను. పదహారు బంగారు రథాలను, ఎనిమిది గొప్ప ఏనుగులను, అందమైన దాసీలను వందమందిని, పట్టుబట్టలను, చీనిచీనాంబరాలను కొన్నివేలు... కానుకగా ఇస్తాను. సూర్యచంద్రుల్లాగా మెరిసే రత్నాలను బహుమతిగా ఇస్తాను. విలువైన ఆభరణాలతో అలంకరించుకొన్న అందమైన వేశ్యలను వేలాదిమందిని ఇస్తాను. దుర్యోధనుని సౌధం కంటె గొప్పదైన దుశ్శాసన భవనంలో వసతి ఏర్పాటు చేస్తాను. దాన్ని బాగా అలంకరించండి. ఖరీదైన మణులు, మాణిక్యాలు, వజ్రవైడూర్యాలు మొదలైనవాటిని ఆ భవనంలో అక్కడక్కడ పెట్టిస్తాను. ఏ వస్తువుపైన కృష్ణుని చూపు పడితే అది అతను తీసుకోచ్చు.”

ధృతరాష్ట్రుడు గుడ్డివాడైనా వస్తువాహనాలు, కాంతాకనకాలు, వస్త్రాభరణాలు ఈనాటి నాయక అధికారులను లొంగదీసే ఉదంతాలను వెండితెరపై చూపించాడు. ఇందులో కపటాన్ని కనిపెట్టిన విదురుడు, ‘రాజా! పాండవులు అయిదు ఊళ్లు అడిగినా ఇవ్వటం ఇష్టం లేని నువ్వు కృష్ణుడి కోసం ఇంత ఖర్చుపెడుతున్నావంటే ఇందులోని మోసం ఎవడైనా తెలుసుకుంటాడు. కృష్ణుడు ఇటువంటి వాటికి లొంగడు. పాండవులను వదిలిరాడు’ అని స్పష్టంగా చెప్పాడు. అలాగే కృష్ణుడు కౌరవుల ఆతిథ్యాన్ని తిరస్కరించాడు. వాళ్లు చూపించే ప్రలోభాలకు లొంగకుండా దూరంగా ఉన్నాడు. కనీసం వాళ్లింట్లో భోజనం కూడా చెయ్యకుండా సరాసరి సభకు వెళ్లాడు.

లంచాలకు, ప్రలోభాలకు తావులేని రాజనీతి, అధికార యంత్రాంగం, కార్యాలయాలతో కళకళలాడే వ్యవస్థను నిర్మించుకుందాం, నిలబెట్టుకుందాం. ఇదే మహాభారత నిత్యసందేశం.

63. ఇవన్నీ సత్యాలే...

'సత్యమేవ జయతే' అని వేదవాక్యం. సత్యమే ఎప్పటికైనా గెలుస్తుంది. ఈ దృఢవిశ్వాసంతోనే అన్నిమతాలూ సత్యానికి ప్రథమస్థానం ఇస్తున్నాయి. సత్యం వద, ధర్మం చర (సత్యాన్ని పలుకు, ధర్మాన్ని ఆచరించు) అనే శాసనం సత్యభాషణం. తర్వాతనే ధర్మ ఆచరణ గురించి చెబుతోంది. "తాతా! దేవతలు, పితృదేవతలు, మానవులు అందరూ సత్యాన్ని ప్రశంసిస్తున్నారు. అసలు సత్యం అని దేనిని అంటాం? దాని స్వరూపం ఎలా ఉంటుంది?" అని ధర్మరాజు భీష్ముణ్ని అడిగాడు. అప్పుడు భీష్ముడు సత్యస్వరూపాన్ని ఇలా వివరించాడు...

నాయనా! ధర్మరాజా! సత్యం అంటే ఉన్నది ఉన్నట్లు మాట్లాడటమే కాదు. ఆ మాటకు చాలా విశాలమైన భావం ఉంది. సత్యం అనేక రూపాలలో ఉంటుంది. ఉన్నది ఉన్నట్లు తెలుసుకొని భ్రమ ప్రమాదాలు లేకుండా చరించటమే సత్యమార్గం అవుతుంది. ఆ మార్గంలో ఎవరికైనా తప్పకుండా గెలుపు లభిస్తుంది. సమత, దమము, తితిక్ష, అమత్సరము, హ్రీ, ధృతి, అనసూయ, ఆర్యత్వం, అహింస, దానం, క్షమ, త్యాగం, సత్యభాషణ ఇవన్నీ సత్యస్వరూపాలు. ఈ పదమూడింటిలో ఒక సత్యభాషణాన్ని మాత్రమే సత్యం అనుకుంటున్నారు. మిగిలినవి కూడా సత్యమే. వేరువేరు పేర్లతో ఉన్నా, వాటి ఆచరణ సత్యదర్శనం వల్లనే సాధ్యం అవుతుంది. అందరూ తనతో సమానమే అనే సత్యాన్ని తెలుసుకోవడం 'సమత'. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వాటి పని ఎంతవరకు చెయ్యాలో అంతవరకే చెయ్యాలి అనే సత్యాన్ని తెలుసుకొని అదుపులో పెట్టడం 'దమం'. సహించగలగటం 'తితిక్ష'. ఎదుటివారి వైభవానికి కుళ్లుకోకుండా ఉండటం 'అమత్సరం'. తన వైభవానికి గర్వించకుండా వినయంగా ఉండటం 'హ్రీ'. ఆ వైభవం... సిరిసంపదలు, ప్రతిభా పాండిత్యాలు ఏవైనా కావచ్చు.

ఎటువంటి సమస్యలు, కష్టాలు, నష్టాలు, ఆపదలు వచ్చినా... ఇవేవీ శాశ్వతం కాదు... అనే సత్యదృష్టితో భరించగలగటం 'ధృతి'. ఇది లేనివారు ఆవేశానికీ, దుఃఖానికీ, ఆత్మహత్యకూ పాల్పడతారు. ఎవరి అభివృద్ధినైనా కోరుకోవటం, వారి ప్రగతికి ఆనందించటం 'అనసూయ' అనే సత్యం అవుతుంది. అందరినీ పూజ్యులుగా భావించటం, గౌరవించటం 'ఆర్యత్వం'. ఇతరప్రాణులూ, తానూ వేరు కాదనే సత్యజ్ఞానంతో ఎవరినీ శారీరకంగా, మానసికంగా బాధించకుండా ఉండటం 'అహింస'. తన దగ్గర ఉన్నది ఎదుటివారికి ఇవ్వటానికే అనే

సత్యాన్ని గ్రహించి ఆచరించేది ‘దానం’. జాలి, కరుణ సహజగుణాలుగా కలిగి ఉంటే ఎవరిలోనూ తప్పులు కనపడవనే సత్యదర్శనమే ‘క్షమ’. అన్నీ నావే అనుకోవటం దుఃఖానికి కారణం, ఏదీ నాది కాదు అనుకోవటమే ఆనందం అనే సత్యం యొక్క ఆచరణ పేరు ‘త్యాగం’.

“ధర్మరాజా! ఇప్పుడు నీకు సత్యస్వరూపం తెలిసిందా! మానవుని ప్రతి కదలికా సత్య సమన్వితమే. ఇదే మహాసత్యం” అని మహాభారతం శాంతిపర్వంలో భీష్ముడు ఇచ్చిన వివరణ ఎంతో విలువైనది.

64. ఎవరూ తప్పించుకోలేరు

ఒక గురువుగారి దగ్గర నలుగురు శిష్యులు వేదాంత పాఠాలు నేర్చుకున్నారు. భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు... అన్నీ స్పష్టంగా, శ్రద్ధగా విన్నారు. ఒకనాడు గురువుగారు ‘నాయనలారా! మీరు నలుగురూ మొత్తం వేదాంతాన్ని ఏకాగ్రతతో గ్రహించారు. మీకు ఒక్కొక్కరికీ ఒక్కొక్క అరటిపండు బహుమతిగా ఇస్తున్నాను. ఎవ్వరూ చూడకుండా, ఎవరికీ కనపడనిచోట ఈ పండు తిని వచ్చి, నాకు కనపడండి. ఆ తరవాత మిమ్మల్ని ఇళ్లకు పంపించేస్తాను’ అన్నాడు. నలుగురూ చకచకా నాలుగు దిక్కులకు బయలుదేరారు. అందులో ఒకడు ఆశ్రమానికి దగ్గరలో ఉన్న నదిలో మునిగి, నీళ్లలో ఎవరికీ కనపడకుండా గురువుగారు ఇచ్చిన పండు తినేశాడు. మరొకడు అడవి లోపలికి పోయి, ఎవరికీ తెలియకుండా తిన్నాడు. ఇంకొకడు కొండపైకెక్కి, చీకటి గుహలోకి పోయి ఎవరికీ తెలియకుండా గుటుక్కున మింగేశాడు.

ఆ ముగ్గురూ విజయగర్వంతో, చిరునవ్వుతో గురువుగారి దగ్గరకు వచ్చారు. తాము ఎవరికీ కనపడని ప్రదేశాలను కనిపెట్టి, ఎవరికీ తెలియకుండా, ఎవరూ చూడకుండా పండు ఎలా తినగలిగారో వివరిస్తూ తమ తెలివితేటలను తామే పొగుడుకున్నారు. గురువుగారు అన్నీ చిరునవ్వుతో వింటున్నారు.

నాలుగవవాడు మాత్రం గురువుగారు ఇచ్చిన పండు తినకుండా తీసుకువచ్చి మౌనంగా నిలబడ్డాడు. ‘ఎవరూ చూడకుండా తినటం నాకు సాధ్యం కాలేదు గురువుగారూ!’ అనగానే మిగిలినవాళ్లు అతని తెలివితక్కువతనానికి పకపకా నవ్వారు. ‘ఎందుకు సాధ్యం కాలేదు?’

అని గురువుగారు అడిగారు. 'మీరు మాకు చెప్పినదానిని బట్టి మానవులు చేసే పనులు ఏవైనా మానవులే కాకుండా చూసేవారు ఇంకా చాలామంది ఉన్నారు. వారిని తప్పించుకోవడం ఎవరికీ కుదిరేపని కాదు. అందువలన నాకు సాధ్యం కాలేదు' అన్నాడు. గురువుగారు అతని అధ్యయనాన్ని మెచ్చుకున్నారు. మిగిలినవారు సిగ్గుతో తలవంచుకున్నారు.

మహాభారతంలో శకుంతల దుష్యంతునితో, 'మహారాజా! నాలుగు వేదాలు, పంచభూతాలు, ధర్మం, సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి... అనే మహాపదార్థాలు ప్రతిక్షణం ప్రాణుల కదలికలన్నిటినీ గమనిస్తూ ఉంటాయి. ఎవరైనా ఏదైనా పని చేసినప్పుడు, సాటి వారి నుండి తప్పించుకున్నప్పటికీ, వీటి నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఏ మానవుడూ తనను తాను మోసం చేసుకోలేడు' అని ఖచ్చితంగా చెప్పింది.

ఎంతటి తక్కువ తెలివిగలవాడైనా శకుంతల చెప్పిన పట్టికలో ఎవరో ఒకరికి దొరక్కుండా తప్పించుకోవడం అసాధ్యం. అంత పకడ్బందీగా నిఘా విభాగం పనిచేస్తోందని తెలిసిన తరువాత ఎవరికి వారు అంతరాత్మ న్యాయస్థానంలో స్వచ్ఛందంగా నిలబడి నేరాన్ని అంగీకరించక తప్పదు. మానవ లోకంలోని శిక్ష కంటె మనోలోకంలోని శిక్ష మరింత బాధాకరం. అది కనపడకుండా కాలుస్తుంది. ఆధివ్యాధుల రూపంలో తరతరాలుగా సాధిస్తుంది. మహాభారతం మానవజాతి మదిలో మెదులుతుంటే న్యాయస్థానాలకు, రక్షకభటనిలయాలకు పని తగ్గుతుంది.

65. నిందితాత్ములకిచ్చుట నిష్ఫలంబు

మన దగ్గర ఉన్నదానిని ఇతరులకు ఇవ్వటం 'దానం', ఇచ్చిన దానిపై హక్కును వదులుకుంటే 'త్యాగం', ఉన్నది దాచుకోకుండా అందరికీ పంచాలి, అలా చెయ్యనివాడు 'దొంగ' అవుతాడు... అని వేదధర్మం చెబుతోంది. దానిని బట్టి దానాన్ని ధర్మంతో కలిపి 'దానధర్మాలు' అంటున్నాం. బిచ్చగాళ్లు కూడా 'ధర్మం చెయ్యండి బాబూ' అంటున్నారు. దానాన్ని అచ్చతెలుగులో 'ఈగి'అంటారు. అనగా ఇవ్వటం అని అర్థం.

భారతీయ సంస్కృతిలో చెప్పిన దానాలు ఎన్నో ఉన్నాయి. దశదానాలు పది. షోడశమహాదానాలు పదహారు. 'అన్నిదానాల్లో అన్నదానం మిన్న' 'విద్యాదానం గొప్పది' మొదలైన

సూక్తులు ఏనాటి నుంచో ఉన్నాయి. ఇప్పుడు నేత్రదానం, రక్తదానం, అవయవదానం, దేహదానం గురించి నినాదాలు, సుభాషితాలు ఏర్పడ్డాయి. అయితే ఏ దానమైనా ఎప్పుడైనా అర్హులైనవారికీ, పాత్రులైనవారికీ ఇస్తేనే సఫలమౌతుంది. కాకపోతే నిష్ఫలం అవుతుంది. కురుక్షేత్ర యుద్ధం తరువాత ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగేటప్పుడు వ్యాసమహర్షి ఇలా అన్నాడు...

'ధర్మరాజా! దానం తప్పకుండా చెయ్యాల్సిందే. కాని అర్హత కలిగినవాళ్లకు మాత్రమే చెయ్యాలి. అపాత్రదానం వలన పుణ్యం రాదు. అది విలాసం కిందికో, అనవసర వ్యయం కిందికో వస్తుంది. దీనులు, ఆపదలో ఉన్నవారు దానానికి తగినవారు. వారిలో కూడా చెడుగుణాలు ఎక్కువగా కనపడేవారికి ఏమీ ఇవ్వకూడదు. ఆటపాటలతో బతికేవారు, విదూషకులు, అంగహీనులు, దుర్జనులు, మత్తులో ఉన్నవాళ్లు, దొంగలు, మతిభ్రమించినవాళ్ళు, నపుంసకులు, ఇచ్చకపుమాటలు చెప్పేవారు, తాము చేసేపని మానుకొని చెడుపనులు చేసేవారు దానపాత్రులు కారు.

అపాత్రదానంతో పుణ్యం పొందాలనుకోవటం బండరాయితో సముద్రాన్ని దాటాలనుకోవటమే. పుట్టిలో, కుక్క తోలుతిత్తిలో పోసిన పాలు, నీళ్లు అపవిత్రం అయినట్లే అపాత్రదానం వృథా అవుతుంది. అసమర్థునికి పిల్లనిచ్చినట్టు, బూడిదలో నెయ్యి పోసినట్టు, ఓటి కడవలో నీళ్లు పట్టినట్టు... అపాత్రదానం నిష్ప్రయోజనం అవుతుంది. అటువంటి దానం మేలుచేయకపోగా కీడు చేస్తుంది. పాత్రులైనవారికి యథావిధిగా చేసిన దానం ఇచ్చినవారికీ, పుచ్చుకొన్నవారికీ... ఇహలోకంలోనూ, పరలోకంలోనూ క్షేమదాయకం అవుతుంది.

వ్యాసుడు చెప్పిన అపాత్రులలో 'అంగహీనులు' అనేది లోతైనమాట. అటువంటివారిని రాజు మాత్రమే పోషించాలి. ఎందుకంటే... వారికి అందరూ దానం చేస్తూంటే, వారిని చూసి మరికొందరు తాము బతకడానికి దీనినొక మార్గంగా, కావాలని క్రూరంగా అంగవైకల్యం కల్పించే దుర్మార్గులు తయారవుతారు. స్వయంగా కూడా కొందరు కల్పించుకోవచ్చు. దీనిని నిషేధించటానికే అంగహీనులు దానానికి అర్హులు కాదు... అని వేదసమ్మతమైన ధర్మనీతిని మహాభారతం ద్వారా లోకానికి అందించాడు వ్యాసమహర్షి.

66. ప్రకృతి ప్రగతి చవితి

భారతీయ సంస్కృతిలోని విశిష్టతను, విజ్ఞతను తెలియచేసే విధంగా పండుగలు ఏర్పడ్డాయి. ప్రతి పండుగలోనూ వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, సమైక్యత, సమగ్రత వెల్లివిరిసే ప్రణాళిక కనిపిస్తుంది. వాటిల్లో వినాయక చతుర్థి ఎన్నో కోణాలలో ప్రాధాన్యాన్ని సంతరించుకొంది.

విశేషమైన నాయకత్వ లక్షణాలు కలవాడు వినాయకుడు. గణాలన్నిటినీ ఒక తాటిపై నడిపించే నాథుడు గణనాథుడు. తనను పూజించి తన పర్యవేక్షణలో ఏ పని ఎవరు చేపట్టినా నిర్విఘ్నంగా, నిరాటంకంగా పూర్తి చేసే విధంగా వినాయకుని రూపం ఉంటుంది.

ఏనుగు తల, పెద్ద చెవులు, తొండం, పెద్ద బొజ్జ మొదలైనవన్నీ మనకు ఒక్కొక్క సందేశాన్ని ఇస్తున్నాయి. అందరినీ నడిపించేవాడు పెద్ద తలకాయ అయి ఉండాలి. అందరూ చెప్పేది చేటంత చెవులతో వినాలి. తొండంతోనే నీటిని, గాలిని పీల్చే విధంగా తగు జాగ్రత్తలతో సమతూకంగా ఎంత తిన్నా ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించని పదార్థాలే ఇష్టపడాలి. ఉండ్రాళ్ళు, పెసరపప్పు, కుడుములు, పానకం ఇత్యాదిగా గణపతికి నైవేద్యం పెట్టే పదార్థాలన్నీ ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో చెబుతున్నాయి. నూనెలు, ఉప్పు, కారం, తీపి తగ్గించి తినాలి. పిండివంటలు పండుగలప్పుడు మాత్రమే చేసుకొని ప్రసాదంగా తినాలి. రోజూ చేసుకుంటే వాటి ఆకర్షణ తగ్గటమే కాక ఆరోగ్యం దెబ్బతింటుంది. గణపతిగా మానవ గణాలకు ఆయన ఇచ్చే సందేశం ఇది.

'ఆ ఋతువులో దొరికే కాయలు, పళ్లు, కూరలు తప్పక తినాలి. వాటిని గురించి తెలుసుకోవాలి. అవి లభ్యం కావాలంటే ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ఆత్మీయతతో మెలగాలి. అటువంటి పూజాద్రవ్యాలే నేను ఇష్టపడతాను' అని వినాయకుడు విజ్ఞానాన్ని అందిస్తున్నాడు. దేహంలోని ఆరుచక్రాలలో మొదటిదైన మూలాధార చక్రానికి అధిపతిగా భూమి ప్రాధాన్యాన్ని తెలియచేస్తున్నాడు. మరే దేవుడూ కోరని విధంగా తన విగ్రహాన్ని ఈ పండుగనాడు మట్టితోనే చేసి పూజించి, దాని విలువను తెలుసుకోమంటున్నాడు.

పుస్తకాలను కూడా పెట్టి చదువు ఆవశ్యకతను గ్రహించమంటున్నాడు. వెండి, బంగారు ఆభరణాలు, డబ్బుకట్టలు కోరటం లేదు. కదలకుండా కూర్చొని లక్షా పాతికవేల శ్లోకాల మహాభారతాన్ని ఆపకుండా వ్రాసి, వ్రాత అలవాటును మరచిపోకుండా పెంచుకోమంటున్నాడు. విఘ్నేశ్వరుడు శుక్లాంబరధరుడు. తెల్లని వస్త్రాలు ధరించడం సాత్త్వికతకు చిహ్నం. సమాజాన్ని

నడిపేవాడు ఎప్పుడూ చిరునవ్వుతో ఉండాలి. గణపతి ప్రసన్నవదనుడై ఉంటాడు. ఎంతపేదవారైనా లోటు లేకుండా మనస్ఫూర్తిగా తనను పూజించుకునే విధంగా విగ్రహం, పూజా ద్రవ్యాలు, నైవేద్యం మొదలైనవన్నీ నిరాడంబరంగా ఏర్పరచుకున్న గణేశుడు, మానవ సమాజాన్ని నిరాడంబర జీవితంతో, నిండుగా బ్రతకమని అభయహస్తంతో దీవిస్తున్నాడు.

ప్రకృతి, ప్రగతి నిండిన పండుగే వినాయకచవితి.

67. క్రమశిక్షణతోనే తీర్థయాత్రలు సాధ్యం

పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు, అంతరిక్షమంతా తేజస్సుతో వెలుగుతూండగా, నారదమహర్షి ఆకాశం నుండి నేల మీదకు దిగి వారి వద్దకు వచ్చాడు. ధర్మరాజాదులు నారదునికి స్వాగతం చెప్పి, అతిథి మర్యాదలు శ్రద్ధగా చేశాడు. నారదుడు వారి వినయవిధేయతలను మెచ్చుకున్నాడు. 'ధర్మరాజా! నీకేం కావాలో అడుగు' అన్నాడు. ధర్మరాజు 'మహర్షీ! కొందరు ప్రదక్షిణం చేసినట్టు భూమంతా తిరిగి తీర్థయాత్రలు చేస్తుంటారు. అసలు యాత్రలు ఎందుకు చెయ్యాలి? ఎలా చెయ్యాలి? ఈ ధర్మసందేహం తీర్చు' అన్నాడు. 'యుధిష్టిరా! పూర్వం భీష్ముడు పులస్త్య మహర్షిని ఇలాగే అడిగాడు. దానికి ఆయన చెప్పిన సమాధానాన్ని నీకు వినిపిస్తాను, విను. 'తీర్థయాత్రలు అందరూ చెయ్యలేరు. చేతి నిండా డబ్బు, ఒంట్లో ఓపిక ఉన్నా కూడా సంకల్పబలం, కొన్ని నియమాలు క్రమశిక్షణ కలవారు మాత్రమే యాత్రలు చేయగలుగుతారు. అటువంటివారు ఏ సౌకర్యాలు ఆశించకుండా, వాటికోసం ఎదురుచూడకుండా పర్యటనలు చేసి ఆయా ప్రదేశాలను శ్రద్ధతో చూసి వస్తారు. యాత్రలు యాంత్రికంగా చేయటం వలన ప్రయోజనమేమీ ఉండదు. అనుభూతితో చేసిన యాత్రలే సత్ఫలితాన్ని ఇస్తాయి. కనుక యాత్రలు చేసేవారికి ఈ అర్హతలు ఉండాలి.

'జ్ఞానేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం) కర్మేంద్రియాలు (కాళ్లు, చేతులు, నోరు, మల మూత్రావయవాలు) అదుపులో ఉన్నవారు, అహంకారం లేనివారు, అడుక్కునే స్వభావం లేకుండా నిబ్బరంగా ఉండేవారు, తినటానికి ఏ కొంచెం దొరికినా తృప్తిపడే అల్పభోజనులు, అనుకున్నది జరగకపోయినా అత్యంత సంతోషంగా ఉండేవారు, యాత్రను మొక్కుబడిగా కాక వ్రతదీక్షగా మనస్ఫూర్తిగా చేయగలవారు, సదాచారపరులు, చెడు

అలవాట్లకు బానిస కానివారు, ప్రతిదానికీ చిటుక్కున కోపం రానివారు, ధర్మాచరణకు కట్టుబడినవారు మాత్రమే యాత్రలు చేయగలుగుతారు. అటువంటివారు చేసిన యాత్రలే ఫలవంతాలు అవుతాయి. ఈ లక్షణాలు గలవారు భాగ్యవంతులు. లేనివారు భాగ్యహీనులు.

నారదుడు చెప్పిన అర్హతలు అన్నికాలాల్లో అందరూ తెలుసుకోదగినవి. ఆచరణలో పెట్టవలసినవి.

మునుపటి కంటె ఇప్పుడు ప్రయాణ సౌకర్యాలు బాగా పెరిగాయి. సమాచారం క్షణాల్లో తెలుస్తోంది. యాత్రలు... తీర్థయాత్రలైనా, విహారయాత్రలైనా, చేయదలచుకున్నవారి శారీరక మానసిక స్థితులు ఎలా ఉంటే యాత్రలు సఫలమౌతాయో తెలుసుకోవలసిన, తెలియచేయవలసిన బాధ్యత ఇప్పుడు మరింత పెరిగింది. అవగాహన లేకుండా చేసే తీర్థయాత్రలు... కేవలం విహారయాత్రలు మాత్రమే అవుతాయి. విహారయాత్రలు వినోదయాత్రలుగా, వినోదయాత్రలు విషాదయాత్రలుగా రూపుదిద్దుకుంటాయి. ఇహపరసాధనలో, విజ్ఞాన సంపాదనలో, వ్యక్తిత్వ వికాసంలో యాత్రల పాత్ర ఎంతో ఉన్నదని మహాభారతం ఇచ్చే సందేశంతో పేదరాసి పెద్దమ్మకథలు, కాశీమజిలీ కథలు వంటి యాత్రాసాహిత్యం రూపుదిద్దుకుంది. శంకరాచార్యుని భారతదేశ పర్యటన, వివేకానందుని విదేశీ పర్యటన విశేషాలను చదివితే చాలు నారదుడు చెప్పిన అర్హతలు అన్నీ కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి.

68. జీవులన్నీ దేవుడే

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, కావ్యాలు, భారతీయ సంస్కృతిలోని భక్తివిశ్వాసాలు, ఆచారవ్యవహారాలు, పూజాపురస్కారాలు... అన్నీ జీవవైవిధ్యంలోని ఏకత్వాన్ని ప్రతిపాదిస్తున్నాయి. సమానత్వాన్ని, సహజీవనాన్ని ప్రబోధిస్తున్నాయి. కంటికి కనిపించని దేవుడు ఎనభైనాలుగు లక్షల జీవరాసుల రూపంలో ఉన్నాడు. స్థిర, చరప్రాణులు ఏవీ నిరుపయోగమైనవి కావు. దేని ప్రయోజనాలు దానికున్నాయి. పరస్పర ఆధారిత జీవన విధానం పైనే జీవుల మనుగడ ఆధారపడి ఉంది. ఆహార సంపాదన, నిద్ర, భయం, సంతానోత్పత్తి... అన్ని జీవులకూ సమానమే బుద్ధి అదనంగా ఉండటం వలన మానవుడు ఉత్తమ జంతువయ్యాడు.

జీవశక్తి ఎన్నటికీ నశించదు, రూపాంతరాన్ని పొందుతుంది... అనే జ్ఞానం మానవునికి

కలిగింది. జీవులలోని జీవం వివిధరూపాలుగా ప్రకృతి, పర్యావరణాల అవసరాన్ని బట్టి మార్పు చెందటం అనివార్యమనే సత్యాన్ని తెలుసుకున్న మానవుడు 'ఆత్మవత్ సర్వభూతాని' (అన్నిప్రాణులూ నీ వంటివే) 'మా హింస్యాత్ సర్వభూతాని' (ఏ ప్రాణినీ హింసించరాదు) అని తీర్మానించాడు.

సృష్టిలో నీరు మూడు వంతులు, భూమి ఒక వంతు ఉన్నాయి. జీవజాలం అస్తిత్వం, అభివృద్ధి వీటిపైనే ఆధారపడి ఉంది. మానవజాతి విజ్ఞానానికి మూలాలు నీటిలో నిక్షిప్తమై ఉన్నాయని మత్స్యావతారంగా శ్రీమహావిష్ణువు వాటిని వెలికితీసి అందించాడు. నీటిలో ఎన్నోరకాల జీవులు వృద్ధి చెందుతూ నీటిని, ప్రాణవాయువును, ఆహారాన్ని, కాలుష్య నివారణను మరెన్నో లాభాలను భూమికి అందిస్తున్న విజ్ఞానానికి మత్స్యావతారం ప్రతీక.

సృష్టికి ప్రేరేపించే మన్మథుడు... మీనాంకుడు, మకరాంకుడు. ఆయన పతాకం మీద చేప, మొసలి గుర్తులు ఉంటాయి. సాగరంలోని విలువైన సామగ్రిని బైటకు తెచ్చే ప్రక్రియకు కూర్మావతారంగా విష్ణువు, సర్పజాతి నుంచి వాసుకి, మందరపర్వతం వంటి వివిధ జీవులు తోడ్పడ్డాయి. ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి నీరు, నీటి నుండి భూమి, భూమి నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవులు ఉద్భవిస్తున్నాయని వేదం చెప్పిన క్రమంలో పంచభూతాలైన... ఆకాశం, వాయువు, భూమి, అగ్ని, నీరు... ఎక్కడికక్కడ జీవం జీవి రూపాన్ని పొంది జీవిస్తున్నప్పుడు పరస్పర అవగాహన, సమన్వయం లేకపోతే జీవజాలం నశిస్తుంది.

భూమిని... సముద్రంలో వేస్తే దాన్ని బయటికి తీయటానికి నీటికి, భూమికి మధ్య బురదలో జీవించే ఆదివరాహం అవతరించింది. గజేంద్రమోక్షంలో భూజీవి అయిన ఏనుగు తన బలగర్వంతో సరస్సులోని నీటిని అల్లకల్లోలం చేసింది. జలజీవి మొసలికి తన స్థావరం పాడైపోయిందని కోపం వచ్చింది. ఏనుగును పట్టుకుంది. అది గెలవలేక నీరసపడితే, దాని అవస్థ విని మొసలి వదిలితే సరిపోయేది. పశ్చాత్తాపం కలిగిన భూజీవిని వదలనందుకు భగవంతుడు జలజీవిని సంహరించాడు. అన్ని జీవులు ఆధిపత్యం కోసం కొట్లాడుకోకుండా ఎవరిదారిన వారు బ్రతకకపోతే ఒక జాతి తగ్గి, మరొకజాతి పెరుగుతుంది. ప్రకృతిలోని అసమానత వల్ల అశాంతి, దీర్ఘకాలిక నష్టాలు ఏర్పడతాయి. భిన్నత్వంలో ఏకత్వమే జీవవైవిధ్య సంక్షేమానికి భారతీయ విజ్ఞానం ఇచ్చే నిత్యసందేశం.

69. వివిధజీవ సహజీవనం

'సృష్టిలో ఉన్న ప్రాణులన్నిటికీ జీవించే హక్కు ఉంది. శారీరక బలంతో బలహీన జీవజాలాన్ని నాశనం చేయటం క్రూరత్వం అవుతుంది. క్రూరత్వం వలన పాపం, పాపం వలన దుఃఖం చుట్టుముట్టి, తప్పుచేసిన వారికి బుద్ధి చెబుతుంది' దేవతల కుక్క అయిన సరమ ఇచ్చిన ఈ సందేశంలాంటి హెచ్చరికతోనే మహాభారతం మొదలైంది. ఏది తప్పు, ఏది ఒప్పు అని ఆలోచించే బుద్ధి ఉండటం వలన మానవుడు మిగిలిన జీవులలోకెల్లా గొప్పవాడవుతున్నాడు. విచక్షణ జ్ఞానం కలిగిన మానవుడే ఇతర ప్రాణులకు అపకారం చేస్తూ ఆధిపత్యం చలాయిస్తే అతను జ్ఞానవంతుడు ఎలా అవుతాడు? ఈ స్వభావాన్ని మార్చటానికే 'తగునిది తగదని మదిలో వగవక' బలహీనులను, అమాయక ప్రాణులనూ బాధిస్తే కారణం తెలియని ఆపదలు వస్తాయని నిర్భయంగా సరమ శపించింది. అలాగే కురువంశంలో ఎన్నో పరిణామాలు సంభవించాయి. అందరూ ఘోరంగా చంపబడ్డారు. వారసుడైన పరీక్షిత్తు దైవానుగ్రహం వల్ల చచ్చి బతికాడు. మళ్లీ దురహంకారంతో... ఋషి శాపంతో పాము కరచి చచ్చిపోయాడు. ఇట్లా మహాభారతం మొత్తం సరమ శాపం ప్రతిధ్వనిస్తూనే ఉంది. సందర్భం వచ్చినప్పుడల్లా వ్యాసమహర్షి ప్రధానకథలో, ఉపాఖ్యానాల్లో, సంవాదాల్లో... జీవవైవిధ్య సహజీవనం కోసం మానవజాతి తీసుకోవలసిన శ్రద్ధను, జాగ్రత్తను మాటిమాటికీ సూచిస్తూనే ఉన్నారు. దుర్మార్గుడైన కీచకుడిని చంపటానికి కోపంతో భీముడు ఒక మహావృక్షాన్ని పీకబోతూండగా ధర్మరాజు వద్దని వారిస్తూ, 'పనికిరాని చెట్లను కొట్టవచ్చు. పూలతో పళ్లతో నిండుగా ఉన్నది, ఇతరులకు మేలు చేసేది అయిన మంచిచెట్టును వంట కట్టెల కోసం కొట్టరాదు' అని నర్మగర్భంగా హెచ్చరించాడు. ఆ వాక్యాన్ని పెడచెవిన పెట్టిన మానవుడు అడవులన్నిటినీ నరికి ఇప్పుడు బాధపడుతున్నాడు. తాత్కాలిక లాభమైన కట్టెల కోసం శాశ్వతమైన వృక్షసంపదను పాడు చేస్తే జీవవైవిధ్య సహజీవనం ఎలా సాధ్యమవుతుంది. ఋషుల సాత్త్విక ప్రవర్తన వలన వారి ఆశ్రమాలలో క్రూరజంతువులు కూడా సాధువులుగా మారి సహజీవనం చేశాయి. బాలుడైన భరతుడు కణ్వాశ్రమంలో ఆ క్రూర జంతువులతో నిర్భయంగా ఆడుకున్నాడే కానీ, కొట్టి చంపలేదు. గంగలో తపస్సు చేస్తూ చేపల సహవాసం చేసిన మాండవ్య మహర్షి వాటితో పాటు వలలో చిక్కాడు. తనను కూడా కొనుక్కొని ఆ సొమ్ముతో జాలరులు చేపలు పట్టకుండా, వారికి జీవనోపాధి కల్పించమన్నాడు.

మూషికమార్జాల సంవాదంలో ఎలుక, పిల్లి ఒకదాన్ని ఒకటి రక్షించుకున్నాయి. అయినా తగిన దూరాన్ని పాటిస్తూ స్నేహం చేద్దామని ఎలుక చెప్పిన నీతి అన్ని జీవులకూ శిరోధార్యం. మహాప్రస్థానం చేసినప్పుడు చివరికి మిగిలిన ధర్మరాజు కోసం దేవవిమానం వచ్చింది. ధర్మరాజు 'నాతో వచ్చిన కుక్కను కూడా రానిస్తేనే నేనూ వస్తాను. నాలాగానే అదీ నడిచింది. దాన్ని విడిచి నేనొక్కణ్నే స్వర్గానికి రాకూడదు' అని చెప్పిన శాశ్వత సందేశం స్ఫూర్తితో వివిధ జీవ సహజీవనానికి నడుం కట్టకపోతే సమతౌల్యం దెబ్బ తింటుంది. అన్ని జీవులూ అంతరించిపోతాయి. సర్వే జీవినః సుఖినోభవంతు!

70. అన్నం బహు కుర్వీత

'అన్నం బహు కుర్వీత' అంటే ఆహారాన్ని బాగా ఉత్పత్తి చెయ్యండి... అని వేదం మానవజాతిని శాసిస్తోంది. అన్నం లేకుండా ఏ ప్రాణీ పనిచేయలేదు. పాంచభౌతిక జీవులే కాక దేవతలు, పితృదేవతలు... అందరికీ ఆహారం అవసరమే. యజ్ఞాలు చేసి దేవతలకు, శ్రాద్ధకర్మలు చేసి పితృదేవతలకు... మనం అన్నం పంపిస్తే, వారు ఆకలి తీరిన ఆనందంతో మనకు వర్షాలు కురిపించి, పంటలు పండించం ద్వారా అన్నం దొరికేటట్లు చేస్తున్నారు.

అన్నం అంటే వరి బియ్యంలో చేసినది మాత్రమే కాదు. ఏ ప్రాంతంలో ఎవరు ఏ ఆహారం తీసుకున్నా దాని పేరు అన్నమే. పరమాత్మ ఎవరో తెలుసుకోవాలన్న ఋషులకు అన్నమే పరబ్రహ్మ (అన్నం బ్రహ్మేతి వ్యజనాత్) అని తెలిసింది. అన్నం ద్వారా శక్తి వారిలో ప్రవేశించాక, వారి పరిశోధన ముందుకు సాగింది. ఆ అన్నశక్తియే శక్తిప్రదాయిని అన్నపూర్ణ. శ్రీమాత అన్నపూర్ణా స్వరూపిణిగా జీవులకు కడుపు నింపే ఆహారంలో శక్తిరూపంగా లోపలికి ప్రవేశిస్తుంది. వ్యవసాయం, వ్యాపారం, చదువు, ఉద్యోగం, వృత్తులు, తపస్సు, ధ్యానం మొదలైన కార్యవ్యవస్థ అంతా సక్రమంగా నడిపిస్తుంది. మిగిలిన జంతువులకు వాటి వాటి పనులు చేయించేది అన్నపూర్ణయే.

అన్నశక్తి ప్రాణశక్తిలో, ప్రాణశక్తి జ్ఞానశక్తిలో లీనమై 'జ్ఞానం బ్రహ్మేతి వ్యజనాత్' (జ్ఞానమే పరమాత్మ అని తెలుసుకో) అనే సత్యం ప్రత్యక్షమవుతుంది. దేవీనవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా ఆరాధించే అంతరార్థం అన్నశక్తితో జ్ఞానశక్తిని పొందడమే.

పాండవుల అరణ్యవాసంలో అందరికీ ఆహారం కోసం ధర్మరాజు గంగానదిలో నిలబడి

సూర్యుడి గురించి తపస్సు చేశాడు. పూలతో పూజించాడు. నామాలతో జపం చేశాడు. సూర్యుడు ప్రత్యక్షమైనాడు. "ధర్మరాజా! ఈ పన్నెండేళ్లూ అడవిలో దొరికిన దుంపలు, వేళ్లు, పళ్లు, కాయలు, ఆకులు మొదలైన వాటితో ద్రౌపది చేసి వంట భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యాలనే నాలుగు విధాలుగా అందరికీ రుచిగా, సరిపోయేటట్లుగా అక్షయంగా ఉండేటట్లుగా వరమిస్తున్నాను' అన్నాడు. కష్టపడి వంట చేసుకుంటే నేను కాపాడతాను అన్నాడు కాని మీరు చెట్ల కింద హాయిగా పడుకోండి, వేళ్లకు నేను భోజనం పంపుతాననలేదు. అక్షయపాత్రను ఇవ్వలేదు. వండినది అక్షయంగా రుచిగా ఉండేటట్లు చూస్తానన్నాడు.

దేవతలు... శ్రమ చేసే మానవులకు సహకరించి ప్రోత్సహిస్తారు. కాని సోమరిపోతులుగా తయారుచెయ్యరు. శరన్నవరాత్రులలో అన్నపూర్ణాదేవి... ఆహారాన్ని ఉత్పత్తిచేసే శక్తిని, వండుకునే శక్తిని, తిని జ్ఞానాన్ని పొందే శక్తిని చిరునవ్వుతో అనుగ్రహిస్తుంది. దాన్ని పాయసం భిక్షగా భావించాలి. పాయసంలో పాడి, పంట రెండూ ఉన్నాయి. అవి సుభిక్షంగా ఉండే శక్తిమంతమైన అన్నం లభిస్తుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్'. అన్నపూర్ణాదేవి పాయసం గరిటెలోని నిత్యసందేశం ఇదే.

అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకరప్రాణవల్లభే!
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి కృపామయి!

71. సంబంధాలు - విభేదాలు

జంతువులన్నిటిలో ఉత్తముడైన మానవుడు స్వార్థంతో, స్వల్ప లాభాల కోసం కూడా సాటి మానవులను చంపుతాడు. మానవసంబంధాల మహనీయతను మరచి, విభేదాలతో వినాశనాన్ని సృష్టించుకుంటున్నాడు. వేదాలు, ఇతిహాసాలు ఎంత చెప్పినా పశుత్వాన్ని వదులుకోలేకపోతున్నాడు. మానవసంబంధాలు బాగుంటే ఒకరినొకరు రక్షించుకోగలుగుతారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, దేశాలతో విభేదాలు సృష్టించుకుంటే ఆత్మీయులైనవారే తమలో తాము చంపుకుంటారు. ఒకరినొకరు చులకన చేసుకుని అస్తిత్వాన్ని కోల్పోతారు.

అయితే మిగిలిన జీవులన్నీ కలిసిమెలిసి బతుకుతున్నాయి. అలా బతకాల్సిందని వాటికి ఎవరూ ప్రబోధించటం లేదు. గుప్పెడు మెతుకులు కనబడితే ఒక కాకి మిగిలిన కాకులన్నిటినీ పిలుస్తుంది. ఆహారం కోసం ఆకలితో కొట్లాడుకున్నా, ఒకదాన్ని మరొకటి ఒకే జాతి ప్రాణులు

చంపుకోవు. విధి నిర్ణయం ప్రకారం చిన్న చేపను పెద్ద చేప తినటం, పాము తన గుడ్లను తానే తినడం, ఆడ పులి ఈనగా ఆకలితో కళ్లు కనపడక తన పిల్లల్ని తానే తినటం వంటి ప్రత్యేక సందర్భాలు మినహాయించి, ఒకే జాతి ప్రాణులు తమలో తాము చంపుకోకుండా బతుకుతుంటాయి.

కద్రువతో కుదిరిన ఒప్పందం ప్రకారం గరుత్మంతుడు అమృతం తేవటానికి స్వర్గలోకానికి బయలుదేరాడు. తల్లి వినతకు ఈ సంగతి తెలియచేసి, “అమ్మా! స్వర్గం దాకా ఎగరాలంటే శక్తి కావాలి. తినటానికి ఏమైనా పెట్టు” అన్నాడు. “నాయనా! సముద్రం లోపల అసంఖ్యాకమైన నిషాదగణం ఉంది. వాళ్లు రాత్రివేళల్లో నేల పైకి వచ్చి ప్రాణులను బాధిస్తున్నారు. వారందరినీ తిను. వారిలో బ్రాహ్మణుడుంటే తినకు. వారు లోకానికి క్షేమాన్ని కోరతారు. కోపం వస్తే మహావిషం, అగ్ని... అవుతారు” అంది. గరుడుడు సముద్రంలోని నిషాదులందరినీ మింగేశాడు. ఒకడు అగ్నిలాగ గొంతు దిగలేదు. వాడు “నేను విప్రుణ్ని. ఒక నిషాదిని పెళ్లి చేసుకున్నాను. ఈమెను విడిచి నేను బయటకు రాను” అన్నాడు. “ఆమెతో సహా నువ్వు బయటకురా!” అన్నాడు గరుడుడు. అతడు భార్యతో వచ్చి గరుత్మంతుణ్ని దీవించాడు. మానవసంబంధాల లాభాలను ఈ కథ తెలియచేస్తుంది.

ఆకలి తీరని గరుత్మంతుడు తండ్రి కశ్యపుడి దగ్గరకు వెళ్లి ఆహారాన్ని అడిగాడు.“నాయనా! విభావసుడు, సుప్రతీకుడు అనే ఇద్దరు బ్రాహ్మణ అన్నదమ్ములున్నారు. తండ్రి ఇచ్చిన ఆస్తి పంచుకుందామని అడిగిన తమ్ముడిని, ‘ఏనుగువైపో!’ అని అన్న శపించాడు. తమ్ముడు మరింత కోపంతో అన్నను ‘తాబేలువైపో!’ అని శపించాడు. నువ్వు వారిద్దరినీ తిని ఆకలి తీర్చుకో’ అన్నాడు. గరుత్మంతుడు వారిద్దరినీ తిని స్వర్గానికి వెళ్లాడు. సొంత అన్నదమ్ముల మధ్య విభేదాల వలన ఇద్దరూ నశించిపోయారు. లోకంలో అటువంటివారికి ఈ గతే పడుతుందని చెప్పటానికే కశ్యపుడు వారిని తినమని గరుత్మంతునికి చెప్పాడు. భారతీయుల మధ్య విభేదాల వల్లనే విదేశీయులు ఈ దేశాన్ని ఆక్రమించారు సజాతీయుల మధ్య విభేదాలు అనర్థదాయకమనీ, అనుబంధాలు లాభదాయకమనీ... ఈ మహాభారతకథ మనకు నిత్యసందేశం ఇస్తోంది.

72. అసత్యమూ అహేతుకం కాదు!

సత్యం వద (సత్యాన్నే పలుకు) అనేది వేదవాక్యం. సత్యాన్నే పలకాలని... మానవులందరినీ వేదం శాసిస్తోంది. హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, ధర్మరాజు సత్యాన్ని పలకటానికీ, అసత్యాన్ని పలకకుండా ఉండటానికీ ఎన్నో కష్టాలు పడ్డారు. లోకానికి ఆదర్శంగా నిలిచారు. అయితే సత్యభాషణం అనే ధర్మానికి ధర్మసూక్ష్మంగా అసత్యభాషణం కూడా రామాయణ, భారత, భాగవతాల్లో చెప్పబడింది.

రాముడు శూర్పణఖతో చిన్న అసత్యం ఆడాడు. వామనావతార ఘట్టంలో శుక్రాచార్యుడు బలిచక్రవర్తికి ... 'కొన్ని సందర్భాలలో అసత్యం ఆడవచ్చు' అని నీతిబోధ చేశాడు. మహాభారతంలో ధర్మవ్యాధోపాఖ్యానంలో ధర్మవ్యాధులు కౌశికునికి ధర్మాల్లో ధర్మసూక్ష్మాలుంటాయనీ, అవి కూడా తప్పకుండా తెలుసుకోవాలనీ వివరించాడు.

ప్రాణులకు మేలు జరగటానికి అసత్యం ఆడినా అది సత్యఫలాన్నే ఇస్తుంది. ప్రాణులకు కీడు జరిగే సత్యం పలికితే అది అసత్యఫలితాన్ని ఇస్తుంది. సత్యభాషణం ప్రధాన ధర్మమే అయినా దాని ముఖ్యోద్దేశం సమాజక్షేమం. కనుక దానికోసం కొన్ని ప్రత్యేక సందర్భాలలో అసత్యభాషణం కూడా సత్యం వంటిదే అవుతుందనీ, అది ధర్మసూక్ష్మమనీ స్పష్టం చేశారు. ఈ వెసులుబాటు కత్తి మీద సాములాంటిది. ఎవరికివారు తన లాభం కోసం, తన కుటుంబ లాభం కోసం ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అసత్యం ఆడకూడదు. వారు కూడా సమాజంలో భాగమే అయినా వారికి మాత్రమే ప్రయోజనకరమై, సమాజం మొత్తానికీ నష్టం కలిగించే చోట ఈ ధర్మసూక్ష్మాన్ని అడ్డుపెట్టుకోకూడదు.

మహాభారతంలో ధర్మరాజు 'అశ్వత్థామా హతః కుంజరః' అని పలికిన అసత్యం వలన లాభం పాండవులకే అనిపిస్తుంది. వాస్తవానికి ద్రోణుడు యుద్ధం కొనసాగిస్తే, పాండవులు ఓడిపోతారు. అంటే అధర్మం గెలుస్తుంది. దాని ప్రభావం వ్యవస్థపై ఉంటుంది. వ్యవస్థ క్షేమం కోసమే ధర్మరాజు అసత్యం పలికాడు కానీ, వ్యక్తిగత లాభం కోసం కాదు.

పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేటప్పుడు ఆయుధాలను జమ్మిచెట్టుపై ధర్మరాజు స్వయంగా చెట్టుపైకి ఉంచుతూ, ఆయుధ దేవతలకు నమస్కరించి, 'నాకు, అర్జునునకు మాత్రమే నిజరూపాలతో కనపడండి' అని అసత్యాన్ని ప్రోత్సహించాడు. ఎందుకంటే భీముడికి కోపం వస్తే... ఆయుధాలను వెలికితీస్తాడు. అప్పుడు అజ్ఞాతవాసం భంగమౌతుంది. దాన్ని నివారించటానికే ధర్మరాజు అలా చేశాడు. ఆ సందర్భంలోనే పాండవులందరూ అక్కడున్న

పశువుల కాపరులతో... 'మా తల్లి చచ్చిపోయింది. మా వంశాచారం ప్రకారం శవాన్ని ఈ జమ్మిచెట్టు మీద కట్టేశాం' అని అసత్యం చెప్పారు. ఈ అసత్యం చెప్పినవారిలో ధర్మరాజు కూడా ఉన్నాడు. ఇలా చెప్పడానికి కారణం లేకపోలేదు. ఆయుధాలు దాచిన సంగతి సామాన్యజనం ద్వారా బయటికి పొక్కకుండా ఇలా చేశాడు. అజ్ఞాతవాసం పూర్తికావాలి. ధర్మం జయించాలి. అధర్మం నశించాలి... అనే విస్తృత ప్రయోజనమే ధర్మరాజు అసత్యం ఆడిన రెండుమూడు సందర్భాలలోని ధర్మసూక్ష్మం. అందుచేత అసత్యాన్నీ కాదనలేం. ఎప్పటికప్పుడు ఆత్మసాక్షిగా నిర్ణయం తీసుకోవాలి. లోకక్షేమమే లక్ష్యంగా వ్యవహరించాలి. ఇదే మహాభారత నిత్యసత్యసందేశం.

73. భగినీ హస్తభోజనం

గడిచిపోతున్న కాలంలో ప్రతిక్షణాన్నీ సద్వినియోగం చేసుకోవాలని భారతీయ సంస్కృతి... మానవజాతికి ప్రబోధిస్తోంది. పగలు, రాత్రిగా సాగిపోయే దినాలను గురించి ఆలోచించకపోవటం జంతులక్షణం. మానవ సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం, జీవిత పరమార్థం కోసం ఒక్కొక్క రోజును ఒక ప్రత్యేకతతో గుర్తుంచుకోవాలి. ధర్మశాస్త్రం చెప్పిన ప్రకారం ఆ నాటి కార్యక్రమాలు నిర్వహించాలి. అలా చేస్తే ఎంతో మేలు కలుగుతుంది.

ధర్మరాజు వంటి మహానుభావునికి కూడా భీష్మాదులు, మహర్షులు మొగమోటం లేకుండా ధర్మాచరణను బోధించారు. ఉత్తములు ఆచరిస్తే సామాన్యులు కూడా వారి దారిలో నడుస్తారు. అందుకే కార్తికశుద్ధ ద్వితీయ (విదియ) నాడు అన్నదమ్ములు... అక్కచెల్లెళ్ల ఇళ్లకు వెళ్లి తప్పకుండా భోజనం చేసి వస్త్రాభరణాలతో సత్కరించి రావాలని ధర్మరాజుకు వివరించారు. ఈ తిథిని యమద్వితీయ అంటారు. ఈరోజు భగినీహస్తభోజనం చెయ్యాలని ధర్మశాస్త్రగ్రంథాలు సోదాహరణంగా చెబుతున్నాయి. యముని చెల్లెలు యమున. కార్తిక విదియనాడు ఆమె ఇంటికి వెళ్లి యముడు భోజనం చెయ్యటం వలన ఈ తిథి యమద్వితీయ అయ్యింది.

మూడు లోకాలవారూ ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. ఈ రోజున అన్నదమ్ములెవరూ తమ ఇళ్లల్లో భోజనం చేయకూడదు. అక్కచెల్లెళ్ల ఇళ్లకు వెళ్లి భోజనం చేసి తీరాలి. అదేదో శిక్షలాగా, మొక్కుబడిగా కాకుండా "స్నేహేన భగినీ హస్తాత్ భోక్తవ్యం పుష్టివర్ధనమ్"...

స్నేహపూర్వకంగా, ఇష్టంగా భుజించిన... అక్కచెల్లెళ్ల చేతి భోజనం అన్నదమ్ములకు పుష్టికరం అవుతుంది. ఈ ఆచారం పేరును సోదరీ హస్త భోజనం అనకుండా భగినీ హస్తభోజనం అనటంలోనే రహస్యం అంతా దాగి ఉంది. సోదరి అన్నా భగిని అన్నా తోబుట్టువే. కాని భగిని అంటే వివాహిత అయి అత్తవారింటికి వెళ్లిన సోదరి అని విశేషార్థం.

భగవంతుడు అంటే ఐశ్వర్యం, సమగ్రత మొదలైన గొప్ప లక్షణాలు కలవాడు. అలాగే అత్తవారింటికి వెళ్లి ఐశ్వర్యంతో, పెత్తనంతో, గౌరవంతో తులతూగే సోదరి భగిని అవుతుంది. అత్తవారిళ్లకు వెళ్లిపోయిన అక్కచెల్లెళ్లకు పుట్టింటి అనుబంధం తెగిపోకుండా ఏడాదికి ఒకసారి అయినా అన్నదమ్ములు వారింటికి వెళ్లి చూసి రావాలి. అక్కచెల్లెళ్లు ఆప్యాయంగా భోజనం పెట్టాలి. సోదరులు వస్త్రాభరణాలు కానుకగా ఇవ్వాలి. ఈ సందర్భంలో వారి స్థితిగతులు వీరికీ, వీరి పరిస్థితులు వారికీ నోరు తెరిచి చెప్పకుండా పరిశీలనలో అర్థమైపోతాయి. అప్పుడు ఒకరికొకరు సహకరించుకోవటానికి వీలవుతుంది.

తల్లిదండ్రులు లేకపోయినా పుట్టింటి మమకారం ఆడపిల్లలకు, అత్తవారింటికి వెళ్లిపోయినా వారి బాగోగులు గమనించే బాధ్యత అన్నదమ్ములకూ ఎల్లప్పుడూ ఉండే విధంగా ఏర్పరచబడిన ఈ ఆచారం అద్వితీయం. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా, కనీసం ఈ తిథి సమాచారం తెలియటం వలన మానవసంబంధాలు, బంధాలు మెరుగవుతాయి.

74. విశేషాలవిందు - వనభోజనం

భారతీయ సంస్కృతి ప్రణాళిక, విస్తరణ క్రమపద్ధతిలో జరిగినట్లు పండుగలు, ఆచారాలు, సంప్రదాయాల ప్రయోజనాలను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది. గుడ్డిగా వాటిని ఆచరించటం కాక వాటిలోని పరమార్థాన్ని తెలుసుకుంటే వ్యక్తిత్వవికాసానికి, క్రమశిక్షణకు, సామాజిక వికాసానికి అవి ఎలా పనికి వస్తున్నాయో భావితరాలకు తెలియచేయగలుగుతాం. అటువంటి వాటిలో ఒకటి కార్తిక వనమహోత్సవం.

మాసాలలో ఎన్నో ప్రత్యేకతలు గలదిగా కార్తికమాసానికి విశిష్టస్థానం ఇచ్చారు మనవారు. నెలంతా పాటించవలసిన కొన్ని నియమాలను స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు... అన్నివర్గాలవారికీ సమానంగా నిర్ణయించారు. ఇంతటి సామాజిక సమన్వయం మరే

మాసంలోనూ కనపడదు. మతపరమైన భేదాలు లేకుండా శివకేశవులు ఇద్దరికీ ప్రీతిపాత్రమైన నెల కార్తికం. సూర్యోదయానికి ముందు స్నానం, తరవాత ఉపవాసం, దైవదర్శనం, దీపారాధన, వనసమారాధన ధర్మాలు, పురాణశ్రవణం... ఇవన్నీ ప్రధానమైన కార్తిక వ్రతనియమాలు. అన్నీ ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు, సామాజిక సమైక్యతకు పనికివచ్చేవే. ముఖ్యంగా అందరూ వనభోజనాలకు వెళ్లటం ఈ నెల ప్రత్యేకం. అయితే అదొక ఆటవిడుపుగా, సరదాగా యువతరం భావిస్తోంది.

వనభోజనాలు ఎందుకు ఏర్పడ్డాయో, ఎలా చెయ్యాలో తెలుసుకోవటం అవసరం. లేకపోతే పాండవులు అరణ్యావాసం చేసేటప్పుడు, వారికి తమ వైభవం చూపి ఏడిపించటానికి వనభోజనాలకు వెళ్లిన కౌరవులు గంధర్వుని చేతిలో చిక్కుకొని పాండవుల ముందు అవమానాలపాలైనట్లు కథ విషాదభోజనం అవుతుంది. సద్బుద్ధితో, భక్తి శ్రద్ధలతో వనభోజనాలకు వెళితే 'విశేషభోజనంబు' అవుతుంది. కార్తికమాసంలో తోటలకు వెళ్లాలి. ఉసిరిచెట్టు కింద శివకేశవులను పూజించాలి. అంతా కలసిమెలసి... అక్కడ వండుకున్న వంటలను ఉల్లాసంగా భుజించాలి. ఆటలు, పాటలు, పురాణశ్రవణం వంటివి చేయాలే తప్ప చెడ్డపనులు ఏవీ చేయకూడదు. దుస్సాహసాలు చేసి కౌరవుల్లాగ ప్రాణాలమీదికి తెచ్చుకోకూడదు.

వృక్షాలలో దైవత్వాన్ని చూసి, పూజించాలి. ప్రకృతితో మమేకం కావాలి. భ్రాతృత్వం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా జరుపుకోవాలి. కక్షలు, కార్పణ్యాలకు వనాలు కేంద్రాలు కాకూడదు. స్కాందపురాణంలో కార్తిక మాహాత్మ్యంలో వనభోజనాల వల్లనే పోయే కొన్ని పాపాలు చెప్పారు. పూజ, ధ్యానం, జపం, తపం చేసేటప్పుడు మధ్యలో ఆపి ఎవరితోనూ మాట్లాడకూడదు. అలా చేసి ఉంటే దాని కారణంగా వచ్చిన పాపం పోవాలంటే కార్తికంలో వనభోజనం చేయాలి. భోజనం చేసేటప్పుడు, పితృకార్యం చేసేటప్పుడు, అశుచిగా ఉన్నవాళ్లతో... మాట్లాడకూడదు. తెలిసీతెలియక అలా వచ్చిన పాపం ఈ వనభోజనంతో పోతుంది. అందరూ తప్పనిసరిగా వన భోజనాలకు వెళ్లితీరాలనే నిబంధన వల్ల ప్రకృతి పరిశీలన, సామాజిక అవగాహన, వినోదం, విహారం వంటి లాభాలు తప్పక కలుగుతాయి. ఏకాగ్రతతో పని చేసేటప్పుడూ మధ్యలో మాట్లాడకూడదు. వృత్తి, ప్రవృత్తి వ్యవహార దక్షతల్లో ఫోన్ మాట్లాడటం, టీవీలు చూడటం వంటివి తెలిసిందే. అందువల్లే వనభోజనాలు అందరికీ అత్యవసరం.

75. సామాజిక బాధ్యతలకు సంకేతం కార్తికం

భారతీయ సంప్రదాయ పరిగణనలో చైత్రం నుండి ఫాల్గుణం వరకు వచ్చే పన్నెండు నెలల్లో కార్తికమాసం ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉంది. ఈ నెలలో ఆచరించవలసిన కొన్ని నియమాలు, వాటివలన కలిగే ప్రయోజనాలు వివరంగా, విశేషంగా పురాణాలలో చెప్పబడ్డాయి. కార్తికం నెలరోజులూ ఆయా తిథివారాలలో ఆచరించవలసిన విధులు కూడా వివరించబడ్డాయి. వాటినన్నిటినీ పరిశీలిస్తే వాటిలో జీవన సమన్వయం ఎంతో ఉందని తెలుస్తుంది.

వ్యక్తిగత క్రమశిక్షణ - సామాజికధర్మరక్షణ అనే నినాదంతో మహర్షులు ఈ మాసప్రణాళికను తీర్చిదిద్దారు. దానికి అనుగుణంగా కర్తవ్యాలను చెప్పారు. వాటి ఆచరణ ఎంత అవసరమో తెలిసే అనేక కథలను బోధించారు. ఇంత విస్తృతమైన ఏర్పాట్లు కార్తిక మాఘమాసాలకు మాత్రమే కనిపిస్తాయి.

సూర్యోదయానికి ముందే నదులలో గాని, చెరువుల్లో గాని, బావుల దగ్గర గాని ఈ మాసమంతా తప్పక స్నానం చె య్యాలన్నారు. దీనివలన తెల్లవారుజామున నిద్రలేవడం అలవాటవుంది. చన్నీటి స్నానం వలన చలిని ఎదుర్కొనే శక్తిని సాధించుకోగలుగుతారు. అంతేకాకుండా నీటివనరులపై అవగాహన కూడా ఏర్పడుతుంది. నీటి కాలుష్యాన్ని తగ్గించి, శుభ్రతను కాపాడవలసిన బాధ్యత... స్త్రీలు, పురుషులు, పిల్లలు, పెద్దలు అందరికీ స్వయంగా తెలుస్తుంది.

ఎన్నో ప్రకటనల ద్వారా తెలియని సత్యం ఈ మాసంలోని నియమాలను ఆచరించడం వల్ల ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. అందుకే ఈ మాసం గృహస్నానం నిషిద్ధం. ఈ నెలంతా ఒకపూట భోజనం చెప్పారు. కార్తికమాసంలో ఆహారోత్పత్తులు తక్కువగా ఉంటాయి. అందుకే ఈ మాసాన్ని కరవుమాసం అని కూడా అంటారు. అందరూ ఒకేపూట తినటం, అన్నదానం చేయటం అనే నియమాల వలన ఆహారపదార్థాలు సమాజంలో అందరికీ చేరి, అందరికీ ఆకలి తీరుతుంది. భారతదేశ పూర్వప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి ఈ స్ఫూర్తితోనే... దేశ ప్రజలంతా ప్రతి సోమవారం ఉపవాసం ఉండి అన్నదానం చెయ్యాలన్నారు.

కార్తికంలో చిన్నదానమైనా పెద్ద పుణ్యాన్ని ఇస్తుందని పెద్దలు వివరించారు. అందుకే మానవులందరూ యథాశక్తిగా దానధర్మాలు చెయ్యాలనే నియమం సమాజసంక్షేమ భావనను దృష్టిలో ఉంచుకుని చెప్పారు మన వాళ్లు. ఈ నెలకు దామోదరమాసమనే పేరు కూడా ఉంది. పేదవాణ్ని 'దరిద్రదామోదరుడు' అంటారు. అందుకే దామోదరునిగా భావించి, పూజించి ఆకలి తీర్చే సామాజిక బాధ్యతలకు సంకేతం కార్తికం. దీపాలు వెలిగించటం

మరో ముఖ్యనియమం. అన్నివర్ణాలవారూ, వర్గాలవారూ ఒక్కొక్కరూ ఒక్కో దీపం వెలిగించడం వలన, ఈ దీపాల నుంచి వచ్చే వేడి గ్రామంలో నుంచి చలిని, చీకట్లను పారద్రోలుతుంది.

ఎవరి వృత్తిధర్మాలను వారు నీతిబద్ధంగా ఆచరించాలి. లేకపోతే ఎంతటివారైనా నరకానికి పోతారు. మానవజీవితం శీలనిర్మాణంతో, క్రమశిక్షణతో సాగాలి. అందరూ కలసిమెలసి జీవిస్తూ సమాజాన్ని చక్కని ఉద్యానవనంగా తీర్చిదిద్దుకొని విహరించాలని బోధించే ధర్మవార్తికం ధన్యకార్తికం.

76. వెలుగులు పంచుతుంది...

పల్లెల్లో, పట్టణాల్లో జీవించే ప్రజలందరికీ... సాంఘిక భద్రత, సామా జిక రక్షణల ఆవశ్యకత ఉంది. ఇందుకోసం సాముదాయిక సమావేశ కేంద్రాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒక గ్రామంలోని ప్రజలంతా కలసిమెలసి, కష్టసుఖాలను చర్చించుకొని... వాటి నివారణకు కావలసిన పరిష్కారాలను, తీర్మానాలను చేసుకునేందుకు ఒకచోటు కావాలి.

ఆవేశకావేశాలు, ఘర్షణలు, డాబు, దర్పం, గర్వం, అహంకారం వంటివాటిని పక్కనపెట్టి, ప్రశాంతచిత్తంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే విధంగా అందరికీ ఆ చోటు పూజనీయస్థానమై ఉండాలి. ఈ ప్రణాళికతోనే భారతీయ సంస్కృతి పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పరచింది. అదే దేవాలయం.

భక్తివిశ్వాసాలతో దైవసన్నిధిలో సమావేశమైన పౌరులు చట్టసభల్లోలాగ దూషణలు, వస్తువులు విసురుకోవడం, విరక్కొట్టడం వంటి పనులు చేయరు. అసత్యభాషణకు భయపడతారు. అబద్ధప్రమాణాలకు వెరుస్తారు. కనుక ఏ దేవుడైనా, ఏ దేవతైనా విస్తారమైన పరిధిలో కోటగోడల్లాంటి ప్రాకా రాలు, గోపురాలతో, అలంకారాలతో, శుచిశుభ్రతలలో, నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాదులతో అల రారే సామాజిక మందిరం గుడి. సంస్కృతిని నిలబెట్టే వేషభాషలు, ఆచారసంప్రదాయాలు అన్నిటికీ దేవాలయం నిలయం అవుతుంది.

సంగీతం, సాహిత్యం, శిల్పం, నాట్యం, చిత్రలేఖనం వంటి లలిత కళాస్వరూపాల అభ్యాసం, ప్రదర్శన, ప్రోత్సాహాలతో దైవసన్నిధిగా గుడి... కళలను నిలబెడుతుంది. దానధర్మాలు చేయదలచుకున్న ధనవంతులు దేవునిపై భక్తితో ఘనంగా ఇస్తారు. అది సమాజం మొత్తానికి పనికి వస్తుంది.

పూర్వం మహారాజులు దేవాలయాలను శాశ్వత ప్రాతిపదికతో నిర్మించారు. దండయాత్రలు జరిగినప్పుడు ప్రజలు దాక్కోవటానికి అవి రక్షణ కేంద్రాలుగా ఉండేవి. ప్రకృతి భీభత్సాలు, ఉత్పాతాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు గ్రామంలోని సామాన్యులు, పేదలు సురక్షిత ప్రాంతంగా దేవాలయాల్లో తలదాచుకొంటారు. ఉప్పెన వచ్చినప్పుడు ఊళ్లన్నీ మునిగినా దేవాలయాలు, గోపురాలు... కొందరి ప్రాణాలను కాపాడతాయి. ఇన్నిరకాలుగా ఉపయోపడే మన గుడికి మనం నిత్యమూ వెళ్లాలనే నియమాన్ని కార్తికమాసం బోధిస్తోంది. మన ఇంటి నుంచి గుడికి నడిచి వెళ్లాలి.

యః కుర్యాత్ నిశ్చయాత్రాంచ కార్తిక్యాం దైవమందిరే
పదేపదే అశ్వమేధస్య ఫలం ప్రాప్నోతి అసంశయః॥

కార్తిక మాసంలో నిత్యం దేవాలయానికి వెళ్లాలి. దేవాలయంలో ఎన్ని అడుగులు వేస్తే అన్ని అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం వస్తుందనడంలో ఏ మాత్రం సంశయం లేదు... అని స్కాందపురాణం చెబుతోంది. దీనిని కార్తికమాసం మనకు ఇచ్చిన కానుకగా భావించి దేవాలయాలకు వెళ్లాలి.

దేవాలయాల ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని తెలుసుకొని వాటిని కాపాడుకోవాలి. కార్తికమాసంలో గుడికి వెళ్లి వెలిగించిన దీపం సాంఘికదీపికగా సమాజానికి వెలుగులు పంచుతుంది.

77. జ్ఞానం దీపంలా వెలగాలి

కార్తికమాసం ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంది. మానవజీవితానికి కావలసిన క్రమశిక్షణ, వ్యక్తిత్వవికాసం, కార్యదీక్షలతో పాటు, చేసే పనిలో శ్రద్ధ అవసరం అనే సందేశంతో ఈ మాసం ముగుస్తుంది. మానవులు ఒక ఇంట్లో కలిసి ఉన్నంతమాత్రాన అది కుటుంబం కాదనీ, మానసికంగా ఒకరితో ఒకరు కలిసి ప్రవర్తించటమే నిజమైన కుటుంబ సంస్కృతి అవుతుందనీ 'పోలిస్వర్గం' వృత్తాంతం తెలియచేస్తుంది.

ఒక అత్తగారికి అయిదుగురు కోడళ్లు. ఆఖరి కోడలంటే ఆ ఇంట్లోని వారందరికీ చిన్నచూపు. పై నలుగురు కోడళ్లూ, అత్తగారూ కలిసి చిన్నకోడలిని హింసించేవారు. అయితే... ఈ నెలరోజులూ తెల్లవారుజామునే నిద్రలేచి స్నానం చేసి, దీపం వెలిగించేది చిన్నకోడలు

'పోలి'. కార్తికమాసం ఆఖరిరోజు అయిన అమావాస్య రోజున పై నలుగురు కోడళ్లు, అత్తగారు పోలిని ఇంట్లో ఉంచేసి, నదీస్నానానికి వెళ్లారు. ఆ ఒక్కరోజు మాత్రమే నదీస్నానం చేసి దీపం వెలిగించి మొత్తం పుణ్యం సంపాదించాలనుకున్నారు వారు.

ఇంట్లో ఉన్న 'పోలి' కవ్వంతో పెరుగు చిలికింది. వచ్చిన వెన్నను ప్రమిదలో వేసింది. పత్తితో వత్తి చేసి వేసింది. బావి దగ్గర స్నానం చేసింది. దీపాన్ని అక్కడే వెలిగించింది. అత్తగారు చూస్తే కేకలేస్తుందేమోనని దీపం కనపడకుండా దాని మీద కుండ బోర్లించింది. శ్రద్ధతో ఇంత నిరాడంబరంగా, నియమం తప్పకుండా కార్తికవ్రత నియమాలను పాటించినందుకు ఆమెకు బొందితో స్వర్గానికి వెళ్లే అవకాశం లభించింది. విష్ణుదూతలు వచ్చి ఆమెను విమానంలో స్వర్గానికి తీసుకు వెళుతుంటే, వెళ్లిపోతున్న ఆమె కాళ్లు పట్టుకొని అత్తగారూ, తోడికోడళ్లూ కూడా పైకి ఎగిరారు. కానీ అశ్రద్ధగా నియమాలను పాటించినవారికి స్వర్గానికి వచ్చే అర్హత లేదని భటులు వారిని కిందికి తోసేశారు. పోలి స్వర్గానికి వెళ్లిపోయింది. ఈ కథ కార్తిక అమావాస్య మరునాడు తెల్లవారుజామున దీపాలు వెలిగించి నదిలో వదిలే వారంతా చెప్పుకొంటారు.

స్త్రీకి స్త్రీయే శత్రువు కాకూడదు. ఈర్ష్య, అసూయ, ఆధిపత్య ధోరణి... ఇవి ఉన్నవారు పతనమౌతారు. ఇంటిదగ్గరే... మౌనంగా శ్రద్ధతో తమ పని తాము నైపుణ్యంతో చేసుకున్నవారు గొప్ప అవకాశాలు పొందుతారు. ఒకరితో ఒకరు ఆప్యాయతతో, సత్సంబంధాలతో ఉన్నప్పుడే అవి నిజమైన చుట్టరికాలు అవుతాయి. కుటుంబ వ్యవస్థలో స్త్రీ కేంద్రబిందువు. కుటుంబాలన్నీ బాగుంటేనే సమాజం అభివృద్ధిపథంలో పయనిస్తుంది. అలా లేనప్పుడు ఎన్ని పూజలు, వ్రతాలు, నియమాలు పాటించినా ప్రయోజనం లేదు. సహజీవన సౌమనస్యమే సుఖజీవన సౌభాగ్యంగా మానవజాతి వర్ధిల్లుతుంది.

జ్ఞానస్వరూపమైన దీపాన్ని ప్రవాహశీలమైన నీటిలో వదలటం ద్వారా మనకు గొప్ప సందేశం లభిస్తుంది. నీరు దీపాన్ని ఆర్పకూడదు. అగ్ని నీటిని మరిగించకూడదు. నీరు నిరంతరం ప్రవహిస్తూ ఉండాలి. పాడిపంటలకు రక్షణగా ఉండాలి. దాహాన్ని తీరుస్తూ దేహాన్ని కాపాడాలి. దానిలో జ్ఞానం దీపంలా వెలుగుతూ సాగిపోవాలి. అప్పుడు భూలోకమే స్వర్గం అవుతుంది. దీన్ని సాధించడానికి శ్రద్ధ, ఐకమత్యం కావాలి. శ్రద్ధ కలిగిన 'పోలి' కి ఇల్లే స్వర్గం అయ్యింది. సాధారణ దీపాలతో జ్ఞానజ్యోతులను వెలిగిద్దాం.

78. కర్తవ్యాన్ని గుర్తుచేసే ముక్కోటి ఏకాదశి...

సూర్యుడు ధనూరాశిలో ఉండే ధనుర్మాసంలో, శుక్ల ఏకాదశినాడు, ముక్కోటి దేవతలను వెంటబెట్టుకొని శ్రీమన్నారాయణుని దర్శనం కోసం బ్రహ్మ వైకుంఠానికి వెళ్లాడు. రావణాసురునితో పీడింపబడుతున్న దేవతలంతా దుఃఖంతో తమ కష్టాలు చెప్పుకోవడానికి వైకుంఠానికి చేరారు. ప్రభాతకాలంలో ఉత్తరద్వారం దగ్గర స్వామివారి దర్శనం కోసం నిలబడ్డాడు. అప్పుడు నారాయణుడు వారికి దర్శనం ఇచ్చాడు. దేవతలు ఆయనను స్తుతించి, అనుగ్రహాన్ని పొందారు. ముక్కోటి దేవతలూ స్వామిని దర్శించిన ఏకాదశి కనుక ఇది ముక్కోటి ఏకాదశి అయింది.

ఆగమశాస్త్రం ప్రకారం దేవాలయాలకు తూర్పున సింహద్వారం, మిగిలిన దిక్కుల్లో కూడా ద్వారాలు ఉంటాయి. ముక్కోటి ఏకాదశినాడు ఉత్తరద్వారం నుండి ప్రవేశించి, ప్రభాతవేళ స్వామిదర్శనం చేసుకోవాలి. స్వామివారు దేవేరుల ఉత్సవ విగ్రహాలను ఉత్తర ముఖంగా ఉత్తర ద్వారానికి ఎదురుగా ఉంచుతారు కనుక దీనిని ఉత్తరద్వార దర్శనం అంటారు.

సంవత్సరానికి పన్నెండు నెలలు. సూర్యుని గమనాన్ని బట్టి మొదటి ఆరు నెలలు ఉత్తరాయణం, తరువాత ఆరునెలలు దక్షిణాయనం అవుతుంది. మానవులు ఉత్తరాయణంలో దేవకార్యాలకు, దక్షిణాయనంలో పితృకార్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిని దేవయానం, పితృయానం అంటారు. ఉత్తరాయణంలో దేవయానంలో మరణించినవారు సూర్యమండలాన్ని భేదించుకుని వెళ్లి మోక్షాన్ని పొందుతారు. దక్షిణాయనంలో పితృయానంలో పోయినవారు చంద్రమండలానికి చేరి, మళ్లీ జన్మిస్తారు. అందుకే భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకు అంపశయ్యపై ఎదురుచూశాడు.

కృత్యోత్సవం తథా భూతం ఏకాదశ్యాం విశేషతః
విశంతి మోక్షం తస్మాత్ స మోక్షత్సవ ఇతీర్యతే ॥

ముక్కోటి ఏకాదశి వేకువజామున ఉత్తరద్వారం నుండి శ్రీమహావిష్ణుదర్శనం చేసుకొన్నవారికి మోక్షం తప్పక లభిస్తుంది. కనుక ఈ దర్శనాన్ని మోక్షోత్సవం అంటారు. వైఖానసుడు అనే రాజు రాజకార్య నిమగ్నుడై దేవతలను, పితృదేవతలను పూజించటం మానేశాడు. దాంతో పితృదేవతలు దుఃఖంతో కలలో కనబడ్డారు. 'నాయనా! నీవు దేవతార్చన, పితృదేవతార్చన చేయకపోవడం వలన మాకు ఉత్తమలోకాలు లభించటం లేదు. వైకుంఠ ఏకాదశినాడు స్వామిని ఉత్తరద్వార దర్శనం చేసుకొని 'ఏకాదశీవ్రతం' ఆచరించి, ఆ ఫలాన్ని

ధారపోస్తే మాకు పుణ్యలోకాలు, నీకు ముక్తి లభిస్తాయి' అన్నారు. వైఖానసుడు వారు చెప్పినట్లు చేశాడు. ఐహిక బాధ్యతలతో మునిగి దేవపితృకార్యాలను మరచిపోయే వారికి ముక్కోటి ఏకాదశి కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, మనస్సు మొత్తం పదకొండూ భగవంతుని యందు లగ్నం చేసి, ఏకాదశీవ్రతం చేసినవారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఇహం కోసం పరాన్నీ, పరం కోసం ఇహాన్నీ నిర్లక్ష్యం చేయకుండా మానవుడు సమతూకంగా జీవించి, జన్మను సార్థకం చేసుకోవాలి. ముక్కోటిఏకాదశి మనకు ఇచ్చే సందేశం ఇదే.

79. తెనుగున రచియింపుము...

"ఆంధ్రత్వమాంధ్రభాషాచ... నాల్పస్య తపఃఫలమ్" (తెలుగునేలపై పుట్టటం, తెలుగుభాష తల్లిభాషగా కలిగి ఉండటం అందరికీ సాధ్యం కాదు. ఆ భాగ్యం కలిగినవారు గొప్ప తపస్సు చేసి ఉంటారు) అని అప్పయ్య దీక్షితులు తిరుగులేని ప్రకటన చేశాడు. రాజరాజనరేంద్రుడు తెలుగుభాషలో ఆదికావ్యావతరణ జరగాలనీ, అది అందరినీ తీర్చిదిద్దే మహాభారతం కావాలనీ నన్నయగారిని అడిగేటప్పుడు... తెలుగువారినీ, తెలుగు భాషనూ గొప్పగా ప్రశంసించాడు. తెలుగులో వ్రాయాలన్నా, తెలుగువారిని మెప్పించాలన్నా చాలా తెలివితేటలు కావాలన్నాడు.

ఇతర భాషలలో నుంచి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలన్నింటినీ 'మహా భారతబద్ధ నిరూపితార్థమేర్పడ, తెనుగున రచి యింపుమధిక ధీయుక్తి మెయిన్' అనే ఒక్కమాటలో ఇమిడేటట్లుగా చెప్పిన రాజరాజు అభినందనీయుడు. అతని ముందుచూపు, పరిశీలనాదృష్టి పరిశోధనాత్మకమైనవి. ఇతరభాషల సహాయసహకారాలు లేకుండా ఏ భాషా స్వతంత్రంగా బతకలేదనీ ఇచ్చిపుచ్చుకునే విధానం మనకు లాభం తెచ్చేటట్లు, మన వాళ్లందరికీ పనికి వచ్చేటట్లు ఉండాలని రాజనీతి చాతుర్యం జోడించి చెప్పారు.

పరభాషలను మొత్తంగా దించేస్తే తెలుగు కనపడకుండా పోతుంది. ఆయా భాషలలో నిరూపితమైన విషయాలను తెలుగులో తెలుగువారికి తెలిసేవిధంగా వ్రాయాలి. అలా వ్రాయాలంటే అధికధీ (చాలా తెలివి), యుక్తి (చాతుర్యం) రెండూ ఉండాలి. అప్పుడు తెలుగు బతుకుతూ, ఇతర భాషల నుంచి లాభాలను పొందగలుగుతుంది. అలా చేయకపోతే

తెలుగు ఆక్రమణకు గురి అవటమే కాక, తెలుగువారికి తెలియవలసిన విజ్ఞానం స్పష్టంగా, ఆత్మీయతతో అందదు. ఇది రాజనీతి ప్రణాళిక. ఇది విన్న నన్నయగారు తెలుగు రచనాప్రణాళిక ఎలా ఉండాలో అవి తన కవితా లక్షణాలుగా 'కవినీతి'తో చెప్పాడు.

తెలుగులో రచన చేసేవారు పాటించవలసిన మొదటి నియమం 'ప్రసన్న కథా కలితార్థయుక్తి'. అనగా చదువుతూ ఉండగా లేదా వింటూ ఉండగానే చెబుతున్న విషయం కళ్లకు కట్టేటంత స్పష్టంగా, సరళంగా, సుబోధకంగా రచించాలి. చెప్పేదానిలోని రమ్యత తాత్కాలికంగా కాకుండా అక్షరమై శాశ్వతంగా ఉంటే ఆ రచన పదికాలాలు బ్రతుకుతుంది. అది వినపడేటప్పుడే ఆకర్షించేలా, మాధుర్యంగా, రచనాశైలిలో ఉండాలి. దానిని నన్నయగారు 'అక్షరరమ్యత' అన్నాడు. కవులు, రచయితల బాధ్య సమాజహితం. వారు ఏది రాసినా లోకక్షేమం కోసం రాయాలి. మార్గదర్శకమైన మంచిమాటలు మంచిగా చెప్పాలి.

ప్రజలకు ఆ ప్రయోజనాన్ని అనేకవిధాలుగా వారివారి స్థాయిని బట్టి అందించే విధానమే 'నానారుచిరార్థసూక్తినిధిత్వం'.

తెలుగులో నన్నయ ఇలా వ్రాస్తున్నాను... అని తానే పరోక్షపద్ధతిలో తెలుగుభాషా సాహిత్యాల శాశ్వతత్వానికి సూత్రరచన చేశాడు. భారతావతరణ సందర్భంలో భాషావతరణ ప్రణాళికను కూడా ప్రకటించిన రాజరాజుకూ, నన్నయకూ నమస్కరిస్తూ, తెలుగువెలుగులను కలకాలం విరజిమ్ముదాం. జై తెలుగు. జై జై తెలుగు.

80. ధనుర్మాసం ప్రాణుల రక్షణకు ఆవాసం

కాలాన్ని లెక్కించే క్రమంలో అనేక విధానాలు ఉన్నాయి. గ్రహాల కదలికలను బట్టి, ఆయా ప్రాంతాలవారు నెలలకు పేర్లు పెట్టుకొని అనుసరిస్తూ ఉంటారు. ఏ పేరు పెట్టినా, ఏ మార్గంలో వెళ్లినా నెలలు మాత్రం పన్నెండే. తెలుగువారు చంద్రుని గమనాన్ని బట్టి చంద్రమానంలో చైత్రం నుండి ఫాల్గుణం వరకు పండుగలు, ఉత్సవాలు జరుపుకుంటారు. తమిళులు సౌరమానం ప్రకారం సూర్యుడు రాశి మారినప్పుడు రాశుల పేర్లతో నెలల పేర్లు చెప్పుకుంటారు. చంద్ర సౌరమానాలు రెండిటినీ సమన్వయపరుస్తూ అందరూ ఇష్టపడే మాసం ధనుర్మాసం. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన మాసం ఇది.

మేష మాసం నుండి మీన మాసం వరకూ ఉన్న పన్నెండు నెలల్లో ధనుర్మాసం పేరు

బాగా ప్రచారంలోకి రావడానికి కారణం వివిధ మతాల, సిద్ధాంతాల సమన్వయం. కనుక ధనుర్మాసాన్ని సమన్వయ మాసంగా అర్థం చేసుకోవచ్చు. హేమంత ఋతువులో చలి బాధ తీవ్రంగా ఉన్నా తెల్లవారుజామున స్త్రీలు ఇంటి ముందు కళ్లాపి చల్లి పోటీలు పడి మరీ చిత్రవిచిత్రమైన రంగవల్లులు దిద్దుతారు. ఈ నెలంతా ముగ్గులతో ప్రాంగణాలు, వీధులన్నీ పరిశుభ్రమై చలికాలంలో విజృంభించే సూక్ష్మజీవులను ఇళ్లల్లోకి రాకుండా ఆపుతాయి. చీమలు మొదలైన ప్రాణులకు ముగ్గులో కలిపిన బియ్యప్పిండి ఆహారం అవుతుంది. చేలల్లో నుంచి ఇంకా ఇంటికి ధాన్యం రాక తిండి దొరకని చిన్న ప్రాణులకు ఇదొక ఉపకారం. సృజనాత్మకత, ప్రతిభ, పోటీతత్త్వం, శారీరక ఆరోగ్యం మొదలైన లాభాలు ఎన్నిటికో రంగవల్లులు కేంద్రబిందువులు.

పాడి, పంట రెండూ నిత్యావసరాలు. ఆ రెండింటి అభివృద్ధికీ మానవుడు భక్తిశ్రద్ధలతో కృషి చెయ్యాలి. గోవులోనే సమస్త దేవతలూ ఉన్నారని భారతీయుల విశ్వాసం. గోవు నుండి వచ్చే పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ అన్నీ పవిత్రమైనవి, ఆరోగ్యప్రదమైనవి. గోవును పోషించాలి. గోవును పూజించాలి. గోసేవ చెయ్యాలి. ఈ స్ఫూర్తిని, సూచనను ధనుర్మాసం మాత్రమే ఇస్తుంది. ప్రతి ముంగిలీ... ఆవుపేడ, గొబ్బెమ్మలతో అలరారుతూ ఉండాలి. వాటితో పిడకలు చేసి మాఘమాసంలో సూర్యుడికి కొత్తబియ్యం, పొంగలి చేసి నైవేద్యం పెట్టాలి. పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలి.

చలితీవ్రత తగ్గి సూర్యుని అనుగ్రహంతో ప్రాణులన్నీ ఆరోగ్యవంతంగా జీవించటానికి ధనుర్మాసం అన్ని ఏర్పాట్లు చేసి మకర మాసానికి స్వాగతం చెబుతుంది. మకర సంక్రమణానికి ముందురోజు భోగి. ఇది ధనుర్మాసానికి చివరిరోజు. మానవులే కాక సమస్త ప్రాణులూ పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో భోగులై వర్థిల్లటానికి ప్రాతిపదిక ధనుర్మాసం. తెల్లవారుజామునే విష్ణ్వాలయాలన్నీ తెరిచి పూజలు చేసి ప్రసాదాలు పంచుతారు. పిల్లలూ, పెద్దలూ వాటికోసం తెల్లవారుజామునే నిద్రలేస్తారు. ముంగిటికి వచ్చిన హరిదాసులకు భిక్షపెట్టి దానగుణాన్ని పెంపొందించుకుంటారు. పాశురాలను గానం చేస్తారు. నాట్యం చేస్తారు. లలితకళలన్నిటికీ ధనుర్మాసం ప్రతినిధి. రాబోతున్న ఉత్తరాయణ పురుషుడు సమస్త ప్రాణుల సంరక్షణ కోసం ఎక్కుపెట్టిన ధనుస్సు ఈ ధనుర్మాసం.

81. త్యాగమే భోగం

మన పండుగల పేర్లు అన్నిటిలో ప్రత్యేకమైనది 'భోగి'. అది జయంతీ కాదు, వర్ధంతీ కాదు. ఏదైనా ఒక సంఘటనను సూచించేదీ కాదు. వినటానికి గొప్పగా, విశేషంగా ఉన్న భోగి పండుగ పేరు మానవజీవన సాఫల్యానికి ప్రతీక. భోగములు కలవాడు భోగి. భోగాలు అంటే వైభవాలు. సుఖసంపదలు. వాటిని సంపాదించటం వలన, అవి ఉండటం వలన మానవుడికి పైకి సుఖం కలుగుతున్నట్లు అనిపించినా లోపల అంతకుమించిన దుఃఖం ఉంది.

సంపాదించటానికి, దాన్ని దాచటానికి, ఖర్చు పెట్టడానికి మానవుడు అనుభవించేది దుఃఖమే కాని సుఖం కాదు. తాను ఆర్జించినదానిని ఆర్తులైన వారికి పంచటానికి, ఆత్మీయులతో కలిసి అనుభవించటానికి త్యాగబుద్ధి కావాలి. అదే అసలైన భోగం. ఆనందయోగం. భౌతికంగా, మానసికంగా ఈ దృక్పథాన్ని పెంపొందించుకునే విధంగా భోగి పండుగను పెద్దలు రూపొందించారు. కొత్తగా సంపాదించిన ఆదాయాన్ని, పాడిపంటలను పిసినారితనంతో దాచకుండా బంధుమిత్రులకు, పనివారికి, పేదలకు... పశువులు, ఆహారపదార్థాలు, పిండివంటలు, వస్త్రాభరణాల రూపంలో పంచిపెట్టి వారి అభినందనలు, ఆశీస్సులు అందుకోవటమే భోగం. పనికిరాని వస్తువులను కూడా పారెయ్యటానికి మనసొప్పని లోభగుణంతో సహా వాటన్నిటినీ వీధిలో పారేసి తగలెయ్యటమే భోగం. భోగిమంటలు ఈ పండుగ ప్రత్యేకత. అనేకరకాల త్యాగాలతో మానవుడు భోగి కావాలని ఈ పండుగ మనకు ఆచార వ్యవహారాల రూపంలో చెబుతోంది.

మహాభారతంలో కౌశికుడనే బ్రాహ్మణుడు, ఇక్ష్వాకు మహారాజుల మధ్య జరిగిన సంవాదంలో దానధర్మాలు, త్యాగగుణ ప్రయోజనాలు స్పష్టంగా ఉన్నాయి. ఇక్ష్వాకువు కౌశికునితో, 'నీకు ఏం కావాలంటే అది కోరుకో' అన్నాడు. కౌశికుడు 'నాకు ఏ కోరికలూ లేవు. నేనే నీకు ఇస్తాను. ఏం కావాలో కోరుకో' అన్నాడు. ఇక్ష్వాకువు... రాజ్యం, సిరిసంపదలు ఉన్నవాడు. కౌశికుడు అటువంటివి ఏవీ లేని పేద బ్రాహ్మణుడు. భౌతికంగా సంపన్నుడు మానసికంగా పేదరికాన్ని, పేదవాడు మానసిక సంపన్నతను కలిగి ఉండవచ్చు. భౌతిక సంపదలే సంపదలు అనుకోకూడదు.

ఇక్ష్వాకువు, 'కౌశికా! నీ జపఫలం అంతా నాకివ్వు' అన్నాడు. దానానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. ఇస్తానన్నాడని మొత్తం అడగకూడదు. అడిగాడని మొత్తం

ఇవ్వకూడదు. కౌశికుడు 'మహారాజా! నా జపఫలంలో సగం ఇస్తాను' అన్నాడు. 'ఆ సగం ఎంత?' అని ఇక్ష్వాకువు అడిగాడు. 'రాజా! నేను ఎప్పుడూ ఎవరి దగ్గరా ఏమీ తీసుకోను. నాకు లెక్కలు, ఎక్కువ తక్కువలు తెలియవు. ఇచ్చింది తీసుకోవటమే పరిగ్రహీత లక్షణమని ధర్మశాస్త్రం చెబుతోంది. నీవు అడిగినంత నేను ఇచ్చాను' అన్నాడు కౌశికుడు. త్యాగం, దానం భౌతికంగా ఇచ్చిపుచ్చుకోవటాలు మాత్రమే కాదనీ, మనోవిజ్ఞానాన్ని కూడా అలవరుచుకుంటే, ఇచ్చేవారూ పుచ్చుకునేవారూ దానివలన ఆనందాన్ని పొందగలుగుతారనే నిత్యసందేశాన్ని మహాభారతం అందిస్తోంది. త్యాగమే భోగం. గతమైన వ్యర్థాల మంటల్లో వర్తమానపు పాలు, కొత్త బియ్యాన్ని పొంగించి, పంచి, ఆనందంతో పొంగి పొమ్మని చెప్పే పొంగళ్ల పండుగను ఆ దిశగా జరుపుకుందాం.

82. సత్కార్యాలకే సాహసించాలి

భీముడు సౌగంధిక పుష్పం కోసం గంధమాదన పర్వతానికి బయలుదేరాడు. ప్రకృతి దృశ్యాల సౌందర్యాన్ని కళ్లారా చూస్తూ, పెద్ద అరటితోటలోకి ప్రవేశించి, శంఖాన్ని గట్టిగా ఊదాడు. అక్కడ కొండగుహలో నిద్రపోతున్న హనుమంతునికి ఆ శంఖధ్వని వినపడింది. శంఖాన్ని ఊదిన విధానం, ధ్వని ఆత్మీయతను బట్టి 'ఇది నా తమ్ముని శంఖారావమే' అని కనిపెట్టి సంతోషించాడు. ఆ ధ్వనిలోని అహంకారాన్ని కూడా హనుమ గుర్తించాడు. ఎదుటివారి మనసు కనిపెట్టే వ్యక్తిత్వ వికాసానికి ఇది ఒక ఉదాహరణ. భీముడికి హితోపదేశం మాటలతో కాక చేతలతో చెయ్యాలనుకున్నాడు. ముసలికోతి రూపంలో దారికి అడ్డంగా పడుకున్నాడు. భీముడు నెమ్మదిగా నిద్ర లేపకుండా గట్టిగా సింహనాదం చేశాడు. ఇది అతని అసహనాన్ని తెలియచేస్తుంది. ఆ అరుపులకు హనుమ నిద్ర లేచాడు. 'నాయనా! ముసలితనం, అనారోగ్యం... వీటి కారణంగా అలసిపోయి ఒదిగి పడుకొని ఉన్న నన్ను, పొగరుతో జాలి లేకుండా ఎందుకు నిద్ర లేపావు? జంతువులకు ధర్మం తెలియదు. మనిషిగా పుట్టిన నువ్వు వృద్ధులను, అనారోగ్యవంతులను బాధపెట్టకూడదు. నా వంటి పేదజంతువును బాధించే నువ్వు ఎవడివి?' అన్నాడు.

భీముడు 'నేను క్షత్రియుడిని. మహాబలవంతుడిని. పాండురాజు కుమారుడిని. వాయుదేవుడి వరాల వలన కుంతికి జన్మించాను. నన్ను భీముడు అంటారు' అన్నాడు. భీముడు చెప్పిన క్రమం, తీరు అతని గర్వాన్ని తెలియచేస్తున్నాయి. ముందు తన కులం,

బలం, తండ్రి పేరు, తన పుట్టుక గొప్పదనం... అన్నీ చెప్పి చివరికి తల్లిపేరు చెప్పాడు. హనుమ సముద్రాన్ని దాటినట్టు నీ మీద నుంచి దూకుతాను' అన్నాడు. అందువలన హనుమ భీమునికి జ్ఞానబోధను మూడు దశలలో ప్రారంభించాడు. మొదటిదశ అయిన మనస్సును సరిదిద్దటానికి 'హనుమంతుడు సముద్రాన్ని ఎందుకు దాటాడు?' అని అడిగాడు. అంటే సాహసకార్యాలు మహాప్రయోజనం కోసమే చెయ్యాలి కాని చిన్నచిన్న వాటి కోసం కాదు అని సూచన. భీముడు రామాయణకథ అంతా చెప్పాడు. 'నేను ఆంజనేయుడంతటివాణ్ని' అన్నాడు. అంటే భీముడికి రామాయణం తెలుసు కానీ దానిని ఆచరణలోకి తేవటం తెలియదు.

ఇక రెండవ దశ పొగరుగా మాట్లాడటం. అది కూడా దారికి రావాలి. అందుకని హనుమ 'నేను పెద్దవాణ్ని'. దారికి అడ్డంగా ఉన్న నా తోకను నీవే పక్కకు తోసి వెళ్లు'అన్నాడు. భీముడు తన బలానికి ఇది చాలా చిన్నపని అనుకున్నాడు. కానీ కదిలించలేకపోయాడు. మూడో దశ దేహబలం. దేహగర్వం అణిగేసరికి వాక్కుగర్వం అణిగింది. దాంతో భీముడు వెంటనే హనుమంతునికి నమస్కరించి, 'స్వామీ! మీరెవరు?' అన్నాడు. 'నేను అంజనీ కేసరులకు వాయుదేవుని వరం వల్ల జన్మించినవాడిని. నువ్వు చెప్పిన హనుమంతుడిని నేనే. సీతాన్వేషణ కోసమే నేను సముద్ర లంఘనం చేశాను. అందుకే శ్రీరాముడు నాకు శాశ్వతకీర్తిని వరంగా ఇచ్చాడు' అన్నాడు. ఈ సమాధానంలోనే మనసు, మాట, చేతలు ఎలా ఉండాలో భీమునికి హితోపదేశం చేశాడు మనస్తత్త్వశాస్త్రవేత్తగా. సత్కార్యాలకు మాత్రమే సాహసాలు చెయ్యాలి. ఇదే మహాభారతం మనకు అందించే సందేశ సౌగంధిక పుష్పం.

83. సద్భావమే శాంతికి మూలం

మానవజాతి సాంఘికంగా కలసిమెలసి జీవించేటందుకు కొన్ని నియమ నిబంధనలు ఏర్పడ్డాయి. వాటిని పాటించడం మానవులందరి కర్తవ్యంగా భావించాలి. తమకు లాభం చేకూర్చేవి పాటిస్తూ ఇబ్బంది పెట్టే వాటి నుంచి తప్పించుకోకూడదు. లాభమైనా, నష్టమైనా, కష్టమైనా, సుఖమైనా ఎదురుచెప్పకుండా, అవుననీ, కాదనీ వాదించకుండా ధర్మాన్ని ఆచరించి తీరాలి. అలా ఆచరించే ప్రవర్తన, క్రమశిక్షణ అలవాటు కావాలి. దానికి అవసరమైనది సద్భావం. ఇప్పుడు దీనిని అనుకూలబుద్ధి (పాజిటివ్ థింకింగ్) అంటున్నాం. ధర్మరాజు భీముడికి ఈ మాట చెప్పాడు.

పాండవులు మయసభలో జరిగిన ఒప్పందం ప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం చేస్తున్నారు. అరణ్యంలో వారికి కొన్ని సౌకర్యాలు లభించినా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. లోకప్రసిద్ధమైన రాజసూయయాగాన్ని చేసి రాజభోగాలను, వైభవాలను అనుభవించిన పాండవులు, ద్రౌపది ఇప్పుడు చెట్ల కింద, క్రూరమృగాల మధ్య జీవించవలసి వస్తోంది. కాయలు, పండ్లు, దుంపలు తినవలసి వస్తోంది. ఈ బాధలన్నింటినీ ధర్మరాజుపై ఉండే గౌరవంతో మిగిలినవారు మౌనంగా అనుభవిస్తున్నారు.

ఒకనాడు భీముడు ఉండబట్టలేక అన్నగారితో వాదనకు దిగాడు. "అన్నా! వంశపారంపర్యంగా వచ్చిన రాజ్యాన్ని మనం ఏకచ్ఛత్రాధిపత్యంగా విస్తరించాం. దానిని కౌరవులకు ఇచ్చేసి ఈ భయంకరమైన అడవుల్లోకి ఎందుకు రావాలి? సర్వార్థ సాధనమైన సంపదను విడిచిపెట్టి కన్నవారిని, బంధుమిత్రులను ఎందుకు కష్టపెట్టాలి. శత్రువులకు ఎందుకు సంతోషం కలిగించాలి? బాహుబలం లేని పనికిమాలినవాడు అడవులపాలై ఇటువంటి కష్టాలు పడవచ్చు. పట్టాభిషిక్తుడైన నీకు ఈ దుర్గతి ఎందుకు? నువ్వు అనుజ్ఞ ఇవ్వు. కౌరవులందరినీ చిటికెలో చంపేస్తాం. భయంకరమైన ఈ అడవిలో క్రూరమృగాల బారి నుండి తప్పించుకుందాం. రాజధానికి చేరుకుందాం. ఒప్పందానికి కట్టుబడి సహనంగా ఉన్న మనల్ని కౌరవులు పరాక్రమహీనులు అనుకుంటున్నారు. ఒంటరిగా ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనేవాడు ధర్మ అర్థ కామాలను విడిచిపెట్టవచ్చు. సమాజంలో ఉన్నవాళ్లకు ఎలా కుదురుతుంది? అర్థధర్మాలు సముద్రం, మేఘాల వంటివి. సముద్రంలో నీటివలన మేఘాలు ఏర్పడతాయి. మేఘాలు వర్షించటం వలన సముద్రం నిండుతుంది. ధర్మరాజా! నువ్వు ఇంత సహనంతో ఉండకూడదు' అన్నాడు. భీముడి మాటలన్నీ ధర్మరాజు శ్రద్ధగా విన్నాడు. "భీమసేనా! నువ్వు చెప్పింది బాగానే ఉంది. కానీ ధర్మమూ, నీతీ ఇప్పటికిప్పుడు కష్టాలమయంగా ఉన్నా ముందుముందు మనకు క్షేమాన్నీ, సత్కీర్తినీ ఇస్తాయి. కష్టాలనూ, బాధలనూ అనుభవించి అయినా ధర్మాన్ని పాటించాలి కాని వాటికోసం ధర్మాన్ని విడిచిపెట్టకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని ఆచరించితీరాలి అనే దృఢదీక్ష ఉన్నప్పుడు కష్టం కష్టంగా కనిపించదు. 'కార్యఫలంబులెల్ల సద్భావమునన్ విచార సులభంబుల యంద్రు విచార పారగుల్ (సద్భావంతో కార్యఫలితాలన్నీ అనుకూలంగానే కనిపిస్తాయి. ప్రతికూలభావన దుఃఖ కారణం. అనుకూల భావన ఆనందదాయకం)" అని ధర్మరాజు చేసిన సిద్ధాంతం అన్ని కాలాలలోనూ మానవులకు మనశ్శాంతి ప్రదాయకం.

84. పిల్లలు పెద్దలకు చెప్పవచ్చు

కాలం అన్ని ప్రాణులనూ భయపెడుతూ పరిగెడుతూ ఉంటుంది. ఎంతటివారైనా దానిని ఒక్క క్షణమైనా ఆపలేరు. గడిచిన క్షణాన్ని వెనక్కి తీసుకురాలేరు. కాలం ఎవరికోసమూ నిలవదు. అసలు కాలాన్ని గురించి ఎందుకు భయపడాలి? దానిదారిన అది పోతుంది. మన దారిన మనం పోదాం అనుకోవడం అజ్ఞానం. ఎటువంటి మూర్ఖప్రాణికైనా ఆకలి, నిద్ర, దేహంలో వచ్చే మార్పులు కాలగమనాన్ని తెలియజేస్తుంటాయి. పొద్దు వాలటం, తెల్లవారటం వాటంతట అవి జరిగిపోతూ ఉంటాయి. ఈ మధ్యకాలంలో ఎవరి పనులు వారు చకచకా చేసుకోవాలి. పసివారికి ఈ పరిజ్ఞానాన్ని పెద్దలు కలిగించాలి. పెద్దరికంలోను అనుభవాలు, జ్ఞాపకాలు పిల్లలకు అందిస్తే తరువాత తరానికి మేలు కలుగుతుంది. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు. కాలం విలువ తెలుసుకుంటారు. పైతరం కింది తరాల మధ్య ఈ అనుబంధం ఇలా కొనసాగుతూ ఉండాలి. పిల్లలు అడగాలి. పిల్లలు అడక్కపోయినా పెద్దలు చెబుతూ ఉండాలి. తమకు తమ పెద్దలు బోధించినట్లే తమ పిల్లలకు ఏదో ఉపాయంతో జ్ఞానబోధ చెయ్యాలి. పెద్దలే చెప్పాలా? మేం వినాలా? వారికి మేం చెప్పకూడదా? మాకు మాత్రం విజ్ఞానం, లోకజ్ఞానం లేదా? అని పిల్లలు అనుకోవచ్చు. మనసికంగా అటువంటి భావన పిల్లల మనసులో ఉంటుంది. అంచేత కొన్ని విషయాలు పెద్దలు పిల్లల్ని అడిగి తెలుసుకుంటూ ఉండాలి. దానివలన వారి అధ్యయనం, అవగాహన గమనించినట్లవుతుంది. పెద్దవాళ్ళు కూడా మనల్ని అడిగి తెలుసుకొంటున్నారనే ఘనతతో మరింత శ్రద్ధలో పెద్దలు చెప్పింది వింటారు. పిల్లల పెంపకంలో ఇన్ని సాధక బాధకాలు ఉన్నాయి. మహాభారతంలో ఇటువంటి కథ 'పితాపుత్ర సంవాదం'గా ఉంది. భీష్ముడు ఈ కథను ధర్మరాజుకు చెప్పాడు.

అధ్యయనపరుడు, విద్యాబుద్ధులు కలవాడు ఒక బాలుడు ఉన్నాడు. అతనిపేరు మేధావి. ఒకనాడు తండ్రి అతనిని కొన్ని ప్రశ్నలు అడిగాడు. పిల్లవాడు గొప్పసమాధానాలతో సందేహనివృత్తి చేశాడు ప్రశ్న–పుట్టిన మానవుడు చచ్చిపోయేలోగా ఏం చెయ్యాలి? సమాధానం: బాల్యంలో బ్రహ్మచారిగా బాగా చదువుకోవాలి. యౌవనంలో వివాహితుడై మంచిసంతానాన్ని పొందాలి. సత్కర్మలు ఆచరించాలి. వృద్ధాప్యంలో అన్ని బంధాలు వదులు కోవాలి. మృత్యువూ, ముసలితనం ప్రాణి పుట్టినక్షణం నుంచీ వెంటాడుతూనే ఉంటాయి. చేప తన చుట్టూ వలపన్ని ఉన్న విషయాన్ని గమనించక హాయిగా తిరుగుతూ వలలో చిక్కుకుంటుంది. అలాగే మృత్యువు ఎప్పుడు కబళిస్తుందో ఎవరికీ తెలియదు. కనుక చేయవలసిన మంచిపనులను

వాయిదా వెయ్యకూడదు. మరునాడు చేస్తాననకుండా మంచిపని ఇవాళే చెయ్యండి మనం మంచిపని ఎప్పుడో చేయబోతున్నామని అప్పటి వరకు మృత్యువు ఆగదు. మరణం, అమరత్వం రెండూ శరీరంలోనే ఉన్నాయి. మూఢత్వమే మృత్యువు. సత్యదర్శనమే అమరత్వం. 'రాగము సరి దుఖంఃబును, త్యాగము బోలెడి సుఖంబు నరయంగలవే' (బంధాలకు సమానమైన దుఃఖం, త్యాగాన్ని పోలిన సుఖం మరొకటి లేదు) అంటూ మేధావి అయిన పుత్రుడు తండ్రి అడిగిన ప్రశ్నలన్నిటికీ సరియైన సమాధానాలు చెప్పాడు. ధర్మరాజా! పెద్దలు పిల్లలకే కాక పిల్లలు కూడా పెద్దలకు చెప్పగలరు. పెద్దలు వారిని అలా తీర్చిదిద్దాలి. రెండు తరాలు మైత్రిలో, చర్చలతో అభిప్రాయాలు పంచుకోవాలి అత్మీయత పెంచుకోవాలి" అని భీష్ముడు ముగించాడు.

85. ధర్మం ఎవరికి తెలుస్తుంది..?

ధర్మం శాశ్వతం. దానికి ఎవరూ అతీతులు కారు. ఎవరికి వారు ఎప్పుడికప్పుడు తాము పాటించవలసిన, ఆచరించవలసిన ధర్మాలను తప్పకుండా ఆచరించి తీరాలి. "ధ్రియతే ఇతి ధర్మః" 'ధరాణాత్ ధర్మః' (ధర్మాన్ని మనం ధరిస్తే అది మనల్ని ధరిస్తుంది.) మనం ఆచరించవలసిన ధర్మం మనకు తెలియాలి. తెలుసుకోవటం ఎలా? దానికి కొన్ని అర్హతలు, నియమ నిబంధనలు ఉన్నాయి. అవి చెప్పేవారికీ, వినేవారికీ కూడా వర్తిస్తాయి. ఎవరికీ వారు అధికారం, అహంకారం, అంగబలం, అర్థబలాలతో తనకు తోచింది, తాను చెప్పేది ధర్మం అనుకోకూడదు. కానీ లోకంలో చాలామంది అలాగే అనుకొంటూ ఉంటారు. పాండవులు రాజసూయయాగం చేసిన సందర్భంగా శ్రీకృష్ణుడు, మిగిలిన రాజులూ, బంధుమిత్రులు అందరూ వచ్చారు. యాగం శాస్త్రోక్తంగా మహావైభవంగా జరిగింది. పాండవులను ఆశీర్వదించటానికి సదస్సు ఏర్పాటయింది. ఆ సభకు వచ్చిన పెద్దలలో అర్హుడైన ఒకరిని పూజించి సత్కరించమని భీష్ముడు ధర్మరాజుకు సూచించాడు. ఆ సత్కారానికి తగిన వారెవ్వరో నువ్వే చెప్పమని ధర్మరాజు భీష్మణ్ణి అడిగాడు. సకల లోకపూజ్యుడు శ్రీకృష్ణుడే తగిన వాడని ఆయన చెప్పిన మాట ప్రకారం ధర్మరాజు శాస్త్రీయంగా అర్ఘ్యపాద్యాది సత్కారాలతో వాసుదేవుణ్ణి పూజించాడు. ఇదంతా గమనిస్తున్న శిశుపాలుడు సత్కారం పూర్తికాగానే లేచి అభ్యంతరం తెలిపాడు. 'పూజనీయులయిన రాజులు ఎంతోమంది ఉండగా ముసలాయన చెప్పాడని అనర్హుణ్ణి పూజిస్తావా? నీకు ధర్మం తెలియదు. చెప్పిన

భీష్ముడికీ తెలియదు. శ్రీకృష్ణుడు మీకు ఇష్టుడైతే చాటుగా సన్మానాలు చేసుకోండి. డబ్బు, కానుకలు ఇచ్చుకోండి. పెద్దలెందరో ఉన్న ఈ సభలో దీనికి నేను అంగీకరించను. ఇది ధర్మం కాదు'' అన్నాడు ధర్మరాజు. "శిశుపాలా! వృద్ధుడు, జ్ఞాని అయిన భీష్మపితామహుడు చెప్పినట్లే నేను చేశాను' అని అతనిని బుజ్జగిస్తుండగా

"ధర్మరాజా! శిశుపాలుని లెక్కచేయనక్కర్లేదు. అతని మాటలు పట్టించుకోవద్దు. ధర్మం చెప్పటానికి కొన్ని అర్హతలు ఉండాలి. అవి ఇతనిలోలేవు. శిశుపాలుడు అవినీతిమంతుడు, వయసులో చిన్నవాడు, రాగద్వేషాలతో మనస్సు చెడిపోయినవారికి, అల్పమైన రాజ్య సంపదలకే కళ్ళుమూసుకుపోయిన వారికి, కారణం లేకుండా పెద్దలతో, మహాత్ములతో గొడవలు పెట్టుకునే వారికి ధర్మం తెలుసుకునే జ్ఞానం నశిస్తుంది. వారికి తెలిసిందే ధర్మం అనుకొంటారు. ఇతను మూఢుడు, ఇటువంటి వారికి ధర్మం తెలియదు. చెప్పే అర్హత లేదు. సత్ప్రవర్తన, అధ్యయనం కలిగి ఉత్తమ జ్ఞానవృద్ధుడుగా పేరు పొందినవాడు వయసులో చిన్నవాడయినా అతన్ని పూజించవచ్చు. శిశుపాలుడు మా అందరికన్న చిన్నవాడు. శ్రీకృష్ణునిపై ద్వేషంతో, క్రోధంతో అతని మనసు చెడిపోయింది. చిన్నరాజ్యానికి రాజయినందుకే గర్విస్తున్నాడు. తనకు సంబంధం లేని విషయంలో తలదూర్చి పెద్దలతో కావాలని కయ్యం పెట్టుకుంటున్నాడు. పెద్దలు, ధర్మజ్ఞులు తన ఎదుట ఉన్నారనే భయభక్తులు లేకుండా అవినయంతో అధికంగా మాట్లాడుతున్నాడు. ఇది మూర్ఖత్వానికి పరాకాష్ఠ''. 'భీష్ముడు ఈ సందర్భంలో ఇచ్చిన వివరణ అందరికీ అన్ని కాలాల్లో పనికివస్తుంది. ధర్మాన్ని చెప్పేవారి అర్హతలు, అనర్హతలు తెలుసుకొని వారి మాట వినాలి. లేకపోతే ధర్మకాలుష్యం ఏర్పడుతుంది. ధర్మ జయించుగాక! ధర్మస్య జయోస్తు!

86. సూర్యుని విజయ యాత్ర-రథసప్తమి

భారతీయ ఖగోళజ్ఞానం ప్రాచీనమైనది, శాస్త్రీయమైనది. భూమికి చుట్టూ ఉన్న ఇతర గ్రహాలు, వాటి కదలికల విధానం, ప్రభావం, ప్రయోజనం మొదలైనవాటిని సూక్ష్మాతిసూక్ష్మంగా, లోతుగా పరిశీలించి మహర్షులు లోకానికి అందించిన వాఙ్మయం ఎంతో ఉంది. వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు అన్నీ సూర్యుణ్ని ప్రార్థించమంటున్నాయి. సూర్యుణ్ని ప్రత్యక్షదైవంగా ప్రస్తుతిస్తున్నాయి. కంటికి కనపడని పరబ్రహ్మం యొక్క దర్శనం సూర్యునిలో

కలుగుతుంది. 'అసావాదిత్యోబ్రహ్మ' (సూర్యుడే పరబ్రహ్మం) భూగోళంపై ఉన్న సమస్త ప్రాణులు, పంచభూతాలు (నేల, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) అన్నీ సూర్యుని ప్రభావం వల్ల, కిరణప్రసారం వల్ల చైతన్యాన్ని, ప్రయోజనాన్ని పొందుతున్నాయి. సౌరశక్తి లేకుండా జీవజాలానికి మనుగడే లేదని ప్రాచీన, ఆధునిక శాస్త్రవిజ్ఞానం సూర్యారాధన ఆవశ్యకతను తెలియజేస్తోంది.

సంవత్సరంలోని పన్నెండు నెలల్లో మాఘమాసం, అయనాల్లో ఉత్తరాయణం, తిథుల్లో సప్తమి, నక్షత్రాల్లో రోహిణి, రంగుల్లో ఎరుపు, నైవేద్యాలలో పొంగలి, ఓషధుల్లో జిల్లేడు, వృక్షాల్లో రేగు, ఫలాల్లో రేగు, పువ్వుల్లో మంకెన వంటి ఎర్రనిపూలు, ఎర్రచందనం వంటివి సూర్యునికి ప్రీతిపాత్రమైనవి. మాఘమాసం సూర్యమాసం. ఈ నెల నుంచి చలి తగ్గి ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి విపరీతమైన చలి, పగటిపూట వేడి ఉంటుంది.

ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో వచ్చే వ్యాధులను, అనారోగ్యాలను నివారించుకోవటానికి మహర్షులు ఆచారరూపంలో ఒక ప్రణాళిక ఏర్పరిచారు. ఈ మాసంలో తెల్లవారుజామున నదీస్నానం చెయ్యాలి. శుక్ల సప్తమినాడు జిల్లేడు, రేగు ఆకులను, గరికను తల, భుజాలు, మెడ, వీపు, కుడి ఎడమ రొమ్ముల... మీద మొత్తం ఏడుచోట్ల పెట్టుకుని నది, చెరువు, బావి వంటి చోట్ల ప్రాతఃకాలంలో బహిరంగ జలాల్లో స్నానం చేసి సూర్యునికి నమస్కరించాలి. ప్రమిదలో ఆవునెయ్యిలో ఒత్తి వేసి దీపం వెలిగించి దాన్ని తలపై పెట్టుకొని నీటిలోకి దిగి వదలాలి. ఆవు పేడ పిడకల సెగలో ఆవుపాలు ఎర్రగా కాచి, ఎర్రని ముడిబియ్యం పోసి ఉడికించి, బెల్లం వేసి ఆ పొంగలిని సూర్యునికి నైవేద్యం పెట్టి ప్రసాదంగా తీసుకోవాలి. షష్ఠినాడు ఒక పూట తిని రాత్రికి ఉపవాసం ఉండాలి. దీపాన్ని నీటిలో వదిలేటప్పుడు మనసులో సూర్యుణ్ని ధ్యానిస్తూ జలదేవత అయిన వరుణునికి నమస్కరించాలి. రథసప్తమి నాడు సూర్యకాంతిలో ఎన్నో ప్రత్యేకతలు ఉంటాయి. ఆ కిరణాలు సోకిన నీటిలో స్నానం చేస్తూ గత జన్మలు, ఈ జన్మలో మనసు, వాక్కు, కాయం, తెలిసీ తెలియక చేసిన ఏడురకాల పాపాలు, రోగాలు, శోకం రథసప్తమి స్నానం వల్ల పోతాయని 'నిర్ణయసింధు' చెబుతోంది.

ఇతి సప్తవిధం పాపం స్నానాన్మే సప్తసప్తికే
సప్తవ్యాధి సమాయుక్తం హరమాకరి సప్తమి...

అనే మంత్ర శ్లోకాన్ని చదువుతూ రథసప్తమి స్నానం చేసి సూర్యానుగ్రహాన్ని పొందుదాం. ఏడు గుర్రాల సూర్యుని రథం ఈ నాటి నుంచి వేగం పుంజుకుంటుంది. రథసప్తమినాడు సూర్యుని విజయయాత్రకు స్వాగతం చెబుదాం.

87. జాతికి మేలు చేసిన వారికి

అందరూ వారసులే!

మహాభారతంలో కౌరవులు, పాండవులు అందరికీ పితామహుడు, పూజనీయుడు భీష్ముడు. శ్రీకృష్ణుడు కూడా గౌరవించిన కురువృద్ధుడు. ఎన్నో యుద్ధాలలో ఆరితేరిన మహావీరుడు. తన గురువైన పరశురామునితో పోరాడి ఆయన ఆశీస్సులు అందుకున్నవాడు. మానవధర్మాలు, మానవ సంబంధాలు, వ్యక్తిత్వవికాసం, రాజనీతి, యుద్ధనీతి అన్నీ తెలిసిన మహామేధావి. తండ్రి తనను అడగకపోయినా ఆయనకోసం కఠోరనిర్ణయం తీసుకుని బ్రహ్మచర్యాన్ని జీవితాంతం పాటించిన మహానుభావుడు. భీష్మపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు ఎన్నో విషయాలు అంపశయ్యపై నుండి ఓపిగ్గా చెప్పాడు. అవి మొత్తం మానవజాతికి అన్ని కాలాల్లోనూ ఆచరణీయాలు.

ఉత్తరాయణంలో మొదట వచ్చే పవిత్రమైన మాఘశుద్ధ ఏకాదశికి మూడురోజులు ముందు అష్టమినాడు భీష్ముడు ప్రాణాలు విడిచాడు. మహాభక్తులైన ప్రహ్లాద నారద పరాశరులలో ఒకడైన భీష్మునికి గౌరవసూచకంగా మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన ఏకాదశిని భీష్మ ఏకాదశిగా మరింత భక్తిశ్రద్ధలతో జరుపుకునే విధంగా పెద్దలు ఏర్పరిచారు. 'నీ భక్తుణ్ణి నా మనస్సు ఎప్పుడూ నీయందే లగ్నమై ఉంటుంది. భార్యాబిడ్డలు లేని బ్రహ్మచారిని పుండరీకాక్షా! ఎల్లప్పుడూ నన్ను కాపాడు' అని మరణ సమయంలో తన దగ్గర ఉన్న శ్రీకృష్ణుణ్ణి భీష్ముడు ప్రార్థించాడు. ఆ కారణంగా ఆయనకు మోక్షాన్ని ప్రసాదించటమే కాక తరువాత వచ్చే ఏకాదశినాడు అందరూ ఎల్లప్పుడూ తలచుకునేవిధంగా శ్రీకృష్ణుడు ఇలా అనుగ్రహించాడు. మరణించిన వారిని భూలోకంలో ఎవరైనా మంచిగా తలచుకుంటూ ఉంటేనే వారికి పరలోకంలో ఉత్తమస్థితి లభిస్తుంది. వారసులు లేనికారణంగా భీష్ముణ్ని మానవులు అందరూ తలచుకునేటట్లు ఇది భీష్మేకాదశి అయింది. మామూలుగా అయితే సంతానం లేనివారికి మోక్షం లేదు. కాని తండ్రికోసం తాను వివాహాన్ని మానుకుని బ్రహ్మచర్యాన్ని పాటిస్తానని భీష్మప్రతిజ్ఞ చేయడం వల్లనే 'దేవవ్రతుడు' భీష్ముడిగా పేరొందాడు, ప్రఖ్యాతుడయ్యాడు. పితృభక్తితో తాను ఇలా చేస్తున్నందువల్ల తనకు సంతానం లేకపోయినా ముక్తి లభిస్తుంది అని భీష్ముడు చేసిన తీర్మానం జనంకోసం, జాతికోసం, దేశంకోసం స్వసుఖాలను త్యాగం చేసే వారందరికీ వర్తిస్తుంది. జాతిజనాలు వారిని మరచిపోకుండా తలచుకుంటూ ఉండాలి. అది మనందరి బాధ్యత. వారి త్యాగం వలన లాభం, స్ఫూర్తి పొందిన వారందరూ వారసులే

అవుతారు. ఒకరిద్దరు సొంతవారసులకోసం జాతిక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం కన్న త్యాగబుద్ధితో జాతికి మేలు చేస్తే అందరూ వారసులై తలచుకుంటూ ఉంటారు. మోక్షం లభిస్తుంది. అనే స్ఫూర్తిని 'భీష్మ ఏకాదశి' మానవజాతికి అందిస్తోంది.

"భీష్మా! నీకు ఏ పాపాలు అంటవు" అని శ్రీకృష్ణుడు భీష్ముని మరణ సమయంలో ప్రకటించాడు. భీష్ముని నామస్మరణ చేయడం వలన ఆయనకు, అంతటి పుణ్యాత్ముని స్మరించిన వారికి శాశ్వత పుణ్యలోకాలు, ముక్తి తప్పక లభిస్తాయి. 'పుణ్యానిమాన్ పరమ భాగవతాన్ స్మరామి'. 'పూజ్యులైన పరమ భాగవతోత్తములను ఎల్లప్పుడూ స్మరిస్తాను' అనే ప్రతిజ్ఞను భీష్మ ఏకాదశినాడు మానవజాతి అంతా తీసుకోవాలి.

88. మానవులందరినీ మేల్కొల్పే ప్రశ్నలు

వ్యక్తిత్వవికాసం కోసం, మార్గదర్శనం కోసం అడుగడుగునా ప్రయత్నించడమే సాహిత్య ప్రయోజనం. 'హితేన సహితం సాహిత్యమ్' (హితముతో కూడినదే సాహిత్యం). అటువంటి సాహిత్యం శాశ్వతమై యుగయుగాలు, తరతరాలు మానవజాతికి పఠనీయమై పూజనీయమౌతుంది.

మహాభారతం ఇతిహాసంగా అటువంటి స్థానాన్ని పొంది అందరికీ ప్రీతిపాత్రమౌతోంది. కనుకనే తెలుగువారు 'తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి' అనే సామెతను కూడా సృష్టించుకున్నారు. మహాభారతంలో నిరూపితమైన అర్థాన్ని... తెలుగువారికి స్పష్టంగా తెలిసేటట్లు చెప్పమని రాజరాజనరేంద్రుడు నన్నయను అడిగాడు. సమాజానికి మేలుచేసే విషయాలు దానిలో ఉన్నాయని ఆయన గ్రహించాడు కనుకనే ఆ కోరిక కోరాడు.

సుఖదుఃఖాలు, లాభనష్టాలు, కామక్రోధాలు... మానవ సంబంధాలను చెడగొడతాయి. అందరికీ మంచిగా ఉంటూ మన క్షేమం మనం కాపాడుకునే జీవనవిధానం, నడవడిక తెలియాలి. అప్పుడు ప్రశాంతంగా జీవించవచ్చు. విభేదాలు, ఒత్తిడులు, ఘర్షణలు లేకుండా జీవించగలగడమే ఉత్తమజీవనం. పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు ఒక యక్షునికి చెందిన సరస్సులో మంచినీళ్లు తాగబోయి విగతజీవులు అవుతారు. వారిని బతికించాలంటే తానడిగిన ప్రశ్నలకు సరియైన జవాబులు చెప్పాలని యక్షుడు ధర్మరాజుకు నిబంధన విధించాడు. ధర్మరాజు అంగీకరించాడు. వారిద్దరి మధ్య జరిగిన ప్రశ్న సమాధానాలను పరిశీలిస్తే

మానవజాతి క్షేమం కోసం వ్యాసమహర్షి ఎంత శ్రమపడ్డాడో తెలుస్తుంది.

యక్షుడు 'వదులుకోవడం' అనే అంశం మీద నాలుగు ప్రశ్నలు అడిగాడు. ఏం వదులుకుంటే అందరికీ మంచి అవుతాం? ఏం వదులుకుంటే దుఃఖించకుండా ఉంటాం? ఏం వదులుకుంటే ధనవంతులం అవుతాం? ఏం వదులుకుంటే సుఖపడతాం? ఈ నాలుగు ప్రశ్నలకు మనకు ఏవేవో సమాధానాలు సందర్భాన్ని బట్టి తట్టవచ్చు. సిగ్గు లజ్జా వదులుకుంటే ఏమైనా చెయ్యొచ్చు అని కూడా చమత్కారంగా సమాధానం చెబుతాం.

కాని ధర్మరాజు చెప్పిన నిజమైన సమాధానాలు విని ఆచరిస్తే ప్రశాంతంగా జీవిస్తాం. 'అహంకారాన్ని వదులుకుంటే అందరికీ మంచి అవుతాం. క్రోధాన్ని వదులుకుంటే శోకించకుండా ఉంటాం. కోరికలను వదులుకుంటే ధనవంతులం అవుతాం. లోభాన్ని (దురాశ) వదులుకుంటే సుఖసంతోషాలు పొందుతాం' ఇవి ధర్మరాజు చెప్పిన సమాధానాలు.

ఈ నాలుగు సమాధానాలు చదివి మరిచిపోవటం కాకుండా, ప్రతిక్షణం చెవిలో మారుమ్రోగుతూ ఉండాలి. ఆచరణలో పెట్టాలి. అహంకారం, క్రోధం, మితిమీరిన కోరికలు, లోభం ఈ నాలుగే దుఃఖకారణాలు. ఈ నాలుగింటినీ వదులుకోవటమే సుఖజీవనం.

మానవజాతిని మేల్కొల్పటానికి సూచనగా... మిగిలిన పాండవులందరూ పడిపోయినట్లుగా, జ్ఞానవంతుడైన ధర్మరాజు ఒక్కడే స్పృహలో ఉన్నట్లుగా, తన విజ్ఞానంతో వారిని చైతన్యవంతుల్ని చేసినట్లుగా... ఈ కథ నడిచింది. కాని యక్షప్రశ్నలు, ధర్మరాజు సమాధానాలు మానవులందరి కోసం రూపొందించబడ్డాయి.

89. మంగళప్రదం - శివనామం

త్రిమూర్తులలో ఒకడుగా పరిపక్వమైన సృష్టిని లయం చేసి పునఃసృష్టికి అవకాశం కల్పించే శివుడు భక్తసులభుడు. బోళాశంకరుడు. నిరాడంబరత, నిజాయితీ, త్యాగగుణం, పరోపకారం, నిస్వార్థత, అన్యోన్యదాంపత్యం, చక్కని కుటుంబజీవనం, సర్వజన సమానత్వం వంటి ఉత్తమ వ్యక్తిత్వ లక్షణాలు ఒక రూపం ధరిస్తే పరమేశ్వరుడుగా కనిపిస్తాడు. శివనామానికి 'మంగళకరం' అని అర్థం. ఈశ్వరుడు అనే పేరు సర్వసమర్థుడైన వాడికే చెల్లుతుంది. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. అంతటి ఆధిపత్యం ఉన్నా ఆయన గొప్పలకు పోడు. ఎంతటివారు పిలిచినా పలుకుతాడు. సాలీడు, పాము, ఏనుగు... వంటి జంతువులు, తిన్నడు,

గౌడగూచి వంటి అమాయకులు, రావణాసురుడు, గజాసురుడు వంటి రాక్షసులు, బ్రహ్మ, విష్ణువు మొదలైన దేవతలు... ఎవరు ప్రార్థించినా అనుగ్రహిస్తాడు. పెద్దపెద్ద కానుకలు, వైభవాలు ఏమీ కోరుకోడు. అడిగినవారికి అన్నీ ఇస్తాడు. దానివలన తనకు కష్టనష్టాలు వచ్చినా పట్టించుకోని ప్రబలదేవుడు మహాదేవుడు.

నీలకంఠుని శిరసుపై నీళ్లు చల్లి
పత్త్రిరిసుమంత ఎవ్వాడు పారవైచు
కామధేనువు వానింటి గాడి పసర
మల్ల సురశాఖి వానింటి మల్లె చెట్టు (రాజశేఖర చరిత్ర)

నిర్లక్ష్యంగా ఆయన శిరస్సుపైన కాసిని నీళ్లు చల్లగా, ఆ చల్లినవాడు భక్తుడైతే అదే అభిషేకంగా భావిస్తాడు. ఒక్క మారేడుదళం తెచ్చి ఆయన మీద పారేసినా, వేసినవాడు నిజమైన భక్తుడైతే, అదే షోడశోపచారపూజగా ఆనందిస్తాడు. కోరిన కోరికలు తీర్చే కామధేనువు, స్వర్గం నుంచి వచ్చి, ఆ భక్తుని పశువుల కొట్టంలో ఆవు అవుతుంది. అడిగినవన్నీ ఇచ్చే కల్పవృక్షం ఆ భక్తుని పెరట్లో మల్లెచెట్టు అవుతుంది. శివుని దయ అంత గొప్పది.

దేవతలు, రాక్షసులు అంతా కలిసి అమృతం కోసం పాలసముద్రాన్ని చిలికితే భయంకరమైన హాలాహలం పుట్టింది. అందరూ పారిపోయి ఈశ్వరుణ్ని ప్రార్థించారు. ఆయన లోకక్షేమం కోసం ఆ విషాన్ని తన గొంతులో దాచుకున్నాడు. నీలకంఠుడు అయినాడు. భూలోకానికి ఆకాశగంగ దిగి రావడానికి తన తల బద్దలౌతుందేమోనన్న భయం లేకుండా తల అడ్డం పెట్టాడు. భగీరథుని ప్రార్థన, మూడు లోకాలకూ గంగాజలాన్ని పుష్కలంగా అందించే సత్కార్యం ఆయన చేత అలా చేయించింది. అంతటి దయగల పరమశివుడు సాకారంగా లోకానికి కనబడటానికి మాఘమాసం బహుళ చతుర్దశి అర్ధరాత్రి మహాలింగరూపంలో అవతరించాడు. ఆ శివలింగానికి ఆది, అంతమూ ఉండదు. కళ్లు, ముక్కు, చె వులూ ఉండవు. కానీ ఒక ఆకారంగా కనిపిస్తుంది. అదే శివతత్త్వం.

'లీనం గమయతి ఇతి లింగః' ఈ సృష్టిలోని ప్రతిప్రాణీ ఆ మహాలింగంలోని ఒక అణువు నుండి ఆవిర్భవిస్తుంది. మళ్లీ దానిలో కలిసిపోతుంది. అన్నిటినీ తనలో లీనం చేసుకోవటం వలన 'లింగము' అనే పేరు వచ్చింది. అది శివరాత్రి పర్వదినం అయింది. ఈశ్వరానుగ్రహం ఉంటే ఇహపరాలు రెండూ ఆనందమయంగా సాగుతాయి. ప్రశాంతత, ప్రసన్నత లభిస్తాయి. ఓం నమశ్శివాయ!!!

90. అసలైనది ఏది?

అనేక విషయాలలో మనం సత్యాసత్యాలను గ్రహించలేక నష్టపోతూ ఉంటాం. చాలామంది తమ మాటలతో, హావభావాలతో, నటనతో మనలను నమ్మించి మోసం చేస్తూ ఉంటారు. అయినా మళ్లీమళ్లీ మోసపోతూనే ఉంటాం. నమ్మించి గొంతు కోసే వ్యక్తులు, సంస్థలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దానికి కారణం మోసపోయే స్వభావం మానవుడికి పుట్టుకతో ఉండటమే. ఈ మానసిక బలహీనతను సరిచేసి నిజానిజాలను, సత్యాసత్యాలను సరిగ్గా బేరీజు వేసుకొనే వివేకాన్ని ఇవ్వటానికే మహాభారతం పుట్టింది. 'నిజం' అంటే తనది. 'సత్యం' అంటే శాశ్వతమైన యథార్థస్థితి. ఏది తనదో, ఏది తనకు పనికి వస్తుందో, ఏది శాశ్వతమైనదో మనిషి గ్రహించగలగాలి.

అరణ్యపర్వంలో యక్షుడు ధర్మరాజును అసలైనది ఏదో తెలియచెప్పే విధంగా నాలుగుప్రశ్నలు అడిగాడు. ఒకటి – నిజంగా ఆనందాన్ని పొందేవాడెవడు? రెండు – నిజమైన ఆశ్చర్యం ఏది? మూడు – సరియైన దారి ఏది? నాలుగు – అసలైన వార్త ఏది? ఈ నాలుగు ప్రశ్నలు మానవజాతికి అంతటికీ కలుగవలసినవే. సమాధానాలు కూడా అందరూ తెలుసుకోవలసినవే. ఎందుకంటే ఆనందం, ఆశ్చర్యం, దారి, వార్త అనే ఈ నాలుగింటిలోనూ మనం భ్రమలతో పొరబడుతున్నాం.

అప్పు చేసి అయినా పప్పుకూడు తినటం, స్వదేశం విడిచి పరాయిదేశంలో అస్వతంత్రతతో లక్షలు, కోట్లు గడించటం... ఆనందం అనుకుంటున్నాం. కానీ ధర్మరాజు అది అసలైన ఆనందం కాదంటున్నాడు. తన ఇంట్లో తాను ఉంటూ, అయిదారు రోజులకొకసారి అయినా ఒక్క కూర, అన్నం... అప్పు లేకుండా తినేవాడు పొందేదే అసలైన ఆనందం. పరుల పంచన ఆత్మాభిమానాన్ని కోల్పోయి పంచభక్ష్యపరమాన్నాలు తినటం వలన కలిగేది ఆనందం అనుకోవడం పశులక్షణం. మానవుడు అలా అనుకోకూడదు. స్వస్థలంలో ఉండటం, సొంత తిండి తినటం, అప్పు చేయకుండా ఉండటమే... ఆనందం.

ఇక ప్రతి చిన్నదానికీ మనం ఆశ్చర్యపడిపోతూ ఉంటాం. కానీ అసలైన ఆశ్చర్యాన్ని గమనించం. అదేమిటంటే ప్రతిరోజూ ఎన్నో జీవులు, మహానుభావులు ప్రాణాలు విడిచిపెడుతున్నారు. బతికి ఉన్నవాళ్లం మాత్రం శాశ్వతంగా ఉంటామకుంటున్నాం. ఇదే అసలైన ఆశ్చర్యం. ఈ మాటే ధర్మరాజు చెప్పాడు.

మూడోప్రశ్న– ఏది అసలైన సరైన దారో తెలియక మాటిమాటికీ దేవుళ్లను, గురువులను,

సిద్ధాంతాలను, ఆహారవిహారాలను మార్చేస్తున్నాం. ఇవాళ్టికి ఇదే సరియైన దారి అనిపిస్తోంది. రేపటికి మరొకటి కనిపిస్తోంది. భ్రమలకు లోనై దారులు మార్చకూడదు. మహాత్ములు నడిచినదే అసలైన దారి. దానిని విడిచిపెట్టకూడదు.

నాలుగో ప్రశ్న - ప్రచారమాధ్యమాల్లో వచ్చేవాటిలో, నేటి తాజా వార్త రేపటికి పాతబడిపోతుంది. కానీ అసలైన వార్తను గమనించం. అదేమిటంటే అజ్ఞానమనే పెద్దపాత్రలో జీవులందరినీ వేసి కాలపురుషుడు ఉడకబెట్టేస్తున్నాడు. సూర్యుడు... నిప్పు. రాత్రింబవళ్లు... కట్టెలు. ఉడికే పదార్థాన్ని... నెలలు, ఋతువులు, సంవత్సరాలనే గరిటెలలో తిప్పి చూస్తున్నాడు. ఇంతకుమించిన వేడివేడి వార్త మరొకటి ఏముంటుంది? కాబట్టి మానవుడు అజ్ఞానంతో పెడదారులు పట్టకుండా అసలైనది ఏదో తెలుసుకొని విజ్ఞానవంతులై జన్మను సార్థకం చేసుకోవాలి.

91. పనికివచ్చే చుట్టాలు

ఇతర ప్రాణుల్లో సజాతి బంధుత్వం మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. వ్యక్తిగత బాంధవ్యం తల్లిపాలు తాగేవరకు మాత్రమే తల్లీబిడ్డలకు ఉంటుంది. కాకికి కాకి ఏ చుట్టం అవుతుందో తెలియదు కానీ కాకులన్నీ అనుబంధాన్ని కొనసాగిస్తూ ఉంటాయి. అవసరానికి పరస్పరం సహాయసహకారాలు అందించుకుంటాయి. మానవుడు... జన్మతో వచ్చిన తల్లి, తండ్రి, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, తండ్రివైపు, తల్లివైపు బంధుత్వాలను, వివాహాదుల ద్వారా వచ్చిన కొత్త చుట్టరికాలను జీవితాంతం కొనసాగిస్తూ ఉంటాడు. కానీ ఈ చుట్టరికాలన్నీ సాపేక్షంగా లాభనష్టాలను బట్టి బలంగా, బలహీనంగా సాగుతూ ఉంటాయి. 'చుట్టాలు, దొంగలు, సుతులు, ఋణస్థులు' అని భాగవతం వ్యాఖ్యానిస్తోంది.

'అక్కరకు రాని చుట్టము... గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ' అని నీతి శతకం చెబుతోంది. అక్కరకు రావటమంటే అవసరానికి ఆదుకోవటం. ఇంట్లో జరిగే శుభాశుభకార్యక్రమాలకు రావటం. దీనిని బట్టి రక్తసంబంధమైన చుట్టరికాల కంటె అవసరానికి ఆదుకొని వెంటనడిచేవాడు, పలకరించేవారే అసలైన చుట్టాలుగా బంధుత్వాలు బలపడతాయని తెలుస్తోంది. మహాభారతం అరణ్యపర్వంలో యక్షుడు ధర్మరాజును చుట్టరికాన్ని గురించి నాలుగు ప్రశ్నలు అడిగాడు. ఆ నాలుగూ జీవితంలో అతి ముఖ్యమైనవి.

అవి... బాటసారికి చుట్టం ఎవరు? రోగికి చుట్టం ఎవరు? గృహస్థుకు చుట్టం ఎవరు? మరణించిన వానికి చుట్టం ఎవరు? వీటికి ధర్మరాజు చెప్పిన సమాధానాలు మనమందరం గుర్తుంచుకోవాలి.

బాటసారికి చుట్టం గుంపు. ఒంటరిగా ఎప్పుడూ ప్రయాణం చెయ్యకూడదు. దారిలో ఏ ప్రమాదం జరిగినా, ఇబ్బంది వచ్చినా చెప్పుకునే వారుండాలి. వాళ్లు మన రక్తసంబంధీకులు కానక్కర్లేదు. నేటి మానవులు వాహనాల్లో కూడా 'నిర్భయం'గా ప్రయాణం చెయ్యలేకపోతున్నారు. పక్కవారిని నమ్మవద్దని ప్రకటనలు చేస్తున్నాం. ఒకరినొకరు దోచుకోకుండా అండగా ఉండటమే చుట్టరికం.

రోగికి చుట్టం వైద్యుడు. ఏ రోగం వచ్చినా సొంత చుట్టాల కంటె ముందు గుర్తు వచ్చేది, కాపాడేది వైద్యుడే. అనగా వైద్యుడు ముందు రోగిని కాపాడాలి. తరువాత ధనం గురించి ఆలోచించాలి. ధనం ఉంటేనే వైద్యం అనే వైద్యుడు సాటి మానవుడికి నిజం చుట్టం కాదు. ధనవ్యామోహంతో వైద్యం చెయ్యకూడదు.

గృహస్థుకు చుట్టం భార్య. స్త్రీపురుషులు భార్యాభర్తలుగా కుటుంబంగా ఏర్పడినప్పుడు ఒకరికొకరు తోడు నీడగా ఉండాలి. నమ్మకంగా ఉండాలి. గృహనిర్వహణలో భర్తకు, సంపాదనలో భార్యకు దిగులు లేకుండా సంసారం చక్కగా సాగాలంటే ఈ చుట్టరికంలో లోటుపాట్లు ఉండకూడదు.

మరణించినవాడికి చుట్టం... చేసిన సత్కార్యాలు. దేహబంధువులు శ్మశానం వరకే వస్తారు. ఆస్తిపాస్తుల గొడవల్లో అందరూ రాకపోవచ్చు కూడా. చేసిన పుణ్యం మాత్రం మరణించిన వ్యక్తి వెంట ఉండి కాపాడుతూ ఉంటుంది. రక్తసంబంధం లేనివారు కూడా వచ్చి చూసిపోతారు.

యక్షుడు అడిగిన నాలుగు ప్రశ్నలకూ ధర్మరాజు చెప్పిన చుట్టాలెవరూ రక్తసంబంధీకులు కారు. దానిని బట్టి అసలైన చుట్టాలెవరో, పనికివచ్చే చుట్టాలెవరో మనకు తెలుస్తుంది. మానవ సంబంధాల మహనీయతను తెలియచేసే ఈ నాలుగు సమాధానాలు మానవజాతికి మార్గదర్శకాలు. శిరోధార్యాలు.







పేరు : **పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

జననం : 03-10-1957 (విజయదశమి)

స్వస్థలం : అవనిగడ్డ, కృష్ణాజిల్లా

తల్లిదండ్రులు : శ్రీమతి పూర్ణాంబ, వేంకట సుబ్బారావు గారు

విద్యార్హతలు : భాషా ప్రవీణ, ఎం.ఎ. (తెలుగు),
ఎం.ఎ (సంస్కృతం) పి.హెచ్.డి. (తెలుగు), పి.హెచ్.డి. (సంస్కృతం)
పరిశోధనాంశాలు : 1. చల్లా పిచ్చయ్యశాస్త్రి సాహిత్య ప్రకాశము
2. విశ్వనాథవారి సంస్కృత నాటకాలు

ఉద్యోగం : 1978 నుండి విజయవాడ సయ్యద్ అప్పలస్వామి కళాశాలలో ఆంధ్రోపన్యాసకత్వం

అవధాన రంగం : రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో 300 పైగా అష్టావధానాలు ద్విగుణిత, చతుర్గుణిత అష్టావధానాలు, తొలి అచ్చతెలుగు అవధానం.
ఏకైక సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం (1995) అనేకవిధా ప్రదర్శనలు

ఇతర సాహిత్యాంశాలు : ఆకాశవాణి, దూరదర్శన్ కవిసమ్మేళనములు, సాహిత్యకార్యక్రమాలు, భువన విజయం మొదలగు సాహిత్య రూపకాలలో వివిధ పాత్రలు, ధార్మిక సాహిత్యోపన్యాసాలు

బిరుదములు : అవధానకళా సరస్వతి (ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్టణం), అవధాన శారద (మల్లాపుం పీఠం) అవధాన సుధాకర (టీటీ ఫౌండేషన్, విజయవాడ), శతావధాని శేఖర (లయన్స్ క్లబ్, విజయవాడ), వాణీసుధ (శ్రీ రామలింగేశ్వర కల్చరల్ అసోసియేషన్)

సంపాదకత్వం : 'విశ్వస్ఫూర్తి' (ఆధ్యాత్మిక మాస పత్రిక, తాడేపల్లి, గుంటూరు జిల్లా.), 'కనకదుర్గ ప్రభ' గౌరవసంపాదకుడు

కార్యదర్శి : కాళిదాస పీఠమ్ (సంస్కృత సాహిత్య సంస్థ, విజయవాడ)

సత్కారములు : ముఖ్యమంత్రిచే అధికార భాషా సంఘ సత్కారం (2000), ఆంధ్రభాషాభివర్ధిని, నెల్లూరు, మోచర్ల రామకృష్ణ కవి స్మారక సత్కారం, బాపట్ల జ్ఞానప్రసూనాంబ దేవస్థాన సత్కారము, తెలుగు విశ్వవిద్యాలయం అవధాన పురస్కారం (2003), ఆంధ్రసారస్వత సమితి సత్కారం (2008), బోగూరు ప్రవాసాంధ్ర సంఘ సత్కారం మొదలైనవి, సింగపూర్ తెలుగు సంఘం (2006), ఉషశ్రీ మిషన్

గ్రంథ రచన : 1. చల్లా పిచ్చయ్య శాస్త్రి సాహిత్య ప్రకాశము
2. శాంతి సూక్తమ్ (సంస్కృతం)
3. శైవ ధర్మశతకము
4. షిర్డీసాయి సహస్రనామస్తోత్రమ్ (సంస్కృతం)
5. రామచంద్ర విజయము (పద్య కావ్యము)
6. వెంకయ్యస్వామి జీవితచరిత్ర
7. పద్యపంక్తి, అనేక అముద్రిత రచనలు